HMDA Approved Fully Developed Residential Plots @ Badangpet Opp. New Muncipal Office, Library, Airport to TCS Road near Int. Schools, Colleges. 9666148089, 9581213344.

BHEL

BHEL- Ameenpur HMDA Janachaitanya Layout Sai Rajeswari 120 yds, 200 yds, 233 yds Loan Avl. Ph: 9849328576

ECIL

Cherlapally Green Oaks Gated Layout GHMC Approved Plots for Sale. 140, 150, 183, 200 Sq.Yds 39000 Per S/Y ✆ 9885715039/ 9703127766.

దసరా ఆఫర్..కీసర బొమ్మలరామారం HMDA లిమిట్స్ లో గే.క. ఫుల్ డెవలప్‌మెంట్స్, 4లైన్స్ రోడ్ కు దగ్గర్లో ప్లాట్స్. రూ. 6000/-, గజం. Ph: 9951685471, 6281244462

GACHIBOWLI

For Sale. Ready to Construction. Open Plots beside Lanco Hills, Just 100 Feet Distance from Lanco Hills @ Manikonda Jagir. Survey No. 223, Plot No.303, 304, 305, 306, Total 861 Yds. ✆ 9966099764, 7981635356.

GHATKESAR

Pinewoods: Open Plots @ Aushapur near Ghatkesar! Last 8 Plots left! Gated Community with Excellent Amenities & Club house. Rates @ Rs. 13,000/- Sqyd. HMDA Approved. Call: 7677120120.

HAYATHNAGAR

Vijayawada Highway Facing Projects HMDA & DTCP RERA Villa Projects Highway Commercial Plots Avlble. Cont: 9989754992.

Hayatnagar, Batasingaram 400 Sq.yds Open Plot, 2 Side Road South 100 Ft, North 25 Ft, Full LRS Paid. Ph: 9866794213

CC కావి ప్లాట్లు కొనబడును. హయత్‌నగర్, కుంట్లూర్, పసుమాముల, తారామతిపేట్, మునగనూర్, కోహెడ, అబ్దుల్లాపూర్‌మెట్, చౌటుప్పల్ పరిసర ప్రాంతాలలో. ✆ 9392154653.

గజము 2500/- విజయవాడ హైవే, నార్కెట్‌పల్లి దగ్గర గేటెడ్ కమ్యూనిటీ వెంచర్ స్విమ్మింగ్‌పూల్, కాటేజ్ 30 పండ్ల మొక్కలు, 30 ఎర్రచందనం మొక్కలు 1210గ. (10 గుంటలు) ప్లాట్ అమ్మకం. Ph: 9390261598.

విజయవాడ హైవేకు అతి సమీపంలో రామోజీ ఫిలింసిటీ ఎదురుగా, కావాడిపల్లి రోడ్డు నందు (ఇళ్ళ మధ్యలో) HMDA ఓపెన్ ప్లాట్లు కలవు చ॥గ॥ రూ. 26999/- లోన్ సౌకర్యం 8885575455.

హయత్‌నగర్, పసుమాముల, పెద్దఅంబర్‌పేట, కోహెడ జనచైతన్య బాటసింగారం, శ్రీమిత్ర, గ్రీన్‌సిటీలో ప్లాట్లు అమ్మ/కొనబడును. Ph: 9553973999, 9666912111

HITECH CITY

Madhapur- Kakatiyahills: 500, 1000 yds @ 2L, Kondapur: 600 yds, Gachibowli: 200, 400yds, Hotel: 400, 500Y @ 14Cr, Rent: 9L. Ph: 9100587259

JEEDIMETLA

Gajularamaram 220 Sq.Yds (LRS) (40x50) South Face @ Mahadevapuram Phase-II near Ganesh Temple, 3KM from KPHB Metro Stn ✆ 9848352839.

Gagillapur Venkatadri- 200 Yds, W/F 267 Yds, E/F 534 Yds, N/W 800 Yds, E/S, 1068 Yds, E/W Sale. Kistaipally- 821 Yds. W/F LRS ok. ✆ 6301829066.

L.B.NAGAR

300 Sq.Yd, E/F, Hanuman Nagar, Behind Breezy Valley Villas, Bandlaguda, Nagole, 500 Mtrs from Main Rd. Full LRS. ✆ 9849362021.

200 Square Yards, East. LRS full paid. Raghavendra Colony, Nagole, 1 KM from Lucky Restaurant. Ph: 9848955015.

MALKAJGIRI

మల్కాజ్‌గిరి ఆనంద్‌బాగ్‌లో 200 చ॥ G+2 ఇండ్లు @ 1.25 Cr. మల్కాజ్‌గిరిలో అతి తక్కువ ధరల్లో 2&3 BHK ఫ్లాట్లు, Res/ Com ప్లాట్లు, ఇండ్లు కొనుటకు అమ్ముటకు, లోన్ కొరకు. ✆ 9494606645.

MEDCHAL

Commercial Plots for Sale. Opposite Modi Builders @ Aliabad (V), Shameerpet (M), 3000 Sq.Yds, DTCP Final Approved & HMDA Plots @ Turkapally. Ph: 9966099764.

MOINABAD

APPA Junction @ Moinabad 20 minutes drive from Gachibowli Farm Lands 418, 565, 1000, 1210 Sq.Yds with 6 Years old Mango Trees. Ph: 9000053259

NIZAMPET

177 Sq.Yds. S+2 Floors Permission+ Bore. Ready to Construction. East Face, Srinivas Nagar, Pragathi Nagar, Bank Loan. ✆ 9666241688.

Bachupally 290/ 600/ 660/ 1800/ 2200 Yds. Commercial Plot Sale. Aeronagar- 500 Yds. IDPL- 254 Yds, Simhapuri- 400 Yds. ✆ 6301829066.

PATANCHERU

HMDA Villa Plot for Sale @ Patancheru admeasuring 200 Sq.yds. Ready for Construction. 2 Mins From ORR. Ph: 8897301021

పటాన్‌చెరు భానూర్ లహరి జాడే రెసిడెన్షియా ల్యాండ్ 418.8 Sq.Yds బిల్టప్ ఏరియా 1391 Sft Plot అమ్మబడును. ✆ 7893728153, 7981392465.

SANGAREDDY

Dussera Offer.. Sadasivapet. Mumbai H/way DTCP & RERA. full.Dev. G.community. Loan. Rs: 9499/- Spot Reg. Ph: 9951685471, 6281244462

VJR Farm Lands దసరా ఆఫర్ 25% డిస్కౌంట్ నారాయణఖేడ్‌లో ఒక గుంట భూమి 2లక్షలు మాత్రమే, 121 గ॥ to 605 గ॥లు. Ph: 7207936669.

SECUNDERABAD

Sec'bad, Bowenpally, Soujanya Colony, East Face 154, 240 & West Face 200 Sq.yds For Sale. Gated Community. Ph: 7842649941.

SHADNAGAR

500 Sq.yds S/F, Nr. Kanha shanti vanam, Happy homes venture Plt.no 808 Bangalore highway p/yd Rs.10000. Ph: 9440634040

దసరా & దీపావళి- ఆఫర్: షాద్‌నగర్ దగ్గర DTCP & RERA వెంచర్లో 150- చ॥గ॥ ప్లాట్ కొన్నవారికి 30 గ్రాముల బంగారం-ఫ్రీ, స్పాట్-రిజి. డైరెక్ట్- కం. Ph: 9949695027 నో- ఏజెంట్స్.

SRISAILAM HIGHWAY

DTCP Villa Plot for Sale in Fortune Butterfly City Kadthal 500 syd in Clouds Park & TimesII Call: 9618029141

Villa Plots @ Meerkhanpet, Nr. Amazon Data Center, AI & Future City, Srisailam H/W, Spot Regt. Bank loan. Ph: 8886200526

Invest 22 Lakhs & take 30 Lakhs worth 200 Yds Villa Plot (Developed LL Share) @ Kadthal- Srisailam H/W. Raja- 9966744544.

HYD, Fortune Butterfly City Kadthal ముచ్చర్ల 4th సిటీకి దగ్గర్లో గేటెడ్ కమ్యూనిటీ, క్లబ్‌హౌస్, స్విమ్మింగ్‌పూల్ 60 & 40 అ॥ CC రోడ్స్. రెడీ టు కన్‌స్ట్రక్షన్. గ॥: 200, 400: S/y- 14,500/-. ✆ 96182 82731.

గూడూరు 1000 గజాల DTCP ప్లాట్ 60 అడుగుల & 40 అడుగుల 3 రోడ్లతో ప్లాట్ అమ్మబడును. శ్రీశైలం హైవే నుండి 1.5 కి.మీ. ఓనర్: 9014526083.

TUKKUGUDA

Tukkuguda Mohabat Nagar, HMDA Approved in Peram Kandakatla Valley-2 Gated 304 Sq.Yds. S/W Corner Plot Rs: 22K. P/Yd. Nego. ✆ 7013149364/ 9538069680.

UPPAL

Bodu Uppal, Rajlingam Colony, Phase-I, 150, 300, 450 Sq.Yds, E/W/F Plots for Sale. Direct Owner 49K Yard. Cont ✆ 9390160112.

YADAGIRIGUTTA

యాదగిరిగుట్ట, వంగపల్లిలో గేటెడ్ కమ్యూనిటీ యందు బ్యాంకు లోన్ సౌకర్యంతో ఓపెన్ ప్లాట్లు కలవు. రీసార్ట్స్, స్విమ్మింగ్‌పూల్, పార్క్ అన్ని వసతులతో. Ph: 8106340199

SHANKARPALLI

JB's Infra వారి అతితక్కువ ధరలో @ మోమిన్‌పేట. DTCP Appvd. ప్రీమియం లేఅవుట్ VKB Dt. Spl ఆఫర్- 7500/- P. Sq.Yd. 9010277299, 9032645065.

HMDA VILLA PLOT @ SANKARAPALLY TOWN
SARK GREEN TOWN HOMES
HMDA Final Approved
220 Sq.yds
PLOT FOR SALE
Suitable for Ready to Villa Construction
Rs: 28000/- per sq yd
✆ 8374988887

ALWAL

Bhudevi Nagar near MMTS beside Vijaya Durga Services 183 Sq.Yd. N/F Plot Ready to Construction. No Brokers ✆ 6900174544.

GENERAL

Vijaya Dasami Greetings from the Real Estate Marketing Office. You should Never Bother about your Property Slae because the Professional is Ready to HELP. Needy Persons with confidence only to send Property Sale Proposals. GHREP, Dr. A.S.Rao Nagar. Email: nr.pyarasani@gmail.com Ph: 9866191007.

Villa open plots for Sale, Location: Nadergul, near TCS, Hyderabad. Ph: 8885000507

323 yd, West-Facing Plot for Sale in Reverie Avenue, a premium venture on the National Highway near Athvelly, Medchal. Phone: 9333939999, 9888899333

Residential Plot at Sri Malani Colony, Bhavana Colony, New Bowenpally for Sale. 266 Sq.yards. (Size 40x60). Close to paradise circle. ✆ 89859 66286.

తెల్లాపూర్, మైహోమ్ సాముక్, వజ్రం హైరేంజ్ అపార్ట్‌మెంట్స్‌కి, మంతన ఇంటర్నేషనల్ స్కూల్‌కి ఆనుకొని 75 గజాల కమర్షియల్ స్థలం అమ్మబడును. ఫోన్: 9885286593.

దసరా ఆఫర్. 2,50,000/- లకే 11 సెంట్లు (4.4 గుంటలు) 532 గ॥లు ప్రకాశం జిల్లా అద్దంకి దగ్గర 48 ఎర్రచందనం, శ్రీ గంధం మొక్కలతో ఫామ్‌ల్యాండ్ అమ్మకం. స్పాట్ Reg. ✆ 95234 56789.

దసరా ఆఫర్- నెలకు 10,000/- ఆదాయంతో 10నెలలు 5 మందికి మాత్రమే. అమరావతికి 15KM, HYD హైవేకు 4KM, ORRకు 200మీ॥, కంచికచర్ల దగ్గర, ఇళ్ళ ప్రక్కన, CRDA వెంచర్, స్పాట్ రి॥, బ్యాంకు లోన్. ✆ 88018 03689.

AP రాజధానికి దగ్గర్లో 1 చ॥గ॥ రూ. 4000/- కే NH-9 కి 1 కి.మీ, 60 అ॥ రోడ్డుకి, ఇళ్ళ దగ్గర్లో, రింగు రోడ్డుకి, రాబోయే రైల్వేస్టేషన్‌కి దగ్గర్లో 100, 150, 600 గ॥ ప్లాట్లు ✆ 78939 42229.

అమరావతి అంటే ఐకాన్- హానర్- ఐడెంటిటీ, ఎక్కడ ఎన్ని ఉన్నా కొన్నా, ఇక కొనబోయేది అమరావతిలో కొనండి ఒక్క 100 గజాలే కొనండి మీ పిల్లల శాశ్వతానందం కోసం దసరా ఆఫర్లో 7 లక్షలకే. సంప్ర. ✆ 79977 55546.

VJA, రాజధాని అమరావతి, మంగళగిరి, గన్నవరం, బందరురోడ్డు, బెంజిసర్కిల్‌కి 5 కి.మీ. నున్న నూజివీడు రోడ్డు, కంచికచర్లలో DTCP & APCRDA ప్లాట్స్ చ॥గ॥ 1,900/- నుండి 12,900/- సంప్ర: ✆ 93906 65999.

COMMERCIAL SPACE FOR SALE

Narsing to Kokapet 200 Feet Road Facing Commercial Space for Sale Please Contact: 7207897528.

Kokapet Grade-A Commercial Office Space for Sale. Rs. 85 Lakhs High Rental Value. Contact: 7330730038.

Hospital cum Residence for Sale/ Rent. 5500 Sft 720 Sq.Yd. RCC Building @ Dwaraka Nagar, Nizamabad. ✆ 9848059679, 8309496656.

WANTED

Required: Loan Against Property. 2BHK Flat Located In Ameerpet. M: 7259158774

ప్రముఖ విద్యా సంస్థకు గ్రేటర్ హైదరాబాద్‌లో 10,000 చదరపు అడుగుల బిల్డింగ్ కావలెను. ✆ 9247244186.

PROPERTY FOR SALE

Flats For Sale 3BHK Luxury Apartments Satya Nagar. Kothapet. GHMC & RERA Approved. Clearance From Hydra & Musi Development. All Bank Loans Available MKR Constructions: 8247551051.

East facing IND 2 BHK house 236 sqrds. 2 sides Rd. Brundavan Nagar gollaguda, Alwal. Brokers excuse. Call: 9500108210.

BUILT TO SUIT
In Prime Location at Greater Hyderabad Municipal Corporation Region
SANATHNAGAR
HYDERABAD-500018
Free Hold ,Title Clear
Plot 3259 Sq Yard ;
Floor Plate:18084 Sq Ft Approx.
Construction Potential 90473 to 108460 Sq Ft Approx. Depending upon Floor Rise.
OUTRIGHT SALE
Land Use:work Centre Use zone and affected by proposed 60 Ft wide road As per Master Plan
IDEAL FOR CORPORATE OFFICE BUILDING, IT, ITeS, DATA Centres, GCC, Co-working, Studios, Hotels,
School , College, Polytechnic College, Retail Shopping Centre, Universities and Specialized Education Institutions, Research and Developement Centre, Warehouses and Storage Godown, Hospital, Dispensary, Exhibition Centre etc.
Contact
For English - 9821020345
For Telugu-9989930921

LAND REQUIRED

A premium International School Req. min. 2-6 Acres Land with/ without Building for 30 yrs. Lease Nr. Kompally, Attapur-Shamshabad Rd., Gandipet, Narsingi- Kollur-Mokila-Nalagandla- Patancheru & Hayatnagar. Ph: 9848017745

TO LET

KPHB Colony 3BHK 1st & 3rd Floor Good Vastu, Lift, Car Park 24 Hrs Water for Rent. Families only. Rent: 45K ✆ 9849877047

Tolet 2 BHK 1100 Sft 2nd Floor in Renuka Apts. Anand Nagar Colony Khairtabad E/F Lift, 24 Hrs Water, No Car Park: 9848679757.

Semi Furnished 3 BHK, 2 Halls, Modular Kitchen with Seperate Wash Area, 3 Bathrooms, 1 Balcony & 1 Carparking. 2nd Floor (1780 Sft), East Facing. Krishnakunj Garedens, Quthubullapur. Contact: Person Srinivas. Ph: 9849474653.

COMMERCIAL

Kazipally Nr Mallampet (ORR EXIT) Cmrcl Space for Rent 24,000 Sft (G+3) Full/ Part suitable for Office, Shops, Schools Etc. ✆ 8143731350.

Somajiguda, Office Space in Lahari Building, behind Yashoda Cancer Hospital, 'G' Floor 2000 Sft, fully Furnished with Rec, 3 Cabins, 30 Work Stations, Conf. Hall, AC's Suitable for Corporate offices/ Software/ Call Center/ CA/ Diagnostics/ Clinics. Cont: 9849066787.

Shed For Lease- 15000 Sft @ Gowlidoddi, Gachibowli Warehouse/ Service Center Contact: 9765134567/ 8179007077

Commercial Space Rent, beside Nexa Showroom Bowenpally-Balanagar Road, RAMP Facility Avbl, G+1, 5000 Sft (Parking Avabl). Ph: 9000556688.

Shops And Godown For Rent At Hitension Wire Road, Sainikpuri. Shop-250 Sft, Each Godown-1000 Sft. Ph: 7901691311

Commercial Space 1300 Sft, 2nd Floor, Opp: Muthoot Finance, NGO's Colony, Min. Road, Vanasthalipuram. ✆ 8497972190.

GF Large Frontage 4 Rd Centre Eastanandbagh E/F On Rent Good For ATM/ Banks Contact: 9885135898/ 9496019158

WANTED

Looking for lease building for a school. Boddupal, Peerzadiguda, Medipally. Call: 8309507245.

BOOK YOUR CLASSIFIED
Ad ₹1450/- (5 Lines B/w)
3 Ads Package ₹ 3695/-
7 Ads Package ₹ 8580/-
STHIRASTHI ₹ 1580/- (5 Lines B/w)
★ GST 5% Extra
Ph: 040- 23440304, 23318181, Extn: 6422
Through Online
www.eenaduclassifieds.com

మహానగరంలో ఇల్లు లేదా వంద, రెండొందల గజాల స్థలం కొనుక్కోవాలనేది ప్రతి ఒక్కరి కల. ఆశలు వాయిదా వేసుకొని జీతం డబ్బులో పొదుపు చేసి కూడబెట్టి ఇల్లు లేదా స్థలం కొనేందుకు సిద్ధమవుతుంటారు. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, మున్సిపాలిటీలు, డీటీసీపీ వంటి సంస్థలు అనుమతులు ఉన్నాయని మధ్యవర్తులు చెప్పిన వెంటనే గుడ్డిగా నమ్మి వారి చేతిలో మొత్తం పెట్టి మోసపోయేవారు ఎందరో. కొన్న ఆస్తి చేతికి రాకపోగా.. ఇచ్చిన డబ్బులు కూడా పోగొట్టుకొని పోలీసులను ఆశ్రయించే వారి సంఖ్య పెరుగుతోంది. ఈ నేపథ్యంలో మీ ఆస్తికి మీరే బాధ్యులని నిపుణులు చెబుతున్నారు. స్థలం లేదా ఇల్లు ఎంపిక నుంచి వాటిని సొంతం చేసుకునే వరకు అప్రమత్తంగా ఉండాలని, వివిధ అంశాలను పరిగణలోకి తీసుకొని ముందుకు వెళ్లాలని సూచిస్తున్నారు.

ఈనాడు స్థిరాస్తి

ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ చెక్ చేసుకోండి ఇలా



టైటిల్ సక్రమమేనా...

ఏదైనా ఆస్తి లేదా ఇంటికి యాజమాన్య హక్కు కీలకం. అది ఎవరి పేరుతో ఉంది.. వారసులు ఎవరు.. ఆ ఆస్తి లేదా ఇంటిపై ఇది వరకు కేసులు ఉన్నాయా.. దాన్ని అమ్మే వ్యక్తి వద్ద ఉన్న పత్రాలు నిజమైనవేనా.. ఇత్యాది అంశాలను ఒకటికి రెండుసార్లు పరిశీలించుకోవాలి. తెలిసిన వారు చెప్పారని, బంధువులు సూచించారని గుడ్డిగా ముందుకు వెళితే ఇబ్బందులే. ఆస్తి విషయంలో ఎవరినీ నమ్మొద్దు. వారికి వచ్చే కమీషన్ల కోసం ప్రాణ మిత్రులు కూడా మోసగించే రోజులివి. కాబట్టి టైటిల్‌ను ఒకటికి రెండుసార్లు చెక్ చేసుకోవాలి. ఆ సర్వే నంబరుతో తహసీల్దార్, రిజిస్ట్రేషన్ కార్యాలయం లేదా మున్సిపల్ కార్యాలయాన్ని సంప్రదించి టైటిల్ పరిస్థితి తెలుసుకోవాలి. మంచి న్యాయవాదిని సంప్రదించడం వల్ల టైటిల్‌లో సమస్యలు ఉంటే తెలుసుకోవచ్చు. ఆస్తి కొనేందుకు లింకు డాక్యుమెంట్లు చూసుకోవాలి. మీకు ఆస్తి అమ్మిన వ్యక్తికి స్వార్జితమా..వారసత్వంగా వచ్చిందా...వారసులు ఉన్నారా..ఉంటే వారి సంతకాలు తీసుకోవాలి. అన్నీ సక్రమంగా ఉంటేనే అడ్వాన్సు ఇచ్చి రిజిస్టర్ అగ్రిమెంట్ చేయించుకోవడం ఉత్తమం.

నీటి వనరులు... తస్మాత్ జాగ్రత్త

లేక్‌వ్యూ వద్ద ప్లాట్లు అంటూ.. ప్రీమియం ధరలు వసూలు చేసే విక్రయిస్తుంటారు. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌కు సంబంధించి అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. హైడ్రా ఏర్పాటు అనంతరం మరింత అప్రమత్తంగా

వ్యవహరించాలి. సాగునీటి శాఖ ఎన్‌వోసీతో హెచ్ఎండీఏ అనుమతులు ఇచ్చిన లేఅవుట్లు, అపార్ట్‌మెంట్ల విషయంలో కూడా వివాదాలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో అనుమతులు ఉన్నట్లు తేలినా.. మరోసారి చెక్ చేసుకోవాలి. హెచ్ఎండీఏ పరిధిలోనైతే మాస్టర్‌ప్లాన్-2030 తీసుకోవాలి. మీరు కొనే ప్లాటు ఏ జోన్‌లో ఉందో చూసుకోవాలి. ఉదాహరణకు ఇండస్ట్రియల్ జోన్‌లో నివాస ప్రాంతాలకు అనుమతించరు. కొందరు బిల్డర్లు దీన్ని మభ్యపెట్టి ప్లాట్లు అంటగడుతుంటారు. తర్వాత ఇల్లు కట్టుకోవాలంటే జోన్ మార్పు కోసం అదనంగా భారీ ఎత్తున ఫీజు చెల్లించాలి. చెరువు సమీపంలో మీ ఆస్తి ఉంటే మరింత నిశితంగా పరిశీలించాలి. రెవెన్యూ కార్యాలయానికి వెళ్లి మీ సర్వే నంబరు ఆధారంగా చెరువు ఎఫ్‌టీఎల్ లేదా బఫర్‌జోన్ పరిధిలో ఉందో లేదా తెలుసుకోవాలి.

హెచ్ఎండీఏ వెబ్‌సైట్‌లో ఇలా...

హెచ్ఎండీఏ వెబ్‌సైట్‌లోని లేక్స్ హెచ్ఎండీఏ గవర్నమెంట్ ఇన్ సైట్‌లోకి వెళ్లాలి. అందులో జిల్లా, మండలం, గ్రామం సెలెక్ట్ చేసుకొని మీ సర్వే నంబరు ఆధారంగా ఆ ఊరిలోని అన్ని చెరువుల వివరాలు తెలుసుకోవచ్చు. ఎఫ్‌టీఎల్ కాలమ్‌లో క్లిక్ అని బ్లూ కలర్ ఉంటుంది. దాన్ని క్లిక్ చేయగానే మ్యాప్ ఓపెన్ అవుతుంది. ఎఫ్‌టీఎల్ వరకు చెరువు విస్తీర్ణం ఎంత ఉంది.. పరిసరాల్లో ఏం ఉన్నాయో కూడా కనిపిస్తుంది. తర్వాత బ్యాక్‌కు వచ్చి క్యాడస్ట్రల్ మీద క్లిక్ చేస్తే మళ్లీ మ్యాపు ఓపెన్ అవుతుంది. దీంతో ఆ చెరువు ఏయే సర్వే నంబర్ల పరిధిలో ఉందో తెలుస్తుంది. మ్యాప్‌లో నీలి రంగు లైన్‌తో ఉన్నది ఎఫ్‌టీఎల్ పరిధి.. దాని పక్కనే రెడ్ కలర్‌తో ఉన్నదే బఫర్‌జోన్. చెరువు కట్ట ఆరెంజ్ కలర్‌తో ఉంటుంది. దాని ప్రకారం చెరువుకు ఎటు వైపు మీ స్థలం లేదా అపార్ట్‌మెంట్ ఉందో చెక్ చేసుకోవచ్చు. ఒకవేళ వీటి మధ్యలో ఉంటే వాటికి అనుమతులు ఉన్నా సరే.. కొనుగోలు చేయకపోవడం ఉత్తమం.

ఈనాడు, హైదరాబాద్

(c) eenadu

గర్భస్థ శిశువులకు ఉష్ణ గండం

- చిన్నారుల ఎదుగుదలకు భూతాపం ప్రతిబంధకం
- లాన్సెట్ జర్నల్ కథనం వెల్లడి

దిల్లీ: పర్యావరణ మార్పులు ఆహార భద్రతకు ముప్పు కలిగించడంతో పాటు పౌష్టికాహార లోపానికీ దారి తీసి చిన్నారుల ఎదుగుదలపై దుష్ప్రభావాన్ని చూపుతున్నాయని పరిశోధకులు తెలిపారు. అందులోనూ ముఖ్యంగా అధిక ఉష్ణోగ్రతలు గర్భస్థ శిశువులు మొదలు రెండేళ్ల చిన్నారుల వరకు నేరుగా వారి ఎదుగుదలలో లోపానికి కారణమవుతున్నాయని లండన్ స్కూల్ ఆఫ్ హైజీన్ అండ్ ట్రోపికల్ మెడిసిన్ (ఎల్ఎస్‌హెచ్‌టీఎం) పరిశోధకులు వెల్లడించారు. పశ్చిమ ఆఫ్రికా దేశమైన గాంబియాలో 668 మంది చిన్నారులపై వీరు కొనసాగించిన అధ్యయనం వివరాలను లాన్సెట్ ప్లానెటరీ హెల్త్ జర్నల్ ప్రచురించింది. అధిక ఉష్ణోగ్రతల ప్రభావం మహిళలు గర్భం దాల్చిన తొలి త్రైమాసికం నుంచే మొదలై చిన్నారులకు రెండేళ్ల వయసు వచ్చే వరకూ ఉంటోందని పరిశోధకులు వెల్లడించారు. పొట్టిగా, తక్కువ బరువుతో పుట్టడంతో పాటు నెలలు నిండకుండానే కాన్పుకావడం వంటి సమస్యలను వీరు గుర్తించారు. అధిక ఉష్ణోగ్రత ఒత్తిడిని

జ్ఞాన నేత్రం

తల్లి శరీరం నియంత్రించుకునే స్థాయిని బట్టి గర్భస్థ శిశువుపై ప్రభావం ఉంటుందన్నారు. ఉష్ణోగ్రతల వల్ల కలిగే దుష్ఫలితాల ప్రభావం గర్భస్థ శిశువుల కన్నా 6 నుంచి 18 నెలల వయసు చిన్నారులపై ఎక్కువగా ఉంటుందని అధ్యయన నివేదికను రచించిన అసిస్టెంట్ ప్రొఫెసర్ అనా బోనెల్ తెలిపారు. ఉష్ణోగ్రతల ప్రభావం గాంబియాలో మాదిరిగా ఇతర ప్రాంతాల్లోనూ ఇదే విధమైన దుష్ఫలితాలకు దారితీస్తుందా లేదా అనేది నిర్ధారించుకోవాల్సి ఉందని పేర్కొన్నారు.

కిరీటం దొంగలను త్వరగా పట్టుకోండి

బంగ్లాదేశ్‌కు భారత్ విజ్ఞప్తి

దిల్లీ: బంగ్లాదేశ్ పర్యటనలో భాగంగా 2021లో జెశోరేశ్వరి కాళీమాత ఆలయానికి ప్రధాని మోదీ బహూకరించిన కిరీటం చోరీకి గురైంది. దీనిపై తాజాగా బంగ్లాదేశ్‌లోని భారత హైకమిషన్ స్పందించింది. నిందితులను వెంటనే పట్టుకుని శిక్షించాలని కోరింది. "కిరీటం చోరీ వార్తలు మా దృష్టికి వచ్చాయి. బంగ్లా ప్రభుత్వం దీనిపై విచారణ జరిపించి కిరీటాన్ని తిరిగి స్వాధీనం చేసుకోవాలని, దొంగలను శిక్షించాలని విజ్ఞప్తి చేస్తున్నాం" అని దౌత్య కార్యాలయం ఎక్స్ వేదికగా పోస్టు పెట్టింది. బంగ్లాలోని సత్‌ఖీరా జిల్లా ఈశ్వరీపుర్‌లోని ఈ కాళీ ఆలయం 51 శక్తి పీఠాల్లో ఒకటి.

పాకిస్థాన్‌లో రాకెట్ లాంచర్లతో ముష్కరుల దాడి

20 మంది గని కార్మికుల మృతి

కరాచీ: పాకిస్థాన్‌లోని బలూచిస్థాన్ ప్రావిన్స్‌లో ముష్కరులు శుక్రవారం దాడులకు తెగబడ్డారు. ఓ ప్రైవేటు బొగ్గు గని వద్ద రాకెట్ లాంచర్లు, ఆటోమేటిక్ ఆయుధాలతో జరిపిన దారుణ దాడుల్లో కనీసం 20 మంది గని కార్మికులు మృతి చెందారు. ఎనిమిది మంది గాయపడ్డారు. మృతుల్లో కొందరు అఫ్గానిస్థాన్‌కు చెందిన వారు కూడా ఉన్నారు. ప్రావిన్స్‌లోని దుక్కి సమీపంలో గల జునైద్ బొగ్గు గని వద్ద ఉన్న వారిని కొందరు సాయుధులు ఒక్కసారిగా చుట్టుముట్టి కాల్పులు జరిపారని, అనంతరం సమీపంలోని కొండల్లోకి పారిపోయారని పోలీసు అధికారులు తెలిపారు. ఉగ్రమూకలు దాడి జరిపిన సమయంలో బొగ్గు గని వద్ద సుమారు 50 మంది కార్మికులు ఉన్నారు. దాడితో ఉలిక్కిపడిన కొందరు సమీపంలోని కొండల్లోకి పరుగెత్తారు. మరికొందరు బొగ్గు గనిలో దాక్కొని ప్రాణాలను కాపాడుకున్నారు. ముష్కరులు హ్యాండ్ గ్రనేడ్లు, రాకెట్ లాంచర్లతో దాడులకు పాల్పడినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఈ దాడికి ఇంతవరకు ఏ సంస్థా బాధ్యత ప్రకటించుకోలేదు.

యురేసియా, పశ్చిమాసియాలో శాంతి నెలకొనాలి

- సవాళ్లకు పరిష్కారాలు యుద్ధక్షేత్రంలో దొరకవు
- తూర్పు ఆసియా సదస్సులో ప్రధాని మోదీ వ్యాఖ్యలు

తూర్పు ఆసియా సదస్సులో ప్రధాని మోదీతో థాయ్‌లాండ్ ప్రధానమంత్రి పేటోంగ్టార్న్ షినవత్ర

వియంటియాన్: ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న ఘర్షణలు దక్షిణాది దేశాలపై అత్యంత ప్రతికూల ప్రభావాన్ని చూపుతున్నాయని ప్రధాని మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. యురేసియా, పశ్చిమాసియాల్లో వీలైనంత త్వరగా శాంతి, సుస్థిరత నెలకొనాలని పిలుపునిచ్చారు. లావోస్ రాజధాని వియంటియాన్‌లో జరిగిన 19వ తూర్పు ఆసియా సదస్సులో శుక్రవారం ఆయన ప్రసంగించారు. సమస్యలకు పరిష్కారాలు యుద్ధక్షేత్రాల నుంచి రాబోవని స్పష్టం చేశారు. ఆసియా ప్రాంతంలో చైనా దూకుడు పెరుగుతుండటంపై మోదీ స్పందిస్తూ..యావత్తు ప్రాంతంలో శాంతి, పురోగతి సాధించేందుకు స్వేచ్ఛాయుత, బహిరంగ, సమీకృత, సుసంపన్న, నియమాల ఆధారిత ఇండో-పసిఫిక్ కీలకమని పేర్కొన్నారు. ఇండో-పసిఫిక్ ప్రాంత ప్రయోజనాలకు దక్షిణ చైనా సముద్ర ప్రాంతంలో శాంతి, భద్రత, సుస్థిరతలు ఆవశ్యకమన్నారు. "సముద్ర జలాల్లో నిర్వహించే కార్యక్రమాలు యూఎన్‌సీఎల్‌వోఎస్ నిబంధనలకు అనుగుణంగా ఉండాలని మేం విశ్వస్తాం. నావిగేషన్, గగనతల స్వేచ్ఛ నిర్ధారణ అవసరం. ఇందుకు ప్రభావవంతమైన నియమనిబంధనలను రూపొందించాలి. అవి ప్రాంతీయ దేశాల విదేశీ విధానాలపై ఆంక్షలకు దారితీయకూడదు. విస్తరణవాదంపై కాకుండా అభివృద్ధిపై దృష్టిసారించాలి' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

'నేను బుద్ధుడి బోధనలను అనుసరించే దేశం నుంచి వచ్చాను. ఇది యుద్ధాల యుగం కాదు. ప్రపంచ శాంతిభద్రతలకు ఉగ్రవాదం సైతం తీవ్రమైన సవాలుగా మారింది. దీన్ని ఎదుర్కొనేందుకు మానవత్వంపై విశ్వాసమున్న శక్తులన్నీ కలసికట్టుగా పనిచేయాలి. సైబర్, సముద్ర, అంతరిక్ష రంగాలలో పరస్పర సహకారాన్ని బలోపేతం చేసుకోవాలి. సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రత, అంతర్జాతీయ చట్టాలను అందరూ గౌరవించాలి. సమస్యల పరిష్కారానికి చర్చలకు, దౌత్యానికి ప్రాధాన్యమివ్వాలి' అని మోదీ సూచించారు. భారత సంస్కృతి, వారసత్వాలను ప్రతిబింబించే పలు బహుమతులను లావోస్, థాయ్‌లాండ్, న్యూజిలాండ్, జపాన్ దేశాల నేతలకు మోదీ బహూకరించారు. బిహార్‌లోని నలంద వర్సిటీలో త్వరలో నిర్వహించే మొట్టమొదటి ఉన్నత విద్య అధిపతుల సదస్సుకు హాజరు కావాలని తూర్పు ఆసియా దేశాల ప్రతినిధులను ప్రధాని మోదీ ఆహ్వానించారు.

థాయ్‌లాండ్ ప్రధానితో వాణిజ్యంపై చర్చలు

ఇరుదేశాల మధ్య వాణిజ్య సంబంధాలను మెరుగుపరిచేందుకు, సాంస్కృతిక సంబంధాలకు ఊతమిచ్చేందుకు చేపట్టాల్సిన చర్యలపై థాయ్‌లాండ్ ప్రధాని పేటోంగ్టార్న్ షినవత్రతో ప్రధాని మోదీ శుక్రవారం లావోస్‌లో చర్చలు జరిపారు. షినవత్రతో మోదీ భేటీ కావడం ఇదే తొలిసారి. అదేవిధంగా లావోస్ ప్రధాని సొనెక్సే సిఫాన్‌డన్‌తో చర్చల సందర్భంగా ఇరుదేశాల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని నిర్ణయించారు. కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో, అమెరికా విదేశాంగమంత్రి ఆంటోనీ బ్లింకెన్‌తో ప్రధాని మోదీ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వారితో కొద్దిపాటి చర్చలు జరిపారు. అనంతరం రెండు రోజుల పర్యటన పూర్తి చేసుకున్న ఆయన భారత్‌కు బయలుదేరారు.

సెంట్రల్ బీరుట్‌పై విరుచుకుపడ్డ ఇజ్రాయెల్

వైమానిక దాడుల్లో 22 మంది మృత్యువాత

బీరుట్: లెబనాన్ రాజధాని బీరుట్‌పై ఇజ్రాయెల్ గురువారం భీకర వైమానిక దాడులతో విరుచుకుపడింది. ఈ దాడుల్లో 22 మంది మృత్యువాతపడ్డారు. 117 మంది గాయపడ్డారు. సెంట్రల్ బీరుట్‌పై జరిపిన ఈ దాడుల తీవ్రతకు 8 అంతస్తుల ఓ భవనం పూర్తిగా నేలమట్టమయిందని స్థానిక అధికార వర్గాలు తెలిపాయి. మరో భవనంలో దిగువ అంతస్తులు తీవ్రంగా దెబ్బతిన్నాయని వెల్లడించాయి. హెజ్‌బొల్లా కీలక నేతల్లో ఒకరైన వఫీక్ సఫాను అంతమొందించడమే లక్ష్యంగా ఇజ్రాయెల్ తాజా దాడులు చేపట్టిందని ఆ మురా వర్గాలు పేర్కొన్నాయి. అయితే సఫా మరణించలేదని స్పష్టం చేశాయి. దక్షిణ లెబనాన్‌లోని కాఫ్రాలో ఇజ్రాయెల్ శుక్రవారం వైమానిక దాడికి పాల్పడింది. ఈ ఘటనలో ఇద్దరు లెబనాన్ సైనికులు మృతిచెందారు. సెంట్రల్ వెస్ట్‌బ్యాంక్‌లోని నూర్ షమా శరణార్థి శిబిరంపై తాజాగా తాము జరిపిన దాడిలో పాలస్తీనా ఇస్లామిక్ జిహాద్ (పీఐజే) కీలక కమాండర్ మహమ్మద్ అబ్దుల్లా హతమైనట్లు ఇజ్రాయెల్ తెలిపింది.

- లెబనాన్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఐక్యరాజ్య సమితి శాంతిపరిరక్షకులపై ఇజ్రాయెల్ బలగాలు గురు, శుక్రవారాల్లో దాడులకు దిగడం కలకలం సృష్టించింది. గురువారం నాటి దాడుల్లో ఇద్దరు, శుక్రవారం మరో ఇద్దరు శాంతిపరిరక్షకులు గాయపడ్డారు.

పుతిన్‌తో ఇరాన్ అధ్యక్షుడి భేటీ

తుర్క్‌మెనిస్థాన్ రాజధాని అష్గాబాత్‌లో శుక్రవారం ఓ అంతర్జాతీయ సదస్సుకు హాజరైన రష్యా అధ్యక్షుడు పుతిన్, ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ భేటీ అయ్యారు. ద్వైపాక్షిక సంబంధాలపై విస్తృతంగా చర్చలు జరిపారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల వేళ వీరిద్దరి భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది.

మూస విధానాలతో జీవితం మారదు

మీరు ఎప్పటినుంచో కోరుకుంటున్న కలల జీవితాన్ని పొందాలంటే, ఇప్పటివరకూ చేస్తున్న పనులను, అలవాట్లను అదే విధంగా కొనసాగించడం వల్ల ఉపయోగం లేదు. వాటిని ఎప్పటికప్పుడు సమీక్షించుకొని, లోపాలను సరిదిద్దుకొని, వ్యూహాలను మార్చుకుంటేనే క్రమంగా మార్పు కనిపిస్తుంది.

– కోరీ విల్సన్, బిజినెస్ కన్సల్టెంట్

15న పంచకులలో హరియాణా కొత్త సర్కారు ప్రమాణస్వీకారం!

చండీగఢ్: హరియాణాలో వరుసగా మూడోసారి విజయం సాధించిన భాజపా కొత్త సర్కారు ప్రమాణస్వీకార కార్యక్రమం అక్టోబరు 15న పంచకులలో జరిగే అవకాశముంది. ఈ మేరకు ప్రత్యేక కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు ప్రారంభమైనట్లు పంచకుల డిప్యూటీ కమిషనర్ డాక్టర్ యశ్‌గార్గ్ శుక్రవారం వెల్లడించారు. ఆర్నెల్ల కిందట ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఓబీసీ నేత నాయబ్‌సింగ్ సైనీయే తమ తదుపరి సీఎం కూడా అని భాజపా ఇదివరకే ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రమాణస్వీకార మహోత్సవానికి ప్రధాని మోదీతో పాటు పలు భాజపా పాలిత రాష్ట్రాల సీఎంలు హాజరయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం.

రాజ్యసభ నైతిక విలువల కమిటీ ఛైర్మన్‌గా భాజపా ఎంపీ ఘనశ్యామ్

దిల్లీ: రాజస్థాన్‌కు చెందిన భాజపా ఎంపీ ఘనశ్యామ్ తివారీ రాజ్యసభ నైతిక విలువల కమిటీ ఛైర్మన్‌గా నియమితులయ్యారు. కమిటీ పునర్నిర్మాణంలో భాగంగా ఎగువసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ ఈ నియామకాన్ని చేపట్టారు. ఈ నెల 10 నుంచి ఇది అమలులోకి వచ్చింది. కమిటీలో ప్రమోద్ తివారీ(కాంగ్రెస్), డెరెక్ ఒబ్రియెన్ (టీఎంసీ), తిరుచ్చి శివ(డీఎంకే), సంజయ్ సింగ్ (ఆప్), విజయసాయి రెడ్డి(వైకాపా), సస్మిత్ పాత్రా(బీజేడీ), ప్రేమ్‌చంద్ గుప్తా(ఆర్జేడీ), ఎం.వి.కులకర్ణి, దర్శన్ సింగ్ (భాజపా) సభ్యులుగా ఉన్నారు.

హరియాణా ఎన్నికలపై ఈసీకి కాంగ్రెస్ మరిన్ని ఫిర్యాదులు

దిల్లీ: హరియాణా శాసనసభ ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రా(ఈవీఎం)ల్లో వచ్చాయంటున్న వ్యత్యాసాలపై కాంగ్రెస్ శుక్రవారం ఎన్నికల కమిషన్(ఈసీ)కి మళ్లీ ఫిర్యాదులు చేసింది. ఆ పార్టీకి చెందిన, ఓటమిపాలైన 20 మంది అభ్యర్థులు లిఖితపూర్వకంగా ఈసీకి ఫిర్యాదులు చేశారు. ఈ నెల 8న పలు ఈవీఎంల్లో బ్యాటరీ ఛార్జింగ్ 99 శాతం ఉందని ఆరోపించారు. ఈ మేరకు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ 'ఎక్స్'లో వెల్లడించారు. తమ ఫిర్యాదులపై ఈసీ తగిన చర్యలు తీసుకుంటుందని భావిస్తున్నామన్నారు.

రొటేషన్ పద్ధతిలో విపక్ష నేత పదవి!

- ఇండియా కూటమిలో ఆ చర్చ జరుగుతోంది: భాజపా

బాంసురీ స్వరాజ్

దిల్లీ: లోక్‌సభలో ప్రతిపక్ష నేత హోదాను రొటేషన్ పద్ధతిలో మార్చుకునే విషయమై ఇండియా కూటమి భాగస్వామ్య పార్టీల్లో చర్చ జరుగుతోందని భాజపా ఎంపీ బాంసురీ స్వరాజ్ తెలిపారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రతిపక్ష నేత బాధ్యతలను అంకితభావంతో నిర్వర్తించలేకపోతున్నారని ఇండియా కూటమి పక్షాలు భావిస్తే రొటేషన్ పద్ధతిలో ఆ పదవిని చేపట్టడానికి సన్నద్ధం కావాలంటూ ఆమె వ్యంగ్యంగా సూచించారు. దిల్లీలోని భాజపా ప్రధాన కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఓ ప్రశ్నకు బదులిస్తూ బాంసురీ స్వరాజ్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇండియా కూటమి పార్టీల్లో లోక్‌సభ విపక్ష నేత పదవికి అర్హులైన వారు ఎందరో ఉన్నారని పేర్కొన్నారు. రొటేషన్ పద్ధతిపై వారిలో మంతనాలు జరుగుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని తెలిపారు. అయినా ఇది ఇండియా కూటమి అంతర్గత అంశమని చెప్పారు. స్వరాజ్ వ్యాఖ్యలను ఇండియా కూటమిలో భాగస్వామి అయిన ఆరెస్పీ ఎంపీ ఎన్.కె.ప్రేమచంద్రన్ తోసిపుచ్చారు. లోక్‌సభలో అతిపెద్ద విపక్ష పార్టీకి చెందిన వారికే ప్రతిపక్ష నేత హోదా లభిస్తుందని, ఇది ఆమోదనీయమైన విధానమని ప్రేమచంద్రన్ తెలిపారు. రొటేషన్‌పై ఇండియా కూటమి పక్షాల్లో చర్చే లేదని, బాంసురీ స్వరాజ్ వ్యాఖ్యలు నిరాధారమని ఖండించారు.

సిద్ధిదాయిని అలంకారంలో భ్రమరాంబాదేవి

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: శ్రీశైల మహాక్షేత్రంలో దసరా మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల తొమ్మిదో రోజు శుక్రవారం భ్రమరాంబాదేవి సిద్ధిదాయిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో స్వామిఅమ్మవార్లను అశ్వ వాహనంపై కొలువుదీర్చి విశేష పూజలు నిర్వహించారు. ఉత్సవాలను పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం తరఫున స్వామిఅమ్మవార్లకు రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయంలో ఉత్సవమూర్తులకు పూజలు చేసి, అనంతరం శ్రీగిరి పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ, ఈఓ డి.పెద్దిరాజు పాల్గొన్నారు.



తిరుచ్చి విమానాశ్రయంలో సిద్ధంగా ఉంచిన అంబులెన్స్‌లు ★ ఆకాశంలో చక్కర్లు కొడుతున్నట్లు చూపే మ్యాప్ ★ ల్యాండైన విమానం

తిరుచ్చి-షార్జా విమానంలో సాంకేతికలోపం

- లోనికి ముడుచుకోని చక్రాలు
- 2 గంటలు ఆకాశంలో చక్కర్లు కొట్టి సురక్షితంగా ల్యాండింగ్

చెన్నై, న్యూస్‌టుడే: తిరుచ్చి నుంచి షార్జాకు బయలుదేరిన విమానంలో సాంకేతిక లోపం తలెత్తింది. తిరుచ్చి విమానాశ్రయం నుంచి ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానం 141మంది ప్రయాణికులతో శుక్రవారం సాయంత్రం 5.40గంటలకు షార్జా బయలుదేరింది. గాల్లోకి ఎగిరిన కాసేపటికే హైడ్రాలిక్స్‌లో సమస్య కారణంగా చక్రాలు లోనికి ముడుచుకోలేదు. ల్యాండ్ చేయలేని పరిస్థితి నెలకొనడంతో 2 గంటలకుపైగా ఆకాశంలోనే చక్కర్లు కొట్టింది. విషయం తెలిసిన వెంటనే తమిళనాడు రాష్ట్ర సీఎం స్టాలిన్ సంబంధిత అధికారులతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి విమానం సురక్షితంగా ల్యాండ్ అయ్యేందుకు చర్యలు తీసుకోవాలని నిర్దేశించారు. ఈ క్రమంలో విమానంలో ఇంధనం తగ్గిన తర్వాత ల్యాండ్ చేయాలని పైలట్లు నిర్ణయించారు. రాత్రి 8.15 గంటలకు తిరిగి తిరుచ్చి విమానాశ్రయంలోనే సురక్షితంగా దించారు. ముందు జాగ్రత్తగా ఇక్కడి విమానాశ్రయంలో 20కు పైగా అంబులెన్స్‌లు, అగ్నిమాపక వాహనాలను అధికారులు సిద్ధంగా ఉంచారు. విమానం సురక్షితంగా కిందకు దిగడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. చాకచక్యంతో వ్యవహరించిన విమాన పైలట్, ఇతర సిబ్బందిని సీఎం స్టాలిన్ 'ఎక్స్' వేదికగా అభినందించారు.

తెలంగాణకు నిధుల కేటాయింపులో కేంద్రం అన్యాయం

- మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శ

ఈనాడు, హైదరాబాద్: గోదావరి పుష్కరాల కోసం ఆంధ్రప్రదేశ్‌కు రూ.100 కోట్లు ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు గుండుసున్నా మిగిల్చిందని, ప్రతి సందర్భంలోనూ కేంద్ర ప్రభుత్వం నిధుల కేటాయింపులో తెలంగాణకు తీవ్ర అన్యాయం చేస్తోందని భారాస సీనియర్ నేత, మాజీ మంత్రి టి.హరీశ్‌రావు ఒక ప్రకటనలో విమర్శించారు. "తెలంగాణ నుంచి 8 మంది భాజపా ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులున్నా... రాష్ట్రానికి ఒక్క రూపాయి కూడా సాధించలేకపోయారు. తెలంగాణకు హక్కుగా రావాల్సిన నిధుల కోసం పోరాటం చేయడంలో భాజపా, కాంగ్రెస్ పార్టీలు పూర్తిగా విఫలమయ్యాయి. లోక్‌సభలో భారాస ఉండి ఉంటే, తెలంగాణకు అన్యాయం జరిగేది కాదు. రాష్ట్ర హక్కుగా రావాల్సిన నిధులను కచ్చితంగా ఇవ్వాలి" అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

మహదేవ్ బెట్టింగ్ యాప్ నిర్వాహకుల ఆటకట్టు

- దుబాయ్‌లో గృహనిర్బంధం.. త్వరలో భారత్‌కు తరలింపు

దిల్లీ: మహదేవ్ బెట్టింగ్ యాప్ ప్రమోటర్లలో ఒకడైన సౌరభ్ చంద్రకర్‌ను త్వరలోనే దుబాయ్ నుంచి భారత్‌కు తీసుకురానున్నట్లు అధికారులు శుక్రవారం తెలిపారు. అక్రమ ధన చలామణి, మోసం కేసుల్లో ఇంటర్‌పోల్ రెడ్ నోటీసు జారీ చేయడంతో చంద్రకర్‌ను, సహ ప్రమోటర్ రవి ఉప్పల్‌ను దుబాయ్‌లో గృహనిర్బంధంలో ఉంచారు. ఈడీ సూచన మేరకు ఆ నోటీసు జారీ అయింది. వీరిద్దరూ చట్టవిరుద్ధ ఆన్‌లైన్ బెట్టింగ్ వెబ్‌సైట్ల ద్వారా రూ.6,000 కోట్ల మేరకు సొమ్ము చేసుకున్నారు. 2023 ఫిబ్రవరిలో యూఏఈలోని రస్ అల్ ఖైమాలో పెళ్లి చేసుకున్న చంద్రకర్ వివాహ వేడుకలకు రూ.200 కోట్లు ఖర్చు పెట్టాడు. చంద్రకర్‌తో సంబంధాలున్నాయని అనుమానిస్తున్న బాలీవుడ్ తారలను సైతం అధికారులు ప్రశ్నిస్తున్నారు. 2019లో దుబాయ్‌కు వెళ్లడానికి ముందు చంద్రకర్ తన సోదరుడితో కలసి ఛత్తీస్‌గఢ్‌లోని భిలాయ్‌లో పండ్లరసాల దుకాణం నడిపేవాడు. దుబాయ్ కేంద్రంగా చంద్రకర్, ఉప్పల్ నడిపిన మహదేవ్ బెట్టింగ్ యాప్‌లో ప్రమేయం ఉన్న కొందరు రాజకీయ నాయకులు, ఉన్నతాధికారులకు భారీగా డబ్బు ముట్టింది. ఈ కేసులో ఈడీ ఇప్పటివరకు 11 మందిని అరెస్టు చేసింది.

అరబిక్, ఫ్రెంచ్ జూనియర్ లెక్చరర్ ఫలితాల విడుదల

ఈనాడు-హైదరాబాద్: ఇంటర్మీడియెట్ కళాశాలల్లో అరబిక్, ఫ్రెంచ్ బోధించే జూనియర్ లెక్చరర్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) శుక్రవారం రాత్రి ప్రకటించింది. పూర్తి వివరాలు కమిషన్ వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

రూ.లక్షన్నర కోట్లు ఎలా తెస్తారు?

- మూసీ ప్రక్షాళనపై డీపీఆర్ ఏదీ?
- అన్ని అనుమతులిచ్చి... ఇప్పుడు పేదల ఇళ్లను కూలుస్తారా?
- రాష్ట్ర ప్రభుత్వంపై కేంద్ర మంత్రి, భాజపా అధ్యక్షుడు కిషన్‌రెడ్డి మండిపాటు

ఈనాడు, హైదరాబాద్: "మూసీ సుందరీకరణకు రూ.లక్షన్నర కోట్లను ఎక్కడి నుంచి సమీకరించుకుంటారనే దానిపై రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టత లేదు. డీపీఆర్ కూడా లేకుండానే ముందుకెళ్తుండటం విడ్డూరంగా ఉంది. ఈ ప్రభుత్వం పేదల ఇళ్లను కూలగొట్టడమే లక్ష్యంగా పెట్టుకుంది. బాధితులందరికీ మేం అండగా ఉంటాం" అని కేంద్ర మంత్రి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి స్పష్టంచేశారు. శుక్రవారం భాజపా రాష్ట్ర కార్యాలయంలో విలేకరులతో ఆయన ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ... "మూసీ పరీవాహక ప్రాంతంలో ఇళ్లు నిర్మించుకుని, 40 ఏళ్లుగా నివాసముంటున్న పేదలను అక్కడి నుంచి పంపించి వేయాలనుకోవడం ఎంతమాత్రం సరి కాదు. ఈ నిర్మాణానికి గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలే అనుమతిచ్చాయని గుర్తుంచుకోవాలి. ఇళ్లకు కరెంటు, తాగునీరు, డ్రైనేజీ సౌకర్యాలు కల్పించి... ఇప్పుడు కూల్చేస్తామంటే ఎలా? గండిపేట నుంచి చౌటుప్పల్ దాకా మురుగంతా మూసీలోనే కలుస్తున్న విషయాన్ని విస్మరించి... నగరంలోనే మూసీ సుందరీకరణ అనడం ఆశ్చర్యంగా ఉంది. నదికి రిటైనింగ్ వాల్‌ను నిర్మించి సుందరీకరించేందుకు ఉన్న అవకాశాలను ప్రభుత్వం పరిశీలించడంలేదు. గత భారాస ప్రభుత్వం రూ.3,800 కోట్లతో మూసీ ప్రక్షాళనంటూ హడావుడి చేసి, చివరకు రూ.30 కోట్లు కూడా ఖర్చు చేయలేదు. వారి హయాంలోనూ ఇళ్లకు రెడ్ మార్కులు వేశారు. మూసీ పరీవాహకంలోని పేదలు బలహీనులుకాదనే విషయాన్ని ప్రభుత్వం గుర్తుంచుకోవాలి. వారికి అండగా ఉండటమే భాజపా పాలసీ. పేదలను ఒప్పించి ఖాళీ చేయించడానికి సీఎం రేవంత్‌రెడ్డి వస్తే మేం కూడా వెళ్లి పేదల తరఫున మాట్లాడతాం. హైడ్రా కొత్తదేమి కాదు. అక్రమ నిర్మాణాల కూల్చివేతలను గతంలో జీహెచ్‌ఎంసీ చేస్తుండేది. మూసీలో నిర్మించిన ఎంజీబీఎస్, మెట్రో స్టేషన్, ఇతర నిర్మాణాలను కూల్చేస్తారా?" అని ప్రశ్నించారు. రాష్ట్రాన్ని లూటీ చేసిన భారాసతో రాజీపడే ప్రసక్తే ఉండదని స్పష్టంచేశారు.

కశ్మీర్‌లో శాంతి... అభివృద్ధి

"భాజపా పాలనలో దేశం జాతీయంగా, అంతర్జాతీయంగా బలోపేతం అవుతోంది. ఆర్టికల్ 370పై పునరాలోచన ఉండబోదు. జమ్మూ కశ్మీర్‌లో శాంతిభద్రతల మెరుగయ్యాయి. పంచాయతీ, బ్లాక్ సమితి ఎన్నికలు నిర్వహించడంతో స్థానిక పాలనకు, అభివృద్ధికి మార్గం సుగమమైంది. అక్కడ స్వేచ్ఛాయుత వాతావరణంలో శాసనసభ ఎన్నికలు జరిగాయి. భాజపా గతం కంటే ఎక్కువ స్థానాలు సాధించింది" అని కిషన్‌రెడ్డి వివరించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధులు ప్రకాశ్‌రెడ్డి, ఎన్.వి.సుభాష్ ఉన్నారు.

మూసీ ప్రక్షాళనపై భాజపా, భారాస వైఖరేంటో చెప్పాలి

- హైదరాబాద్ బాగుండటం మీకు ఇష్టం లేదా?
- రెండో విడత కార్పొరేషన్ పదవులు దీపావళికి భర్తీ
- విలేకరులతో ఇష్టాగోష్ఠిలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్

హైదరాబాద్, న్యూస్‌టుడే: మూసీ ప్రక్షాళనపై తమ వైఖరేంటో స్పష్టం చేయాలని భాజపా, భారాసలను పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ డిమాండ్ చేశారు. భవిష్యత్తులో హైదరాబాద్ బాగుండటం మీకు ఇష్టం లేదా? అని నిలదీశారు. పేదలకు ఇబ్బంది కలగకుండా మూసీ ప్రక్షాళన చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఆయన శుక్రవారం గాంధీభవన్‌లో విలేకరులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. '2016లోనే అప్పటి సీఎం కేసీఆర్ మూసీ ప్రక్షాళన గురించి మాట్లాడారు. ఇప్పుడెందుకు భారాస నాయకులు అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు? నిర్వాసితులను అన్ని రకాలుగా ఆదుకుంటామని సీఎం రేవంత్‌రెడ్డి భరోసా ఇచ్చారు. 50 శాతానికి పైగా బాధితులు మూసీ ప్రక్షాళనకు అంగీకరించారు. ప్రస్తుతం ప్రభుత్వం దృష్టంతా మూసీ ప్రక్షాళనపైనే ఉంది. సుందరీకరణకు చాలా సమయం పడుతుంది. పేదలకు అన్యాయం జరిగితే ఉద్యమిస్తామని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అంటున్నారు. పదేళ్ల పాలనలో కార్పొరేట్ల కొమ్ముకాస్తూ ధరల నియంత్రణలో విఫలమై.. పేదల పొట్టగొడుతున్న భాజపాకు వారి గురించి మాట్లాడే నైతిక హక్కు లేదు. భాజపా, భారాస కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎదుర్కోవడానికి లోపాయికారీ ఒప్పందంతో ముందుకెళ్తున్నాయి. లిక్కర్ స్కాంలో ఎమ్మెల్సీ కవితకు బెయిల్ రావడం కూడా అందులో భాగమే. భారాస మా ప్రభుత్వం మీద అసత్య ప్రచారం చేయడానికి సోషల్ మీడియాను వాడుకుంటోంది. ముఖ్యంగా మహిళా మంత్రులు సీతక్క, కొండా సురేఖలను టార్గెట్ చేస్తోంది. తెలంగాణలో సైబర్ క్రైం ఉండటంతో భారాస దుబాయ్ నుంచి ఈ సోషల్ మీడియా అకౌంట్లను నడిపిస్తోంది. కేటీఆర్ వైఖరి వల్ల మంత్రి సురేఖ పలు వ్యాఖ్యలు చేశారు. ఈ కారణంగా ఆమెను మంత్రివర్గం నుంచి తప్పిస్తారని జరుగుతున్న ప్రచారంలో నిజం లేదు. రెండో విడత కార్పొరేషన్ పదవులు దీపావళికి భర్తీ చేస్తాం. నెల రోజుల్లో పీసీసీ నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేస్తాం. భారాస నుంచి కాంగ్రెస్‌లో చేరిన వారికి ఎలాంటి హామీలు ఇవ్వలేదు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న బీసీల పక్షాన మాట్లాడితే పార్టీ లైన్ తప్పారనడానికి లేదు. సమీకృత గురుకుల భవనాల నిర్మాణానికి పెద్దఎత్తున శంకుస్థాపనలు చేయడం అద్భుతమైన కార్యక్రమం. నాంపల్లి ఇన్‌ఛార్జి ఫిరోజ్‌ఖాన్‌పై దాడి చేసిన ఎంఐఎం నేతలపై చట్ట ప్రకారం చర్యలుంటాయి' అని మహేశ్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు.

(c) eenadu

డ్రోన్లు కొంటారా? శుద్ధి యూనిట్లు పెడతారా?

- రైతుల కోసం 'వ్యవసాయ మౌలిక సదుపాయాల నిధి'
- రాష్ట్రంలో ఇప్పటికే 2,199 యూనిట్లు మంజూరు
- ఈ నిధి వినియోగంలో ముందంజ

సిరిసిల్ల జిల్లా గంభీరావుపేటలో నిర్మించిన అధునాతన గోదాము

ఇలా రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ మౌలిక సదుపాయాల నిధి (అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్- ఏఐఎఫ్) పథకం కింద రూ.2,836 కోట్లతో 2,199 యూనిట్లు నిర్మించారు. ఇందులో వ్యవసాయ ప్రాసెసింగ్ యూనిట్లు 1,322, గిడ్డంగులు 825, యంత్రాలు అద్దెకిచ్చే కేంద్రాలు 163, శీతల గిడ్డంగులు 101 ఉన్నాయి. వ్యవసాయ ఉత్పత్తులకు అదనపు విలువ జోడించడం, శుద్ధి వంటి సదుపాయాలతో గిట్టుబాటు ధరలు పొందేలా, రైతుల ఆదాయం మరింత పెంచే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం 2020లో ఈ పథకాన్ని ప్రారంభించింది. దీనికింద ఎలాంటి హామీ కత్తు లేకుండా గరిష్ఠంగా రూ.2 కోట్ల వరకు బ్యాంకులు రుణం ఇస్తాయి. లబ్ధిదారులు 6% వడ్డీ చెల్లించాలి. 3% వడ్డీ రాయితీ లభిస్తుంది. జాతీయ ఉద్యాన మిషన్, వ్యవసాయ మార్కెటింగ్ మౌలిక వసతులు, ఆహారశుద్ధి పథకాలనూ దీనికి అనుసంధానం చేశారు. ఈ పథకాల కింద ప్రాజెక్టులను చేపడితే 25% నుంచి 33% వరకు రాయితీ లభిస్తుంది.

- రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేటలో ప్రాథమిక సహకార సంఘం.. రూ.66 లక్షల 'వ్యవసాయ మౌలిక సదుపాయాల నిధి'తో ఆధునిక గోదాము నిర్మించింది. 5 వేల టన్నుల నిల్వ సామర్థ్యం గల ఈ గోదాములో రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను నిల్వ చేసుకుని, మంచి ధరవచ్చినప్పుడు విక్రయిస్తున్నారు.
- వరంగల్ జిల్లా నర్సంపేటలో రైతు ఉత్పత్తిదారులు విత్తన శుద్ధి కర్మాగారాన్ని నిర్మించారు. 300 మంది సభ్యులు గల ఈ సంఘం దీని ద్వారా లబ్ధి పొందనుంది.

గిడ్డంగుల నిర్మాణంలో దేశంలో ప్రథమం

యూనిట్ల మంజూరులో గత మూడేళ్లుగా అగ్రస్థానంతో పాటు జియో ట్యాగింగ్‌లో తెలంగాణ మూడోస్థానం సాధించింది. రాష్ట్రంలో ఒక్కో యూనిట్‌కు సగటున రూ.1.26 కోట్ల రుణాన్ని బ్యాంకులు మంజూరు చేశాయి. ఏఐఎఫ్ కింద దేశంలోనే అత్యధికంగా తెలంగాణలో 825 ఆధునిక గిడ్డంగులు మంజూరు అయ్యాయి. వీటిలో రైతులు 357, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు, రైతు ఉత్పత్తి సంఘాలు కలిపి 376 నిర్మించగా... మరో 92 నిర్మాణాలు జరుగుతున్నాయి. 500 ప్రాజెక్టులు కొత్తగా మంజూరయ్యాయి.

మంజూరు.. చెల్లింపులు ఇలా..

అర ఎకరం, ఆపైన భూమి ఉన్న రైతులు, రైతు సంఘాలు ఈ రుణాల కోసం సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. పెద్ద ప్రాజెక్టులకు సమగ్ర పథక నివేదిక (డీపీఆర్) సైతం సమర్పించాల్సి ఉంటుంది. మంజూరైన భారీ ప్రాజెక్టును రెండేళ్లలో పూర్తి చేసి... మూడో ఏడాది నుంచి రుణ చెల్లింపు ప్రారంభించాలి. డ్రోన్లు, ఇతర యంత్ర పరికరాలను ప్రాజెక్టు మంజూరైన ఆరు నెలల్లో కొనుగోలు చేసి.. ఏడేళ్ల లోపు రుణాలు తిరిగి చెల్లించాలి.

ఆహారశుద్ధి యూనిట్లతో లబ్ధి

– నర్సింహారెడ్డి, కట్టంగూరు రైతు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు

మా ప్రాంతంలో నిమ్మ, బత్తాయి, నారింజ తదితర తోటలున్నాయి. గతంలో వీటిని శుద్ధి చేయకపోవడం వల్ల నష్టపోయాం. ఏఐఎఫ్ కింద రూ.కోటి రుణం తీసుకొని శుద్ధి కర్మాగారం నిర్మించారు. ఈ కాయల రసంతో పాటు పొడి కూడా తయారు చేస్తున్నాం. ప్రతి నెల 10 టన్నుల కాయలను శుద్ధి చేసి వివిధ ఆహార కంపెనీలకు విక్రయిస్తున్నాం. విదేశాలకూ ఎగుమతి చేస్తున్నాం.

పథకాన్ని వినియోగించుకోవాలి

– భుజంగరావు, రాష్ట్ర ప్రాజెక్టు అధికారి, ఏఐఎఫ్

వ్యవసాయ మౌలిక సదుపాయాల నిధి కింద కేంద్రం విస్తృతంగా ప్రాజెక్టులను మంజూరు చేస్తోంది. దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులందరికీ సాయం అందిస్తున్నాం. రైతులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, సహకార సంఘాలు దీనిని వినియోగించుకునేందుకు ముందుకురావాలి. వారికి అన్ని విధాలా సహకారం అందిస్తాం.

– ఈనాడు, హైదరాబాద్

రాష్ట్రంలో ఒక్కో కుటుంబంపై రుణం రూ.1,29,599

- అత్యధికంగా అప్పుల్లో ఉన్నది తెలంగాణ వాసులే
- ఆదాయం పెరిగినా తగ్గుతున్న మిగులు
- నాబార్డ్ సర్వేలో వెల్లడి

ఈనాడు, దిల్లీ: రాష్ట్రంలో కుటుంబం పెద్దదైంది. ఒక్కో కుటుంబంలో సగటు సభ్యుల సంఖ్య 3.8 నుంచి 4.1కి చేరినట్లు నాబార్డ్ ఆల్ ఇండియా రూరల్ ఫైనాన్షియల్ ఇంక్లూజన్ సర్వే 2021-22లో తేలింది. ఈ సంస్థ 2016-17లో విడుదల చేసిన సర్వేలో ఈ సంఖ్య 3.8 కాగా, ఇప్పుడు 4.1కి చేరినట్లు వెల్లడైంది. ఆంధ్రప్రదేశ్‌లో 3.5 నుంచి 3.7కి చేరింది. జాతీయ సగటు 4.3. దేశంలో అత్యధికంగా ఉత్తర్‌ప్రదేశ్‌లో 5, బిహార్‌లో 4.8 వరకు ఒక్కో కుటుంబంలో ఉన్నట్లు తాజాగా విడుదలైన ఈ నివేదిక వెల్లడించింది. మహారాష్ట్రలో అత్యల్పంగా 3.5గా ఉంది. రాష్ట్రంలో ఒక్కో కుటుంబంపై సగటున రూ.1,29,599 అప్పు ఉంది. జాతీయ సగటు రూ.90,372. రాష్ట్రంలో అప్పుల్లో ఉన్న కుటుంబాల సంఖ్య 79% నుంచి 92%కి పెరిగింది. జాతీయ సగటు 52%. దేశంలో అప్పుల్లో ఉన్న కుటుంబాల్లో తెలంగాణ (92%), ఆంధ్రప్రదేశ్ (86%) తొలి రెండు స్థానాలలో ఉన్నాయి.

★ తెలంగాణలోని ఒక్కో కుటుంబ నెలవారీ సగటు ఆదాయం రూ.7,811 నుంచి రూ.12,065కి (54.46%)పెరిగింది. జాతీయ సగటు రూ.8,059 నుంచి రూ.12,698 (57.56%)కి చేరింది.

★ వ్యవసాయ కుటుంబ నెలవారీ సగటు ఆదాయం రూ.8,951 నుంచి రూ.13,874 (54.99)కి చేరింది. జాతీయ సగటు రూ.8,931 నుంచి రూ.13,661 (52.96%)కి పెరిగింది. ప్రస్తుతం అత్యధికంగా పంజాబ్‌లో ఒక్కో రైతు కుటుంబానికి రూ.31,433 ఆదాయం ఉంది.

★ కుటుంబ నెలవారీ సగటు మిగులు ఇదివరకు రూ.998 ఉండగా, ఇప్పుడు రూ.781కి పడిపోయింది. పంజాబ్‌లో కుటుంబానికి నెలకు రూ.5,683 ఆదాయం మిగులుతుండగా, ఏపీ, బిహార్, ఝార్ఖండ్, తెలంగాణలోని కుటుంబాల వద్ద మిగులు అతితక్కువగా ఉంటోంది.

★ 2021-22 వ్యవసాయ సంవత్సరంలో రుణం తీసుకున్న కుటుంబాలు 73%. జాతీయ సగటు 42%. ఈ విషయంలో ఏపీ, తెలంగాణ తొలి రెండు స్థానాలలో ఉన్నాయి.

★ కుటుంబ నెలవారీ సగటు వినియోగ వ్యయం రూ.6,813 నుంచి రూ.11,284 (65.62%)కి చేరింది. జాతీయ సగటు రూ.6,646 నుంచి రూ.11,262 (69.45%)కి పెరిగింది.

★ రాష్ట్రంలో కౌలుకి తీసుకున్న వ్యవసాయ కుటుంబాలు 5.6%. కౌలుకు ఇచ్చినవి 1.8%.

★ వ్యవసాయ సంవత్సరంలో ఒక్కో కుటుంబం పొదుపుచేసిన సగటు మొత్తం రూ.18,381. జాతీయ సగటు రూ.20,139. అత్యధికంగా జమ్మూకశ్మీర్‌లో రూ.53,140 పొదుపుచేస్తున్నారు.

★ రాష్ట్రంలోని 54% కుటుంబాలు ఎంతో కొంత మొత్తాన్ని పొదుపు చేస్తున్నాయి. జాతీయ సగటు 66%.

తెలంగాణలో మరిన్ని గణాంకాలు ఇలా...

★ రాష్ట్రంలో 92% కుటుంబాలు గ్రామాల్లో, 8% సెమీ అర్బన్ ప్రాంతంలో ఉన్నట్లు నివేదిక వెల్లడించింది.

★ వ్యవసాయ కుటుంబాల సంఖ్య 55%, వ్యవసాయేతర కుటుంబాల సంఖ్య 45%.

★ వ్యవసాయ కుటుంబాల చేతుల్లో ఇంటిజాగాతో కలిపి ఉన్న సగటు భూ విస్తీర్ణం 1.01 హెక్టార్ల నుంచి 0.80 హెక్టార్లకు, వ్యవసాయేతర కుటుంబాల చేతుల్లో ఉన్న సగటు విస్తీర్ణం 0.20 హెక్టార్ల నుంచి 0.08 హెక్టార్లకు తగ్గిపోయింది.

మరిన్ని వివరాలు www.eenadu.net లో

గూడ్స్ రైలును ఢీకొన్న భాగమతి ఎక్స్‌ప్రెస్

- పట్టాలు తప్పిన 13 కోచ్‌లు
- ఒకదానిపై మరొకటి ఎక్కిన బోగీలు
- ఏసీ కోచ్‌ల్లోని ప్రయాణికులకు గాయాలు

రైలు ప్రమాదం కారణంగా బోగీల్లో మంటలు

ప్రమాదస్థలంలో బోల్తా పడిన గూడ్స్ రైలు బోగీ

ఈనాడు-చెన్నై, న్యూస్‌టుడే-పొన్నేరి: తమిళనాడులో శుక్రవారం రాత్రి భారీ రైలు ప్రమాదం చోటుచేసుకుంది. ఎంతోమంది ప్రయాణికులు గాయపడినట్లు తెలుస్తోంది. మైసూరు నుంచి తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మీదుగా దర్భాంగ వెళ్లాల్సిన భాగమతి ఎక్స్‌ప్రెస్ (12578) రైలు వేగంగా వచ్చి తమిళనాడులోని తిరువళ్లూరు జిల్లా కవరైపెట్టై రైల్వేస్టేషన్ సమీపంలో గూడ్స్ రైలును ఢీకొంది. 13 వరకు కోచ్‌లు పట్టాలు తప్పాయి. కొన్ని చెల్లాచెదురుగా పడిపోగా, మరికొన్ని ఒకదాని పైకి మరొకటి ఎక్కాయి. సమీప గ్రామాల్లోని ప్రజలు, వివిధ శాఖల సహాయక సిబ్బంది పరుగున వచ్చి సహాయక చర్యలు చేపట్టారు. ప్రయాణికులెవరూ మరణించలేదని దక్షిణ రైల్వే ప్రకటించింది. చెన్నై రైల్వే డివిజన్ 044 2535 4151, 044 2435 4995 ఫోన్ నంబర్లతో హెల్ప్‌లైన్లను ఏర్పాటుచేసినట్లు చెప్పింది. గూడ్స్ రైలును ఢీకొన్నప్పుడు ముందుభాగంలో అన్నీ ఏసీ కోచ్‌లే ఉండటంతో వాటిలో ఉండే ప్రయాణికులు గాయపడ్డారని తెలుస్తోంది. వారందరినీ సమీపంలోని ఆసుపత్రులకు తరలించారు.

మళ్లీ అదే తప్పు జరిగింది

గతేడాది ఒడిశా పరిధిలో మూడు రైళ్లు ఢీకొన్న ప్రమాదంలో వందలమంది ప్రయాణికులు మృతి చెందారు. అప్పట్లో గ్రీన్ సిగ్నల్స్ పడటం, రైలు ట్రాక్ మారడం వంటి తప్పిదాలు జరిగాయి. సరిగ్గా అదే తీరులో భాగమతి ఎక్స్‌ప్రెస్ ప్రమాదానికి గురైంది. రాత్రి 8.27 సమయంలో ఈ రైలు పొన్నేరి స్టేషన్ దాటింది. కవరైపెట్టై స్టేషన్‌కు వస్తున్న సమయంలో ఆ రైలు ప్రధాన లైనుపై నుంచి కాకుండా లూప్‌లైన్‌లోకి వెళ్లడం, ఆ లైన్‌లో ఆగి ఉన్న గూడ్స్ రైలును ఢీకొట్టడం క్షణాల్లో జరిగిపోయాయి. ఈ సమయంలో ఎక్స్‌ప్రెస్ రైలుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లుగా రైల్వే అధికారులు వెల్లడించారు. ప్రమాద సమయంలో రైలు వేగం గంటకు 75 కి.మీ. ఉన్నట్లు తెలిపారు. గూడ్స్ రైలును వేగంగా వచ్చి ఢీకొనడంతో భాగమతి ఎక్స్‌ప్రెస్‌లోని లోకోతో పాటు సుమారు 12, 13 ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు పట్టాలు తప్పాయి. ఇంజిన్ తర్వాత ముందుభాగంలో లగేజీ కోచ్‌తో పాటు 10 ఏసీ కోచ్‌లే ఉన్నాయి. ప్రయాణికులున్న హెచ్1, ఏ2 కోచ్‌లు ఏపీ నుంచి కర్ణాటక, తమిళనాడు వైపు వెళ్లే ప్రధాన మార్గంలోని పట్టాల పైకి ఎగిరి పడ్డట్లు సాక్షులు చెబుతున్నారు. పార్శిల్ వ్యానులో మంటలు చెలరేగాయి.

నెలాఖరులోగా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎంపిక

- ఇందుకు అనుగుణంగా అభిప్రాయాలు సేకరించాలి
- జూమ్ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి

ఈనాడు, హైదరాబాద్: మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలని పార్టీ శ్రేణులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉద్బోధించారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ఈ ఎమ్మెల్సీ ఎన్నిక కోసం జూమ్ సమావేశం జరిగింది. రేవంత్‌రెడ్డి మాట్లాడారు. "లోక్‌సభ నియోజకవర్గాల వారీగా ఈ నెల 15 లోగా సమన్వయ కమిటీని ఏర్పాటు చేసి... అభ్యర్థి ఎంపిక కోసం సీనియర్ నాయకుల చేత అభిప్రాయాలు సేకరించి... అన్ని విధాలా గెలుపు అవకాశాలున్న నాయకుడిని అభ్యర్థిగా నిలబెట్టాలి. నెలాఖరులోగా అభ్యర్థి ఎంపిక పూర్తి చేయాలి. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ బాధ్యతలు చేపట్టాక జరుగుతున్న మొదటి ఎన్నిక ఇది. కాబట్టి అత్యంత పకడ్బందీగా మంచి వ్యూహంతో ముందుకు వెళ్లాలి. పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయించాలి. ప్రధానంగా యూత్ కాంగ్రెస్, ఎన్‌ఎస్‌యూఐ వారు ఎన్నికల్లో పూర్తిస్థాయిలో పనిచేసే విధంగా వ్యూహరచన చేయాలి. ఈ ఎన్నిక కోసం ప్రత్యేకంగా ఒక వార్ రూమ్ ఏర్పాటు చేసి ఎన్నికల సమన్వయ వ్యూహాలను అమలు చేసేందుకు చర్యలు తీసుకోండి" అని సీఎం రేవంత్ సూచించారు. మహేశ్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ వెంటనే నేతలు ఎన్నికకు సిద్ధం కావాలని అన్నారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి దీపా దాస్‌మున్షీ మాట్లాడుతూ కొత్త ఓటర్ల నమోదులో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ గత ఎన్నికల్లో తాను పోటీ చేసే సమయంలో కొంత సానుభూతి వ్యక్తమైందని అది విజయానికి దోహదపడిందని అన్నారు. సమావేశంలో మంత్రులు, ఎమ్మెల్యేలు ఎంపీలు, డీసీసీ అధ్యక్షులు అభిప్రాయాలు తెలిపారు.

స్థిరమైన ప్రయత్నాలతోనే లక్ష్య సాధన

మీరు కలలు కంటూ కూర్చున్నారంటే ఇంకా సున్నా దగ్గరే ఉన్నట్లు. వాటిని సాకారం చేసుకోవడానికి ఒక్క అడుగు ముందుకేసినప్పుడే మీరు ఒకటో మైలురాయికి చేరుకున్నట్లు. అలా రోజూ స్థిరత్వంతో ప్రయత్నిస్తున్నారంటే మీ ప్రయాణం ముందుకు సాగుతున్నట్లు. అందుకే మధ్యలో ఏ కారణంతోనూ విరామం ఇవ్వకుండా లక్ష్యసాధన కోసం రోజూ నిర్దిష్ట సమయం పాటు పనిచేస్తూనే ఉండండి.

– జేమ్స్ క్లియర్, రచయిత

ఓట్లెక్కువ వచ్చినా ఓడిపోవచ్చు!

అమెరికా అధ్యక్ష ఎన్నికకు ఎలక్టోరల్ కాలేజీయే కీలకం

ప్రజాస్వామ్యంలో మామూలుగా... ఎన్నికల్లో ఎవరికి ఎక్కువ ఓట్లు వస్తే వాళ్ళు నెగ్గినట్లు! కానీ అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఓట్లెక్కువ వచ్చినా ఓడిపోవచ్చు! తక్కువ వచ్చిన వారూ అధ్యక్ష పీఠం అధిరోహించవచ్చు! ఓట్లెక్కువ వచ్చినవారు అధ్యక్ష పీఠం ఎక్కుతారనే గ్యారెంటీ ఏమీ లేదు. చరిత్రలో అలా జరిగింది కూడా! వినడానికి కాసింత ఆశ్చర్యంగా అనిపించినా ఇది నిజం! దీనికి కారణం... అమెరికా అధ్యక్ష ఎన్నికల ఎలక్టోరల్ కాలేజీ!

270 వస్తే నెగ్గినట్లు..

నాలుగేళ్లకోసారి నవంబరు తొలివారంలో అధ్యక్ష ఎన్నికల్లో దేశవ్యాప్తంగా అమెరికా ప్రజలు పార్టీలు/అభ్యర్థుల వారీగా ఓట్లు వేస్తారు. కానీ వారు ప్రత్యక్షంగా తమ అధ్యక్షుడిని ఎన్నుకోరు. ఆ ఓట్ల ఆధారంగా ఎలక్టోరల్ కాలేజీ ప్రతినిధులు ఎన్నికవుతారు. ఎలక్టోరల్ కాలేజీకి ఎంపికయ్యే వారిని ఎలక్టర్లు అంటారు. వీరంతా డిసెంబరు 17న సమావేశమై అధ్యక్షుడిని ఎన్నుకుంటారు. మొత్తం 538 ఎలక్టోరల్ సీట్లకుగాను... 270 మద్దతు లభించినవారు అధ్యక్షులవుతారు.

538 ఇలా...

ఆయా రాష్ట్రాల్లోని జనాభా ఆధారంగా ఒక్కోరాష్ట్రానికి ఒక్కోలా ఎలక్టోరల్ కాలేజీ స్థానాలుంటాయి. ఉదాహరణకు... కాలిఫోర్నియాకు అత్యధికంగా 54, టెక్సాస్‌కు 40 ఎలక్టోరల్ సీట్లుండగా... తక్కువ జనాభాగల వ్యోమింగ్‌కు మూడు ఎలక్టోరల్ ఓట్లున్నాయి అధ్యక్ష ఎన్నికల బరిలో ఉన్న పార్టీలు ఆయా రాష్ట్రాల్లో తమ ఎలక్టర్లను ముందే నిర్ణయిస్తాయి. నవంబరులో ప్రజలు వేసే ఓట్ల ఆధారంగా ఏ పార్టీకి ఎన్ని ఎలక్టోరల్ సీట్లు అనేవి ఖరారవుతాయి. ఎక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థికి ఆ రాష్ట్రంలోని ఎలక్టోరల్ కాలేజీ స్థానాలన్నీ వెళతాయి. ఉదాహరణకు కాలిఫోర్నియాకు 54 ఎలక్టోరల్ ఓట్లున్నాయి. అక్కడ ఈసారి ఎన్నికల్లో కమలా హారిస్‌కు సగం కంటే ఎక్కువగా 50.1 శాతం ఓట్లు (పాపులర్ ఓట్లు) వస్తే ఆ రాష్ట్రానికి చెందిన 54 ఎలక్టోరల్ కాలేజీ ఓట్లు గంపగుత్తగా డెమొక్రాటిక్ పార్టీ ఖాతాలో పడిపోతాయి. అందుకే... దేశవ్యాప్తంగా ఎక్కువ ఓట్లు వచ్చేదానికంటే... 270 ఎలక్టోరల్ కాలేజీ సీట్లు వచ్చేలా ఓట్లు రావటం అధ్యక్ష పీఠానికి అత్యవసరం!

వేయాలని ఏమీ లేదు...

ఎలక్టోరల్ కాలేజీ సభ్యులు.. తమ రాష్ట్రాల్లోని ఓటర్ల అభీష్టానికి అనుగుణంగానే అధ్యక్ష ఎన్నికలో ఓటేయాలన్న రాజ్యాంగ నిబంధనేదీ లేదు. అంటే కాలిఫోర్నియా నుంచి 54 మంది డెమొక్రాటిక్ పార్టీ ఎలక్టర్లంతా కమలా హారిస్‌కే కచ్చితంగా ఓటు వేయాలని ఏమీ లేదు. అయితే వీరు 'నమ్మక ద్రోహానికి' పాల్పడటం చాలా అరుదు. దీనికితోడు నిర్దిష్ట పార్టీకే ఓటేస్తామని ఆ సభ్యులు ముందే ప్రకటిస్తారు. ఎలక్టోరల్ కాలేజీ సభ్యులు ఎవరైనా ఒకవేళ 'విశ్వాసాన్ని' వమ్ముచేస్తే వారిపై ఆయా రాష్ట్రాలు కఠిన శిక్ష విధించాలని అమెరికా సుప్రీంకోర్టు 2020లో ఆదేశించింది.

టై అయితే..?

అమెరికా అధ్యక్ష ఎన్నిక హోరాహోరాగా సాగుతున్న నేపథ్యంలో... ఎలక్టోరల్ కాలేజీలో ఒకవేళ ఇద్దరు అభ్యర్థులకూ 269 చొప్పున ఓట్లు వచ్చి.. టై అయితే పరిస్థితి ఏంటన్న ప్రశ్న ఉత్పన్నమవటం సహజం. 1824లో నలుగురు అభ్యర్థులకూ ఎలక్టోరల్ కాలేజీలో సమానంగా ఓట్లు వచ్చాయి. అలా ఎలక్టోరల్ కాలేజీ ద్వారా అభ్యర్థిని ఎంపిక చేయడం కుదరకపోతే అమెరికా రాజ్యాంగం ప్రకారం.. అధ్యక్షుడిని కాంగ్రెస్‌లోని దిగువ సభ (ప్రతినిధుల సభ) ఎన్నుకోవాలి. ఉపాధ్యక్షుడిని ఎగువ సభ (సెనెట్) ఎన్నుకుంటుంది.



తాజాగా హిల్లరీ

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ప్రజల ఓట్లు ఎక్కువగా పడ్డా (పాపులర్ ఓటు).. ఎలక్టోరల్ కాలేజీలో దెబ్బతిని కొంతమంది అభ్యర్థులు అధ్యక్ష పీఠానికి దూరమయిన సందర్భాలున్నాయి.

- ఇలాంటి ఉదంతం 1824లో మొదటిసారి చోటుచేసుకుంది. జాన్ క్విన్సీ ఆడమ్స్‌కు ఎక్కువ ఓట్లు వచ్చినా (పాపులర్ ఓటు గెల్చుకున్నా).. ఆయనకు అధ్యక్ష పీఠం దక్కలేదు. 2000 సంవత్సరంలో ఆల్ గోర్‌కు, 2016లో హిల్లరీ క్లింటన్‌కూ ఇదే పరిస్థితి ఎదురైంది. అల్‌గోర్‌కు జార్జ్ బుష్‌కంటే 5లక్షలకుపైగా ఓట్లు వచ్చినా ఓడిపోయారు. 2016లో ట్రంప్ కంటే హిల్లరీ క్లింటన్‌కు 30 లక్షల ఓట్లు ఎక్కువ వచ్చాయి. కానీ... ఎలక్టోరల్ కాలేజీకి అవసరమైనన్ని రాలేదు.

700 సార్లు విఫలయత్నం...

అమెరికా అధ్యక్షుడిని ప్రజల పాపులర్ ఓటు ద్వారా ఎంపిక చేయాలా... కాంగ్రెస్ (పార్లమెంటు) ద్వారానా అనే చర్చలో భాగంగా... మధ్యేమార్గంగా ఈ ఎలక్టోరల్ కాలేజీ పద్ధతి ఆవిర్భవించింది. అన్ని రాష్ట్రాల, అమెరికా ప్రజల ప్రయోజనాల మధ్య సమతూకం ఉండాలన్న అమెరికా రాజ్యాంగ నిర్మాతలు 1787లో ఈ వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. దీన్ని మార్చాలని, రద్దుచేయాలని ఇప్పటిదాకా దాదాపు 700సార్లు ప్రయత్నించినా అవి ఫలించలేదు.

– ఈనాడు ప్రత్యేక విభాగం

ప్రతి మహిళా శక్తికి ప్రతిరూపమే: నారా భువనేశ్వరి

ఈనాడు, అమరావతి: మహిళలు అన్ని రంగాల్లో సత్తా చాటుతున్నా.. ఇప్పటికీ కొన్ని విషయాల్లో ఇంకా వివక్ష కొనసాగుతోందని, కొన్ని అపోహల వల్ల సమాజంలో మహిళా శక్తిని పూర్తిస్థాయిలో వినియోగించుకోవడం లేదని ఏపీ సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి పేర్కొన్నారు. మహిళలు బాగుంటేనే.. కుటుంబం, సమాజం బాగుంటాయని వివరించారు. విజయవాడ పున్నమిఘాట్‌లో రాష్ట్ర పర్యాటకశాఖ ఆధ్వర్యంలో 'నారీ శక్తి విజయోత్సవం' కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. మూడు రోజులు జరిగే ఈ కార్యక్రమ ప్రారంభోత్సవానికి భువనేశ్వరి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దసరా అంటేనే మహిళా శక్తికి నిదర్శనమన్నారు.

అశేష భక్తజనం నడుమ సాగుతున్న స్వామివారి రథోత్సవం

తిరువీధుల్లో వైభవంగా రథోత్సవం

అశ్వ వాహనంపై విహరిస్తున్న శ్రీమలయప్పస్వామి

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో ఎనిమిదో రోజు శుక్రవారం రాత్రి శ్రీమలయప్పస్వామి కల్కి అవతారంలో భక్తులను కటాక్షించారు. బంగారు వజ్రవైఢూర్యాభరణాలు, విశేష పుష్పాలంకరణ అనంతరం బ్రహ్మరథం, గజ, అశ్వ, చతురంగ బలాలు ముందుకు సాగగా.. స్వామివారు కల్కి అవతారంలో ఆలయ మాడ వీధుల్లో ఊరేగారు. కళాకారులు, భజన బృందాల సంకీర్తనల నడుమ వాహనసేవ వైభవంగా సాగింది. ఉదయం శ్రీమలయప్పస్వామి దేవేరులతో కలిసి బ్రహ్మరథం అధిరోహించి భక్తులను అనుగ్రహించారు. భక్తకోటి గోవింద శరణాగతుల మధ్య ఆలయ తిరువీధుల్లో రథోత్సవం వైభవంగా సాగింది. వాహన సేవలో జీయర్ స్వాములు, తితిదే ఈఓ జె.శ్యామలరావు, అదనపు ఈఓ సీహెచ్ వెంకయ్యచౌదరి, జేఈఓలు గౌతమి, వీరబ్రహ్మం, సీవీఎస్ఓ శ్రీధర్, సినీనటుడు బాలకృష్ణ సతీమణి వసుంధర పాల్గొన్నారు.

★ శనివారం తెల్లవారుజామున 3-6 గంటల వరకు పల్లకీ, తిరుచ్చి ఉత్సవాలు నిర్వహించనున్నారు. అనంతరం చక్రత్తాళ్వార్‌కు వరాహస్వామి ఆలయం ప్రాంగణంలో స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. శ్రీవారి ప్రతిరూపమైన చక్రత్తాళ్వార్‌కు పుష్కరిణిలో ఉదయం 6-9 గంటల మధ్య పవిత్ర స్నానం చేయించనున్నారు. రాత్రి 7-9 గంటలకు మధ్య జరిగే ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.

యంగ్ ఇండియా స్కిల్స్ వర్సిటీ
తొలి నోటిఫికేషన్ జారీ

- నాలుగు నైపుణ్య కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

కేపీహెచ్‌బీకాలనీ, న్యూస్‌టుడే: కేపీహెచ్‌బీ నాలుగో రోడ్డులో ఓపెన్ నాలా గోడ ధ్వంసమై ప్రమాదకరంగా మారింది. జీహెచ్ఎంసీ అధికారులు తూతూమంత్రంగా రక్షణ చర్యలు చేపట్టారు. రద్దీ రహదారిలో ఓపెన్ నాలా ప్రమాదకరంగా మారినా పునరుద్ధరణ చేయట్లేదు. సెప్టెంబరు 21న వాటర్ ట్యాంకర్ అదుపు తప్పి నాలా గోడను ఢీకొట్టి ఇంజిన్ భాగం నాలాలోకి దిగబడి ఆగిపోయింది. నాలా గోడ, ఐరన్ కంచె, పైపులు ధ్వంసమయ్యాయి. గతంలో నాలా వద్దే ప్రమాదం చోటుచేసుకుని ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయారు. ఇరుకైన రహదారిలో రద్దీ ఎక్కువని తెలిసినా అధికారులు పనులు చేపట్టకపోవడంతో కాలనీవాసులు మండిపడుతున్నారు. 20 రోజులైనా పట్టించుకున్ననాథుడే లేరని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెట్టకొమ్మలు సైతం నాలాలోకి వేలాడుతున్నాయి. నాలాకు అడ్డుగోడను నిర్మించాలి వాహనదారులు కోరుతున్నారు.

త్రుటిలో తప్పిన భారీ ప్రమాదం

పొలాల్లోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

గార్లదిన్నె, న్యూస్‌టుడే: గార్లదిన్నె మండలంలోని తిమ్మంపేట సమీపంలో 44వ జాతీయ రహదారిపై గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత జరిగిన రోడ్డు ప్రమాదంలో బస్సు డ్రైవరు అప్రమత్తతతో భారీ ప్రమాదం తప్పింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు తెలంగాణ రాష్ట్రం జహీరాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు 52 మంది ప్రయాణికులతో బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు బయలుదేరింది. ఈక్రమంలో హైదరాబాదు నుంచి బెంగళూరుకు వెళ్తున్న ట్యాంకరును డ్రైవర్ అజాగ్రత్తగా నడపడంతో తిమ్మంపేట సమీపంలో బస్సు ముందు భాగాన్ని ఢీకొంది. ఈఘటనలో బస్సు బోల్తా పడింది. బస్సులో ప్రయాణిస్తున్న హైదరాబాదుకు చెందిన గోపికృష్ణ, అక్షితబాబు, మూపతి, పూర్ణిమ, శ్యామల, అన్నపూర్ణ, వైభర్‌రెడ్డి, మనిస్వామి, లాలూబాషా, శ్రీకాకుళం చెందిన విశ్వనాథరావు, కర్నూలు జిల్లా లక్ష్మీపురానికి చెందిన గురుమూర్తి, బస్సు డ్రైవరు రాము, ట్యాంకరు డ్రైవరు వసంతరావు గాయపడ్డారు. వీరిని అత్యవసర చికిత్స కోసం పామిడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మరికొంతమందిని అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరిలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మిగిలిన ప్రయాణికులను పోలీసులు హైదరాబాదుకు చెందిన మరో బస్సులో సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చారు. ఘటనాస్థలాన్ని శింగనమల సీఐ కౌలుట్లయ్య ఎస్సై గౌస్‌బాషా పరిశీలించి ట్యాంకరు డ్రైవరు వసంతరావుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మూసాపేట: అంబేడ్కర్‌నగర్‌లో..

ఫతేనగర్ జవహర్‌కాలనీలో కనకదుర్గాదేవి ఆలయంలో..

జయ జయహే మహిషాసురమర్దిని

శరన్నవరాత్రి ఉత్సవాల్లో తొమ్మిదో రోజు మహిషాసురమర్దిని అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన మండపాల్లో నిర్వాహకులు, భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కూకట్‌పల్లి చిత్తారమ్మ ఆలయంలో నియోజకవర్గ కాంగ్రెస్ బాధ్యుడు రమేశ్

అలంకరణలో మూసాపేట రేణుకాఎల్లమ్మ

కూకట్‌పల్లి చిత్తారమ్మ


బాలానగర్ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో..

చోరీ కేసులో అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే: చోరీ కేసులో అంతర్రాష్ట్ర దొంగను అరెస్టు చేసినట్లు మదనపల్లె రూరల్ సీఐ శేక్ వెంకటరమణ తెలిపారు. అన్నమయ్య జిల్లా మదనపల్లె మండలం కొత్తవారిపల్లె పంచాయతీ పూలవాండ్లపల్లెకు చెందిన రెడ్డిమోహన్ ఇంట్లో ఈ ఏడాది సెప్టెంబరు 26న గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి 8 గ్రాముల బంగారు, రూ.17 వేల నగదు చోరీ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. విచారణ ప్రారంభించి నిందితుల కోసం గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో శుక్రవారం తట్టివారిపల్లె వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా అతను అనంతపురం రూరల్ మండలం గ్రామానికి చెందిన జె.పుల్లానాయుడుగా గుర్తించారు. అతను ప్రస్తుతం తిరుపతిలోని తీర్థకట్ట వీధిలో ఉంటున్నాడని తెలిపారు. అతను మదనపల్లెలోని వివిధ ప్రాంతాల్లో దొంగతనాలు చేశాడని, అతని వద్ద నుంచి రూ.1.50లక్షలు విలువైన 30 గ్రాముల బంగారు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఇతనిపై ఇది వరకే కర్నూలు, అత్తర్కర, ప్రొద్దుటూరు, మార్కాపురం, డోన్, బళ్లారి, తెలంగాణ రాష్ట్రంలోని పలుచోట్ల నేరాలు పాల్పడ్డాడని, 17 కేసులు ఉన్నట్లు సీఐ తెలిపారు. నిందితుడిని రిమాండుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

భవన నిర్మాణ కార్మికుల నిరసన

షాపూర్‌నగర్, న్యూస్‌టుడే: జగద్గిరిగుట్టలో భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. 'హెచ్ఎంటీ స్థలంలో రెండేళ్లుగా వారు అడ్డా ఏర్పాటు చేసుకుని కూలీ పనులు చేసుకుంటున్న స్థలాన్ని ఖాళీ చేయాలంటూ ఐజాక్స్ సంస్థ కేటాయించిందంటూ నిరసన చేపట్టారు. సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఏసురత్నం, సీపీఐ మండల కార్యదర్శి ఉమామహేష్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 40 ఏళ్లుగా జగద్గిరిగుట్ట చివరి బస్టాప్ వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అడ్డా ఏర్పాటుచేసుకుని పనిచేస్తున్నారన్నారు.

బొమ్మలు ఏర్పాటు చేసి.. నిర్వహణ మరచి
నగర సుందరీకరణలో భాగంగా కూకట్‌పల్లి చౌరస్తాలో ఏర్పాటు చేసిన బొమ్మలకు తొడిగిన దుస్తులు చిరిగిపోయాయి. దీంతో ఆ బొమ్మలు అందవిహీనంగా దర్శనమిస్తున్నాయి.

ఘనంగా ప్రపంచ గుడ్డు దినోత్సవం

కేపీహెచ్‌బీ కాలనీ, న్యూస్‌టుడే: కేపీహెచ్‌బీలో శుక్రవారం ప్రపంచ గుడ్డు దినోత్సవం నిర్వహించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ రోజూ గుడ్డు తినడంతో ఆరోగ్యంగా ఉండొచ్చన్నారు. నవంబర్ 26 నుంచి 29 వరకు అంతర్జాతీయ కోళ్ల ప్రదర్శన ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏపీ సీడ్స్ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాజేంద్రప్రసాద్‌కు పరామర్శ

కేపీహెచ్‌బీకాలనీ, న్యూస్‌టుడే: కుమార్తెను కోల్పోయిన సినీనటుడు రాజేంద్రప్రసాద్‌ను శుక్రవారం తెలుగు ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ ఆఫ్ ఏపీ అధ్యక్షుడు, తెలుగునాడు తెలుగు యువశక్తి వ్యవస్థాపక అధ్యక్షుడు కేతిరెడ్డి జగదీశ్వర్‌రెడ్డి పరామర్శించారు.


విజయదశమి శుభాకాంక్షల ప్రత్యేక అనుబంధం నేటి సంచికతో ఉచితంగా అందుకోగలరు.

కోనేరుల్లో వ్యర్థాల తొలగింపు

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: బతుకమ్మ పండగ ముగియడంతో కోనేరులను శుభ్రం చేసే ప్రక్రియ మొదలైంది. కూకట్‌పల్లి రంగధాముని చెరువు కట్టపై బతుకమ్మ సంబరాలు చేసి.. కోనేరులో భారీగా బతుకమ్మలను నిమజ్జనం చేశారు. కోనేరు పూర్తిగా నిండిపోవడంతో వ్యర్థాలను శుక్రవారం సిబ్బంది తీయడం ప్రారంభించారు. దీంతో పాటు ఓల్డ్‌బోయిన్‌పల్లి, అంబీర్ చెరువుల కోనేరులను శుభ్రం చేయాల్సి ఉంది.

వివాహమైన నెల నుంచే వేధింపులు

సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని బలవన్మరణం

కేపీహెచ్‌బీకాలనీ, న్యూస్‌టుడే: వివాహమైన 8 నెలలకే సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని బలవన్మరణానికి పాల్పడిన ఘటన కేపీహెచ్‌బీ ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌హెచ్‌వో వెంకటేశ్వర్లు, బాధిత మహిళ తండ్రి వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట మండలం, నందిపేటకు చెందిన కొండయ్య బుచ్చిరెడ్డి, కవిత దంపతుల కుమార్తె సుప్రియరెడ్డి(26)ను అదే జిల్లా దేవరకద్ర మండలం లక్ష్మీపల్లికి చెందిన మద్దూరు రామ వేందర్‌రెడ్డికి ఇచ్చి మార్చి 24న వివాహం చేశారు. ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు. కేపీహెచ్‌బీ ఠాణా పరిధి శంషీగూడలో ఉంటున్నారు. వివాహమైన నెల నుంచే రామవేందర్‌రెడ్డి భార్యని వేధించసాగాడు. తాను చెప్పినట్లే వినాలని, ఆమె జీతం తన బ్యాంకు ఖాతాలోనే జమచేయాలని, ఇల్లు కట్టుకుందుకు ఆమె పుట్టింటి నుంచి 3 ఎకరాలు రాయించుకురావాలని సుప్రియను రామవేందర్‌రెడ్డి ఒత్తిడి చేయసాగాడు. జీతం బ్యాంకు ఖాతాలోకి జదిలీ చేయించుకున్నా వర్గాలేదు. తన కుమార్తెను మంచిగా చూసుకోవాలని సుప్రియ తల్లిదండ్రులు వియ్యంకులకు చెప్పారు. ఇలా గొడవల్లో సాగుతోన్న రామవేందర్‌రెడ్డి-సుప్రియ సంసారంలో గురువారం రాత్రి తీవ్ర విషాదం చోటుచేసుకుంది. 11.30 గంటల సమయంలో సుప్రియ ఉరివేసుకున్నట్లు పక్కింటి వారు ఆమె తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. ఆ సమయంలో రామవేందర్‌రెడ్డి ఉదయాన్నే వెళ్లారు. తమ కుమార్తె రాత్రి 8 గంటల సమయంలో తమతో బాగానే మాట్లాడిందని, ఆమె మృతిపై అనుమానం ఉన్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేశామని బుచ్చిరెడ్డి తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హిజ్రాల ఘర్షణ.. కేసు నమోదు

బాలానగర్, న్యూస్‌టుడే: దసరా మామూళ్ల విషయంలో హిజ్రాల మధ్య చోటుచేసుకున్న ఘర్షణలో పలువురిపై కేసులు నమోదయ్యాయి. బాలానగర్ సీఐ నరసింహరాజు కథనం ప్రకారం.. శుక్రవారం శోభన సెంటర్ మామూళ్లలో కొందరు హిజ్రాలు దసరా మామూళ్లు వసూలు చేస్తున్నారు. ఇదే సమయంలో మరికొందరు హిజ్రాలు వచ్చి తమ ప్రాంతంలో ఎందుకు డబ్బులు వసూలు చేస్తున్నారంటూ వారిపై గొడవకు దిగారు. దీంతో ఇరువర్గాల మధ్య కొట్లాట జరిగింది. పోలీసులు ఇరువురిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు.

यूनियन बैंक ऑफ इंडिया Union Bank of India
బాలాజీ నగర్ శాఖ, తిరుపతి(00331) బాలాజీ కాలనీ, తిరుపతి, తిరుపతి జిల్లా - 517502, ఫోన్: 9372200331

స్థిరాస్తుల అమ్మకానికి అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002, లోని రూల్ 8(6) నిబంధనతో చదువుకునే విధంగా సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి -ఈ-వేలం ప్రకటన ...

రుణగ్రహీత: శ్రీ టి.శ్రీనివాసులు ... శ్రీమతి టి.సుమిత్ర ... రిజర్వు ధర: రూ.37,03,000.00 | ధరావత్తు: రిజర్వుధరలో 10% | బిడ్ ఇంక్రిమెంట్: రూ.37,000.00

ఈ-వేలం తేదీ మరియు సమయము: 13.11.2024 ఉ.12.00గంటల నుండి సా.5.00 గంటల వరకు (10 నిముషాల అపరిమిత పొడిగింపుతో) ...
https://ebkray.in and https://www.unionbankofindia.co.in/auction-property/view-auction-property.aspx ను చూడగలరు.
ప్రదేశం: తిరుపతి, తేదీ : 11.10.2024 | సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

విభిన్న వేదికలు.. వినూత్న వేడుకలు

ఆకట్టుకునేలా దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు

దసరా సంబరాలకు నగరం సిద్ధమైంది.. వేదికల్లో ప్రధాన ఆకర్షణగా నిలవాలని పలు ఈవెంట్ సంస్థలు, ఉత్సవ సమితులు వినూత్న కార్యక్రమాలకు రూపకల్పన చేశాయి. హోటళ్లు, ఫంక్షన్‌హాళ్లు, ఖాళీ మైదానాలను వేడుకలకు సిద్ధం చేస్తున్నారు. రావణదహనం, పాలపిట్ట, జమ్మి బంగారం రాల్చి ఇచ్చి పుచ్చుకోవడం అలయ్.. బలయ్, దాండియా తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి. ఈసారి కూడా హైదరాబాద్ బెంగాలీ సమితి (హెచ్‌బీఎస్) వినూత్న కార్యక్రమాలతో వేడుకలు నిర్వహిస్తున్నట్టు ప్రకటించింది.

నగరమంతా దాండియా

నగరంలో అనేక చోట్ల దాండియా వేడుకలు ప్రారంభమయ్యాయి. ఢోలా రే ఢోలా, నవరాత్రి ఉత్సవ్, దాండియా నైట్, దాండియా మహోత్సవ్, డిస్కో దాండియా, సెలబ్రిటీ దాండియా, నవకర్ నవరాత్రి ఉత్సవ్, రంగీలో దాండియా నైట్, దాండియా మస్తీ, గ్రాస్ ఆఫ్ గార్బా, రంగ్ రాత్రి తదితర పేర్లతో ఈవెంట్లు నిర్వహిస్తున్నారు. హెచ్‌ఐసీసీ, బేగంపేట్ హాకీ స్టేడియం, ఉప్పల్ మున్సిపల్ స్టేడియం, చిరాన్‌ఫోర్ట్‌తో పాటు ప్రముఖ హోటళ్లు దాండియా వేడుకలకు వేదికలయ్యాయి. భారీ స్థాయిలో పండగ వేడుకల్ని నిర్వహిస్తున్న చోట అన్నప్రసాదాలు ఏర్పాటు చేస్తున్నారు. రకరకాల వంటకాలు ఉంటున్నాయి. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో షాపింగ్ చేసుకోవచ్చు. ఊళ్లో జాతరలో దుకాణాల మాదిరి రకరకాల ఫుడ్ స్టాల్స్ ఉంటున్నాయి.

హెచ్‌బీఎస్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ స్టేడియంలో..

నగరంలోనే పురాతనమైన అతిపెద్ద బెంగాలీ సాంస్కృతిక సంస్థ హెచ్‌బీఎస్ ఎన్టీఆర్ స్టేడియం వద్ద ఐదు రోజుల దుర్గాపూజ వేడుకలను ప్రారంభించింది. అక్టోబర్ 8న పంచమి నాడు ప్రారంభమైన ఈ వేడుకలు అక్టోబర్ 13న దశమితో ముగుస్తాయి. సంస్థ ఉత్సవ వేళ 83వ దుర్గాపూజను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పురాతన గ్రంథాల్లో పేర్కొన్న ఆచారాలను పాటిస్తూ నిత్యం పూజలు చేస్తారు. ఐటీ ఉద్యోగులు, వ్యాపారులు, డిజైనర్లు, రక్షణ రంగం, కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో పనిచేసే వారు అనేక మంది ఈ సమితిలో సభ్యులుగా ఉన్నారు. వీరంతా ఆరు రోజుల కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొంటారు. అత్యంత పవిత్రమైన అష్టమి రోజున పుష్పాంజలితో పూజ ప్రారంభమవుతుంది. తర్వాత సంధి పూజ చేస్తారు.

ఈనాడు, హైదరాబాద్

● అబిడ్స్‌లోని మురళీధర్‌బాగ్ మహాలక్ష్మి ఆలయం అతి పురాతనమైంది. ఇక్కడ జరిగే వేడుకలకు వేలాదిగా తరలి వస్తుంటారు. నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో రాజస్థాన్ ప్రగతి సమాజ్ ఆధ్వర్యంలో రామాయణ్ మేళా ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. విజయదశమి రోజున రకరకాల వేషధారణలతో ప్రదర్శనలు కట్టిపడేస్తాయి. రావణదహనం, శ్రీరాముడి పట్టాభిషేకం వంటి ఘట్టాలు వీక్షకులను మంత్రముగ్ధులను చేస్తాయి. ఈ కార్యక్రమానికి కేంద్ర, రాష్ట్ర మంత్రులు హాజరవుతారు. సుమారు 20వేల మంది ఇందులో పాల్గొంటారు.

గుడిమల్కాపూర్‌లో పూల దొంగలు

మెహిదీపట్నం: గుడిమల్కాపూర్ పూలమార్కెట్‌లో ప్రజలు కొనుగోలు చేసిన పూలసంచులు శుక్రవారం క్షణాల్లో మాయమయ్యాయి. మార్కెట్ ఆవరణలోనే కాకుండా బయట, మార్కెట్ వెనక పార్కు చేసిన ఆటోలు, ఇతర వాహనాల్లోని పూల సంచులు చోరీకి గురయ్యాయి. బోయిన్‌పల్లికి చెందిన రాంబాబు 50 కిలోల బంతిపూలు కొనుగోలు చేసి ఆటోలో పెట్టి.. చేమంతి పూలు తీసుకొచ్చేసరికి ఆటోలోని బంతిపూలు కనిపించలేదు. ఓ వ్యక్తి ఆటోలోంచి చోరీ చేస్తున్న దృశ్యం సీసీ కెమెరాలో కనిపించింది. కవాడిగూడకు చెందిన పరశురాం మార్కెట్‌లో పూలుకొని బైక్‌పై పెట్టి పక్కకు తిరిగి చూడగానే సంచి కనిపించలేదు. అత్తాపూర్‌కు చెందిన చిరు వ్యాపారి కొనుగోలు చేసిన బంతి, చేమంతి మాయమయ్యాయి. నాలుగు రోజులుగా దాదాపు 50-60 మందికి చెందిన పూలు ఎత్తుకెళ్లారని విక్రేతలు తెలిపారు. దాదాపు టన్ను పైగా బంతిపూలు అపహరణకు గురయ్యాయి.

దసరా వేళ బందీ అవుతున్న రాష్ట్రపక్షి

ఈనాడు, హైదరాబాద్ : స్వేచ్ఛగా తిరగాల్సిన రాష్ట్రపక్షి పాలపిట్ట పంజరాల్లో బందీ అవుతోంది. విజయదశమి రోజున దీనిని చూస్తే మంచి జరుగుతుందని, విజయాలు వరిస్తాయన్న నమ్మకాన్ని కొందరు సొమ్ము చేసుకుంటుండడంతో వాటి సంఖ్య క్రమంగా తగ్గిపోతోంది. రాజధాని పరిధిలోని మూడు జిల్లాల్లో సంచరిస్తున్న అతి ప్రాధాన్యమున్న 104 పక్షి జాతుల్లో పాలపిట్ట ఒకటి. ఈ జిల్లాల పరిధిలో గత ఏడాది 400 పాలపిట్టలు ఉండగా.. ప్రస్తుతం వాటి సంఖ్య 300లకు పడిపోయినట్లు బర్డింగ్‌పల్స్ సంస్థ ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాలపిట్ట పక్షుల సంఖ్య తగ్గుతుండడం ఆందోళన కలిగిస్తోందని స్టేట్ ఆఫ్ ఇండియా బర్డ్స్ నివేదిక వెల్లడించింది. ప్రస్తుతం ఇది ఐయూసీఎన్ రెడ్ లిస్టులో ఉందని, ఈ పక్షి జాతిని కాపాడుకోకపోతే ఈ సంఖ్య మరింతగా తగ్గే అవకాశం ఉందని పేర్కొంది. విజయదశమి రోజున రావణదహనం, జమ్మి బంగారం ఇచ్చిపుచ్చుకునే ప్రదేశాలు, 'అలయ్ బలయ్' ఇచ్చుకునే చోట పంజరాల్లో ప్రదర్శిస్తూ కొందరు జేబులు నింపుకొంటున్నారు. స్వేచ్ఛగా తిరగాల్సిన వీటిని పంజరాల్లో బంధించడంతో సరిగా ఆహారం, నీరు తీసుకోక డీహైడ్రేషన్‌తో చనిపోతున్నాయి.

బంధిస్తే జరిమానా, జైలుశిక్ష..

పాలపిట్టలు వన్యప్రాణుల విభాగంలోని అటవీ చట్టం పరిధిలోకి వస్తాయి. వీటిని బంధించడం శిక్షార్హమైన నేరం. పాలపిట్టను బంధించినా, హింసించినా నాన్‌బెయిలబుల్ కేసు నమోదు చేస్తారు. మూడేళ్ల వరకు జైలు శిక్ష, రూ.25 వేల జరిమానా విధించే అవకాశం ఉంది.

ఉన్నది ఉన్నట్లు.. సహజత్వం ఉట్టిపడుతూ..

నగర సుందరీకరణలో భాగంగా ఎల్బీనగర్ కామినేని వంతెనకు కళాకారులు పక్షుల బొమ్మలు గీస్తున్నారు. తమవద్ద ఉన్న చిత్రాల ఆధారంగా ఉన్నది ఉన్నట్లు చిత్రీకరిస్తుండడంతో సహజత్వం ఉట్టిపడుతూ ఆకట్టుకుంటున్నాయి.

అగ్రవర్ణాల్లోని పేదల లెక్క తేల్చాలి

గుజ్జ సత్యం

కాచిగూడ: రాష్ట్రంలో చేపట్టనున్న సమగ్ర కులగణనలో భాగంగా.. అగ్రవర్ణాల్లోని పేదల లెక్కను తేల్చాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం డిమాండ్ చేశారు. సుమారు 60 రోజుల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ కులాలవారీగా సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలలో సర్వేకు జీవో జారీ చేయడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. శుక్రవారం కాచిగూడలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. డీఎస్సీ ఫలితాలలో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల కారణంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల కన్నా తక్కువ మార్కులు వచ్చినా పలువురికి ఉద్యోగాలు లభించాయన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు సక్రమంగా అమలు కావాలంటే అగ్రవర్ణాల్లోని పేదలెందరో ప్రస్తుత సర్వేలోనే లెక్క తేల్చాలని ఆయన కోరారు.

పోలీసు అనుమతులిక సులభం

రాయదుర్గం, న్యూస్‌టుడే: వివిధ వేడుకల (ఈవెంట్స్) నిర్వహణ, గృహనిర్మాణం కోసం సెల్లార్ తవ్వకాలు తదితరాలకు నియంత్రిత పేలుళ్లు, సంగీత వేడుకలు, భారీ ఉత్సవాలు.. మారథాన్‌లు ఇలా ఎలాంటి వేడుకల నిర్వహణకైనా ఇక సైబరాబాద్ పోలీసుల నుంచి అనుమతులు తీసుకోవాలంటే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లోనే అనుమతి పత్రాలనూ పొందే సౌలభ్యం అందుబాటులోకి వచ్చింది. సైబరాబాద్ పోలీస్ పర్మిషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (సీపీపీఎంఎస్) పేరుతో ఆన్‌లైన్ పోర్టల్ సేవలను జాయింట్ సీపీ జోయల్ డేవీస్‌తో కలిసి సీపీ అవినాశ్ మహంతి శుక్రవారం ప్రారంభించారు. కమిషనర్ మాట్లాడుతూ.. అనుమతుల కోసం జోన్, ఏసీపీ కార్యాలయాలు, ఠాణాలకు వెళ్లే వీల్లేకుండా సీపీపీఎంఎస్ ద్వారా ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. నిర్ణీత కాలంలో విచారణ ప్రక్రియ పూర్తి చేసి ఆన్‌లైన్‌లోనే అనుమతులు మంజూరు చేస్తామన్నారు. ఆన్‌లైన్‌లోనే అనుమతి పత్రాలను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని చెప్పారు. మొదటి దశలో గృహనిర్మాణాలు, వివిధ తవ్వకాలకు నియంత్రిత పేలుళ్లు, కమర్షియల్, టికెట్‌ల ద్వారా నిర్వహించే ఈవెంట్‌లకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించినట్లు చెప్పారు. మూడు నెలల్లో లౌడ్ స్పీకర్లు, మారథాన్, రన్, వాక్, సంగీత విభావరులు తదితర అన్ని పోలీస్ అనుమతుల కార్యక్రమాలకు ఆన్‌లైన్‌లోకి తీసుకొస్తామన్నారు. ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు ఫారం, రుసుం వివరాలూ ఉంటాయని తెలిపారు. దరఖాస్తు చేసుకున్నాక సంబంధిత అధికారుల వద్దకు అది చేరుకుంటుందని, అధికారి పరిశీలన, విచారణ చేపట్టి అనుమతి మంజూరు చేస్తారన్నారు. రాష్ట్రంలోనే తొలిసారి ఈ సౌలభ్యాన్ని అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. ఈ విధానంతో అనుమతులు మరింత సమర్థవంతంగా, వేగంగా, పారదర్శకంగా సాగుతాయని చెప్పారు. ఇందులో లోటుపాట్లు ఏమైనా ఉంటే దశలవారీగా పరిష్కరిస్తామన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న సీపీ అవినాశ్ మహంతి. చిత్రంలో జాయింట్ సీపీ జోయల్ డేవిస్, అదనపు డీసీపీ రవిచందన్‌రెడ్డి

రూ.కోట్ల విలువైన జలమండలి భూమిపై కన్ను

ఆక్రమించే ప్రయత్నం.. అడ్డుకున్న అధికారులు

ఈనాడు, హైదరాబాద్: నగరంలో రూ.కోట్ల విలువైన భూమిని ఓ వ్యక్తి ఆక్రమించే ప్రయత్నం చేయడంతో శుక్రవారం జలమండలి అధికారులు, పోలీసులు అడ్డుకున్నారు. జలమండలి ఓఅండ్‌ఎం డివిజన్ నంబర్ 7లోని మహేంద్రహిల్స్ పరిధి సర్వే నం. 844/1లో బోర్డుకు అత్యంత విలువైన 8,072 చదరపు మీటర్ల భూమి ఉంది. తాజాగా ఈ స్థలాన్ని కాపాడుకునే ఉద్దేశంతో జలమండలి అధికారులు ఫెన్సింగ్‌కు సిద్ధమయ్యారు. స్థానిక వ్యక్తి అక్కడకు చేరుకొని ఆ భూమి తనదని, కంచె ఎలా కడతారని గొడవకు దిగాడు. అప్రమత్తమైన జలమండలి విజిలెన్సు బృందంపాటు మేనేజర్ ఇతర అధికారులు స్థలం వద్దకు వెళ్లి ఆరా తీశారు. అయినా సదరు వ్యక్తి ఆ భూమి మొత్తం తనదేనని వారితోనూ ఘర్షణకు దిగాడు. దీంతో అధికారులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు పరిశీలించి మారేడుపల్లి ఎమ్మార్వోతో మాట్లాడారు. ఆయన స్థలం వద్దకు వచ్చి రికార్డులను సరిచూశారు. ఆ స్థలం జలమండలిదిగా తేల్చి పోలీసులకు రికార్డులు అందించారు. దీంతో ఆ వ్యక్తిపై కేసు నమోదు చేశారు. జలమండలికి సంబంధించిన భూములు, స్థలాలను ఎవరైనా ఆక్రమించాలని చూస్తే...అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

ప్రజావాణికి 295 అర్జీలు

ప్రజల నుంచి వినతిపత్రాలు తీసుకుంటున్న డా.చిన్నారెడ్డి

సోమాజిగూడ: మహాత్మా జ్యోతిబాపులే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణికి 295 అర్జీలు అందాయి. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డా.చిన్నారెడ్డి ప్రజల సమస్యలు తెలుసుకొని వినతి పత్రాలు స్వీకరించారు. అందిన అర్జీల్లో గృహనిర్మాణ శాఖ-90, మైనారిటీ సంక్షేమం-32, విద్యుత్-18, హోంశాఖ-10, ఇతర శాఖలకు 145 ఉన్నట్లు అధికారులు తెలిపారు.

బాణసంచా దుకాణాలకు తాత్కాలిక లైసెన్స్!

26 వరకూ డీసీపీ కార్యాలయంలో దరఖాస్తు

ఈనాడు, హైదరాబాద్: నగర పరిధిలో పక్కా అనుమతులు తీసుకున్నాకే బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేయాలని నగర సీపీ సీవీ ఆనంద్ శుక్రవారం తెలిపారు. ఈ నెల 31న దీపావళి సందర్భంగా నగరవ్యాప్తంగా బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేస్తుంటారు. ఈ నేపథ్యంలో వ్యాపారులు, నిర్వాహకులు తమ పరిధిలోని డీసీపీ కార్యాలయంలో ఈ నెల 11 నుంచి 26వ తేదీ వరకూ దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

జలమండలిలో నకిలీ విజిలెన్సు

ట్యాంకర్ డ్రైవర్ల నుంచి వసూళ్లు

సాయికుమార్

ఈనాడు, హైదరాబాద్: జలమండలిలో నకిలీ విజిలెన్సు అధికారి అవతారమెత్తాడు ఓ యువకుడు. తాను విజిలెన్సు విభాగంలో పనిచేస్తున్నానని, అక్రమంగా ట్యాంకర్లను తరలిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని ఫోన్ చేసి ఓ ట్యాంకర్ డ్రైవర్‌ను బెదిరించాడు. కేసు కాకుండా ఉండాలంటే రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. ఎట్టకేలకు పోలీసులకు చిక్కి కటకటాలపాలయ్యాడు. జలమండలి ఓఅండ్‌ఎం డివిజన్ జూబ్లీహిల్స్ సెక్షన్ పరిధిలో శుక్రవారం ఈ సంఘటన జరిగింది. వంశీకృష్ణ అనే వ్యక్తి జలమండలి ట్యాంకర్ నడుపుతున్నాడు. తాజాగా అర్రా సాయికుమార్ అలియాస్ సాయిరామ్ అనే వ్యక్తి తాను జలమండలి విజిలెన్సు విభాగంలో పనిచేస్తున్నానని, నిబంధనలకు విరుద్ధంగా ట్యాంకర్ పనిచేస్తోందని డబ్బులు డిమాండ్ చేశాడు. భయపడిన వంశీకృష్ణ తొలుత రూ.3 వేలు ఇచ్చాడు. జలమండలి విజిలెన్సు అధికారులు విచారణ చేపట్టగా . సాయికుమార్‌కు జలమండలితో సంబంధం లేదని తేలింది. ఫిర్యాదు మేరకు నిందితుడిపై కేసు నమోదు చేశారు.

డబ్బుల మాయలో పడి అయోమయం కావొద్దు

మాట్లాడుతున్న మల్టీ జోన్ 2 ఐజీ సత్యనారాయణ

పటాన్‌చెరు, న్యూస్‌టుడే: సైబర్ నేరాల కట్టడికి ప్రత్యేక బృందాలు నియమించామని హైదరాబాద్ మల్టీ జోన్ 2 ఐజీ సత్యనారాయణ అన్నారు. శుక్రవారం ఆయన అమీన్‌పూర్ ఠాణాను సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. గ్రామీణ యువకులు, చిన్నారులు ఇళ్లల్లో డబ్బులు దొంగతనం చేసి ఆన్‌లైన్ గేమ్స్, జూదం ఆడి జీవితాలు నాశనం చేసుకుంటున్నారన్నారు. సంగారెడ్డి జిల్లా సైబర్ నేరాల్లో నగదు రికవరీలో రాష్ట్రంలో మూడోస్థానంలో ఉందన్నారు. అత్యధిక కేసులు అమీన్‌పూర్‌లో నమోదు అవుతున్నాయని చెప్పారు. మూడేళ్లలో 456 సైబర్ కేసులు నమోదయ్యాయని తెలిపారు. చాలామంది కేసులు పెట్టడానికి ముందుకు రావడం లేదని, దీనిపై అవగాహన సదస్సులు పెద్దఎత్తున పెట్టనున్నామని తెలిపారు.

సుదీర్ఘ తనిఖీ: అమీన్‌పూర్ ఠాణాలో రికార్డులను ఐజీ సుదీర్ఘంగా పరిశీలించారు. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు అన్ని రకాల పత్రాలు తనిఖీ చేశారు. భూముల లావాదేవీల వ్యవహారాలపై ఎక్కువగా దృష్టి సారించారు.

సైబర్ మోసాలకు అడ్డుకట్ట

సలేహాను సత్కరిస్తున్న సీవీ ఆనంద్

నారాయణగూడ: సైబర్ పోలీసులు, బ్యాంకు అధికారులు సకాలంలో స్పందించి రెండు మోసాలకు అడ్డుకట్ట వేశారు. వేర్వేరు కేసుల్లో బాధితులకు సంబంధించిన రూ.19.50 లక్షలు కాపాడారు. డీసీపీ(సైబర్ క్రైమ్స్) ధారా కవిత, ఏసీపీ శివమారుతిలతో కలిసి సీపీ సీవీ ఆనంద్... బ్యాంకు అధికారిణి సలేహా, కానిస్టేబుల్ ఫిరోజ్‌లను శుక్రవారం సత్కరించారు.

● వారాసిగూడకు చెందిన శ్రీనివాస్ తన ఖాతాలోంచి రూ.9 లక్షలు బదిలీ చేయడానికి ఐసీఐసీఐ బ్యాంకుకు వెళ్లారు. డిప్యూటీ మేనేజర్ సలేహాకు అనుమానంవచ్చి సీసీఎస్ కానిస్టేబుల్ ఫిరోజ్‌ను సంప్రదించారు.ఆయన బాధితుడితో మాట్లాడి, డబ్బులు పంపించకుండా ఆపగలిగారు. ● అడిక్‌మెట్‌కు చెందిన నవీన్‌కుమార్ సైబర్ నేరగాళ్లకు రూ.11.50 లక్షలు బదిలీ చేయడానికి ఐసీఐసీఐ బ్యాంకుకు వెళ్లారు. డిప్యూటీ మేనేజర్ సలేహా, హెడ్ కానిస్టేబుల్ ఫిరోజ్‌లు గమనించి బాధితుడికి కౌన్సెలింగ్ ఇచ్చారు.

ఆస్తిలో వాటా కోసమే.. శిశువు అపహరణ

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: సంగారెడ్డి జిల్లా ఆసుపత్రిలో శిశువును అపహరించిన కేసులో పోలీసులు నలుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్యగౌడ్ తెలిపిన వివరాలు.. సంగారెడ్డిలోని నాల్‌సాబ్‌గడ్డకు చెందిన రుక్సానాబేగం బార్కస్‌కు చెందిన మహ్మద్ సమీర్‌ను రెండో పెళ్లి చేసుకుంది. పిల్లలు పుట్టే అవకాశం లేదని, తన భర్త ఆస్తిలో వాటా దక్కదేమోనని ఆందోళన చెందింది. ఈ నెల 9న రుక్సానాబేగం, తల్లి సయిదాబేగం, చెల్లెళ్లు ముస్కాన్‌బేగం, జువేరియా ఫాతిమాలు కలిసి సంగారెడ్డిలోని ప్రభుత్వ ఆసుపత్రి నుంచి శిశువును అపహరించారు. పట్టణ సీఐ భాస్కర్ బృందం సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా నలుగురిని గురువారం అరెస్టు చేశారు. అపహరణకు గురైన శిశువును తల్లిచెంతకు చేర్చారు.

'గోసంరక్షణ'పై సినిమా తీయాలి

కాచిగూడ: దేశవ్యాప్తంగా గోవధ నిషేధంతోపాటు గోసంరక్షణను అమలుచేయాలని కోరుతూ సినిమా తీయాలని నిర్మాత అభిషేక్ అగర్వాల్(కాశ్మీర్ ఫైల్స్ ఫేమ్)కు తెలంగాణ గోసంరక్షణ సంస్థలు విజ్ఞప్తి చేశాయి. గోవధ జరగకుండా అన్ని రాష్ట్రాల్లోనూ ప్రజలను చైతన్యవంతులను చేయాలని కోరాయి. కార్తికేయ-2 సినిమా నిర్మాతగా అత్యుత్తమ తెలుగు చలనచిత్రం కేటగిరీలో జాతీయ పురస్కారాన్ని అందుకున్న ఆయన్ను శుక్రవారం కాచిగూడకు చెందిన తెలంగాణ లోఫర్‌కా ఫౌండేషన్ ఛైర్మన్ జస్మత్‌పటేల్, ప్రాణిమిత్ర రమేష్ జాగిర్దార్ మెమోరియల్ ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి రితీష్ జాగిర్దార్, అఖిల భారత హిందూ మహాసభ జాతీయ కార్యదర్శి స్వామి కమలేష్ మహరాజ్, శశికళ, సూర్యప్రకాష్ తదితరులు సన్మానించి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు.

అనాథలు కాదు.. కార్య సాధకులు

అనాథల కోసం రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న సరూర్‌నగర్ విక్టోరియా మెమోరియల్ హోమ్‌లోని విద్యార్థులు వీరంతా. సంక్రాంతైనా.. దసరా అయినా.. అన్నీ ఇక్కడే వీరికి. సొంతూళ్లు అంటే ఏవో తెలీదు. హాకీ సాధనలో భాగంగా భుజాలపై టైర్లు మోస్తూ క్రీడల్లో కఠోర సాధన చేస్తూ కనిపించారు. వీరికి ఎవరూ లేరనే ఆలోచన రాకుండా వారితో పాటు ఉంటూ క్రీడల్లో ప్రోత్సహిస్తున్నాడు వ్యాయామ ఉపాధ్యాయుడు రవి.

ఆర్థరైటిస్‌ను ముందే గుర్తిస్తే నయం చేయొచ్చు

జలవిహార్ వద్ద డా.బీరప్ప, వైద్యులు, వైద్య విద్యార్థులు

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: ఆర్థరైటిస్‌ను ముందుగా గుర్తిస్తే నయం చేయవచ్చని, రోగిని సాధారణ స్థితికి తేవొచ్చని నిమ్స్ డైరెక్టర్ డా.బీరప్ప తెలిపారు. ప్రపంచ ఆర్థరైటిస్ దినం సందర్భంగా శుక్రవారం నెక్లెస్ రోడ్డులో ఇండియన్ రుమటాలజీ అసోసియేషన్ హైదరాబాద్ చాప్టర్ ఆధ్వర్యంలో అవగాహన నడక నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ... దేశ వ్యాప్తంగా రుమటాలజిస్టులు చాలా తక్కువ మంది ఉన్నారని, వ్యాధిని గుర్తించడంలో చాలా మంది ఆలస్యం చేయడంతో తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. జన్యుపరమైన లోపాల కారణంగా చాలా మందికి బాల్యంలో, యుక్త వయసులోనూ కీళ్లవాతం వచ్చే అవకాశాలు ఉన్నాయని అన్నారు. వ్యాధి లక్షణాలను గుర్తించిన వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. అనంతరం ఆర్థరైటిస్‌తో బాధపడుతున్న వారికి మందులు అందజేశారు. నిమ్స్ రుమటాలజీ విభాగం డీన్ లీజా రాజశేఖర్, డాక్టర్ నర్సింహులు, డా.వరప్రసాద్ పాల్గొన్నారు.

చికెన్ ధరలు			
ఫాంరేటు	114–00	డ్రెస్డ్	197–00
రిటైల్	136–00	స్కిన్‌లెస్	224–00

బ్రిటిష్ సివిల్ సర్వీసెస్ విధాన అధికారిగా విజయలక్ష్మి గురులింగం

విజయలక్ష్మి గురులింగం

ఈనాడు,హైదరాబాద్: బ్రిటిష్ సివిల్ సర్వీసెస్ విధాన అధికారిగా నియమితులైన విజయలక్ష్మి గురులింగంనకు హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం అభినందనలు తెలిపింది. భారత్‌లో యూపీఎస్సీ తరహాలో బ్రిటిష్‌లో సివిల్ సర్వీస్ విభాగం విధులు నిర్వహిస్తోంది. ఈ విభాగంలో విజయలక్ష్మి గురులింగం అధికారిగా విధులు చేపట్టనున్నారు. విధానపరమైన నిర్ణయాల్లో భాగస్వామిగా వ్యవహరించనున్నారు. తమ పూర్వ విద్యార్థిని విజయలక్ష్మి మరింత ఉన్నత స్థానానికి ఎదగాలని విశ్వవిద్యాలయం అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో ఆకాంక్షించారు. కోయంబత్తూరుకు చెందిన విజయలక్ష్మి గురులింగం డిగ్రీ తర్వాత హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలోని కాలేజ్ ఫర్ ఇంటిగ్రేటెడ్ స్టడీస్ విభాగంలో రెండేళ్ల క్రితం పీజీ పూర్తి చేశారు. అనంతరం లండన్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్, పొలిటికల్ సైన్స్ విశ్వవిద్యాలయం నుంచి ఎమ్మెస్సీ(ఐఎస్‌పీ) పట్టా పొందారు. గతేడాది వేసవిలో లక్సెంబర్గ్‌లోని యూరోపియన్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ నిర్వహిస్తున్న స్థిరమైన ఆర్థికాభివృద్ధి అంశంపై శిక్షణ పొందేందుకు లండన్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్ ఎంపిక చేసింది. ఆమె పలు విశ్వవిద్యాలయాల నుంచి ఉపకార వేతనాలే పొందారు.

విశ్వవిద్యాలయం విలువైన జీవిత పాఠాలు నేర్పింది : కేంద్రీయ వర్సిటీ విలువైన జీవిత పాఠాలను నేర్పిందని విజయలక్ష్మి అన్నారు. హెచ్‌సీయూలో చేరకముందు తన ప్రయాణం అనిశ్చితిగా ఉండేదని, ఇక్కడికి వచ్చాక ఆచార్యులందరూ ప్రోత్సహించారని, ముఖ్యంగా ఆచార్యులు సంజయ్ సుబోధ్, బి.వి.శర్మలు ఎన్నో విలువైన సూచనలు ఇచ్చారని, జాతీయ..అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలు, సంస్థలతో హెచ్‌సీయూ అవగాహన ఒప్పందాలు కుదుర్చుకోవడం.. వాటిలో అవకాశాలు లభించడంతో తన దృక్పథాన్ని మార్చేశాయని వివరించారు.

ఆర్థరైటీస్ పంజా

ఈ లక్షణాలు ఉంటే..

- ఆరు వారాల కంటే ఎక్కువ కాలం పాటు నిరంతర కీళ్ల నొప్పులు, వాపు.
- దీర్ఘకాలిక జ్వరం.
- ఎండ తగిలితే చర్మం మీద దద్దుర్లు రావడం.
- కీళ్ల నొప్పులు, నోటి పూత పదేపదే వేధించడం.
- బాగా బరువు తగ్గిపోవడం, ఆకలి లేకపోవడం.
- కళ్లు పొడిబారిపోవడం, నోరు, చర్మం పొడిగా మారడం.
- ఉదయం పూట 45 నిమిషాలు కంటే ఎక్కువ సేపు తీవ్రమైన వెన్ను లేదా మెడనొప్పి.
- కీళ్ల నొప్పులతో పాటు రక్తంలో యూరిక్ యాసిడ్ స్థాయిలు పెరగడం.
- తీవ్రమైన కండరాల బలహీనత, నొప్పులు.
- చిన్న పిల్లల్లో కీళ్ల నొప్పులు వేధించడం.

నేడు ప్రపంచ ఆర్థరైటిస్ నివారణ దినం

- పిల్లల నుంచి పెద్దల వరకు బాధితులే
- ముందే గుర్తించి చికిత్స చేయించుకుంటే మేలు



కష్టమైన ఆర్థరైటిస్ వ్యాధి పంజా విసురుతోంది. వయసుతో సంబంధం లేకుండా పిల్లలు, పెద్దల్లో ఈ సమస్య కనిపిస్తోందని వైద్య నిపుణులు చెబుతున్నారు. ముందే గుర్తించి చికిత్స తీసుకోవడం ద్వారా ఉపశమనం పొందవచ్చనని సూచిస్తున్నారు. నగరంలో ఆర్థరైటిస్ బాధితుల సంఖ్య పెరుగుతోందని వైద్యులు పేర్కొంటున్నారు. ఈ నెల 12న ప్రపంచ ఆర్థరైటీస్ నివారణ దినం సందర్భంగా ప్రత్యేక కథనం..

ఆర్థరైటిస్‌ను పలు రకాలుగా విభజించారు. వృద్ధుల్లో ఎక్కువగా ఆస్టియో ఆర్థరైటిస్ సమస్య కనిపిస్తే.. మహిళలు, యువతుల్లో లూపస్‌గా ఆర్థరైటిస్ వేధిస్తుంది. దీనివల్ల ముఖంపై సీతాకోక చిలుక ఆకారంలో ఎర్రటి మచ్చలు ఏర్పడతాయి. ఇంకొందరు గౌట్‌తో బాధపడుతున్నారు. దీనివల్ల చేతులు, కాళ్ల వేళ్ల బాగాల్లో వాపు, నొప్పితో తీవ్ర ఇబ్బందులు పడుతుంటారు. ఆస్టియో ఆర్థరైటిస్ కారణంగా ఎముకలు పెలుసుబారి తీవ్రమైన కీళ్ల నొప్పులు వేధిస్తాయి.

ఇదో ఆటో ఇమ్యూన్ సమస్య. మనలోని వ్యాధి నిరోధక శక్తి తిరిగి శరీరంపై దాడి చేసినప్పుడు ఈ సమస్యకు కారణమవుతుంది.పిల్లల్లో సైతం జువైనల్ ఆర్థరైటిస్‌కు దారి తీస్తుంది. వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవడం ద్వారా దీర్ఘకాలిక ఇబ్బందులు లేకుండా బయట పడవచ్చు. ఆర్థరైటిస్ నుంచి బయట పడాలంటే వీలైనంత త్వరగా వ్యాధిని నిర్ధారించాలి.

ఈనాడు, హైదరాబాద్

అందుబాటులోకి ఆధునిక చికిత్సా విధానాలు..

అర్థరైటీస్‌కు ప్రస్తుతం ఆధునిక చికిత్సలు అందుబాటులోకి వచ్చాయి. సంప్రదాయ గోలీలు నుంచి అధునాతన బయోలాజికల్ ఇంజక్షన్లు, కార్టిసెల్ థెరపీ కూడా ఉంది. అర్థరైటీస్ చికిత్సల్లో స్టెరాయిడ్ల వాడకంపై ఆందోళనలు అవసరం లేదు. వైద్యుల పర్యవేక్షణలో కొద్ది మోతాదులో స్వల్ప కాలానికి స్టెరాయిడ్లు ఉపయోగించవచ్చు. లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా రుమటాలజిస్టులను సంప్రదించాలి. పరీక్షల ద్వారా ఏ రకమైన అర్థరైటీస్ ఉందో నిర్ధారణ అవుతుంది.

-డాక్టర్ వి.శరత్‌చంద్రమౌళి, రుమటాలజీ, క్లినికల్ ఇమ్యునాలజీ విభాగాధిపతి, కిమ్స్

నగరంలో ఆదివారం

◆ నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో ఉదయం10గం.లకు దత్తన్న అలయ్‌బలయ్◆ రవీంద్రభారతిలో సాయంత్రం 5గం.లకు రచయిత శీలా వీర్రాజు జీవితం, రచనలపై రచయిత నాళేశ్వరం శంకరం 'నా దృష్టిలో..' ప్రసంగం.

నిర్యాణం

వైకుంఠ సమారాధన
మా తండ్రి గారైన Lt. Col. వేమూరి రామూర్తి శాస్త్రి గారు పరమపదించినారని తెలుపుటకు చింతిస్తున్నాము. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...
శోకతప్త హృదయాలతో..
కీ॥శే॥ Lt. Col. వేమూరి రామూర్తి శాస్త్రి గారు
కుమారులు: వేమూరి విశ్వనాథ్, వేమూరి లక్ష్మణ్
జననం: 28/2/1939 మరణం: 02/10/2024
కార్యస్థలం: తేది: 13/10/2024 ఆదివారం మొదటి మాసికం, ఆశీర్వచనం, వైకుంఠ సమారాధన 3A, Sector B, AWHO Colony, CREST COMMUNITY HALL సిఖ్ విలేజ్, సికింద్రాబాద్ నందు జరుపబడును. ☎: 99014 55711

శ్రద్ధాంజలి
శ్రీ బానాల చంద్రకుమార్‌గారు పరమపదించారని తెలియజేయుటకు చింతిస్తున్నాము.. మీ మరణం మాకు తీరనిలోటు, మీతో గడిపిన క్షణాలు జ్ఞాపకాలు సదా పదిలం, మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని శ్రద్ధాంజలి ఘటిస్తూ...
భార్య: బానాల కళావతి
కుమారులు – కోడళ్ళు
కూతుళ్ళు - అల్లుళ్లు, మనుమలు- మనుమరాండ్లు
అంతిమయాత్ర: మా స్వగృహము ఇనెం. 13-6-433/32 నేతాజీనగర్ కాలనీ, మెహిదీపట్నం రింగ్‌రోడ్ హైద్రాబాద్-500008 నుండి బయలుదేరును.
కీ.శే. శ్రీ బానాల చంద్రకుమార్ గారు
జననం: 06-10-1936, మరణం: 10-10-2024
Founder, Chairman PARMAHAMSA VIDYA NIKETAN HIGH SCHOOL (Estd 1973) Rahimpura, Hyd.
Inserted by- RELIANCE HI-TECH GROUP OF SCHOOL Shivlal nagar, Rahimpura, Jiyaguda, Tallagadda, Hyd-500006. Cell: 9849330644

ఆర్కేపురం: మహిషాసురమర్దినిగా కుర్తాళం పీఠం ప్రత్యంగిరా అమ్మవారు

దుర్గాదేవికి హారతి ఇస్తున్న విజయలక్ష్మి

నగర ప్రజలకు దసరా శుభాకాంక్షలు: మేయర్

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం దుర్గా పూజలో పాల్గొన్నారు.

బేగంపేట చేరనున్న అయోధ్య రాముడి ధనస్సు, విల్లు

బేగంపేట, న్యూస్‌టుడే: 13 కిలోల వెండి, ఒక కిలో బంగారంతో అయోధ్య రాముడి కోసం చల్లా శ్రీనివాస్ శాస్త్రి అనే భక్తుడు తయారు చేయించిన ధనస్సు, విల్లు శనివారం బేగంపేటకు చేరనున్నాయి. దేశంలోని అన్ని ఆలయాలను చుట్టి వస్తున్న వీటిని భక్తుల సందర్శనార్థం బేగంపేట భూలక్ష్మి ఆలయంలో ఉంచనున్నట్లు దేవాలయ నిర్వాహకులు విశాల్‌సూదం తెలిపారు. తిరుమల బ్యాంక్ వ్యవస్థాపకులు నంగునూరి చంద్రశేఖర్ సహకారంతో రాముడి ధనస్సు, విల్లును భూలక్ష్మి ఆలయానికి తీసుకువస్తున్నట్లు చెప్పారు.

ఆన్‌లైన్ ఆట.. నేరాల బాట

● బానిసలవుతున్న యువత

ఆన్‌లైన్ గేమింగ్ సరదాగా మొదలై.. వ్యసనంగా మారుతోంది. గెలుపోటముల మధ్య ఇరికించి అప్పులపాలు చేస్తోంది. వీటిని తీర్చేందుకు నేరాలబాట పట్టిస్తోంది. విద్యార్థుల నుంచి ఉన్నత స్థాయిలో ఉద్యోగాలు చేస్తున్న వారూ బాధితుల జాబితాలో చేరుతున్నారు.

ఎన్నో ఉదంతాలు.. ● అంబర్‌పేట్‌కు చెందిన 11 ఏళ్ల బాలుడు తల్లి ఫోన్‌లో యాప్ డౌన్‌లోడ్ చేసుకున్నాడు. అక్కడ టాస్కులు పూర్తి చేసేందుకు.. కొత్త ఆయుధాలు కొనేందుకు తల్లి బ్యాంకు ఖాతాలో డబ్బు ఖర్చు చేశాడు. నగదు విత్‌డ్రా చేసేందుకు బ్యాంకుకెళ్లిన తల్లికి ఖాతాలో రూ.27 లక్షలు మాయమైనట్లు గుర్తించి సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అసలు విషయం వెలుగు చూసింది. ● గుడిమల్కాపూర్‌లో ఉంటున్న ఇంజినీరింగ్ విద్యార్థి రూ.60 వేలు రుణం తీసుకొని వాటిని తీర్చలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ● 2022లో నగరంలో ఆన్‌లైన్ గేమింగ్‌లో రూ.60 వేలు పోగొట్టుకున్నట్లు పోలీసులకు ఫిర్యాదులు అందాయి. ● 2023 నాటికి అది రూ.1.60 కోట్లకు చేరింది. ● ఈ ఏడాది 9 నెలల్లో రూ.2.5 కోట్ల మేర ఆన్‌లైన్ గేమింగ్‌తో నష్టపోయినట్లు ఫిర్యాదులు అందాయి.

ఊహల్లో చేరి.. పాత్రలతో విహరించి

అధిక శాతం మంది విద్యార్థులు, యువత రోల్ ప్లేయింగ్ గేమ్స్(ఆర్‌పీజీ)కు ఆకర్షితులవుతున్నారు. ఇక్కడ కనిపించే కొత్త ప్రపంచం..వినూత్న పాత్రలు ఊహా ప్రపంచంలోకి తీసుకెళతాయి. మొదట్లో ఆటవిడుపుగా ప్రారంభమై.. క్రమంగా ఆ పాత్రలన్నింటిలోకి చేరి తామే అక్కడ యుద్ధం చేయాలి. కొత్త దుస్తులు ధరించాలి. ఆధునిక ఆయుధాలతో శత్రువులపై పైచేయి సాధించాలనేంతగా అలవాటుపడతారు. ఆటకు బానిసలైన వారు తల్లిదండ్రులకు తెలియకుండా వారి బ్యాంకు ఖాతాలు, ఏటీఎం కార్డులు, యూపీఐ మార్గాల నుంచి డబ్బు చెల్లిస్తున్నారు.

ఒక్కసారి దిగాక అంతే ఇక..

● నాంపల్లిలోని ప్రముఖ బ్యాంకు ఉద్యోగి. వ్యక్తిగత, విద్యా రుణాలు ఇచ్చే పోస్టులో ఉన్నారు. ఖాతాదారులు జమచేసిన రూ.1.50 కోట్లను తన వ్యక్తిగత ఖాతాలోకి మళ్లించుకున్నారు. దర్యాప్తులో ఆన్‌లైన్ గేమింగ్‌కు బానిసైన ఆ ఉద్యోగి అప్పులు తీర్చేందుకు మోసానికి పాల్పడినట్లు వెల్లడైంది.

● బెంగళూరుకు చెందిన యువకుడు ఆటకు బానిసయ్యాడు. అవసరమైన డబ్బు కోసం సామాజిక మాధ్యమాల నుంచి మహిళల ఫొటోలు సేకరించి వాటితో డేటింగ్ యాప్‌లో నకిలీ ప్రొఫైల్స్ సృష్టించి విదేశాల్లోని యువతను ఆకట్టుకునేవాడు. వారి వ్యక్తిగత ఫొటోలు, వీడియోలు సేకరించి వాటిని బయటపెడతానంటూ బెదిరించి డబ్బు వసూలు చేసేవాడు.

● సికింద్రాబాద్‌లో ఓ వ్యాపారి ఇంట్లో వజ్రాలహారం మాయమవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పదో తరగతి చదువుతున్న వ్యాపారి కుమారుడే ఆ నగను కాజేసి మరొకరి ద్వారా విక్రయించినట్లు బయటపడింది.

ఈనాడు, హైదరాబాద్

ఏకాదశదినకర్మ
మంచితనానికి మారుపేరుగా నిలిచి, అందరి హృదయాలలో ప్రేమానురాగాలు నింపి, ఎల్లవేళలా మా సుఖాన్ని కోరుకున్న మీరు దైవసన్నిధికి చేరినారు. మీ పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతున్ని ప్రార్థిస్తూ...
భర్త: పాలడుగు బుగ్గారెడ్డి
[illegible]
కీ.శే. పాలడుగు కౌసల్యరెడ్డి
జననం: 14-01-1953
మరణం: 04-10-2024
వేదిక: PBR Convention Hall, [illegible] 14-10-2024 సోమవారం [illegible] 12:00 గంటల నుండి

అంత్యక్రియలు, వర్ధంతి, జయంతి
మీ సమాచారం సంబంధీకులందరికి చేరాలి అంటే?
మీ ప్రయత్నానికి ఇదే సులభ మార్గం
ఈనాడు లో ప్రకటన ఇవ్వడం ద్వారా మీ సమస్యకు పరిష్కారం లభిస్తుంది.
GST 5% extra
ఈనాడు హైదరాబాద్ సిటీలో కలర్ ప్రకటన రేటు చాలా తక్కువ
99635 22257
L.B.Nagar & Uppal: 90000 15736
Ameerpet, Oldcity & Sec-bad : 80085 97633
Kukatpally : 8008515142

ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి

దుర్గా మాతను వేడుకున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

రాంనగర్: ముషీరాబాద్ ఎన్టీఆర్ స్టేడియంలో.. హైదరాబాద్ బెంగాలీ సమితి(హెచ్‌బీఎస్) ఆధ్వర్యంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు కనులపండువగా కొనసాగుతున్నాయి. శుక్రవారం రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ హాజరై.. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్న హెచ్‌బీఎస్ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌బీఎస్ అధ్యక్షుడు మౌసుమీ చౌదరి, ప్రధాన కార్యదర్శి జోయ్ కుమార్ దాస్, బిస్వజిత్ ముఖర్జీ పాల్గొన్నారు.

అమ్మవారి విగ్రహానికి నమస్కరిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

'ఇండియా కా సెలబ్రేషన్' విజేత రాజేంద్రనగర్ వాసి

రాజేంద్రనగర్, న్యూస్‌టుడే: రాజేంద్రనగర్‌కు చెందిన ఓ వ్యక్తి రూ.5లక్షల బహుమతిని గెలుచుకున్నాడు. 'ఇండియా కా సెలబ్రేషన్' పేరుతో ఎల్‌జీ కంపెనీ దేశ వ్యాప్తంగా తమ కంపెనీ ప్రోడక్ట్ కొన్నవారికి రూ.51 కోట్ల బహుమతులను అందజేయాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ఎల్‌జీ కంపెనీ వస్తువులు కొన్నవారికి లక్కీడిప్ ద్వారా ఎంపిక చేసి వివిధ రకాల బహుమతులు అందజేస్తోంది. రాజేంద్రనగర్‌కు చెందిన జంగయ్య డెయిరీఫాం చౌరస్తాలోని ఓ ఎలక్ట్రానిక్ షోరూంలో ఎల్‌జీ కంపెనీ వస్తువు కొనుగోలు చేశాడు. శుక్రవారం తీసిన లక్కీ డ్రాలో జంగయ్య రూ.5లక్షల విలువచేసే బహుమతి గెలుచుకున్నాడు. శుక్రవారం జంగయ్యకు ఆ బహుమతిని ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా తెలంగాణ ఆర్‌బీహెచ్ కె.శశికిరణ్‌రావు అందజేశారు.

జంగయ్య కుటుంబాన్ని అభినందిస్తున్న ఎల్‌జీ కంపెనీ ప్రతినిధి శశికిరణ్‌రావు

ధైర్యం ప్రాణాలు నిలబెడుతుంది: క్రికెటర్ సిరాజ్

ఈనాడు, హైదరాబాద్: ఎప్పుడూ క్రికెట్ మైదానంలో గడిపే భారత క్రికెటర్ మహ్మద్ సిరాజ్ శుక్రవారం బంజారాహిల్స్‌లోని రెయిన్‌బో చిన్న పిల్లల ఆసుపత్రిని సందర్శించారు. అక్కడ క్యాన్సర్, ఇతర వ్యాధులకు చికిత్స తీసుకుంటున్న చిన్నారులతో కాసేపు గడిపి ధైర్యాన్ని నింపారు. వివిధ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'క్రికెట్ మ్యాచ్‌లో క్యాచ్ విడిచి పెడితే కొన్నిసార్లు మూల్యం చెల్లించుకోవాలి.. అదే నిజం జీవితంలో నమ్మకం కోల్పోతే ప్రాణాంతక వ్యాధులపై పోరాటం సాగించలేం. ఓడినా మ్యాచ్ కోసం మళ్లీ ఎలా కష్టపడతామో.. జీవితంపై ఆశ వదులుకోకుండా పోరాటం సాగిస్తే గెలుపు సాధించవచ్చు' అని అన్నారు. ధైర్యమే ప్రాణాలు కాపాడుతుందని చిన్నారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి జోనల్ డైరెక్టర్ డా. దినేష్ కుమార్ చిర్ల, చిన్నపిల్లల వైద్యుడు ఫైజల్, పీడియాట్రిక్ హెమటాలజిస్టు, అంకాలజిస్టు శిరీష రాణి, చైల్డ్ అండ్ అడాలసెంట్ న్యూరాలజిస్టు లోకేష్ లింగప్ప, మెడికల్ డైరెక్టర్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులతో క్రికెటర్ మహ్మద్ సిరాజ్

రతన్ టాటాకు నివాళి

ప్రముఖ పారిశ్రామికవేత్త, టాటాగ్రూప్ ఛైర్మన్ రతన్ టాటాకు బోరబండలో నివాళి అర్పిస్తున్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్ గౌడ్, కార్పొరేటర్ ఎం.డి.బాబాఫసియుద్దీన్, యువజన కాంగ్రెస్ క్రీడావిభాగం ఛైర్మన్ ఎం.డి. అసదుద్దీన్ తదితరులు
– న్యూస్‌టుడే, బోరబండ

EENADU Classifieds

AGRI BUSINESS
మా చేపల పెంపకం ప్రాజెక్ట్‌ను మీ ఫామ్ ల్యాండ్స్‌లో & భూసారం పెంచే అంతర పంటగా అన్నిరకాల పంటలు పండించే రైతులు మీ పొలంలో కొద్దిగా స్థలంలో ఈ చేపల పెంపకం చేపట్టి అధిక దిగుబడి, ఆదాయం పొందవచ్చు. ✆: 72077 63093.

AUTO

VEHICLES FOR SALE
Audi Car for Sale 2017 Model, Fancy Number 9, "Audi Q3 Diesel / Red Pearl Colour / Through Bank e-Auction Price : Rs.13,50,000/- 83309 52080 77028 77188

VEHICLES WANTED
Required Bolero Camper, Mahindra Verito, Dezire, Ertiga (Rangareddy, Mekaguda) Telangana Location. Call: 9821493003.

BUSINESS SERVICES

WANTED DEALERS/AGENTS
APలో అతిపెద్ద బేకరీ VM బేకరీ. ప్రొడక్ట్స్ - బ్రెడ్స్, కేక్స్, బిస్కట్స్ సేల్స్ కొరకు డిస్ట్రిబ్యూటర్స్ కావలెను. సొంత ఆటోలు ఉన్న వారికి ప్రాధాన్యత. ✆ 74164 56679, 98497 11799.

BUSINESS OFFER
Join As a Partner in our Aqua Terra Farm Lands "First Venture" by Just Investing Small Amounts get Big Returns. We will provide 100% Collateral Security for Principal Amount & Interest. ✆: 72077 63093.
Good opportunity monthly income, invites good investors for group of educational institutions hyd. Ph: 8639364374
Investment 26 Lakhs & above For Our Ongoing Project. Assured Returns in Short Term With Security. Ph: 8919508229

A reputed detergent company wanted sales force (for hotels and hospitals) and town wise distributors. Contact 7729991155.

BUILDING CONSTRUCTION
100% వాస్తు, క్వాలిటీ మెటీరియల్స్‌తో , తక్కువ Sft రేట్లలో , ఇంజనీర్ల పర్యవేక్షణలో, తక్కువ సమయంలో ఇల్లు కట్టివ్వబడును. Ph:8333030667

FINANCIAL SERVICES

INVESTMENTS
Need Investers for Academic Year 2024-2025 New Series Text Book Printing. Monthly Returns Will be Given. ✆ 90147 67673

CHITS
Reg. Chits: 5L, 10L, 15L, 25L, 50L, 1Cr and above Chits. For good service & Commitments. please contact: 9493266649

FINANCIAL PLANNER
All Types of Collateral loans available aganist (Lands, Vehicles & Gold) with reasonable interest. Ph: 9100096686/83

HOME NEEDS

PEST CONTROL
Om Pest Control: Termites Cockroaches Cupboards Doors New houses 5yrs Guaranty Treatment: 9550446581, 9666566081

INDUSTRY

MACHINERY FOR SALE
Welded Mesh Manu facturing Industry For Sale @ Guntur. Ph: 99000 93092
GEN Samrat హార్వెస్టింగ్ మెషీన్లు, హైడ్రాలిక్, పంపులు, గేర్ బాక్స్‌లు, మోటార్లు, వరికోత మెషీన్లు, విడి భాగాలు. కియరెన్సు సేల్ 50% Dis. Ph:9246249543, 9000688888

INDUSTRIAL SHED
Shed/ Ware House Rental- Ideal for Steel Distributors or Hardware Storage or Tiles & Sanitary. 20,000 Sq.Feet, 2 Acres Land, 9 Feet Compound Wall, Highway Facing, near to ORR, Aliyabad, Shameerpet. Contact: 8688316420.

PEOPLE CARE

OLD AGE HOME
శ్రీ వాత్సల్యవల్లి ఓల్డ్ ఏజ్ హోమ్, గ్రీన్ పార్క్ కాలనీ, చంపాపేటలో సేవా దృక్పథంతో వృద్ధులకు & పేషెంట్స్‌కు ఆరోగ్యకరమైన వాతావరణంలో, మంచి వసతి కల్పిస్తున్నాము. ✆ 92914 59459
ప్రాణహిత ఎల్డర్లీ కేర్ (ఓల్డేజ్ హోం) వృద్ధులకు, మంచాన పడ్డవారికి 24 గం|| వైద్య సౌకర్యం, అన్ని వసతులతో మన్సూరాబాద్, సహారా రోడ్. ✆ 9030906266, 7702399108.
ఒమేగా హోంకేర్ వంట/ఇంటిపని, వృద్ధులకు, పేషంట్లని, చిన్నపిల్లలను 24గం|| చూసుకొనుటకు మీ ఇంటి వద్దకే కేర్‌టేకర్స్‌ని పంపబడును.హైదరాబాద్. ✆ 89776 39664, 89776 39665.
వృద్ధులు, NRI's, విలాసవంతమైన గదులు, లిఫ్ట్, మేడిపల్లి. దీర్ఘకాలిక మంచాన ఉన్న వారికి 24/7 మెడికల్, ఉప్పల్ & ECIL- కీసర రోడ్, చీర్యాల్ X రోడ్. భోజన వసతితో. Ph: 7981467036, 9391039990, 8074327715.

JOBS
Reputed Furniture Showroom @ Kukatpally Requires Salesman (M/F) Attractive salary + incentives. Should have Mini 1-2 exp in any sales field. Ph: 9908040333
Require Exp. Store Manager/ Cashier for Retail Showroom (Baby Store) at Karmanghat/ L.B.Nagar ✆ 6305780047, 8978028062.
Lead India Mission 2047. Req. 1)Office Executives-2 & Admin cum Accountant 3) Social media Trainers. @ Shamshabad, Majidbanda- Kondapur. Ph: 9247301264. Mail: acharya.leadindia2047@gmail.com
Wanted Site Engineer Diploma/ Degree in Civil Eng. with 2-3 Years Experience in Kuntloor, Hyd. Ph: 9440632043.

Wanted Hospitality Professionals, General Manager Hotels and Resorts, Resort Managers, Operations Manager, HR Manager and Sales Managers and HR Recruiters. Looking for only experienced in respective departments. Call on +91 92814 58321.
Reputed MNC Co. Hiring Retd & VRS (Bankers & Govt), Homemakers, Professionals (CA/ Tax Cons/ Adv. etc.) fixed sal+inc. Ph: 9346868889
Medical Warehouse at Boduppal Canara Nagar Wanted Person with Computer Skill Nr. Boduppal. 7995766912/ 8328114785 Whatsapp.
కపిల్ చిట్స్ (Hyd) ప్రై. లిమిటెడ్ లీగల్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేయుటకు కంప్యూటర్ ఆపరేటర్స్, లీగల్ అసిస్టెంట్స్, Jr. అడ్వకేట్స్ కావలెను. ✆ 8096912424, 9848636884.
జైపూర్‌లో స్పెషల్ బిర్యానీ చేయడానికి అనుభవం గల నిపుణులు కావలెను. మంచి జీతం ఇవ్వబడును. Contact: 9829057618.
సువర్ణావకాశం: మీరు VRS/ రిటైర్డ్ అయ్యి బోర్ ఫీలౌతున్నారా? మరలా మేనేజర్‌గా పనిచేస్తూ నెలకు 60,000/- ఆపైన సంపాదన కొరకు స్త్రీ/పు. డైరెక్టర్. Ph: 9000184542.
శ్రీనివాస హోమ్‌కేర్‌లో పెద్దవారికి సేవలు చేయుటకు Exp. స్త్రీ/పురుషులు/ నర్సులు కావలెను. జీతం: 20,000/- నుండి 25,000/- వరకు ఇవ్వబడును. Hyd. లో. ✆ 6301330889, 6300799407.
కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్లని చూసుకోవడానికి స్త్రీ/పు॥ ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీః 15-40 వేలు. ఫ్రీ రూమ్ + భో॥ Hyd. ✆ 7995365999.
రియల్‌ఎస్టేట్ రంగంలో 10 సంవత్సరాల అనుభవం గల, హుందాతనమైన సేల్స్ మేనేజర్స్ కావలెను. Plots, Flats, కమర్షియల్ బిల్డింగ్స్ అమ్మడంలో అనుభవం ఉండవలెను. కాల్: 9849123696, 8885870000.
నాగోల్ బండ్లగూడలోని అపార్ట్‌మెంట్‌లో పనిచేయుటకు డ్రైవర్- వాచ్‌మెన్ కుటుంబ సభ్యులతో ఉన్నవారికి వసతి సౌకర్యం. మంచి జీతం కలదు. Ph: 9391342022.
24 గంటలు ఇంట్లో ఉంటూ చిన్న పాపను చూసుకొనుటకు హిందీ భాష వచ్చిన 50 సం||ల లోపు మహిళ కావలెను. డైరెక్ట్ జాబ్. జీతం: 18,000+ భోజన వసతి. ✆ 9059500749.
KPHB కాలనీ, కూకట్‌పల్లి, హైదరాబాద్. ఒంటరిగా ఉన్న పెద్దాయనను చూసుకొనుటకు పనిమనిషి కావలెన. తను ఏదైనా జాబ్ కానీ చదువుకానీ చేయవచ్చు. వసతి, భోజనం ఉచితం. జీతం: 5000/-. సం|| 9493855652.
హయత్‌నగర్‌లో పనిచేయడానికి వెజ్/ నాన్‌వెజ్ మాస్టర్లు (జీ॥ 25 వేలు) కటింగ్ మాస్టర్లు (జీ|| 15 వేలు) హెల్పర్లు భార్యభర్తలు (జీ|| 23 వేలు) కావలెను. ఫ్రీ రూం, భోజనం- మైథిలీ క్యాటరింగ్. ✆ 9493931224, 7386951320.

కొండాపూర్ బొటానికల్ గార్డెన్ వద్ద బ్రహ్మణ ఇంట్లో 6 గురికి వంట చేయుటకు అనుభవం ఉన్న బ్రహ్మణ స్త్రీలు (ఉ॥ 7 - సా॥ 4 గం॥) కావలెను. జీః 15-16 వేలు సంప్ర॥ ✆ 7674068042.
మల్కాజిగిరి, బోయిన్‌పల్లిల్లో పేషెంట్‌కేర్‌గా 24 గం॥ పనిచేయుటకు ఇంటి, వంటపనికి అనుభవం ఉన్న భార్యభర్త కపుల్స్ కావలెను. జీః 28-30 వేలు + రూం ఫ్రీ ✆ 7674068042
WANTED AMEERPET (Leelanagar) GENTS HOSTEL లో హౌసకీపింగ్ & వాచ్‌మెన్ పనిచేయుటకు (40 సం॥లోపు) భార్యభర్తలు మరియు అనుభవం గల వంటమాస్టార్ భార్యభర్తలు (50 సం॥లోపు) వారు కావలెను. ✆ 9849000249

MARKETING/ SALES
Wanted Marketing Agents for 2/3/4 BHK Apartments Sales in East Hyderabad. Attractive Commission. Ph: 8897799355.
రియల్ ఎస్టేట్ రంగంలో అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న ప్రముఖ కంపెనీలో మార్కెటింగ్ చేయుటకు ఉత్సాహవంతులైన యువతి / యువకులు కావలెను. శాలరీ + కమీషన్, ఫ్రీ ట్రైనింగ్ (freshers only). Ph: 9391184511

FACULTY/ TEACHERS
Indo American School, Santoshnagar, Wanted Teachers for High School Maths & Biology. Also Wanted Computer Teacher. 8121111299.

DRIVERS
బంజారాహిల్స్‌లోని మా మల్లెమాల ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థకు అనుభవం ఉన్న డ్రైవర్లు కావలెను. LMV & HMV లో 5 సం||లకు పైగా లైసెన్స్ కలిగిన వారై ఉండాలి. hr@mallemaala.com ✆ 9848899318.

ACCOUNTING
Immediate Req. Jr & Sr. Accountant. Exp: 1 Yr & above. Knowledge in Tally, GST, TDS & IT, Work location: Somajiguda, Bowenpally & Rajeevnagar ★ Hymac Hydraulics, Hyd-45. Mail CV to: hymachydraulics@gmail.com ✆ 9505492278.

BANKING/ INSURANCE
స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్‌లో ఏజెంట్స్ కావలెను. No exam for LIC ఏజెంట్స్, ఇన్సెంటివ్స్, విదేశీయానం, life long income. 9247799830 Sr. మేనేజర్

TOURS AND TRAVELS
కార్తీకమాసం జ్యోతిర్లింగాలు భీమశంకర్, త్రయంబకేశ్వర్, ఘృష్ణేశ్వర్, ఔండా నాగనాథ్, పర్లీ వైద్యనాథ్, షిరిడి, కొల్హాపూర్, పండరీపూర్, తుల్జాపూర్ + 20 క్షేత్రములు 8 రోజులు మహారాష్ట్ర ఏసీ బస్సు Nov. 4 & 26. లక్ష్మీ టూర్స్. ✆ 98662 46466.
గుజరాత్, నాగేశ్వరం, సోమనాథ్, ద్వారక 8 రో॥ 11 వేలు 21-11 ★ కర్ణాటక, కుక్కి, శృంగేరి, గోకర్ణ, మైసూర్, 7 రో॥ 10,500/- ★ 21-11. అన్ని టూర్స్ మా స్వంత వంట భోజనం. సత్యసాయి ✆ 9618933189.
3/11, రామేశ్వరం, కన్యాకుమారి, అరుణాచలం, కంచి, శ్రీరంగం, 10 రో॥ 17/1 మధుర, సోమనాథ్, ద్వారక, ఉజ్జయిని, ఓంకారేశ్వర్ 11 రో॥ 13/2, కాశీ, అయోధ్య, రై॥ బ॥ వ॥ భో॥. ✆ 9849274315.
కార్తీక మాసంలో కాశీ యాత్ర 9 నిద్రలు * అయోధ్య, త్రివేణి సంగమం, 2 శక్తి పీఠాలు, కాలభైరవ మొ॥ Nov, Dec, శ్రీ అన్నపర్ణేశ్వరి ట్రావెల్స్ ✆ 9347067958

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

BOOK YOUR CLASSIFIED
Ad ₹1450/- (5 Lines B/w)
3 Ads Package ₹ 3695/-
7 Ads Package ₹ 8580/-
★ GST 5% Extra
Ph: 040- 23440304, 23318181, Extn: 6422
Through Online
www.eenaduclassifieds.com

కాచుకో రావణా..

● విజయదశమికి ప్రతిమలు సిద్ధం

కేశవగిరి, న్యూస్‌టుడే: దసరా వేడుకల్లో కీలకమైన భారీ రావణుడి ప్రతిమలు సిద్ధమవుతున్నాయి. సంప్రదాయ పద్ధతిలో రావణుడి ప్రతిమల దహనం ఓ కీలక ఘట్టం. తరువాత ఒకరినొకరు ఆలింగనం చేసుకుని, శమీ పత్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలుపుకొంటారు. పాతబస్తీతోపాటు బండ్లగూడ, మీర్‌చౌక్, చార్మినార్, చంపాపేట్, బడంగ్‌పేట్ ప్రాంతాల్లో మేదర్ కళాకారులు ఈ ప్రతిమలను రూపొందిస్తారు. వెదురు కట్టెలతో వీటిని తయారు చేస్తారు. ఉత్సవ నిర్వాహకుల ఆసక్తి మేరకు రావణుడి శరీర విడిభాగాలు తయారు చేసే సమయంలోనే అందులో వారిచ్చే టపాసులు పొందుపరుస్తారు. విడి భాగాలను తీసుకువచ్చి ఉత్సవం జరిగే రోజున మైదానంలో పెద్ద కర్రల సాయంతో భారీ ఆకారంగా జోడిస్తారు. ఎత్తు, ఆకారాన్ని బట్టి ఒక్కో ప్రతిమ తయారు చేసేందుకు వారం నుంచి పది రోజులు పడుతుందని 65 ఏళ్లుగా ఈ రంగంలో ఉన్న కళాకారులు ప్యారసాని యాదగిరి, అనసూజ దంపతులు తెలిపారు. ధర రూ.12-40 వేల వరకు ఉంటుందన్నారు. నాగారం, మూసాపేట, కొత్తపేట్, చాంద్రాయణ గుట్ట, గుల్జార్‌హౌస్ తదితర ప్రాంతాల నుంచి ఆర్డర్లు వస్తాయన్నారు. ఏటా దసరాకు సుమారు 25 ప్రతిమలు తయారు చేస్తామని చెప్పారు.

ప్రతిమను తయారుచేస్తున్న కార్మికుడు

టపాసుల పేలుళ్ల మధ్య..దసరా పండుగ రోజున నిర్వాహకులు భారీ రావణాసురుడి ప్రతిమలను టపాసుల పేలుళ్లతో దహనం చేస్తారు. ముందుగా భారీ ప్రతిమ లోపల గడ్డిని నింపుతారు. మెడలో సీమ టపాసుల హారాన్ని ఏర్పాటు చేస్తారు. కింది భాగంలో పేర్చిన గడ్డికి నిప్పు పెట్టినప్పుడు మొత్తం ప్రతిమ పేలుళ్ల మధ్య పూర్తిగా దహనం అవుతుంది.

వ్యక్తిగత రుణం ఇప్పించి.. రూ.20లక్షలు టోకరా

నారాయణగూడ, న్యూస్‌టుడే: పర్సనల్ లోన్ ఇప్పించి మరీ నగదు దోచేశారంటూ బాధితురాలు హైదరాబాద్ సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. కాచిగూడ భద్రుకా కళాశాల వద్ద నివసించే ప్రైవేటు ఉద్యోగినికి ఫోన్ కాల్ వచ్చింది. ఆ తర్వాత స్కైప్ వీడియో కాల్ వచ్చింది. అందులో పోలీసు దుస్తుల్లో ప్రత్యక్షమైన వ్యక్తి తాను ముంబయి పోలీసులమని పరిచయం చేసుకున్నాడు. ఫెడెక్స్‌లో మీ ఆధార్ కార్డు ద్వారా ముంబయి నుంచి ఇరాన్‌కు రిజ్వాన్ అహ్మద్‌కు పార్సిల్ బుకింగ్ జరిగిందని, అందులో నిషేధిత వస్తువులున్నాయని ఆరోపించాడు. ఎన్‌సీఆర్‌బీ, ఆర్‌బీఐ, ముంబయి సైబర్ పోలీసులు కూడా కేసు దర్యాప్తు చేస్తున్నారని, నేరం రుజువైతే కనీసం 3 నుంచి 7 ఏళ్ల కఠిన కారాగార శిక్ష పడుతుందని బెదిరించాడు. మీ పేరిట దాదాపు 30 బ్యాంకుల్లో ఖాతాలు ఉన్నాయని చెబుతూనే మరో వ్యక్తికి ఫోన్ ఫార్వర్డ్ అయింది. అవతలి వ్యక్తి ఆర్‌బీఐ అధికారినంటూ పరిచయం చేసుకొని, బాధితురాలి బ్యాంకు ఖాతా గురించి ఆరా తీశాడు. కేసు దర్యాప్తు పూర్తి అయ్యే వరకు ఆర్‌బీఐలో రూ.20 లక్షల వరకు డిపాజిట్ చేయాల్సి ఉంటుందన్నాడు. డబ్బు లేదని బాధితురాలు చెప్పడంతో ప్రీ అప్రూవ్డ్ పర్సనల్ లోన్‌కు సంబంధించిన ఐసీఐసీఐ బ్యాంక్ లింక్ పంపించాడు. బాధితురాలికి రూ.20 లక్షల లోన్ ఇప్పించాడు. ఆ మొత్తం బాధితురాలు నేరస్థుడి ఖాతాకు బదిలీ చేసేశారు. ఆ తర్వాత మోసపోయినట్లు గ్రహించారు.

మూసీలో దూకి.. మహిళ ఆత్మహత్య

చాదర్‌ఘాట్ వంతెన వద్ద ఘటన

కాచిగూడ, న్యూస్‌టుడే: చాదర్‌ఘాట్ వంతెనపై నుంచి అకస్మాత్తుగా ఓ మహిళ మూసీ నదిలోకి దూకి బలవన్మరణానికి పాల్పడింది. కాచిగూడ ఇన్‌స్పెక్టర్ చంద్రకుమార్, అడ్మిన్ ఎస్సై సుభాష్‌ల వివరాల ప్రకారం.. 40-45 ఏళ్ల మధ్య వయసున్న గుర్తుతెలియని మహిళ శుక్రవారం సాయంత్రం వంతెన పైనుంచి మూసీ నదిలో దూకింది. గుర్తించిన పాదచారులు పోలీస్ కంట్రోల్ రూమ్‌కు ఫిర్యాదు చేయడంతో వారు తక్షణం చాదర్‌ఘాట్ పోలీసులను అప్రమత్తం చేశారు. డీఆర్ఎఫ్ బృందాన్ని రప్పించి మహిళ కోసం గాలించారు. నదిలోని మురుగునీటి బురదలో చిక్కుకున్న ఆమెను బయటకు తీశారు. అప్పటికే ఊపిరాడక మృతి చెందింది. ఆ తర్వాత ఘటనాస్థలికి కాచిగూడ పోలీసులు చేరుకుని పరిశీలించారు. మృతురాలి వివరాలతోపాటు ఆమె బలవన్మరణానికి కారణాలు తెలియరాలేదు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వారు వెల్లడించారు.

కేకు కోస్తున్న అభిషేక్ సింఘ్వీ

ఎంపీ అభిషేక్ సింఘ్వీకి ఆత్మీయ సత్కారం

బంజారాహిల్స్: తెలంగాణ నుంచి రాజ్యసభకు ఎన్నికైన అభిషేక్ సింఘ్వీని రాష్ట్ర కాంగ్రెస్ నేతలు సత్కరించారు. బంజారాహిల్స్‌లోని ఎంపీ రేణుకా చౌదరి నివాసంలో అభిషేక్‌సింఘ్వీ కేక్ కోయగా, సీఎం రేవంత్‌రెడ్డి ఆయన్ని అభినందించారు. దేశ, రాష్ట్ర రాజకీయాలపై ఇరువురు కాసేపు ముచ్చటించుకున్నారు. కంట్రీక్లబ్ ఛైర్మన్ వై.రాజీవ్ రెడ్డి, మాజీ ఎంపీ కేకే పాల్గొన్నారు.

నేడు సాలార్‌జంగ్ మ్యూజియానికి సెలవు

చార్మినార్, న్యూస్‌టుడే: సాలార్‌జంగ్ మ్యూజియానికి దసరా వేడుకలను పురస్కరించుకుని శనివారం సెలవు ఉంటుందని మ్యూజియం అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం యథాతథంగా తెరిచి ఉంటుందన్నారు.

అమ్మానాన్న పనికి.. చిన్నారి ప్రాణాలు గాలిలో

8వ అంతస్తు నుంచి పడి బాలుడి దుర్మరణం

రామచంద్రాపురం రూరల్ : ఎనిమిదో అంతస్తులో తల్లిదండ్రులు పనిచేసుకుంటున్న సమయంలో ఓ బాలుడు ఆడుకుంటూ కింద పడి దుర్మరణం చెందాడు. కొల్లూరు సీఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం..ఛత్తీస్‌గఢ్‌కు చెందిన చెందిన సంజయ్ కుమార్ కొల్లూరు గ్రామంలోని మంజు మైత్రి నిర్మాణ సంస్థలో కార్మికుడిగా పని చేస్తున్నాడు. సంజయ్ శుక్రవారం తన భార్య కిరణ్‌కుమారి, ఏడాదిన్నర వయసున్న సిద్ధార్థతో కలిసి ఎనిమిదో అంతస్తుకి వెళ్లాడు. మధ్యాహ్నం సమయంలో సిమెంట్ కలుపుతుండగా ఆడుకుంటున్న కుమారుడు కనిపించాడు. చుట్టుపక్కల అంతా వెతుకుతూ కిందికి వెళ్లగా.. లిఫ్ట్ కోసం తవ్విన గుంతలో పడి ఉన్నాడు. గాయపడిన చిన్నారిని ఆస్పత్రికి తీసుకెళ్లగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. తండ్రి సంజయ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.



(c) eenadu

పేదల ఇళ్ల నిర్మాణ పథకానికి ఇందిరమ్మ కమిటీలు

ఈనాడు, హైదరాబాద్: ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద పేదలకు ఇంటి నిర్మాణానికి ఆర్థిక సహాయం అందించే ప్రక్రియలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. గ్రామ పంచాయతీ, మున్సిపల్ వార్డు స్థాయిలో ఇవి ఏర్పాటవుతాయి. శుక్రవారమే దీనిపై కలెక్టర్లకు ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం శనివారంలోగా వరకు కమిటీలు ఏర్పాటు చేయాలని ఆదేశించింది.

ఒక్కో ఇంటికి రూ.5 లక్షల సాయం

పేదల ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. మొదటి దశలో రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల ఇళ్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందిరమ్మ ఇళ్ల కమిటీలు అధికారులతో సమన్వయం చేసుకుంటూ లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తాయి. గ్రామ పంచాయతీ స్థాయి కమిటీలో.. సర్పంచి లేదా ప్రత్యేకాధికారి ఛైర్మన్‌గా, పంచాయతీ కార్యదర్శి కన్వీనర్‌గా ఉంటారు. స్వయం సహాయక సంఘాల నుంచి ఇద్దరు, ముగ్గురు స్థానికులు సభ్యులుగా ఉండాలని ప్రభుత్వం పేర్కొంది. ముగ్గురు స్థానికుల్లో వెనుకబడిన తరగతుల(బీసీ) నుంచి, దళిత, గిరిజన (ఎస్సీ, ఎస్టీ) వర్గాల నుంచి ఒకరు చొప్పున ఉండాలని స్పష్టం చేసింది.

✦ మున్సిపల్ వార్డు స్థాయి కమిటీలో కౌన్సిలర్ లేదా కార్పొరేటర్ ఛైర్మన్‌గా, వార్డు అధికారి కన్వీనర్‌గా ఉంటారు. స్వయం సహాయక గ్రూప్ నుంచి ఇద్దరు, ముగ్గురు స్థానికులు సభ్యులుగా వ్యవహరిస్తారు. ఇందులోనూ స్థానికుల్లో ఒకరు బీసీ, ఒకరు ఎస్సీ/ఎస్టీ వర్గాల నుంచి ఉండాలి. ఈ కమిటీల కోసం పేర్లు పంపించాలని ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లను ప్రభుత్వం ఆదేశించింది.

నాసిక్‌లో ఇద్దరు 'హైదరాబాద్' అగ్నివీరుల మృతి

ఫైరింగ్ సాధన చేస్తుండగా పేలుడు

నాసిక్‌లో ప్రాణాలు కోల్పోయిన అగ్నివీరులు గోహిల్ విశ్వరాజ్ సింగ్, సైఫత్

నాసిక్: మహారాష్ట్రలోని నాసిక్ జిల్లాలో చోటుచేసుకున్న పేలుడు ఘటనలో హైదరాబాద్ ఆర్టిలరీ కేంద్రానికి చెందిన ఇద్దరు అగ్నివీరులు ప్రాణాలు కోల్పోయారు. ఫైరింగ్ సాధన చేస్తుండగా ఇండియన్ ఫీల్డ్ గన్‌లోని షెల్ పేలడంతో వారు మృతి చెందారని పోలీసులు శుక్రవారం తెలిపారు. నాసిక్ రోడ్డు ప్రాంతంలోని ఆర్టిలరీ కేంద్రంలో గురువారం మధ్యాహ్నం ఇండియన్ ఫీల్డ్ గన్‌తో కొంతమంది అగ్నివీరుల బృందం ఫైరింగ్ సాధన చేసింది. ఆ సమయంలో ఒక షెల్ పేలిపోయింది. దీంతో హైదరాబాద్ ఆర్టిలరీ కేంద్రానికి చెందిన అగ్నివీరులు గోహిల్ విశ్వరాజ్‌సింగ్ (20), సైఫత్(21) గాయపడ్డారు. వెంటనే వారిని ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారని అధికారులు తెలిపారు.

నగరాలు, పట్టణాలే కావాలి!

- కొత్త పశువైద్యుల ఆసక్తి
- నచ్చిన పోస్టింగు కోసం ఐచ్ఛికాలు
- వాటి కోసం పైరవీలు

ఈనాడు, హైదరాబాద్: వారంతా కొత్తగా ఉద్యోగాలు పొందిన పశువైద్యులు... ప్రభుత్వ కొలువు చేసేందుకు నగరాలు, పట్టణాలపైనే ఆసక్తి చూపుతున్నారు. అధికారులు ఐచ్ఛికాలకు అవకాశం కల్పించగా... దాదాపు 80 శాతం మంది గ్రామాల్లో పనిచేసేందుకు విముఖత చూపారు. కొద్దిమంది తమ సొంత జిల్లాలు, తమ నివాసాలకు సమీపంలో ఉండే గ్రామీణ ప్రాంతాలు కావాలని కోరారు. నచ్చిన స్థానం దక్కించుకోవడానికి అప్పుడే పైరవీలు ప్రారంభించారు. అధికారులపై నేతలతో ఒత్తిడి తెస్తున్నారు. రాష్ట్ర పశుసంవర్ధకశాఖ పరిధిలో ఇటీవల 171 మంది వెటర్నరీ అసిస్టెంటు సర్జన్ (వీఏఎస్) ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఆ నెల 6న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరైన కార్యక్రమంలో అధికారుల నుంచి నియామకపత్రాలను పొందారు. వారికి అధికారులు నేరుగా పోస్టింగులు ఇవ్వకుండా... నచ్చిన పోస్టును ఎంచుకునేందుకు ఆప్షన్ ఇచ్చారు. బహుళజోన్‌ల పరంగా ఖాళీలను చూపుతూ వాటిలో నచ్చినవాటికి ఐచ్ఛికాలు ప్రాధాన్య క్రమంలో ఇవ్వాలని సూచించారు. ఈ మేరకు కొత్త పశువైద్యులు రెండు రోజులుగా వారి ప్రాధాన్యాలను ఇచ్చారు.

✦ 77 మందిని మల్టీజోన్ 2కు కేటాయించారు. వీరిలో ఎక్కువ మంది హైదరాబాద్, దానికి సమీపంలోని రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి, యాదాద్రి భువనగిరి జిల్లాలతో పాటు జనగామ, మహబూబ్‌నగర్, సంగారెడ్డి, నల్గొండ, సూర్యాపేట జిల్లాలు వాటి సమీప ప్రాంతాల్లో పోస్టులు కోరారు. నారాయణపేట, గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాలకు అతి తక్కువ మంది ఐచ్ఛికాలు ఇచ్చారు.

✦ మల్టీ జోన్ 1 పరిధిలో 94 మంది ఉద్యోగాలు పొందగా... వరంగల్, హనుమకొండ, నిజామాబాద్, కరీంనగర్. ఖమ్మం, కొత్తగూడెం, సిద్దిపేట, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల... వాటి సమీపంలో పోస్టులు కావాలని కోరారు. మెదక్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, పెద్దపల్లి, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలకు కొద్ది మందే ఐచ్ఛికాలు ఇచ్చారు.

వాస్తవానికి పశుసంపద గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా ఉంది. అక్కడే ఎక్కువ ఖాళీలున్నాయి. నగరాలు, పట్టణాల్లో ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు ప్రైవేటు ఆసుపత్రులూ ఉన్నాయి. అయినా కొత్త పశువైద్యులు తమ సౌకర్యాలకు ప్రాధాన్యమిస్తూ నగరాలు, పట్టణాలను ఎక్కువగా కోరుకున్నారు. ఐచ్ఛికాలు ఎలా ఇచ్చినా... గ్రామీణ ప్రాంతాలకే ప్రాధాన్యం ఇచ్చి వాటిలోని ఖాళీల మేరకే పోస్టింగులు ఇస్తామని ఉన్నతాధికారులు స్పష్టంచేశారు.

ఏపీలోనే కొనసాగించేలా చూడండి

ఆ రాష్ట్ర సీఎంకు ముగ్గురు ఐఏఎస్‌ల వినతి

ఈనాడు, అమరావతి: తెలంగాణ క్యాడర్‌కు వెళ్లాల్సిందేనంటూ కేంద్ర సిబ్బంది వ్యవహారాలశాఖ నుంచి ఆదేశాలు అందుకున్న ముగ్గురు ఐఏఎస్ అధికారులు సృజన, హరికిరణ్, శివశంకర్ శుక్రవారం ఏపీ సీఎం చంద్రబాబును సచివాలయంలో కలిశారు. తమను ఏపీలోనే కొనసాగించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడతానని సీఎం వారికి చెప్పినట్లు తెలిసింది.

ఎంబీఏ చేశాడు.. చోరీల్లో సెంచరీ దాటాడు

- ఘరానా దొంగ అరెస్ట్
- రూ.10 లక్షల విలువైన సొత్తు స్వాధీనం

స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలతో తిరుమలగిరి ఏసీపీ రమేశ్, కార్ఖానా ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ ✦ నిందితుడు మహ్మద్ అవేజ్ అహ్మద్

ఈనాడు, హైదరాబాద్, న్యూస్‌టుడే, కార్ఖానా: ప్రముఖ కళాశాలలో పీజీ పూర్తి చేశాడు. విలాసవంతమైన జీవితం కోసం దొంగగా మారాడు. బండి నంబరు ప్లేట్లు, ఒంటిపై చొక్కాలు మార్చి పోలీసులను ఏమార్చుతాడు. రాజధానిలోని మూడు పోలీసు కమిషనరేట్ల పరిధిలో 100కు పైగా చోరీలకు పాల్పడిన మహ్మద్ అవేజ్ అహ్మద్ అలియాస్ అహ్మద్(42)ను అరెస్టు చేసి, రూ.10 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు ఉత్తరమండలం డీసీపీ ఎస్.రష్మి పెరుమాళ్ శుక్రవారం తెలిపారు. మలక్‌పేట పరిధి సైదాబాద్ ఇంద్రప్రస్థ కాలనీకి చెందిన మహ్మద్ అవేజ్ అహ్మద్ ఎంబీఏ పూర్తిచేశాడు. తండ్రి వైద్యశాఖలో ఉన్నతాధికారిగా పదవీ విరమణ పొందారు. అహ్మద్ కళాశాల వయసులోనే జల్సాలకు అలవాటు పడి.. వాటి కోసం చోరీల బాటపట్టాడు. మొదటి భార్యకు సంతానం కలగకపోవటంతో రెండో వివాహం చేసుకున్నాడు. ముగ్గురు పిల్లలు కూడా ఉన్నారు. 2016లో ఇతడిపై పీడీ యాక్ట్ ప్రయోగించారు. ఎన్నిసార్లు జైలుకెళ్లినా.. పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చినా మారలేదు. సీసీ టీవీ కెమెరాలు, వేలిముద్రలు పడకుండా జాగ్రత్తలు తీసుకుంటూ ఇప్పటివరకు 114 దొంగతనాలకు పాల్పడ్డాడు. వివిధ పోలీస్‌స్టేషన్లలో 107 కేసులు నమోదయ్యాయి. చోరీ చేసే ముందు బైక్‌పై రెక్కీ చేసి.. మధ్యాహ్నం మాత్రమే తాళం వేసిన ఇళ్లల్లో చోరీలకు పాల్పడతాడు. కొట్టేసిన వస్తువులను రిసీవర్ల చేతికిచ్చి హోటళ్లు, రైల్వేస్టేషన్లు, బస్టాండ్‌లు, బంధువుల ఇళ్లలోకి మకాం మార్చుతాడు. ఓ కేసులో అరెస్టై జైలుకెళ్లిన ఇతడు సెప్టెంబరు 5న విడుదలై బయటకు వచ్చాక మిత్రుడు సలామ్ బిన్‌తో కలిసి కొండాపూర్, టోలిచౌకి, లంగర్‌హౌస్, కార్ఖానా ప్రాంతాల్లో వరస చోరీలకు పాల్పడ్డాడు. ఈ నెల 7న కార్ఖానాలోని ఓ ఇంట్లో విలువైన వస్తువులు చోరీ చేశాడు. కేసు దర్యాప్తు చేపట్టిన ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ బృందం సీసీ కెమెరా ఫుటేజ్‌తో నిందితుడిని గుర్తించారు. ద్విచక్రవాహనం అద్దెకు తీసుకొని.. నంబరు ప్లేటు మార్చినట్లు పోలీసులు నిర్ధారించారు. ఎట్టకేలకు అహ్మద్‌ను అరెస్టు చేశారు. మరో నిందితుడి కోసం గాలిస్తున్నారు.

డీఏవో పోస్టుల భర్తీకి 1:2 నిష్పత్తిలో మెరిట్ జాబితా..

- నవంబరు 8 నుంచి ధ్రువపత్రాల పరిశీలన

ఈనాడు, హైదరాబాద్: డైరెక్టరేట్ ఆఫ్ వర్క్స్ అకౌంట్స్ విభాగంలో డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ (డీఏవో) గ్రేడ్-2 పోస్టులకు 1:2 నిష్పత్తిలో మెరిట్ జాబితాను టీజీపీఎస్సీ ప్రకటించింది. ఈ జాబితాలో చోటు సంపాదించిన అభ్యర్థులకు నవంబరు 8 నుంచి 12 వరకు నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు వర్సిటీలో ధ్రువీకరణ పత్రాల పరిశీలన ఉంటుందని టీజీపీఎస్సీ కార్యదర్శి డాక్టర్ ఇ.నవీన్ నికోలస్ తెలిపారు. దివ్యాంగులకు రిజర్వు చేసిన పోస్టులకు 1:5 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేశామన్నారు. మెరిట్ జాబితాతో పాటు వివరాలకు టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

జీవితంలో ఇవి లేకపోతేనే మంచిది

మనం ఏవైనా పొందినప్పుడే జీవితం సుఖప్రదంగా ఉంటుందనుకోవద్దు. కొన్ని మన జీవితంలో లేకపోతేనే సుఖంగా జీవించగలం. అవేంటంటే.. ఆరోగ్య సమస్యలు, అప్పుల భారం, వివాదాలు, అంతులేని కోరికలు. ఆడంబరాలు, అత్యాశలకు దూరంగా సాధారణ జీవితాన్ని గడిపితే అవి మన దరికి చేరవు.

– మార్క్ మాన్సన్, రచయిత

ఆ పిల్లలను చదివిస్తాం!

● ముందుకొచ్చిన స్ఫూర్తి ఫౌండేషన్ ● 'ఈనాడు' కథనానికి స్పందన

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా మోడల్ స్కూళ్లలో పనిచేస్తూ వివిధ కారణాలతో మృతి చెందిన ఉపాధ్యాయుల పిల్లల్లో 18 మందిని ఆదుకునేందుకు హైదరాబాద్‌కు చెందిన స్ఫూర్తి ఫౌండేషన్ ముందుకొచ్చింది. కారుణ్య నియామకాలు లేకపోవడం.. ఇతర ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా మెడికల్ రీయింబర్స్‌మెంట్ వర్తించకపోవడం వల్ల.. ఉద్యోగంచేస్తూ మృతిచెందిన, అనారోగ్యంతో ఆసుపత్రిపాలైన మోడల్ పాఠశాలల ఉపాధ్యాయుల కుటుంబాలను ఆదుకునేందుకు రాష్ట్రవ్యాప్తంగా సహచర టీచర్లు చందాలు వేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ విషయాన్ని వెలుగులోకి తెస్తూ సెప్టెంబరు 21న 'రోగమొచ్చినా... ప్రాణంపోయినా చందాలే గతి' శీర్షికన 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన స్ఫూర్తి ఫౌండేషన్ మొత్తం 10 మంది ఉపాధ్యాయ కుటుంబాలకు చెందిన 18 మంది పిల్లలను పదో తరగతి వరకు చదివించేందుకు ముందుకొచ్చింది. ఈ మేరకు మోడల్ స్కూళ్ల ఉపాధ్యాయ సంఘం నేత భూతం యాకమల్లు సహకారంతో ఆయా కుటుంబ సభ్యులతో మాట్లాడి హామీ ఇచ్చినట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు శ్రీవ్యాళ్ ఉయ్యూరి చెప్పారు. ఆయా పిల్లలు ప్రస్తుతం ఎక్కడ చదువుతున్నారో ఆ ఫీజు చెల్లిస్తామని ఆయన తెలిపారు.

అజేయుడైన పారిశ్రామికవేత్తకు అచ్చిరాని సినిమా!

"ఆయనకేం అదృష్ట జాతకుడు. పట్టిందల్లా బంగారమే" అంటుంటారు కొందరి గురించి. నిజజీవితంలో ఎంతటి విజేతకైనా దిష్టి తీసినట్టుగా ఒకటీ అరా వైఫల్యాలు ఉంటాయి. వందకు పైగా దేశాల్లో దాదాపు 30 కంపెనీలను ఒంటిచేత్తో నడిపిన రతన్ టాటా జీవితంలోనూ ఇలాంటిదే ఓ విఫలమైన ప్రాజెక్టు ఉంది. 2004లో విక్రమ్‌భట్ దర్శకత్వంలో వచ్చిన 'ఏత్‌బార్' (భరోసా) చిత్రానికి ఆయన సహ నిర్మాతగా వ్యవహరించారు. టాటా గ్రూపు నిర్మించిన తొలి, ఆఖరి చలనచిత్రమిది. అమితాబ్ బచ్చన్, జాన్ అబ్రహాం, బిపాశా బసు వంటి అగ్ర తారాగణం నటించినా ఈ చిత్రానికి పెట్టుబడులు కూడా వెనక్కు రాలేదు. నేరపూరితమైన విపరీత ప్రవర్తన గల ఓ యువకుడి ప్రేమ ఉచ్చులో నుంచి తన కుమార్తెను కాపాడుకునేందుకు పోరాడే డాక్టర్ రణవీర్ పాత్రలో అమితాబ్ నటించారు. 1996లో వచ్చిన హాలీవుడ్ చిత్రం 'ఫియర్' ప్రేరణతో రూపొందించిన ఈ సైకలాజికల్ థ్రిల్లర్ ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయింది.



బాలీవుడ్ కథనాయికతో ప్రేమాయణం మళ్లీ తెరపైకి..

బాలీవుడ్‌తో రతన్ టాటాకు ఉన్న మరో అనుబంధం ఒకనాటి సంచలన కథానాయిక సిమీ గరేవాల్. తన స్నేహితుడైన రతన్‌కు మల్లే విదేశాల్లో చదువుకొని వచ్చిన ఈమె హిందీ చిత్రసీమలోకి రావడంతోనే అర్ధనగ్న ఆహార్యాలతో కలకలం రేపారు. 'మేరా నామ్ జోకర్', 'కర్జ్', 'దో బదన్' వంటి చిత్రాల్లో సిమీ పోషించిన పాత్రలు ప్రేక్షకులను అలరించాయి. రతన్ టాటా మరణంతో గతంలో వీరిద్దరి మధ్య నడిచిన ప్రేమాయణం మళ్లీ తెరపైకి వచ్చింది. ఎవరీ సిమీ గరేవాల్ అని ఆయన అభిమానులు నెట్లో వెదకడం మొదలుపెట్టారు. బాలీవుడ్ ఎవర్‌గ్రీన్ సూపర్‌హిట్ గీతాలైన 'వాదా కర్ లే సాజనా' (హాథ్ కీ సఫాయీ), 'చల్తే చల్తే మేరే యే గీత్ యాద్ రఖ్‌నా' (చల్తే చల్తే) పాటల్లో 1970ల నాటి ఆమె చలాకీదనాన్ని చూడవచ్చు.

హిందీ చిత్రాల్లో కెచప్ ఎక్కువ

బాలీవుడ్ చిత్రాల్లో హింసను విపరీతంగా చూపడం తనకు నచ్చదని రతన్ టాటా చెప్పేవారు. "ముంబయిలోని రెస్టారెంట్ల కంటే ఎక్కువ కెచప్ (రక్తంలా కనిపించే టమాటా గుజ్జు)ను మనవాళ్లు వాడుతున్నారు" అని ఓ ఇంటర్వ్యూలో ఆయన చమత్కరించారు. రతన్ టాటా హాలీవుడ్ యాక్షన్ కామెడీ చిత్రాలను ఇష్టంగా చూసేవారు. ఈ కోవలో 'ది అదర్ గైస్', 'ది లోన్ రేంజర్' చిత్రాలంటే ఆయనకు ఇష్టమని రతన్‌కు సన్నిహితుడైన శంతను నాయుడు గతంలో ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. అలాగే ఇజ్రాయెల్ రక్షణ దళాల కోవర్టు ఆపరేషన్లపై నెట్‌ఫ్లిక్స్‌లో వచ్చిన టెలీ సిరీస్ 'ఫౌదా' ఆయనకు ఫేవరెట్ అని తెలిపారు.

- నేషనల్ డెస్క్

రూ.525 కోట్లు రీయింబర్స్ చేయాలి

ప్రభుత్వానికి ఆర్టీసీ విజ్ఞప్తి

ఈనాడు, హైదరాబాద్: విద్యార్థులు సహా తొమ్మిది రకాల ప్రజలకు బస్‌పాసుల్లో ఇస్తున్న రాయితీ మొత్తాన్ని రీయింబర్స్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్టీసీ విజ్ఞప్తిచేసింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆయా వర్గాల ప్రజలకు రూ.525.81 కోట్ల మేర రాయితీని బస్‌పాస్‌ల రూపంలో ఇస్తున్నట్లు వివరించింది. ఈ మొత్తానికి సంబంధించి ప్రతిపాదనలను ఆర్టీసీ ఇప్పటికే ప్రభుత్వానికి అందించింది. అయితే రాష్ట్ర బడ్జెట్‌లో బస్‌పాస్‌ల రీయింబర్స్‌మెంట్ కింద కేటాయింపులు లేవని ఆర్టీసీ రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లింది. విద్యార్థులు సహా వివిధ వర్గాల వారికి రాష్ట్ర ప్రభుత్వ సూచన మేరకు బస్‌పాస్ రాయితీ ఇస్తోంది. సీఎంతో ఇటీవల జరిగిన సమావేశంలో ఆర్టీసీ ఉన్నతాధికారులు వివరించారు. బస్‌పాస్‌లపై వివిధ వర్గాల వారికి రాయితీ విధానం చాలా సంవత్సరాలుగా అమల్లో ఉంది. బస్‌పాస్ రాయితీ రీయింబర్స్ చేయకపోతే సంస్థపై తీవ్ర భారం పడుతుందని సంస్థ ఆందోళన వ్యక్తం చేసింది.

'ఫీజు రీయింబర్స్‌మెంట్'ను దేశవ్యాప్తంగా అమలు చేయాలి

ప్రధాని మోదీకి ఆర్.కృష్ణయ్య లేఖ

అంబర్‌పేట, న్యూస్‌టుడే: తెలుగు రాష్ట్రాల్లోని ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు అమలుచేస్తున్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లతోపాటు.. గురుకులాలు, సంక్షేమ హాస్టళ్ల ఏర్పాటు తదితర పథకాలను దేశవ్యాప్తంగా అమలు చేయాలని ప్రధాని నరేంద్ర మోదీకి బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మోదీకి ఆయన శుక్రవారం లేఖ రాశారు. తెలుగు రాష్ట్రాల్లో ఉన్న 6 వేల సంక్షేమ హాస్టళ్లలోను, 1,500 ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకుల పాఠశాలల్లోను లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారని , ఇంజినీరింగ్, డిగ్రీ, పీజీ చదివే 30 లక్షల మంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ ద్వారా లబ్ధి పొందుతున్నారని వివరించారు. ఈ తరహా పథకాలను దేశవ్యాప్తంగానూ అమలుచేస్తే 'సబ్ కా సాథ్ - సబ్‌కా వికాస్' లక్ష్యం నెరవేరుతుందని లేఖలో పేర్కొన్నారు.

(c) eenadu

అన్నం.. అలా పారేస్తున్నాం!

నియంత్రణకు నడుం కడుతున్నారు..

- ఏటా 68 మిలియన్ టన్నులు వృథా
- ఒక్కొక్కరి వ్యక్తిగత వాటా 55 కేజీలపైనే
- తీవ్ర దుర్భిక్ష ముప్పును కొనితెచ్చుకోవడమేనంటున్న నిపుణులు
- మరోవైపు ఆకలి కేకలతో అలమటిస్తున్న అన్నార్తులు
- ప్రపంచ ఆకలి సూచీలో 111వ స్థానంలో మన దేశం



సరదాగా కుటుంబంతో బయటకు వెళ్లి రెస్టారెంట్‌లో భోజనం చేసే ప్రణాళికలో ఉన్నారా? స్నేహితుల ఇంటికి వెళ్లడమో లేదా వారినే మీ ఇంటికి పిలిచి విందు ఇవ్వాలని ప్లాన్ చేస్తున్నారా?

అయితే ఓకే.. కాకపోతే మీరు తినబోయే ఆహారంపై కాస్త దృష్టిపెట్టండి.. అంటే ఏం తినబోతున్నారనేది కాదు. పొరపాటున వృథా చేస్తారేమోనని! ఎందుకంటే ఏ లక్ష్యసాధనకైనా ఒక్క అడుగుతోనే ప్రయాణం మొదలవుతుంది కాబట్టి.. మా విందుకు, ఆ లక్ష్యానికి సంబంధం ఏంటనుకుంటున్నారా? అదే ఆహార వృథా నియంత్రణ లక్ష్యం. ఇప్పుడు దీని గురించి పట్టించుకోకపోతే భవిష్యత్తులో తీవ్ర దుర్భిక్షానికి మనమే కారకులవుతామనే వాస్తవాన్ని గుర్తెరగాలి.

ఎంత వృథా చేస్తున్నామో తెలుసా?

దేశంలో ఏటా వృథా అవుతున్న ఆహారం	6.87 కోట్ల టన్నులు
అధిక ఆదాయ వర్గాల్లో తలసరి వృథా	90 కేజీలు
మధ్య ఆదాయ వర్గాల్లో తలసరి వృథా	68 కేజీలు
దిగువ ఆదాయ వర్గాల్లో తలసరి వృథా	63 కేజీలు
ప్రతి వ్యక్తీ ఏటా పారేస్తున్నది (సగటున)	55 కేజీలు

ఆధారం: ఐక్యరాజ్య సమితి పర్యావరణ కార్యక్రమం (యూఎన్ఈపీ) నివేదిక

★ గ్రామీణ ప్రాంతాల వారితో పోలిస్తే పట్టణ ప్రాంతాల ప్రజల్లో ఇది అధికం.

వృథా ఎక్కడ ఎలాగంటే..

- 61% ఇళ్ల వద్ద
- 26% హోటళ్లు, రెస్టారెంట్లలో
- 13% వివాహాలు, ఇతర సామాజిక కార్యక్రమాల్లో

● ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా లెక్కల ప్రకారం మన దేశంలో ఆహార ఉత్పత్తుల్లో మూడో వంతు.. తినేందుకు ముందే పాడవుతున్నాయి.

ఎవరికి వారు.. అలా అనుకుంటే ఎలా?

ఇంట్లో అయినా, రెస్టారెంట్‌కు వెళ్లినప్పుడైనా ఆహారం వృథా అయినా పర్లేదు, మనం దీనికి డబ్బు చెల్లించేశాం కదా అని ఎక్కువ మంది భావిస్తుంటారు. హోటల్ నిర్వాహకులు/ ఆ పదార్థాలను అమ్మినవారు కూడా వాటికి సరిపడా డబ్బు వసూలు చేసేసుకున్నాం కాబట్టి తమకూ నష్టం లేదనుకుంటారు. కానీ, ఇలా ఎక్కడికక్కడ మనం చేసే ఆహారవృథా ప్రభావం దేశ ఆర్థికవ్యవస్థపై పడుతోంది.

పర్యావరణం, ఆర్థిక వ్యవస్థపైనా ప్రభావం

ఎక్కువయిందో, మిగిలిపోయిందో కొంత పడేస్తే ఏమవుతుందని మనం అనుకోవచ్చు. కానీ ఇలా ఒక్కొక్కరూ కొంత చొప్పున కొన్ని కోట్లమంది వద్ద ఇలా వృథా అయ్యేది ఎంత ఉంటుందో ఆలోచించాలి కదా! ఇలా పారేసిన ఆహార పదార్థాలను చెత్తకుప్పలు, అక్కడ నుంచి డంపింగ్ యార్డులకు తరలిస్తున్నారు. అవి కుళ్లిపోయే క్రమంలో ప్రమాదకరమైన ఉద్గారాలు వాతావరణంలో కలుస్తున్నాయి. కర్బన ఉద్గారాల్లో (గ్రీన్‌హౌస్ వాయువుల్లో) 10 శాతం ఇలా కుళ్లిన ఆహారం నుంచే ఉంటోందని అంచనా.

ఇటు వృథా..



- యూఎన్ఈపీ నివేదిక ప్రకారం దేశంలో ఏటా వృథా అవుతున్న ఆహారం 6.87 కోట్ల టన్నులు
- 'కేంద్ర వ్యవసాయశాఖ' నివేదిక ప్రకారం దేశంలో ఏటా పారేస్తున్న ఆహారం విలువ సుమారు రూ.50 వేల కోట్లు

అటు వ్యథ

- 'ఫీడింగ్ ఇండియా' నివేదిక ప్రకారం జనాభాలో తగిన పోషణ లభించనివారు సుమారు 14.3%
- 125 దేశాలతో కూడిన ప్రపంచ ఆకలి సూచి-2023లో మన స్థానం 111
- దేశంలో ఐదేళ్లలోపు చిన్నారుల్లో మరణాలకు ప్రధాన కారణం పోషకాహార లోపమేనని ఐసీఎంఆర్ హెచ్చరించింది.

● ఆహార వృథాను 2030 నాటికి కనీసం సగానికి తగ్గించాలని ఐక్యరాజ్యసమితి సుస్థిరాభివృద్ధిలో కీలక లక్ష్యంగా నిర్దేశించింది. ఈ దిశగా కొన్ని దేశాలు ప్రయత్నిస్తున్నాయి.

● భారత్‌లో అతిథి నియంత్రణ చట్టాలను అస్సాం, దిల్లీ, జమ్మూకశ్మీర్ వంటి రాష్ట్రాలు అమలు చేస్తున్నాయి. మరోవైపు పంటల కోత, రవాణా, నిల్వ, సరఫరా స్థాయిల్లో ఆహార వృథా నియంత్రణ కోసం కేంద్ర ప్రభుత్వం.. ప్రధానమంత్రి కిసాన్ సంపద యోజన, నేషనల్ మిషన్ ఆన్ ఫుడ్ ప్రాసెసింగ్ వంటి కార్యక్రమాలను చేపడుతోంది.

● యూకే దశాబ్ద కాలానికి పైగా డబ్ల్యూఆర్ఏపీ (వేస్ట్ అండర్ రిసోర్సెస్ యాక్షన్ ప్రోగ్రామ్) ద్వారా ఆహార పదార్థాల వృథాను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటోంది. 'స్వచ్ఛ పళ్లెం' అనే ప్రచార కార్యక్రమాన్ని చైనా పాటిస్తోంది.

● ఆహార వృథాను అరికట్టేందుకు పౌరులను సమాయత్తం చేయడంలో భాగంగా వారికి ఆహార, వ్యవసాయ సంస్థ (ఎఫ్ఏఓ), ఐక్యరాజ్యసమితి ప్రోత్సాహకాలను అందిస్తున్నాయి.

- ఈనాడు, అమరావతి

మనమూ ఓ చేయి వేయాలి..

- దేశాలు, ప్రభుత్వాల స్థాయిలో కార్యక్రమాలతో లక్ష్యసాధన జరగదు. ప్రజలు కూడా స్వచ్ఛందంగా పూనుకోవాలి.
- వివాహాలు, ఇతర వేడుకలు, భారీ సమావేశాల్లో మిగిలిన ఆహారాన్ని అవసరార్థులకు పంచే స్వచ్ఛంద సంస్థలకు అందజేయవచ్చు.
- తినగలమా లేదా, ఏది ఎంత తినగలమనే ప్రాధాన్యక్రమాన్ని మనం నిర్దేశించుకోవాలి.
- ఆహార వృథా నియమాలను మనం పాటిస్తూ.. భావితరాలకూ నేర్పించాల్సిన ఆవశ్యకతను గుర్తెరగాలి.
- 'కోనసీమ నిధి' సంస్థ ప్రతినిధులు ఆ ప్రాంతంలో మిగులు ఆహారాన్ని సేకరించి అన్నార్తులకు పంచిపెడుతున్నారు. ఆటు ఆహారవృథా నియంత్రణకు.. ఇటు అవసరార్థుల ఆకలిబాధను తీర్చడానికీ కృషి చేస్తున్నారు. ఇలాంటి ప్రయత్నాన్ని వ్యక్తిగతంగానూ అందరం అలవరచుకోవాలి.

భద్రకాళికి భక్తజన హారతులు

దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా శుక్రవారం ఓరుగల్లులోని శ్రీభద్రకాళి అమ్మవారు మహిషాసుర మర్దిని అవతారంలో దర్శనమిచ్చారు. తెలంగాణతోపాటు పొరుగు రాష్ట్రాల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని విశేష పూజలు నిర్వహించారు.

– న్యూస్‌టుడే, రంగంపేట(వరంగల్)

మహిషాసురమర్దినిగా దుర్గమ్మ

ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారు మహిషాసురమర్దినీదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున 4 గంటల నుంచి రాత్రి 11 వరకు భక్తులను దర్శనాలకు అనుమతించారు. దసరా శరన్నవరాత్రోత్సవాల చివరి రోజు జగన్మాత రాజరాజేశ్వరిదేవి రూపంలో దర్శనమివ్వనున్నారు.

– ఈనాడు, అమరావతి

రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ప్రక్షాళన

- నష్ట నివారణకు కఠిన చర్యలు

ఈనాడు, హైదరాబాద్: విత్తనాభివృద్ధి సంస్థను ప్రక్షాళన చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. వరి విత్తనాల ఉత్పత్తిని తగ్గించి ఇతర ఉత్పత్తులను పెంచేందుకు... సంస్థను లాభాల్లోకి తెచ్చేందుకు సమగ్ర కార్యాచరణపై దృష్టి సారించింది. ప్రస్తుతం రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ నష్టాల్లో ఉంది. రూ.400 కోట్ల మేరకు బ్యాంకు రుణం తీసుకొన్న సంస్థ రూ.390 కోట్లు విత్తనాభివృద్ధికి వెచ్చించింది. మిగిలిన రూ.10 కోట్ల నుంచి సంస్థ ఉద్యోగులకు జీతభత్యాలు ఇస్తోంది. సంస్థ పరిధిలో మూడువేల మంది రైతులు 2,200 ఎకరాల్లో విత్తనాలు సాగు చేస్తున్నారు. ఇందులో రెండువేల ఎకరాల్లో వరి, రెండొందల ఎకరాల్లో ఇతర విత్తనాలు వేస్తున్నారు. అయినా నిర్దిష్ట ప్రణాళిక లేకపోవడంతో సంస్థకు నష్టాలు వస్తున్నాయి. సీజన్ ముగిశాక మార్కెట్లోకి తెస్తుండడంతో విత్తనాలు మిగిలిపోతున్నాయి. మరోవైపు ప్రైవేటు సంస్థల కంటే ఎక్కువ ధర ఉండడంతో రైతులు వీటి కొనుగోలుకు వెనకాడుతున్నారు. దీంతో ఒక్కో ఏడాది విత్తనాలను మరఆడించి బియ్యంగా విక్రయించాల్సి వస్తోంది. సంస్థ జమా ఖర్చులూ సక్రమంగా నమోదు చేయడం లేదు. ఇటీవల వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమీక్ష సమావేశం నిర్వహించినప్పుడు ఆదాయవ్యయాల వివరాలను అధికారులు వెల్లడించలేకపోయారు.

కొత్త వంగడాలపై దృష్టి...: మంత్రి ఆదేశాల మేరకు వ్యవసాయ కార్యదర్శి రఘునందన్‌రావు విత్తనాభివృద్ధి సంస్థకు సంబంధించి పలు ప్రతిపాదనలు సిద్ధంచేశారు. వరిని తగ్గించి ప్రత్యామ్నాయ పంటలకు సంబంధించిన విత్తనాలను ఉత్పత్తి చేయాలని, రైతులను వాటాదారులుగా చేర్చుకోవాలని నిర్దేశించారు. సీజన్‌కు ముందే ఉత్పత్తుల విక్రయం పూర్తికావాలని, 25 కిలోలకు బదులు 15 కిలోల సంచులను మార్కెట్లోకి తేవాలని, సంస్థ ఆదాయ, వ్యయాలపై నిపుణులతో ఆడిటింగ్ జరపాలని సంస్థ సిబ్బందికి సూచించారు. త్వరలో మార్గదర్శకాలు సిద్ధం చేయనున్నారు.

ఆ సంస్థతో ఎవరికి లాభం?: మరోవైపు విత్తన ధ్రువీకరణ ప్రాధికార సంస్థ పనితీరుపైనా మంత్రి తుమ్మల అసంతృప్తితో ఉన్నారు. దీనివల్ల ప్రైవేటు సంస్థలకే లాభం చేకూరుతోందని, రైతులకు ఎలాంటి ప్రయోజనం చేకూరడం లేదనే అభిప్రాయంతో ఉన్నారు. దాని నిర్వహణ కూడా భారంగా మారిందని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో విత్తన ధ్రువీకరణ సంస్థపై నివేదిక ఇవ్వాలని వ్యవసాయ కార్యదర్శిని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు.

అవయవదాతలను గౌరవిద్దాం

- అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు ప్రతిపాదనల్లోనే..
- తమిళనాడు విధానాలు స్ఫూర్తిమంతం

ఈనాడు, హైదరాబాద్: అవయవదాతలకు అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించి.. తగిన గౌరవం ఇవ్వాలన్న ప్రతిపాదన రాష్ట్రంలో ముందుకు కదలడం లేదు. అవయవదానంపై ప్రజల్లో మరింత అవగాహన పెంచేందుకు ఈ విధానం తీసుకురావాలని ఆలోచన చేసినప్పటికీ కార్యరూపం దాల్చలేదు. తమిళనాడులో బ్రెయిన్‌డెడ్ అయిన వ్యక్తుల అవయవదానానికి కుటుంబ సభ్యులు ముందుకొస్తే.. మృతి చెందిన వ్యక్తికి అక్కడి ప్రభుత్వం అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తోంది. దీంతో ఆయా కుటుంబ సభ్యులపై సమాజంలో గౌరవభావం పెరుగుతోంది. తాను చనిపోతూ మరికొంతమంది జీవితాల్లో వెలుగులు నింపే అవయవదాతల స్ఫూర్తి ఎంతో గొప్పది. దీన్ని దృష్టిలో పెట్టుకొని తమిళనాడు సర్కారు ఈ విధానం తీసుకొచ్చింది. బ్రెయిన్‌డెడ్ అయిన వ్యక్తుల కోసం ప్రత్యేక ఐసీయూ కూడా నిర్వహిస్తోంది. దాత కుటుంబసభ్యులను ఒప్పించి.. వారిని అవయవదానానికి సిద్ధం చేసేవరకూ ఈ ఐసీయూలోనే ఉంచనున్నారు. తెలంగాణలోనూ అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించాలని, బ్రెయిన్‌డెడ్ అయినవారికి ప్రత్యేకంగా ఐసీయూలు ఏర్పాటు చేయాలని గత ప్రభుత్వ హయాంలోనే జీవన్‌దాన్ ట్రస్టు ప్రతిపాదించింది. కానీ, ఇప్పటివరకు అమలుకు నోచుకోలేదు.

అవయవదానం చేసిన వ్యక్తి కుటుంబ సభ్యులకు ధ్రువీకరణపత్రం అందజేస్తున్న జీవన్‌దాన్ ట్రస్ట్ ప్రతినిధులు

వేల మంది అవయవ గ్రహీతల ఎదురుచూపులు..

అవయవదానంలో దేశంలోనే తెలంగాణ మెరుగైన స్థానంలో ఉంది. ప్రభుత్వం తరఫున జీవన్‌దాన్ ట్రస్టు ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు 1,488 మంది బ్రెయిన్‌డెడ్ అయినవారి అవయవాలను సేకరించారు. ప్రస్తుతం జీవన్‌దాన్ ట్రస్టు వద్ద 15,195 మంది వివిధ అవయవాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఇందులో మూత్రపిండాలు అవసరమైనవారు 7,415 మంది, కాలేయం కావాల్సినవారు 6,906 మంది ఉన్నారు. ఒక్క ఉస్మానియా ఆసుపత్రిలోనే కాలేయ మార్పిడి కోసం 300 మంది ఎదురుచూస్తున్నారు. ఇందులో 50 మంది వరకు పిల్లలున్నారు. వివిధ కారణాలతో రాష్ట్రంలో నిత్యం ఒకరిద్దరు బ్రెయిన్‌డెడ్ అవుతున్నా.. అవగాహన లేక, అపోహల వల్ల చాలామంది అవయవదానానికి ముందుకు రావడం లేదు. బ్రెయిన్‌డెడ్ అయిన వ్యక్తుల కోసం ప్రత్యేక ఐసీయూ, అధికారిక అంత్యక్రియలు, కుటుంబసభ్యులకు ప్రభుత్వపరంగా గౌరవం కల్పించడమే కాకుండా.. పాఠశాలలు, గ్రామ స్థాయుల్లో ప్రజల్లో చైతన్యం చేయాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

చైతన్యం పెరిగింది..

తమిళనాడులో అక్కడి విధానాలపై మంచి స్పందన ఉంటోంది. ఇక్కడ జీవన్‌దాన్ ట్రస్టు తరఫున అవయవదాత కుటుంబ సభ్యులను 11వ రోజున ప్రత్యేకంగా కలిసి ధ్రువీకరణపత్రం అందిస్తున్నాం. అధికారిక అంత్యక్రియలు లాంటివి చేయడం లేదు. గతంతో పోల్చితే తెలంగాణలో అవయవదానంపై చైతన్యం పెరిగింది. మరింత మంది ముందుకురావడం వల్ల ఎంతోమంది జీవితాల్లో కొత్త వెలుగులు నింపవచ్చు. ఎలాంటి అపోహలు లేకుండా ముందుకు రావాలి.

– డాక్టర్ స్వర్ణలత, కోఆర్డినేటర్, జీవన్‌దాన్ ట్రస్టు

తెలంగాణలో అవయవ దానాలిలా..

2021	616
2022	716
2023	728
2024(ఇప్పటివరకు)	508

డీజీపీ జితేందర్‌తో సిరాజ్. చిత్రంలో మహేశ్ భగవత్, రమేశ్

డీఎస్పీగా నియామకపత్రం అందుకున్న మహ్మద్ సిరాజ్

ఈనాడు, హైదరాబాద్: భారత జట్టు క్రికెటర్, హైదరాబాదీ మహ్మద్ సిరాజ్ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డీఎస్పీ)గా నియామకపత్రం స్వీకరించారు. ఈ మేరకు శుక్రవారం డీజీపీ డాక్టర్ జితేందర్‌ను కలిసి రిపోర్ట్ చేశారు. సాధారణ కుటుంబానికి చెందిన సిరాజ్ కష్టపడి భారత క్రికెట్ జట్టులో స్థానం సంపాదించి నగరానికి ఖ్యాతి తెచ్చిపెట్టారు. క్రీడాకారులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సిరాజ్‌కు గ్రూప్-1 అధికారిగా ఉద్యోగం కల్పించారు. ఈ మేరకు డీజీపీ కార్యాలయంలో సిరాజ్ నియామకపత్రం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పోలీసు ఉన్నతాధికారులు మహేశ్ భగవత్, రమేశ్, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

రూ.వెయ్యి కోట్ల రుణానికి బాండ్ల విక్రయం

ఈనాడు, హైదరాబాద్: కొత్తగా రూ.వెయ్యి కోట్ల రుణ సేకరణకు రాష్ట్ర ప్రభుత్వం బాండ్లను విక్రయానికి పెట్టిందని రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. మొత్తం 8 రాష్ట్రాల తరఫున రూ.13 వేల కోట్ల రుణాల సేకరణ బాండ్లను ఈ నెల 15న వేలం వేస్తామని వివరించింది.

చిరుత దాడిలో మరో చిన్నారి మృతి

లఖ్‌నవూ: ఉత్తర్‌ప్రదేశ్‌లో చిరుత పులుల వరుస దాడులతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. చిరుత దాడిలో మరో చిన్నారి ప్రాణాలు కోల్పోయిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. బిజ్నోర్ జిల్లాలోని మల్కాపూర్ గ్రామంలో తాన్య(8) పశుగ్రాసం తీసుకొచ్చేందుకు తల్లితో కలిసి దగ్గరలోని అటవీ ప్రాంతానికి వెళ్లింది. ఈ క్రమంలో చిరుత ఒక్కసారిగా బాలికపై దాడి చేసి.. ఈడ్చుకెళ్లింది. తల్లి, ఇతర గ్రామస్థులు కర్రలతో తరమడంతో చిరుత బాలికను వదిలి పారిపోయింది. చిన్నారిని వెంటనే ఆసుపత్రికి తరలించినా లాభం లేకుండా పోయింది. తీవ్ర గాయాలు కావడంతో బాలిక మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు.

విజేతలకు, పరాజితులకు తేడా అదే..

విజేతల లక్షణమేంటంటే తాము ఏ పని తలపెట్టినా కష్టాలు, నష్టాలు, అడ్డంకులు, బాధలు, వైఫల్యాలు, తిరస్కరణలు, అవమానాలు ఇలా ఎన్ని ఇబ్బందులు ఎదురైనా వెరవక లక్ష్యాన్ని చేరుకునేవరకూ విశ్రమించరు. ఈ క్లిష్ట ప్రయాణంలో ఎక్కడో ఒకచోట ఇబ్బందులను సాకులుగా చూపుతూ ఆగిపోయేవారు పరాజితులుగా మిగిలిపోతారు.

– మోతీలాల్ ఓస్వాల్, వ్యాపారవేత్త

అనుబంధ కళాశాలల్లోనూ పరిశోధన కేంద్రాలు

- ఏటా రెండుసార్లు పీహెచ్‌డీ ప్రవేశాలు
- జేఎన్‌టీయూ నిర్ణయం.. మార్గదర్శకాలు సిద్ధం

ఈనాడు, హైదరాబాద్: విశ్వవిద్యాలయాలకు మాత్రమే పరిమితమైన పీహెచ్‌డీ పరిశోధనలను జేఎన్‌టీయూ అనుబంధ ఇంజినీరింగ్ కళాశాలల్లోనూ నిర్వహించేందుకు అనుమతించాలని అధికారులు నిర్ణయం తీసుకున్నారు. యూజీసీ నిబంధనలకు అనుగుణంగా ఈ పీహెచ్‌డీ ప్రవేశాలు ఉండేలా మార్గదర్శకాలను సిద్ధం చేశారు. నాణ్యమైన పరిశోధనల సంఖ్య పెంచేందుకు ఏటా రెండుసార్లు ప్రవేశాల నోటిఫికేషన్ జారీ చేయాలనీ నిర్ణయించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన పరిశోధనల సంఖ్య పెరగడం, మూడేళ్లలో పీహెచ్‌డీ పూర్తి చేసుకున్నవారు అనుబంధ కళాశాలలు, ప్రభుత్వ వర్సిటీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా విధులు నిర్వహించేందుకు అర్హత సాధించడం అనే రెండు లక్ష్యాలతో ఈ నిర్ణయం తీసుకున్నామని అధికారులు తెలిపారు. పరిశోధక విద్యార్థులకు పర్యవేక్షకులు (సూపర్‌వైజర్లు)గా ఎవరు వ్యవహరించాలన్న అంశంపై జేఎన్‌టీయూ సలహా కమిటీ సూచనలు అందించనుంది. పరిశోధన కేంద్రాలు ఏర్పాటు చేసుకుంటామంటూ దరఖాస్తు చేసుకున్న అనుబంధ ఇంజినీరింగ్ కళాశాలల్లో వసతులను కమిటీ సభ్యులు పరిశీలించిన అనంతరం సీట్లను కేటాయించనున్నారు.

సలహా కమిటీ పర్యవేక్షణలో..

జేఎన్‌టీయూ అనుబంధ కళాశాలల్లో ఏర్పాటు చేసే పరిశోధన కేంద్రాలను విశ్వవిద్యాలయ సలహా కమిటీ పర్యవేక్షించనుంది. పరిశోధక విద్యార్థులకు అవసరమైన వాతావరణం, మౌలిక సదుపాయాలు ఉండేలా కమిటీ మార్గదర్శకాలు రూపొందించింది. దీని ప్రకారం.. కేంద్రాల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయి సదస్సులు, సమావేశాలు నిర్వహించే సామర్థ్యం ఉండాలి. కేంద్ర,

రాష్ట్ర ప్రభుత్వాల నుంచి గ్రాంట్లు లభించేలా పరిశోధన ప్రాజెక్టులు ఉండాలి. ప్రవేశాల కోసం అనుబంధ కళాశాలలు వేర్వేరుగా నోటిఫికేషన్ జారీ చేసుకోవచ్చు. అయితే దరఖాస్తున్నింటినీ జేఎన్‌టీయూకు పంపించి వర్సిటీ బోర్డ్ ఆఫ్ స్టడీస్ ఛైర్మన్ అనుమతి పొందాకే విద్యార్థులకు ప్రవేశం కల్పించాలి. ఒక పరిశోధక విద్యార్థికి ఒకే పర్యవేక్షకుడు(సూపర్‌వైజర్) ఉండాలి. పరిశోధన సక్రమంగా జరగకపోయినా, ఏవైనా వివాదాలు చోటుచేసుకున్నా పర్యవేక్షకుల గుర్తింపును విశ్వవిద్యాలయం వెనక్కి తీసుకుంటుందని మార్గదర్శకాల్లో స్పష్టం చేశారు.

సమాజానికి ఉపయుక్తమయ్యే పరిశోధనలు పెంచేందుకే..

సమాజానికి ఉపయుక్తమయ్యే పరిశోధనలు పెంచేందుకే ఏటా రెండుసార్లు పీహెచ్‌డీ ప్రవేశాలు నిర్వహించాలని భావిస్తున్నాం. కృత్రిమ మేధ, వ్యవసాయం, వైద్యం, బయోటెక్నాలజీ, ఇంజినీరింగ్ పరిశోధనలకు విస్తృత అవకాశాలున్నాయన్న అంచనాతో ఈ నిర్ణయం తీసుకున్నాం. ఇంజినీరింగ్ మూడో సంవత్సరం నుంచే విద్యార్థులు అంకుర సంస్థల ఏర్పాటుకు ఉత్సాహం ప్రదర్శిస్తున్నారు. బహుళజాతి, విదేశీ సంస్థలు అంకురాల్లో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నాయి. అంతర్జాతీయ స్థాయిలో పరిశోధనలుంటే మరిన్ని సంస్థలు ముందుకువచ్చే అవకాశాలున్నాయి.

–ప్రొ.కె.వెంకటేశ్వరరావు, రిజిస్ట్రార్, జేఎన్‌టీయూ

4,150.. 3,000.. 2,000...

- హెచ్ఎండీఏ పరిధిలోని చెరువులు, కుంటల లెక్కలివి
- మూడు విభాగాల వద్ద మూడు రకాల గణాంకాలు
- అసలు సంఖ్యను నిర్ధారించేందుకు హైడ్రా కసరత్తు
- సాయం చేస్తున్న సర్వే ఆఫ్ ఇండియా

ఈనాడు, హైదరాబాద్: రాజధాని పరిధిలో ఆక్రమణలపై హైడ్రా కొరడా ఝుళిపించడం ప్రారంభించాక చెరువులు, కుంటల కబ్జాల బాగోతం బయటపడుతోంది. తెలంగాణ రాకముందే 225 చెరువులు కనుమరుగైపోగా రాష్ట్రం వచ్చాక మరో 44 మాయమైపోయాయని ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క స్వయంగా వెల్లడించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అసలు హెచ్ఎండీఏ పరిధిలో మొత్తం ఎన్ని చెరువులు ఉండేవి... ఇప్పుడెన్ని మిగిలాయనే చర్చ తెరపైకి వచ్చింది. దీనిపై హైడ్రా దృష్టి సారించింది. ఆయా నీటి వనరులను నిర్వహించే, రక్షించే సంబంధిత విభాగాల నుంచి లెక్కలు సేకరిస్తుంటే... ఆశ్చర్యం గొలిపే అంశాలు బయటపడుతున్నట్లు తెలుస్తోంది. ఒక్కో ప్రభుత్వ విభాగం ఒక్కో సంఖ్య చెబుతుండటం గందరగోళానికి దారితీస్తోంది. ఇవీ వివరాలు...

హైదరాబాద్ పరిసరాల్లో భూముల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. మహానగరం సమీపంలో కొందామన్నా స్థలాలు అందుబాటులో లేవు. దాంతో కబ్జారాయుళ్ల కళ్లు చెరువులు, కుంటలపై పడ్డాయి. రాజకీయ పలుకుబడి ఉంటే చాలు అధికారులను ఏదో విధంగా లోబరచుకుంటున్నారు. చెరువులను పూడ్చి, ఆకాశహర్మ్యాలు నిర్మించేస్తున్నారు. అనుమతుల కోసం వారు సమర్పించుకునే ఆమ్యామ్యాలు తప్ప ఆ భూమంతా ఉచితంగా వచ్చినట్లే. ఒక చిన్న కుంటను కబ్జా చేసినా రూ.వందల కోట్లలో లాభం వస్తుంది. అందుకే కొన్ని రియల్ ఎస్టేట్ సంస్థలు సైతం ఇప్పుడు రాజకీయ నాయకులను పట్టుకొని చెరువుల, కుంటలపై దృష్టి సారించాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీన్ని ఇలానే వదిలేస్తే కొద్ది రోజుల్లో మిగతా చెరువులూ నామరూపాలు లేకుండా పోతాయని భావించిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఆక్రమణలు తొలగింపు, ఆస్తుల రక్షణకు హైడ్రాను ఏర్పాటు చేసింది. హైడ్రా రంగంలోకి దిగడంతో రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఇదే సమయంలో రాజధాని పరిధిలో ఎన్ని చెరువులు ఉన్నాయన్న దానిపై రిమోట్ సెన్సింగ్ సమాచారం ఆధారంగా ప్రభుత్వం వివరాలు సేకరించింది. బాహ్యవలయ రహదారి పరిధిలో మొత్తం 920 చెరువులు

ఉండగా వాటిలో తెలంగాణ రాకముందు అంటే 2014 నాటికే 225 చెరువులు కబ్జాకు గురయ్యాయని, 695 మిగిలాయని, వీటిలోనూ 2014 నుంచి ఇప్పటివరకు అంటే గత పదేళ్లలో 44 పూర్తిగా, 127 పాక్షికంగా ఆక్రమణలకు గురయ్యాయని తేలింది.

1970 నుంచి నీటి వనరుల లెక్కల సేకరణ

హైడ్రా సైతం హెచ్ఎండీఏ పరిధిలోని చెరువులు, చిన్నచిన్న కుంటల లెక్కలను తేల్చేందుకు కసరత్తు చేస్తోంది. దీనికి సంబంధించి నీటిపారుదల, రెవెన్యూ శాఖలు, హెచ్ఎండీఏ నుంచి వివరాలను సేకరిస్తోంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం... నీటిపారుదల శాఖ లెక్కల ప్రకారం హెచ్ఎండీఏ పరిధిలో 4,150 వరకు చెరువులు, కుంటలు ఉండేవని తేలినట్లు తెలుస్తోంది. అయితే రెవెన్యూ రికార్డుల ప్రకారం 3,000 ఉన్నట్లు సమాచారం. ఇక హెచ్ఎండీఏ రికార్డుల్లో 2000 వరకే చూపిస్తున్నట్లు తెలుస్తోంది. ఇలా ఒక్కో శాఖ వద్ద ఒక్కో తరహా లెక్కలు ఎందుకు ఉన్నాయన్నది అంతుపట్టని ప్రశ్న. దీన్ని నిర్ధారించుకునేందుకు హైడ్రా అధికారులు సర్వే ఆఫ్ ఇండియా సాయం తీసుకుంటున్నారు. 1970 నుంచి రాజధాని పరిధిలో ఉన్న చెరువులు, కుంటల వివరాలను సేకరిస్తున్నారు. వారి వద్ద ఉన్న మ్యాపులను అధ్యయనం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ కసరత్తు మరికొద్ది రోజుల్లోనే పూర్తవుతుందని, తుది గణాంకాలను తేల్చాక... హెచ్ఎండీఏ పరిధిలో ఎన్ని చెరువులు, కుంటలు ఉండాలి... ఇప్పుడెన్ని ఉన్నాయి... ఎన్ని రూపు కోల్పోయాయి... ఎన్ని ఆక్రమణలో ఉన్నాయి... అనే వివరాలతో జాబితా తయారు చేస్తారని తెలుస్తోంది. ఆ తర్వాత వీటి విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోవాలన్న దానిపై దృష్టి సారిస్తారు. అయితే వందల సంఖ్యలో చెరువులు, కుంటలు మాయం కావడం మాత్రం అధికారులనూ విస్మయానికి గురిచేస్తోంది.

(c) eenadu

'మనుషులు అర్థం చేసుకోవడానికి మాది మామూలు ప్రేమ కాదు.. అగ్నిలాగ స్వచ్ఛమైనది...' అంటున్నారు కొందరు అపర ప్రేమికులు. అలాగని ఆ ప్రేమను గుండెల్లోనే దాచుకోలేదు. ఇష్టప్రకారం పెళ్లాడి ఒక్కటయ్యారు.. ఇంతకీ వాళ్లు ఎవర్ని ప్రేమించారు? ఎలా పెళ్లాడారు? అని తెలుసుకుంటే మాత్రం మీరు నోరెళ్లబెడతారు. పదండి.. ఆ వింతలు పట్టేద్దాం.

ఈఫిల్ టవరే.. భాగస్వామి!

ఎరికా లాబ్రీ అనే అమ్మడు పారిస్‌లోని ఈఫిల్ టవర్‌ని పెళ్లాడింది. పెళ్లికూతురిలా ముస్తాబై వచ్చి, తన దుపట్టాని టవర్‌లోని ఒక ఇనుప దిమ్మెకు చుట్టి సంప్రదాయబద్ధంగా పెళ్లాడింది. ఆ తర్వాత గాఢంగా ఓ ముద్దు కూడా పెట్టేసింది.

- అరోన్ చెర్వెనాక్‌కి చాలామంది కుర్రాళ్లలాగే తన ఐఫోన్ అంటే ప్రాణం. ఆ ఫోన్ వెనకవైపు ఒక బంగారు ఉంగరాన్ని అతికించి, దాన్ని తన వేలికి తొడుక్కొని పెళ్లి అయ్యిందనిపించాడు.
- మీర్యోన్ రోచా మోరాస్ అనే సుందరాంగి ఒక అందగాడి బొమ్మని వివాహం చేసుకుంది. 'ప్రాణం లేని బొమ్మకి మనుషుల్లా మోసం చేయడం తెలియదు. అందుకే దాన్ని నా భాగస్వామిగా చేసుకుంటున్నా' అంది. ఆ బొమ్మకి తన గుండెల్లోనే కాదు.. పడకగదిలోనూ స్థానం ఇచ్చింది రోచా.
- కరోల్ శాంటా అనే అతివ ఉద్యోగరీత్యా శాంటా ఫే అనే రైల్వేస్టేషన్ నుంచి ఎక్కువగా ప్రయాణిస్తుంటుంది. ఆ ప్రదేశం తనకి ఎంత బాగా నచ్చేసిందంటే.. స్టేషన్ గోడకి ఒక ముద్దు పెట్టేసి, దాన్ని పెళ్లాడుతున్నానని అందరి ముందూ ప్రకటించింది.
- ఒక చెట్టుని పెళ్లికూతురిలా ముస్తాబు చేసి, బ్యాండు మేళంతో వేడుక చేస్తూ మరీ పెళ్లాడాడు రిచర్డ్ టోరెస్. చెట్టు కన్నా నిస్వార్థంగా తనకేదీ కనిపించలేదని అలా చేశాడట.

కుర్రకారంటే.. సొగసరులు, సోగ్గాళ్లు... వాళ్ల స్టైల్‌కి మరిన్ని మెరుపులద్దే సందర్భాలు వచ్చేశాయి! కాకపోతే ఈసారి సంప్రదాయంతో చెలరేగిపోవాలి. ఇప్పుడు చెప్పబోతున్నది దసరా, దీపావళి గురించి అని మీకీపాటికే అర్థమై ఉంటుందిగా! చక్కనమ్మలూ, చక్కనయ్యలూ.. అయితే పదండి.. ఈ పండగల వేళ ఎలా మెరిసిపోవాలో తెలుసుకుందాం..

పండగ వేళ.. స్టైల్ దండిగా!

పండగని శ్రద్ధగా జరిపించేది పెద్దలైతే.. సందడి మాత్రం యూత్‌దే. ఆధునికతకు అంబాసిడర్‌లు అయిన జనరేషన్ జడ్ ఆ వేళ మాత్రం బుద్ధిమంతుల్లా సంప్రదాయ దుస్తుల్లో ఒదిగిపోతారు. అమ్మాయిలు పట్టు పావడాలు, చీరకట్టులో ముస్తాబైతే.. అబ్బాయిలు పంచెకట్టుకి జై కొడుతుంటారు. మరి ఈసారి దసరా, దీపావళికి డబుల్ ధమాకాలా వెలిగిపోవాలంటే ఈ సొగసు సూత్రాలు పాటించాల్సిందే.

అమ్మాయిలు సంప్రదాయంగా..

టీనేజీ, కాలేజీ అమ్మాయిల నుంచి ప్రౌఢల వరకు పండగ వేళ ఆ కళ ఉట్టి పడటానికి పట్టుచీరలకే ఓటేస్తుంటారు. ఆ పట్టులో వాళ్లు కోరినన్ని రకాలు ఉండనే ఉంటాయి. ఎరుపు, ఆకుపచ్చ, పసుపు.. ఇలాంటి వర్ణాల చీరలకు జతగా క్లాసిక్ రవికెలు ధరించి, వాటికి తగ్గట్టుగా ఆభరణాలు వేసుకుంటే మహాలక్ష్మిలా మెరిసిపోవడం ఖాయం. సౌకర్యంగా ఉండాలి.. స్టైల్‌గా కనిపించాలి.. సంప్రదాయం అనిపించుకోవాలి అని భావించే చక్కనమ్మలు అనార్కలీ సూట్‌కి ఓటేయొచ్చు. వీటికి కాస్త ఎంబ్రాయిడరీ తళుకులు అద్దితే పండగవేళ అందరి చూపూ మీపైనే పడుతుంది. ఇందులోనూ ఎరుపు, ఆరెంజ్, రాయల్ బ్లూ రంగులైతే మరింత హుందాగా ఉంటాయి. అన్నట్టు ఈ స్టైల్‌కి జుంకాలు పెట్టుకుంటే కాంబినేషన్ అదిరిపోతుంది. సంప్రదాయం, సౌకర్యం రెండూ ఉండాలి అని భావించే భామలు కుర్తాలు ఎంచుకోవచ్చు. ఈ సమయంలో క్రిస్ప్, ఫ్లేర్డ్, గౌనులా పొడవాటివి ధరిస్తే అందంగా, హుందాగా ఉంటాయి. వీటికి జతగా పలాజో ప్యాంట్లు, రంగురంగుల దుపట్టాలు వేశారంటే పండగని ఒంటికి చుట్టుకున్నట్టే ఉంటుంది. కాలేజీ అమ్మాయిలు, సందడితో పండగకి వన్నె తెచ్చే పడుచు ప్రాయులకు లెహెంగా, చోళీ మంచి ఎంపిక. అచ్చ తెలుగు అమ్మాయిలకైతే లంగా, ఓణీలు ఫేవరిట్. అందులోనూ ఎంబ్రాయిడరీ చేసినవైతే సంప్రదాయ సింగారంలా ఉంటాయి. మరింత రిచ్‌గా కనిపించాలనుకుంటే గాగ్రా చోళీలు ఎంచుకోవచ్చు. ఈ స్టైల్ దుస్తులతోపాటు ముత్యాల హారాలు, వరుసల నెక్లెస్‌లు, స్టేట్‌మెంట్ చెవిరింగులు, పెద్ద పరిమాణంలో ఉండే కఫ్‌లు, దండ కడియాలు ధరిస్తే సొగసులకు నిండుదనం వస్తుంది.

అబ్బాయిల రాజసం..

అమ్మాయిలతో పోలిస్తే అబ్బాయిలకు ఫెస్టివల్ వార్డ్‌రోబ్‌ని రకరకాల స్టైల్స్‌తో నింపేయడానికి అవకాశం తక్కువే. అయినా ఉన్నవాటితో ప్రయోగాలు చేస్తూ ఎంచక్కా 'దసరా వచ్చిందయ్యా.. సరదా తెచ్చిందయ్యా..' అంటూ పాడుకోవచ్చు. పండగ అనగానే ప్రతి కుర్రాడికీ గుర్తొచ్చేది కుర్తా పైజమాలే. వీటిపై నెహ్రూ కోట్ ధరించారంటే దీపావళి మతాబులా వెలిగిపోవచ్చు. పైగా ఇవి సంప్రదాయానికి ప్రతీక. ధోతీ ప్యాంట్లు సైతం పండగలు, శుభకార్యాల్లో మగానుభావుల ఎంపికలో ముందుంటున్నాయి. టీనేజీ కుర్రాళ్ల నుంచి మధ్య వయస్కులదాకా ఎవరైనా వీటితో ముస్తాబు కావచ్చు. సాధారణంగా పెళ్లిళ్లలో ఎక్కువగా ధరించే షేర్వాణీలను ఈ దసరా, దీపావళికి కూడా వేసుకుంటే రాజసం ఉట్టిపడుతుంది. ఇందులోనూ ఎంబ్రాయిడరీ చేసినవైతే మరింత రిచ్‌గా కనిపిస్తాయి. వీటికి జతగా లేత రంగు బాటమ్‌వేర్ ధరించారంటే ఆకర్షణ రెట్టింపవుతుంది. ఫ్యాబ్రిక్ విషయానికొస్తే అమ్మాయి, అబ్బాయి అనే తేడా లేకుండా.. ఎవరైనా సిల్క్, కాటన్, చిఫాన్, జార్జెట్‌ని ట్రై చేయొచ్చు. పూజల వేళ సందర్భానికి తగ్గట్టుగా ఉంటాయి. కంటికి కొట్టొచ్చినట్టు కనిపించాలంటే మాత్రం ముదురు వర్ణాలను ఎంచుకొమ్మని ఫ్యాషన్ గురూలు చెబుతున్నారు.

బోలెడు ప్రయోగాలు

దసరా, దీపావళి పండగలంటే మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలు. ఈ సమయంలోనూ స్టైల్‌తో ఎన్నో ప్రయోగాలు చేయొచ్చు. సిల్క్, ఖాదీ, కలంకారీ, చేనేత కాటన్ ఫ్యాబ్రిక్ అనువుగా ఉంటాయి. వీటితో సౌకర్యం, హుందాతనం రెండూనూ. రెడ్, పికాక్ బ్లూ/గ్రీన్, రాయల్ బ్లూ రంగులు సొగసుల్ని ద్విగుణీకృతం చేస్తాయి. అమ్మాయిలకు పట్టు చీరలు, కుర్తీలు ఎవర్‌గ్రీన్ స్టైల్. ధోతీ లుక్, లాంగ్ కుర్తాలు లేదా కుర్తాలకు జతగా మోజరీలను అబ్బాయిలు వేసుకోవచ్చు. మెటల్ లేదా లెదర్ స్ట్రాప్ వాచీలు ధరిస్తే హుందాగా కనిపిస్తారు.

– షణ్మిత, ఫ్యాషన్ డిజైనర్

'సాఫ్ట్'గా పక్కన పెట్టేస్తున్నారు..

ఓ చేతిలో కూల్‌డ్రింక్, మరో చేతిలో పిజ్జా లేదా బర్గర్, ఆపై ఆధునిక వస్త్రధారణ.. ఇవీ జనరేషన్ జడ్, మిలీనియల్స్ ఆనవాళ్లు. ఇలా అనుకోవడంలో తప్పేం లేదు. కానీ ఇప్పుడు ఆ రూపంలో మార్పు లేదుగానీ.. జంక్‌ఫుడ్, శీతలపానీయాల వాడకం గణనీయంగా తగ్గిస్తోంది యూత్. ఇది 'మింటెల్' అనే సంస్థ చేసిన అధ్యయనంలో తేలిన వాస్తవం. ఈతరం కుర్రకారులో 34శాతం మంది మెరుగైన జీవనశైలి కోసం సాఫ్ట్‌డ్రింక్స్‌ని పక్కన పెట్టేస్తున్నారట. దాంతో వాటి అమ్మకాలు భారీగా తగ్గిపోతున్నాయి. చేసేదేం లేక ఆఫ్ సీజన్‌లో శీతల పానీయాల సంస్థలు ఎన్నో రాయితీలు ప్రకటిస్తున్నాయి. ఈ కాలం, ఆ కాలం అని తేడా లేకుండా అన్నికాలాల్లో దుమ్ము రేపే అమ్మకాలు కేవలం వేసవిలోనే ఫర్వాలేదన్నట్టుగా ఉంటున్నాయి. 'యువతలో ఎందుకీ మార్పు?' అంటే వాళ్లకి ఆరోగ్య స్పృహ పెరగడమే కారణం. యాడెడ్ షుగర్స్ పదార్థాలు, కూల్‌డ్రింక్స్ వాడకంతో ఊబకాయం, మెటబాలిక్

సందర్భం

సిండ్రోమ్, ఇన్సులిన్ రెసిస్టెన్స్, గుండెజబ్బుల అవకాశం ఎక్కువ కావడంతో వాటిని పక్కన పెడుతున్నామని ఈ సర్వేలో యువత స్పష్టం చేశారు. ఆరోగ్య చిట్కాలు, మెరుగైన జీవనశైలి సూత్రాలు చెప్పే ఇన్‌ఫ్లుయెన్సర్లు సైతం కొంతమేర ప్రభావం చూపిస్తున్నారు. దీనికితోడు సాఫ్ట్‌డ్రింక్స్‌కి ప్రత్యామ్నాయాలుగా కొన్ని రెస్టరంట్లు అల్లం ద్రావణం, టానిక్ వాటర్‌లాంటివి అందుబాటులో ఉంచుతున్నాయి. వెరసి, సాఫ్ట్‌డ్రింక్స్‌కి కుర్రజనం సాఫ్ట్‌గా దూరమవుతోంది.

మడతే.. మజా!

రోజుకో కొత్త మోడల్, మతిపోయే ఫీచర్లు.. సెల్‌ఫోన్లు చేస్తున్న చిత్రాలెన్నో! ఇప్పుడు మడతపెట్టే (ఫోల్డబుల్) స్మార్ట్‌ఫోన్ల హవా నడుస్తోంది. ట్యాబ్లెట్‌కి తక్కువగా.. స్మార్ట్‌ఫోన్‌కి ఎక్కువగా ఉన్న ఈ చరవాణులు కొన్ని ఇప్పటికే కుర్రకారుకు హస్తభూషణంలా మారితే.. మరిన్ని వరుసలో ఉన్నాయి. ఆ సంగతుల ఖజానా ఇది..

వన్‌ప్లస్ ఓపెన్

ధర: రూ. 1,39,998

ఇది మూడో తరం ఫోల్డబుల్ ఫోను. క్వాల్‌కమ్ స్నాప్‌డ్రాగన్ 8 జెనరేషన్ సీపీయూ, భారీ స్టోరేజీ ర్యామ్ దీని సొంతం. 7.82 అంగుళాల తెర, వెనక 48+64 మెగా పిక్సెల్ కెమెరా, ముందు 20+32 మెగా పిక్సెల్ కెమెరా ఉంటుంది. ఆండ్రాయిడ్ 13 ఆక్సిజన్ ఆపరేటింగ్ సిస్టమ్‌తో వస్తోంది. బరువు 245 గ్రాములు.

శామ్‌సంగ్ గెలాక్సీ జడ్ ఫోల్డ్ 5

గతంలో వచ్చిన ఫోల్డింగ్ గెలాక్సీ మోడల్‌లోని లోపాలు సరిదిద్ది, ఈ స్టైలిష్ ఫోన్‌ని తీసుకొచ్చారు. వాడుతుంటే పర్సనల్ కంప్యూటర్ అనుభూతి కలగడం ఖాయమంటోంది తయారీదారు. స్నాప్‌డ్రాగన్ 8 జెనరేషన్ 2 సీపీయూ ప్రాసెసర్, 7.6 అంగుళాల పరిమాణం, వెనక 12+50+10 మెగా పిక్సెళ్ల కెమెరా, ముందు 4+10 కెమెరా ఉన్నాయి. 256జీబీ నుంచి 1టీబీ వరకు భారీ స్టోరేజీ ఉంది. బరువు 253 గ్రాములు.

ధర : రూ. 1,64,999

హానర్ మ్యాజిక్ వీ2 5జీ

ధర : రూ. 1,02,999

మడత పెట్టినప్పుడు ఫోన్‌లా, విప్పినప్పుడు ట్యాబ్లెట్‌లా కనిపించడం దీని ప్రత్యేకత. మడత ఫోన్లలో తేలికైందీ, నాజూకైంది. తెర 7.92 అంగుళాలు, వెనక 50+20+50 పిక్సెళ్ల కెమెరా, ముందు 16 మెగా పిక్సెళ్ల కెమెరా దీని సొంతం. క్వాల్‌కామ్ స్నాప్‌డ్రాగన్ 8 జెనరేషన్ ప్రాసెసర్, 5000 ఎంఏహెచ్ బ్యాటరీతో వస్తోంది. 256 జీబీ నుంచి 1టీబీ స్టోరేజీ, 16 జీబీ ర్యామ్ ఉంటుంది. బరువు 231 గ్రాములు.

గూగుల్ పిక్సెల్ ఫోల్డ్

గూగుల్ నుంచి వచ్చిన మొదటి మడత ఫోన్. 7.6 అంగుళాల పరిమాణం, 48+10.8+10.8 మెగా పిక్సెళ్ల ముందు కెమెరా, 8+9.5 ఎంపీ వెనక కెమెరాతో ఫొటోలు తీయొచ్చు. గూగుల్ టెన్సర్ జీ2 ప్రాసెసర్ వాడారు. 512జీబీ స్టోరేజీ, 12జీబీ ర్యామ్ ఉంది. బరువు 283 గ్రాములు.

ధర : రూ. 1,47,490

వివో ఎక్స్ ఫోల్డ్ 3

వివో కంపెనీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకొస్తున్న మడత ఫోన్ ఇది. 8.03 అంగుళాల పరిమాణం, 512 జీబీ స్టోరేజీ, 16జీబీ ర్యామ్ దీని ప్రత్యేకతలు. 50+50+50 మెగా పిక్సెళ్ల వెనక కెమెరా, డ్యుయెల్ ఎల్ఈడీ ఫ్లాష్, 32+32 మెగా పిక్సెళ్ల ముందు కెమెరా ఉన్నాయి. 5500ఎంఏహెచ్ ఫ్లాష్ ఛార్జింగ్ బ్యాటరీతో వస్తోంది. బరువు 236 గ్రాములు.

ధర : రూ. 1,59,999

షామీ మిక్స్ ఫోల్డ్ 4

ప్రస్తుతం అందుబాటులో ఉన్న అన్ని ఫ్లిప్ ఫోన్లను తలదన్నేలా సరికొత్త ఫీచర్లతో ఈ మోడల్‌ని తెచ్చామంటోంది షామీ. 7.98 అంగుళాల పరిమాణం, 50+12+50+10 ఎంపీ వెనక కెమెరా, 16+16 ఎంపీ డ్యుయెల్ ముందు కెమెరా, ఎల్ఈడీ ఫ్లాష్, 5100 ఎంఏహెచ్ ఫాస్ట్‌ఛార్జింగ్ బ్యాటరీ, వైర్‌లెస్ ఛార్జింగ్, ఆక్టాకోర్ స్నాప్‌డ్రాగన్ 8 జెనరేషన్ ప్రాసెసర్, 12జీబీ ర్యామ్ ప్రధాన ఆకర్షణలు. 256జీబీ స్టోరేజీ ఉంది.

ధర : రూ. 1,03,690

థియేటర్‌లో.. హీరోల్లా!

హీరో తెరపై విలన్‌తో ఫైటింగ్ చేస్తుంటే.. మనమే అతడ్ని చితక్కొడుతున్నట్టు సీట్లో ఎగిరెగిరి పడతాం. హీరోయిన్‌తో డ్యూయెట్ పాడుతుంటే.. ఆ స్థానంలో మనల్ని ఊహించుకొని మెలికలు తిరిగిపోతుంటాం. ఈలలు, చప్పట్లు.. అబ్బో మనం ప్రేక్షకుడు అన్న సంగతి మర్చిపోయి థియేటర్‌లోనే నవరసాలూ పండిస్తాం. సినిమాలో హీరో తన పాత్రలో లీనం అవుతాడో, లేదో తెలియదుగానీ ప్రేక్షకుడిగా అన్నీ రక్తి కట్టిస్తాం. అంతవరకు ఓకే! అది శ్రుతి మించితేనే వస్తుంది చిక్కంతా. అలా జరిగినప్పుడు 'మేం సినిమా చూడాలా.. మీ చిందుల్ని వీక్షించాలా?' అని చిరాకు పడుతుంటారు మిగతా ప్రేక్షకులు. అందుకే మన భావావేశం ఇతరుల ఆక్రోశానికి గురి కాకుండా ఉండాలంటే 'థియేటర్ ఎటికెట్' పాటించాలి. అంటే 'రేసుగుర్రం' సినిమాలో శ్రుతీ హాసన్‌లా భావోద్వేగాలను మనసులోనే అణచుకొమ్మని కాదుగానీ.. చుట్టూ వందలమంది ఉన్నారని గుర్తుంచుకొని, వాళ్ల ఫీలింగ్స్‌ని అర్థం చేసుకొని ప్రవర్తిస్తే చాలు. హాలులో లైట్లు ఆర్పేసినా, టైటిల్స్ మొదలైనా.. కొందరు పక్కవాళ్లతో ముచ్చట్లు ఆపరు. ఇంకొందరైతే శుభం కార్డు పడ్డా.. ఆ కబుర్లకు ఎండ్ కార్డు వేయరు. ఆ మాత్రం దానికి థియేటర్‌దాకా వెళ్లడం ఎందుకు? జోరీగలా పక్కవాళ్లకు ఇబ్బంది కలిగించడం ఎందుకు? ఇంతేనా.. ముందు సీట్లపై కాళ్లు పెట్టడం, సెల్‌ఫోన్లో పెద్దగా మాట్లాడటం, పదేపదే లేచి అటూఇటూ తిరగడం.. వీటినే హీరోయిజంగా భావిస్తుంటారు కొందరు. తిన్నా, మాట్లాడినా అతి శబ్దమే ఇంకొందరు. 'పక్కవాళ్లకి ఇబ్బంది కలుగుతుందనే కామన్‌సెన్స్ కూడా ఉండదు' అని ఎంతమంది అనుకుంటారో!

'ఈ చేష్టలు కేవలం సినిమా చూడటమే కాదు. సమాజం పట్ల మనకున్న దృక్పథాన్ని తెలియజేస్తుంది' అంటారు మానసిక నిపుణులు. ఇతరుల ఫీలింగ్స్‌ని అర్థం చేసుకోలేకపోవడం, భావోద్వేగాలపై నియంత్రణ లేకపోవడం ఈ తరహా ప్రవర్తనకు కారణం అవుతుందంటారు. సమయానికి థియేటర్‌కి చేరుకోవడం, సెల్‌ఫోన్ మ్యూట్‌లో పెట్టుకోవడం, సినిమా ఆడుతున్న సమయంలో మాట్లాడకపోవడం, చాటింగ్ చేయకపోవడం, ఇతరులకు ఇబ్బంది కలగకుండా ప్రవర్తించడం.. ఇవి పాటిస్తే మీకే కాదు.. పక్కవాళ్లకీ సినిమా చూసిన అనుభూతి కలుగుతుంది.



ఇన్‌స్టాలో విష్ణుసహస్ర నామాలు!

నుదుటన నిలువు తిలకం.. మెడలో పూసల దండ.. అల్లికల జుట్టు.. పాడేవేమో శ్లోకాలు.. ఇలా ఉంటే సామాజిక మాధ్యమాల్లో కంటెంట్ ఎవరైనా చూస్తారా.. అని సందేహపడతారు. సినిమా పాటలకు స్టెప్పులేస్తేనే రీల్స్ అవుతాయని భావిస్తారంతా. కానీ అవేమీ అక్కర్లేదని.. భక్తిశ్రద్ధలతో, సంప్రదాయరీతిలోనూ కంటెంట్‌తో యువతను ఆకర్షించవచ్చని నిరూపించింది శ్రీకిషోరి. హావభావాలతో భక్తిరస కీర్తనల వీడియోలను సోషల్ మీడియాలో పోస్టు చేస్తూ పేరు సంపాదించుకుంది. ఇప్పటికే ఇన్‌స్టాలో తనను 26 లక్షల మంది అనుసరిస్తున్నారు. ఫేస్‌బుక్ పేజీని వేలాది మంది ఫాలో అవుతున్నారు. యూట్యూబ్‌లో లక్షన్నర మంది సబ్‌స్క్రైబర్లు తన భక్తి కీర్తనల వీడియోలు చూస్తున్నారు. యాపిల్ మ్యూజిక్, స్పాటిఫైల్లోనూ అలరిస్తోంది. విష్ణుసహస్రనామాలు, కాలభైరవాష్టకంతో తక్కువ సమయంలో బాగా పాపులర్ అయ్యిందీ హైదరాబాద్ అమ్మాయి.

మట్టి వాసన.. మళ్లీ చూద్దామా?

ఎప్పుడెప్పుడు వీకెండ్ వస్తుందా.. ఎప్పుడెప్పుడు సెలవులు దొరుకుతాయా అని ఉద్యోగులు, కాలేజీ కుర్రోళ్లు ఎదురుచూస్తుంటారు. ఒకేలాంటివి కాకుండా విభిన్నంగా ఉండేలా కొత్త కొత్త ప్రదేశాల కోసం నెట్టింట జల్లెడ పడుతుంటారు. ఆ కోవలో తాజాగా యూత్ ఫేవరిట్ డెస్టినేషన్‌గా మారింది అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు సమీపంలోని 'దేశీయ ఎకో రిసార్టు'. ఇది పూర్తిగా మట్టితో నిర్మించి, అలికిన గుమ్మాలతో కళకళలాడే చిన్ని చిన్ని నివాసాల సముదాయం. మన్యం వచ్చే పర్యాటకులకు అక్కడి సాధారణ జీవన విధానాన్ని రుచి చూపించాలనే ఆలోచనతో పురీకి చెందిన యుగభ్రత్‌కర్ దీనికి రూపమిచ్చారు. ఈ రిసార్టులోకి అడుగుపెట్టగానే మట్టివాసనలు మనకు పాత రోజులను గుర్తుచేస్తాయి. పిజ్జాలు, బర్గర్ల వంటి జంక్ ఫుడ్ కాకుండా సేంద్రియ కూరగాయలు, ధాన్యాలతో చేసిన ఆరోగ్యకరమైన భోజనం రారమ్మంటూ ఊరిస్తుంది. అంతేకాదు.. చుట్టుపక్కల ఐదు గ్రామాల నుంచి వచ్చే చిన్నారులకు పర్యాటకులతో పెయింటింగ్, క్రాఫ్ట్స్ మేకింగ్, యోగా, మెడిటేషన్ వంటి వాటి మీద శిక్షణ కూడా ఇప్పిస్తుంటారు. స్థానిక ఆదివాసీలకు ఉపాధి, గిరిజన చిన్నారులకు విద్య, మరోపక్క విభిన్నమైన అనుభూతిని పంచుతూ హైదరాబాద్, పుణె తదితర నగరాల నుంచి యువతను ఆకర్షిస్తోంది. జీవితంలో ఒక్కసారైనా అలా పూర్తిగా ప్రకృతితో మమేకమై, ఏదీ ఆశించకుండా పనిచేస్తూ ఆ ఆనందాన్ని అనుభవిస్తే భలే ఉంటుంది కదా.. ఏమంటారు!

– ఉదయ్, ముంచంగిపుట్టు గ్రామీణం

'స్త్రీ 2'.. రూ.వెయ్యి కోట్ల వసూళ్ల బాలీవుడ్ సినిమా! అందులోని హీరో రాజ్‌కుమార్ రావు నిజ జీవిత ఆస్తులు సుమారు రూ.100 కోట్లు. కానీ, ఒకప్పుడు అతడు రూ.10 కోసం అల్లాడిన సందర్భాలు అనేకం. అవకాశాల కోసం సినిమా కష్టాలెన్నో భరించి, స్టార్‌గా ఎదిగిన అతడి తీరు స్ఫూర్తిదాయకం కాక మరేంటి?

రూ.100 కోట్ల హీరో.. రూ.10 కష్టాలు

రాజ్‌కుమార్ రావు అందగాడు కాదు.. గాడ్ ఫాదర్లు లేరు.. సినిమా నేపథ్యం అస్సలు లేనే లేదు! వీటన్నింటికన్నా కనీస అవసరాలు కూడా తీర్చుకోలేని కుటుంబం. అయినా సినిమాల్లో మెరిసిపోవాలనే పెద్ద లక్ష్యం పెట్టుకున్నాడు. 'అన్నివైపులా కష్టాలు చుట్టుముట్టినప్పుడు.. పట్టుకున్న ప్రతిదీ ప్రతికూలంగా మారినప్పుడే మనం ఎంత బలవంతులమో తెలుస్తుంది' అంటారు. అలా కష్టాల కూపం నుంచి కసిగా పైకెదిగి బాలీవుడ్‌లో తనకంటూ ఓ స్థానం సంపాదించుకున్నాడు రాజ్‌కుమార్ రావు.

- దిల్లీ పక్కనున్న గురుగ్రామ్‌లో రాజ్‌కుమార్ రావు పుట్టి పెరిగాడు. చిన్నప్పట్నుంచే సినిమాలంటే పిచ్చి. 'సత్య' తర్వాత మనోజ్ బాజ్‌పేయి హవా కొనసాగుతున్న రోజులవి. ఎలాంటి సినిమా నేపథ్యం లేని ఒక వ్యక్తి స్టార్‌గా ఎదగడం కళ్లారా చూశాడు. అప్పట్నుంచే నటుడు కావాలనుకున్నాడు. గురుగ్రామ్ నుంచి దిల్లీకి రోజూ సైకిల్‌పై వెళ్లి థియేటర్ ఆర్ట్స్ నేర్చుకునేవాడు. తండ్రి రెవెన్యూ శాఖలో చిరుద్యోగి. కొడుకు సినిమాల్లోకి వెళ్లడం ఆయనకు ఇష్టం లేదు. పైసా ఇవ్వనన్నాడు. దాంతో రాజ్‌కుమార్ ట్యూషన్లు చెబుతూ, డ్యాన్స్ నేర్పిస్తూ.. తన ఖర్చులకు తనే సంపాదించుకునేవాడు.
- 'హీరో కావాలి' అనే ఒకే కోరికతో ముంబయిలో అడుగు పెట్టాడు. కానీ రాగానే ఎవరూ ఎర్రతివాచీ పరచలేదు. 'నువ్వు హీరో అవుతావా?' అని ముఖం మీదే నవ్వారు చాలామంది. అవకాశాల మాట అటుంచితే ఆకలి కష్టాలు ఎక్కువగా ఉండేవి. ఇరుకు గదిలో ఉండేవాడు. ఒక పూట వడాపావ్, మరో పూట బిస్కెట్ ప్యాకెట్‌తో కడుపు నింపుకొనేవాడు. రెండేళ్లు ఇదే పరిస్థితి. ఈ స్థితిలోనూ తనను తాను మరింత మెరుగు పరచుకోవడానికి ప్రఖ్యాత ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియాలో చేరి, నటనలో శిక్షణ తీసుకున్నాడు. ఖాళీ సమయాల్లో చిన్నచిన్న పనులు చేసేవాడు.
- మొత్తానికి 2006లో 'రంగ్ దే బసంతి'లో చిన్న పాత్ర దక్కింది. నాలుగేళ్లయ్యాక 'లవ్ సెక్స్ ఔర్ ధోఖా'లో ముఖ్య పాత్ర చేశాడు. 'ట్రాప్డ్', 'న్యూటన్', 'హిట్'లాంటి ఎన్నో హిట్ సినిమాల్లో నటించాడు. ఇప్పుడు 'స్త్రీ 2'తో రూ.వెయ్యి కోట్ల క్లబ్‌లో చేరాడు. జాతీయ ఉత్తమ నటుడు సహా 19 అవార్డులు అందుకున్నాడు. బాలీవుడ్‌లో అత్యుత్తమ నటుల్లో ఒకరిగా నిలిచాడు. ఒకప్పుడు జేబులో పది రూపాయలు కూడా లేని స్థితి నుంచి వచ్చి రూ.వంద కోట్లు సంపాదించాడు. అదృష్టం కలిసొస్తేనో, వారసుడిగా రంగప్రవేశం చేసో.. స్టార్ కావడం గొప్ప కాదు. దెబ్బ మీద దెబ్బ పడినా, ఎన్నిసార్లు పడ్డా.. పైకి లేచి అందలాన్ని అందుకోవడమే గ్రేట్. దాన్ని సుసాధ్యం చేసినవాడే రాజ్‌కుమార్ రావు.

(c) eenadu

వసుంధర

vasundhara@eenadu.in

కుంకుమ దిద్ది... మిఠాయిలు పంచి!

దేవీ నవరాత్రుల్లో చివరి రోజున బెంగాల్‌లో 'సింధూర్ ఖేలా' వేడుక జరుపుకొంటారు. ఆ రోజు పెళ్లైన ఆడవారంతా ఎరుపురంగు అంచుతో ఉన్న తెల్లని చీరలు ధరిస్తారు. ఒకరికొకరు నుదుట కుంకుమ దిద్దుకుంటూ... భర్త, పిల్లలతో సంతోషంగా జీవించాలని ఆకాంక్షించుకుంటారు. మిఠాయిలు పంచుకుంటారు. దశమి రోజున ఈ కార్యక్రమం లేకుండా అక్కడ దుర్గాపూజ పూర్తవదట. స్త్రీత్వం, ప్రేమలకు ప్రతీకగా ఈ వేడుకను భావిస్తారు వాళ్లు.

దీని వెనక...

దుర్గామాత ఏటా తన అత్తింటి నుంచి పుట్టింటికి పిల్లలతో కలిసి వస్తుందని భక్తుల నమ్మకం. పెళ్లైన అమ్మాయి తన పుట్టింటికి వచ్చిన సందర్భంగా... అమ్మవారినీ అలానే భావించి నైవేద్యాలు సమర్పిస్తారు. సంతోషంతో నాట్యం చేస్తూ సంబరంగా జరుపుకొంటారు. తొమ్మిది రోజుల తరవాత ఆమె తిరిగి అత్తింటికి వెళ్లేటప్పుడు మిఠాయిలు పంచుకుంటూ, కుంకుమ పెట్టి సాగనంపుతారట. ఈ సంప్రదాయం నాలుగు వందల ఏళ్ల నుంచీ బెంగాలీలు పాటిస్తున్నారు. ఒకరకంగా మహిళలంతా ఒకరికొకరు స్నేహపూర్వకంగా, సంతోషంగా ఉండాలన్నది దీని వెనుక ఆంతర్యమంటారు.

ఓ పురాణ కథనం ప్రకారం జగన్మాత రాక్షసులను సంహరించటానికి తొమ్మిది రోజుల పాటు యుద్ధం చేసింది. ఆ సమరంలో మూడు రోజుల చొప్పున మహాకాళి అంటే దుర్గాదేవిగా... మహాలక్ష్మిగా... మహాసరస్వతిగా ఆవిర్భవించి, రాక్షసులను తుదముట్టించింది. పదోరోజు విజయోత్సవాల్లో అపరాజితగా నిలిచింది. అందుకే ఈ ముగ్గురు దేవతామూర్తుల్లో నవదుర్గల శక్తి దాగుందని చెబుతారు. దసరా వేళ వీరి విజయ ప్రస్థానం మనకీ ఓ వ్యక్తిత్వవికాస పాఠమే!

మీలోనూ అపరాజిత!

అతివ జీవితంలో అపరాజితగా సాగిపోవాలంటే... దుర్గ, లక్ష్మీ, సరస్వతీలా ఒక్కో దశలో ఒక్కో దేవిని ఆవాహన చేసుకోవాలి అంటారు ఆధ్యాత్మికవేత్తలు. ఇందుకు తొలుత దుర్గగా ఆత్మన్యూనత, పరాధీనత అనే మధుకైటభులను దునుమాడి... ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవం అనే శుభలక్షణాలను మేల్కొల్పాలి. ఆపై మహాలక్ష్మిగా ఇంట్లో ఆర్థికభారం, లేమితనం అనే మహిషాసురుడినీ, రక్తబీజుడినీ తుదముట్టించాలి. ఐశ్వర్యం, ఆర్థిక స్వాతంత్ర్యాలనే వరాలను ప్రాప్తించుకోవాలి. ప్రగతికి ఆటంకమైన అవిద్య, అజ్ఞానాలనే శుంభనిశుంభులను పారదోలడానికి సరస్వతిగానూ మారాలి. విద్య, ప్రజ్ఞలతో భాసించాలి. అప్పుడు ప్రతి మహిళా అపరాజితే! మహిషాసురుడనే రాక్షసుణ్ణి వధించటానికి ఆదిపరాశక్తి సింహం మీద బయలుదేరింది. అందుకే ఆమెను 'సింహవాహిని'గా పిలుస్తారు. సింహం ధీశక్తికీ, గంభీర్యానికీ, ఒంటరి పోరాటానికీ చిహ్నం. దానిలా జీవన సమరంలో మహిళలూ బేలగా కుంగిపోకుండా, గంభీరంగా ఉండగలగాలి. ఎవరి భుజంపైనో వాలి సాంత్వన పొందాలి అనుకోకుండా, ఒంటరిగానైనా పోరాడగలగాలి. ఆ అమ్మలగన్నయమ్మ సింహాన్ని వాహనం చేసుకోవటంలోని అంతరార్థమిదే!

పోలికతో, పోటీతో కాదు...

దేవీ మహాత్మ్యం' దుర్గాదేవిని 'సర్వకారిణ్యై...' అంటే అన్ని పనులనూ సమర్థంగా నిర్వహించగలిగే కార్యశీలి అని కొనియాడింది. అమ్మ స్ఫూర్తితో మనమూ కుటుంబం, కార్యాలయం... బాధ్యత ఏదైనా సమర్థంగా నిర్వహించాలి. అతివలకు అసాధ్యమన్న రంగాల్లోనూ అడుగుపెట్టి, మన సామర్థ్యాన్ని నిరూపిస్తున్నాం. భూతలమే కాదు గగనంలోనూ మన కీర్తిపతాకాలను ఎగురవేస్తున్నాం. అంటే మనమూ 'సర్వకారిణ్యై' అన్న సంబోధనకు ఏ మాత్రం తీసిపోమనే కదా! దాన్ని కొనసాగించే ధైర్యాన్నీ, ఆత్మవిశ్వాసాన్నీ వదలకుండా ఉండగలగాలి. ఇన్ఫోసిస్ ఫౌండేషన్ వ్యవస్థాపక ఛైర్‌పర్సన్ సుధామూర్తి ఓ ముఖాముఖిలో... 'ఇంజినీరింగ్ చదవడం దగ్గర్నుంచి యంత్రాల మధ్య పనిచేయటం వరకు నేను ఎక్కడా నా సామర్థ్యాన్ని శంకించే అవకాశం నేనెవరికీ ఇవ్వలేదు. కార్యదక్షత ఒకరి సొత్తు కాదని తెలిసేలా మనం కృషి చేయాలి. ఆ పట్టుదలతోనే ఎంత కఠినమైన పనినైనా చేయగలనని నలుగురు అంగీకరించేలా కష్టపడ్డాను' అన్నారు. అందుకే ప్రారంభంలో సంశయించిన వారే సుధామూర్తి జీవన సాఫల్యాలకు ఆశ్చర్యపోయారు, వందనాలు చేశారు. ఇది మనకీ వర్తిస్తుంది. ఎవరితోనో పోల్చుకుని, పోటీపడి నిరూపించుకోవాల్సిన అవసరం లేదు. అయితే స్త్రీ అన్న పక్షపాతంతో పక్కవారు మన ప్రతిభాపాటవాలను తక్కువగా అంచనా వేయకుండా, శక్తిసామర్థ్యాలను మాత్రం ఆవిష్కరించుకోవాలి.

'శ్రద్ధ' పెడితే సాధ్యమే...

ఆ జగజ్జననిని 'శ్రద్ధా రూపేణ సంస్థితా' అని కీర్తించింది దుర్గా సప్తశతి. అంటే శ్రద్ధరూపంలో ఉన్న పరదేవత అని అర్థం. కుటుంబ నిర్వహణలోనైనా, కార్యక్షేత్రంలోనైనా మీరు చూపించే శ్రద్ధను బట్టే మీ ఫలితం ఆధారపడి ఉంటుంది. శ్రద్ధతో గృహిణిగా బాధ్యతలు నిర్వర్తించినా గౌరవనీయ మహిళగా వెలుగుతారు. ఉద్యోగంలో నలుగురిలో ప్రత్యేకంగా రాణిస్తారు. ప్రాకృతికంగా స్త్రీలకు శ్రద్ధ, ఏకాగ్రతలు ఎక్కువని ఆధునిక మానసిక శాస్త్రవేత్తలూ అభిప్రాయపడుతున్నారు. అది అమ్మవారి దైవిక లక్షణం. ఇలాంటి ఎన్నో గుణాలతో, దుర్గాదేవిలా మన జీవితాల్లో విజయ పరంపర కొనసాగాలని ఈ విజయదశమి పర్వదినాన ఆకాంక్షిద్దాం. ఆ దేవి ఆశీస్సులతో, దివ్యశక్తులతో ఎదురేలేకుండా ఎదగాలని ఆశిద్దాం!

– చైతన్య, రామకృష్ణ మఠం

బామ్మ మాట... రతన్ బాట!

రతన్ టాటా ప్రపంచం మెచ్చిన పారిశ్రామికవేత్తే కాదు... గొప్ప మానవతావాది కూడా. అంతటి వ్యక్తికి స్ఫూర్తినిచ్చింది, వెన్నుతట్టి నడిపించింది... ఆయన వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దింది మాత్రం వాళ్ల నానమ్మ నవాజ్‌బాయి. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా ఎన్నోసార్లు వెల్లడించారు. ఆ స్త్రీమూర్తి ఔన్నత్యాన్ని కొనియాడారు.

ఓర్పు, నేర్పు కలిగిన స్త్రీ మూర్తి నవాజ్‌బాయి. సంపన్నులైన టాటా కుటుంబంలో కోడలిగా అడుగుపెట్టారు. వైవాహిక జీవితం సంతోషంగా సాగిపోతున్నా.. సంతానం లేకపోవడం మాత్రం వెలితిగా భావించేవారు. ఆపై కొన్నాళ్లకే భర్తనూ కోల్పోయారు. ఆ బాధ తనని నిలువునా దహించేస్తున్నా... ఎక్కడా నిబ్బరాన్ని కోల్పోలేదామె. కుటుంబానికి వారసత్వం అందించడానికి నావల్ అనే ఓ పార్శీ చిన్నారిని దత్తత తీసుకున్నారు. భర్త సర్ రతన్ టాటా వ్యాపార బాధ్యతల్ని అందిపుచ్చుకుని జంషెడ్‌జీ టాటా సూత్రాలు, ఆదర్శాలకు అనుగుణంగా ముందుకు నడిపించారు. ఇలా టాటా సన్స్ కంపెనీకి మొదటి మహిళా డైరెక్టర్‌గా, టాటా ట్రస్ట్ ఛైర్‌పర్సన్‌గా నవాజ్ విధులు నిర్వర్తించారు.

స్త్రీలకు చేయూతనిస్తూ...

వ్యాపార నిర్వహణే కాదు... సామాజిక పురోగతికి సేవా కార్యక్రమాలూ చేపట్టాలని భావించారామె. ముఖ్యంగా ఆర్థికంగా వెనకబడిన స్త్రీలకు చేయూతనిచ్చేందుకు 1928లో భర్త పేరున సర్ రతన్ టాటా ఇన్‌స్టిట్యూట్‌ని స్థాపించారు. దీని ద్వారా పేద మహిళలకు కుకరీ, హ్యాండ్ ఎంబ్రాయిడరీ, టైలరింగ్ అండ్ లాండ్రీ వంటి జీవనోపాధి విభాగాలలో శిక్షణ అందించారు. తల్లిదండ్రులు విడిపోవడంతో ఒంటరైన మనవళ్ల బాధ్యతలు తీసుకుని వారికి వ్యాపార దక్షతనూ, మెలగాల్సిన తీరునూ, జీవితంలో పాటించాల్సిన విలువలనూ నేర్పించారు. వాటిని అందిపుచ్చుకునే రతన్ టాటా కడదాకా నడిచారు. నవాజ్‌బాయికి లలిత కళలు, హస్త కళాకృతులంటే ఆసక్తి ఎక్కువ. పర్యటనలకు ఎక్కడికి వెళ్లినా వాటిని సేకరించేవారట. మూగజీవాలపై ప్రేమా ఎక్కువే. ఆయనా కళలను ఆదరించారు. ధార్మిక, సేవాకార్యక్రమాలకు భూరి విరాళాలు ఇచ్చారు. తాజ్‌హోటల్ లోపలికి వీధి కుక్కలకి ప్రవేశం కల్పించడంలోని దయ, జాలి... ఆయన తన నాయనమ్మ నుంచి అందిపుచ్చుకున్నవే.

బంగారం-వెండి

11న ముగింపు-క్రితం

	హైదరాబాద్		విజయవాడ		ప్రొద్దుటూరు		రాజమహేంద్రవరం		విశాఖపట్నం	
బంగారం (24క్యా)	78,170	77,400	75,570	74,200	77,550	77,350	77,900	77,300	77,120	76,360
ఆర్నమెంట్	71,750	71,050	70,950	70,250	71,860	71,630	71,750	71,050	70,950	70,250
వెండి (కిలో)	93,427	91,807	92,900	90,800	92,700	91,000	93,000	90,800	92,000	92,000

తమిళనాడు (రూ.లలో)		
ఆర్నమెంట్ (గ్రా)	7,095	7,025
వెండి (గ్రా)	102.00	100.00

ఇంటి నుంచి పనిచేస్తున్నారా?

రాగిణికి వర్క్ ఫ్రం హోమ్ అవకాశం పిల్లలకు సెలవులిచ్చే ముందు రోజు వరకు అదృష్టంగానే సాగింది. స్కూల్ లీవ్స్‌తో ఆమెకిప్పుడు ఇంటి నుంచి పని కత్తిపై సాములా మారింది. ఇలా ఆఫీసుపని, ఇంటిపనితోపాటు పిల్లల బాధ్యతలను ఎలా సమన్వయం చేయొచ్చో చూద్దాం!

ఇంటిపని, పిల్లల సంరక్షణతో పాటు వర్క్‌ఫ్రమ్ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించలేం. దీంతో తీవ్ర ఒత్తిడి, ఆందోళనకు గురి అవుతాం. చివరకు ఇవన్నీ మన ముందు సవాళ్లుగా నిలుస్తాయి. ఈ ప్రభావంతో బాధ్యతలన్నీ మనకు మోయలేని బరువుగా మారి తెలియని నిరాసక్తత మొదలవుతుంది. ఇలాకాకుండా ఉండాలంటే ముందుగా ఆఫీసు, ఇంటి పనికంటూ స్పష్టమైన సరిహద్దులు గీసుకోవాలి. ఏ పనికెంత సమయం అని కేటాయించుకోవడమే కాకుండా వాటికి సమయపాలన పాటించి పూర్తి చేయడం అలవరుచుకోవాలి. అలాగే నలుగురి మధ్య కాకుండా ఆఫీసు పనికి ఇంట్లో ప్రత్యేక స్థలం కేటాయించుకోవాలి. అక్కడ మన మెదడు ఆఫీస్ మోడ్‌లోనే ఉంటుంది. దీంతో ఈ బాధ్యతలను సక్రమంగా పూర్తిచేయగలుగుతాం.

విభజనతో...

ఇంటి పనులను ప్రాముఖ్యతమేరకు ముందుగా విభజించాలి. వాటిలో మనం పూర్తిచేసేవే కాకుండా భాగస్వామికి అప్పగించగలిగేవీ ఉండాలి. అలాగే పిల్లలకూ వాళ్ల స్థాయినిబట్టి పని పంచాలి. దీంతో వాళ్లకూ బాల్యం నుంచి బాధ్యతలు అలవడతాయి. మొత్తం మనమే కాకుండా ఇంటిల్లిపాది పని పంచుకోవాలి. ఈ ఆదా అయిన సమయం కుటుంబమంతటికీ కలిసి గడపడానికి ఉపయోగపడుతుంది. ఈ పని విభజన విధానం అందరిమధ్యా అనుబంధాలను పెంచుతుంది. వ్యక్తుల విలువలను మాత్రమే కాకుండా, పని విలువనూ తెలిసేలా చేస్తుంది. ఇలా పని విభజనతో ఆఫీసు పనినీ త్వరగా పూర్తిచేయొచ్చు.

అభిరుచి...

పిల్లలకు సమయం విలువపై అవగాహన కలిగించాలి. సెలవుల్లో అభిరుచులకు పెద్దపీట వేయించాలి. పుస్తకపఠనం, చిత్రలేఖనం, మనసుకు నచ్చిన క్రీడలు, క్విజ్ పూర్తిచేయడం వంటివాటిని ప్రోత్సహించాలి. ఆఫీసు పనిలో నిమగ్నమైన అమ్మను డిస్టర్బ్ చేయకుండా సమయాన్ని సమర్థంగా వినియోగించుకుంటారు. అలాగే వర్క్ ఫ్రమ్ హోమ్ పేరుతో మొత్తం రోజంతా పనిలోనే మునగకుండా కుటుంబం కోసం, స్వీయ సంరక్షణకు అంటూ కొంత సమయాన్ని కేటాయించుకోవడం మంచిది. ఇలా ప్రణాళికగా అడుగులు వేస్తే పని-జీవిత సమతుల్యతనూ సాధించగలం.

అమ్మవారు... కృష్ణుడి చెల్లెలు!

నవరాత్రుల్లో అమ్మవారిని ఒక్కోరోజు ఒక్కో రూపంలో కొలవడం మనకు ఆనవాయితీ. విజయదశమినాడు సంప్రదాయాలకు అనుగుణంగా దుర్గాదేవిని ఆరాధించడమూ మనకు తెలిసిందే! కానీ కేరళలోని ఇరింగోలేకావు గుడిలో దుర్గాదేవిని శ్రీకృష్ణుడి చెల్లెలిగా భావించి కొలుస్తారు. చెల్లెలు దేవకికి కలిగే సంతానంతో తనకు మరణం వస్తుందని తెలుసుకుంటాడు కంసుడు. దీంతో దేవకీ, వసుదేవులను చెరసాలలో బంధిస్తాడు. వాళ్లకు బిడ్డ జన్మించడం ఆలస్యం... చంపేస్తుంటాడు. ఎనిమిదోసారి పుట్టిన బిడ్డనైనా కాపాడాలనుకుని వసుదేవుడు కృష్ణుడిని బృందావనానికి చేరుస్తాడు. తమ బిడ్డ స్థానంలో యశోదకు పుట్టిన ఆడశిశువును ఉంచుతారు. చెల్లెలికి పుట్టిన మగశిశువు చేతిలో మరణం ఉంటుంది, ఆడశిశువుతో ప్రమాదం ఉండదని తెలిసినా కంసుడు ఆ బిడ్డనీ వదలాలనుకోడు. ఎప్పటిలాగే బిడ్డని గాల్లోకి విసిరి కత్తిని ఎత్తుతాడు. కానీ ఆ పాప ఓ వెలుగులా మారి అంతర్ధానమవుతుంది. ఆ వెలుగు ఏర్పడిన చోటే 'ఇరునాల్' అనీ... అదే కాలక్రమేణా 'ఇరింగోలే'గా మారిందని చెబుతారు. ఆ పాప ఇక్కడ దుర్గాదేవిగా వెలిసిందంటారు. ఇక్కడ నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. తొమ్మిదిరోజులూ పిల్లల చేత గాన, నృత్య ప్రదర్శనలిప్పిస్తారు. విజయదశమి నాడు 'విద్యారంభం' ఏర్పాటు చేస్తారు. మనకు పిల్లలను పాఠశాలకు పంపేముందు అక్షరాభ్యాసం చేస్తాం కదా... దాన్నే ఇక్కడ విద్యారంభంగా జరిపిస్తారు. పెద్దలు పిల్లలను ఒళ్లో కూర్చోబెట్టుకుంటారు. అరిటాకులో గోధుమలు లేదా బియ్యం పోసి పూజ చేశాక... వాటిలో పిల్లల వేలితో అక్షరాలు దిద్దిస్తారు.



గుండె ఆరోగ్యానికి వీరభద్రాసనం

శరీర మొత్తం బరువును ఒక కాలిపై సమతుల్యం చేయడం వీరభద్రాసనంలో ప్రధానం. విశ్రాంతిగా నిల్చొని ఈ ఆసనాన్ని ప్రారంభించండి. నెమ్మదిగా రెండు కాళ్లను భుజాలకు సమాంతరంగా చాచి ఉంచండి. ఇప్పుడు కుడి పాదాన్ని కుడి పక్కకు తిప్పి కాలి వేళ్లు, పాదాలను నేలపై అదిమిపెట్టి శరీరాన్ని బ్యాలెన్స్ చేయండి. చేతులను పైకి సాగదీస్తూ నమస్కార ముద్రలో ఉంచి బరువును కుడి పాదంలోకి మార్చి, ఎడమ కాలిని నెమ్మదిగా పైకి లేపండి. తర్వాత శరీరాన్ని నేలకి సమాంతరంగా వచ్చేలా చేయండి. ఇప్పుడు కుడికాలిని నిటారుగా ఉంచండి. అదే సమయంలో ఎడమ పాదాన్ని చిత్రంలో చూపిన విధంగా ఎత్తడం ద్వారా బరువును సమతుల్యం చేయండి. మెడనూ వెన్నునూ విశ్రాంతిగా ఉంచండి. ఆపై సాధారణ శ్వాస తీసుకుంటూ 10-15 సెకన్లు ఉండే ప్రయత్నం చేయండి. తర్వాత అదే పద్ధతిని అనుసరిస్తూ యథాస్థానానికి వచ్చి, నిల్చొని రెండు చేతులు, కాళ్లు దూరంగా చాచి విశ్రాంతి తీసుకోండి.

ఈ ఆసనం గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. సయాటికాకు మంచిది. జ్ఞాపకశక్తిని పెంచుతుంది. శరీరంలో కొవ్వుని తగ్గిస్తుంది. శరీరం దిగువ భాగంలో కండరాలను బలంగా ఉంచుతుంది. మోకాళ్ల సర్జరీ అయిన వాళ్లు చేయకూడదు. తల తిరుగుడు, వర్టిగో సమస్యలున్న వారు డాక్టర్ సలహాతో చేయాలి. ఆహారంలోనూ మార్పులు అవసరం. రోజూ ఆకుకూరలు, నట్స్, తాజా పండ్లను తీసుకోండి. అవకాడో, బీన్స్, బాదం, వెల్లుల్లి, టొమాటోలను ఆహారంలో ఎక్కువగా చేర్చుకోండి.

- శిరీష, యోగ గురు

కళ తెచ్చే... ముక్కుపుడక

నగా నట్రా

పండగ రోజు ముఖంలో కళ కనిపించాలంటే... పట్టు దుస్తులే కాదు, నిండుగా నగలూ వేసుకోవాలి. అలాంటప్పుడు ముక్కుపుడక లేకపోతే ఎలా? ఆధ్యాత్మిక శోభనూ, అందాన్నీ తెచ్చిపెట్టే దీన్ని కచ్చితంగా ధరించాల్సిందే. అమ్మ, అమ్మమ్మల తరంలో దీన్ని ధరించడం సంప్రదాయమనేవారు... కాలం తిరిగే సరికి దీన్నే ఫ్యాషన్‌గానూ భావిస్తున్నారు. మరి వారిని మెప్పించాలంటే... అవి కాస్త ఆధునికంగానూ కనిపించాలి. అందుకోసమే నయా డిజైన్లు ఎన్నో తీసుకొచ్చారు డిజైనర్లు. బంగారంతో చేసిన దిద్దుల్లానే కాదు, పచ్చలు, పూసలు, ముత్యాలు వంటి వాటిని పొదిగిన రకాలెన్నో వచ్చేశాయి. ప్రాంతాలతో సంబంధం లేకుండా అన్ని శైలుల్నీ ఇముడ్చుకుని అదరగొట్టేస్తున్నాయి. అలాంటివే ఈ నాసికాభరణాలన్నీ. మీరూ చూసేయండి.

ట్రంప్ స్వార్థపరుడు

- తన అహం, డబ్బు గురించి మాత్రమే ఆలోచిస్తారు
- అమెరికా మాజీ అధ్యక్షుడు ఒబామా విమర్శలు

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ తరఫున బరిలో ఉన్న ట్రంప్‌పై ఆ దేశ మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా తీవ్ర విమర్శలు గుప్పించారు. ట్రంప్‌ను స్వార్థపరుడిగా పేర్కొన్నారు. ఆయన తమకు మేలు చేస్తారని కొందరు ప్రజలు ఎందుకు అనుకుంటున్నారో తనకు అర్థం కావడం లేదన్నారు. ట్రంప్ సొంత డబ్బు, అహం గురించే పట్టించుకుంటారని ఆరోపించారు. అధ్యక్ష ఎన్నికల్లో డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థిగా ఉన్న కమలా హారిస్‌కు మద్దతుగా.. పెన్సిల్వేనియా రాష్ట్రంలోని పిట్స్‌బర్గ్ నగరంలో ఒబామా గురువారం ప్రచార సభ నిర్వహించారు. స్వీయ సమస్యలపై కాకుండా ప్రజల సమస్యలపై దృష్టిపెట్టేవారే అమెరికాకు నాయకత్వం వహించాలని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం హారిస్ మాత్రమే అలా చేయగలరని తాను విశ్వసిస్తున్నట్లు చెప్పారు. ప్రజల జీవితాలను ఆమె మెరుగుపరచగలరని పేర్కొన్నారు. ట్రంప్, హారిస్ మధ్య ఈ దఫా ఎన్నికలు హోరాహోరీగా సాగుతుండటంతో ఒబామా జోక్యం చెప్పారు. హారిస్ అధ్యక్ష పదవిని చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నారని వ్యాఖ్యానించారు.


పిట్స్‌బర్గ్ సభలో మాట్లాడుతున్న ఒబామా

ప్రజా సమస్యలను ట్రంప్ పట్టించుకోరు: హారిస్

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో తన ప్రత్యర్థిగా ఉన్న రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌పై డెమోక్రటిక్ అభ్యర్థి కమలా హారిస్ విమర్శలతో విరుచుకుపడ్డారు. ప్రజల సమస్యల గురించి ఆలోచించే మనసు ట్రంప్‌నకు లేదన్నారు. ఆయన తన గురించి మాత్రమే ఆలోచిస్తుంటారని పేర్కొన్నారు. అరిజోనాలో గురువారం తన మద్దతుదారులను ఉద్దేశించి హారిస్ ప్రసంగించారు. తనతో మరో చర్చకు ట్రంప్ నిరాకరించడాన్ని ఆమె ఎద్దేవా చేశారు. మరోవైపు- హెలీన్, మిల్టన్ హరికేన్‌ల ప్రభావిత రాష్ట్రాల్లో సహాయక చర్యలు చేపట్టడంలో ఫెడరల్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్యలను కమలా హారిస్ తీవ్రంగా తప్పుబట్టారు. రాజకీయ లబ్ధి కోసం విపత్తును వాడుకోవాలని చూస్తున్నారంటూ ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. లాస్‌వెగాస్‌లో ఏర్పాటుచేసిన ఓ కార్యక్రమాన్ని ఉద్దేశించి వర్చువల్ విధానంలో ప్రసంగిస్తూ హారిస్ ఈ మేరకు స్పందించారు.

హిస్పానిక్ మహిళల్లో అధిక మద్దతు హారిస్‌కే.

అమెరికాలోని హిస్పానిక్ మహిళల్లో అత్యధికులు (ప్రతి 10 మందిలో ఆరుగురు) కమలా హారిస్‌కే అనుకూలంగా ఉన్నట్లు 'ది అసోసియేటెడ్ ప్రెస్ - ఎన్‌వోఆర్‌సీ సెంటర్ ఫర్ పబ్లిక్ అఫైర్స్ రీసెర్చ్' పోల్ తేల్చింది. ఆ వర్గం పురుషులు మాత్రం ట్రంప్ వైపు కొంత ఎక్కువగా మొగ్గుచూపుతున్నట్లు నిర్ధారించింది. మొత్తంగా చూస్తే హిస్పానిక్‌లలో ఇద్దరు అభ్యర్థులకు దాదాపు సమాన మద్దతు లభిస్తోందని తెలిపింది.

హారిస్‌కు మద్దతుగా ఎ.ఆర్.రెహమాన్ కచేరీ!

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో కమలా హారిస్‌కు మద్దతు ప్రకటించిన 'ద ఏషియన్ అమెరికన్ పసిఫిక్ ఐలాండర్స్' నిధుల సేకరణ బృందం కీలక ప్రకటన చేసింది. హారిస్‌కు మద్దతుగా త్వరలో నిర్వహించనున్న ఓ సభలో ప్రముఖ సంగీత దర్శకుడు ఎ.ఆర్.రెహమాన్‌తో కచేరీ ఏర్పాటుచేయనున్నట్లు తెలిపింది. తేదీ ఇంకా ఖరారు కాలేదని పేర్కొంది.

భారతీయ ఉత్పత్తులపై అధిక సుంకం విధిస్తా: ట్రంప్

వాషింగ్టన్: అమెరికా ఉత్పత్తులపై భారత్ అధిక సుంకాలు విధిస్తోందంటూ ఆ దేశ మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ మరోసారి అసహనం వ్యక్తం చేశారు. తాను అధ్యక్ష ఎన్నికల్లో గెలిస్తే.. భారత్ నుంచి దిగుమతయ్యే ఉత్పత్తులపై సుంకాల భారం పెంచుతానని ప్రకటించారు. డెట్రాయిట్‌లో గురువారం నిర్వహించిన ఓ సదస్సులో ఆయన ప్రసంగించారు. అమెరికాను మళ్లీ సుసంపన్నంగా మార్చడమే తన లక్ష్యమని చెప్పారు. చైనా, బ్రెజిల్ కూడా అమెరికా ఉత్పత్తులపై అధిక సుంకాలు వసూలు చేస్తున్నాయంటూ మండిపడ్డారు. భారత్ సుంకాలు ఎక్కువగానే విధిస్తున్నప్పటికీ.. ఆ దేశంతో అమెరికాకు మంచి బంధం ఉందని పేర్కొన్నారు. ప్రధాని మోదీ గొప్ప నాయకుడని కొనియాడారు. 2019లో అమెరికా అధ్యక్షుడిగా ఉన్న సమయంలో భారత్‌ను 'సుంకాల రాజు'గా ట్రంప్ వ్యాఖ్యానించిన సంగతి గమనార్హం. మరోవైపు- కమలా హారిస్ అమెరికా అధ్యక్షురాలైతే దేశమంతా డెట్రాయిట్‌లా తయారవుతుందని ట్రంప్ తాజా సదస్సులో వ్యాఖ్యానించారు. ఆయన వ్యాఖ్యలు డెట్రాయిట్‌ను అవమానించేలా ఉన్నాయంటూ పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు.

డెమోక్రటిక్ పార్టీ విధానాలకు కమలా హారిస్ బందీ

- ఓటర్లు ఆమె డమ్మీ అన్న అభిప్రాయానికి వస్తే ట్రంప్ విజయం ఖాయం
- ద వాల్‌స్ట్రీట్ జర్నల్ ఎడిటోరియల్ బోర్డ్ వెల్లడి

వాషింగ్టన్: అమెరికా ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ తన డెమోక్రటిక్ పార్టీ, ఆ పార్టీ విధానాలకు బందీ అని 'ద వాల్‌స్ట్రీట్ జర్నల్' ఎడిటోరియల్ బోర్డు గురువారం పేర్కొంది. ఒకవేళ ఇప్పటికీ ఓ నిర్ణయం తీసుకోని ఓటర్లు కమలా హారిస్ డమ్మీ అన్న అభిప్రాయానికి వస్తే ఆమె ప్రత్యర్థి, రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ విజయం సాధిస్తారని హెచ్చరించింది. "మెజారిటీ ఓటర్లు ట్రంప్‌నకు మళ్లీ ఓటు వేయరని కమలా హారిస్, డెమోక్రాట్లు అంటున్నారు. వారు చెప్పింది నిజం కావచ్చు. కమలా హారిస్ రాజకీయ డమ్మీ అని, చక్‌షుమర్, ఎలిజబెత్ వారెన్ వంటి డెమోక్రాట్లు ఆదేశిస్తే ఆమె ఏదైనా చేసేస్తారని ఓటర్లు భావిస్తే ట్రంప్ గెలవగలరు" అని చెప్పింది. "అధ్యక్షుడిగా జో బైడెన్ ఎలా అయితే ఏదైనా నిర్ణయం తీసుకోవడానికి పార్టీలోని ఇతరులపై ఆధారపడతారో.. ఆమె కూడా అదే తరహాలో పార్టీ విధానాలకు కట్టుబడి కీలక నిర్ణయాలు తీసుకోలేరనే విషయం స్పష్టమవుతోంది" అని ద వాల్‌స్ట్రీట్ జర్నల్ తన సంపాదకీయంలో పేర్కొంది. "హారిస్ ప్రచారంలో జోరు తగ్గుతోంది. దీనిపై డెమోక్రాట్లు ఆందోళన చెందుతున్నారు. 2020లో బైడెన్ పాటించిన ప్రచార వ్యూహాన్నే పాటిస్తుండడంతో కొందరు ఆమెను తప్పుబడుతున్నారు. ఓటర్లను ఆకర్షించడానికి ఆమె తనను తాను వినూత్నంగా ఆవిష్కరించుకోవాలని సూచిస్తున్నారు" అని వెల్లడించింది.

విద్యుత్తు బిల్లులు సగానికి తగ్గిస్తానన్న ట్రంప్

- అమెరికాలోనూ ఉచితాలు: కేజ్రీవాల్

దిల్లీ: అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైతే విద్యుత్తు ఛార్జీలు సగానికి తగ్గిస్తానని రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ హామీ ఇచ్చారు. "అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత 12 నెలల్లో ఇంధన, విద్యుత్తు బిల్లులు సగానికి తగ్గిస్తా. మన విద్యుత్తు సామర్థ్యాన్ని రెట్టింపు చేసేలా చర్యలు తీసుకుంటాం. దీంతో ద్రవ్యోల్బణం తగ్గుతుంది. ఈ చర్యల వల్ల అమెరికా మరీ ముఖ్యంగా మిషిగన్‌లో వ్యాపార అవకాశాలు పెరుగుతాయి" అని ట్రంప్ 'ఎక్స్' వేదికగా ప్రకటించారు. ఈ పోస్టును ఆప్ అధినేత, దిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ రీపోస్టు చేశారు. "విద్యుత్తు బిల్లులను సగానికి తగ్గిస్తానని ట్రంప్ ప్రకటించారు. ఉచిత తాయిలాలు అమెరికా దాకా వెళ్లాయి" అని పేర్కొన్నారు. దేశ రాజధాని నగరం దిల్లీలో అధికారంలో ఉన్న ఆప్ ప్రభుత్వం ఉచిత విద్యుత్తు పథకాన్ని అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఎన్డీయే పాలిత రాష్ట్రాల్లో ఉచిత విద్యుత్తును అమలు చేస్తే.. దిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో తాను మోదీ తరఫున ప్రచారం చేస్తానని ఇటీవల కేజ్రీవాల్ పేర్కొన్న సంగతి తెలిసిందే.

మోదీతో చర్చలు జరిపా

- కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో వెల్లడి

ఇంటర్నెట్ డెస్క్: భారత ప్రధాని నరేంద్ర మోదీతో లావోస్‌లో భేటీ అయినట్లు కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో వెల్లడించారు. భారత్-ఆసియాన్ శిఖరాగ్ర సదస్సు సందర్భంగా మోదీతో చర్చలు జరిపానన్నారు. "భారత్-ఆసియాన్ శిఖరాగ్ర సదస్సు నేపథ్యంలో మోదీతో సమావేశమై పలు అంశాలపై చర్చించా. మనం తదుపరి చేయాల్సిన పనులు ఉన్నాయని చెప్పా. వివరాల్లోకి వెళ్లను కానీ.. నేను ఎప్పుడూ చెబుతున్నట్లుగా కెనడా పౌరుల భద్రత, చట్టబద్ధపాలనే మా ప్రభుత్వ బాధ్యతలు. వాటిపైనే దృష్టి సారించా" అని ట్రూడో పేర్కొన్నారు. నరేంద్ర మోదీ నేతృత్వంలో మూడోసారి ప్రభుత్వం ఏర్పడిన సందర్భంలో మాట్లాడిన ట్రూడో.. నూతన ప్రభుత్వంతో తాము చర్చలు జరపడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పిన నేపథ్యంలో ఈ భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. ఖలిస్థానీ ఉగ్రవాది హర్‌దీప్ సింగ్ నిజ్జర్ హత్యలో భారత్ హస్తం ఉందంటూ కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో చేసిన వ్యాఖ్యలతో ఇరు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతిన్న విషయం తెలిసిందే.

చైనాపై సైబర్ దాడి

- సమాచారాన్ని చోరీచేస్తున్న గూఢచారి సంస్థలు

బీజింగ్: ఇంతవరకు భారత్, అమెరికా, ఐరోపా దేశాల ప్రభుత్వ యంత్రాంగాల్లోకి, రక్షణ, విద్యుత్తు కేంద్రాలు, ఓడ రేవులు, వైద్య, వాణిజ్య సంస్థల నెట్‌వర్కులలోకీ చైనా హ్యాకర్లు చొరబడి కీలక రహస్యాలను చోరీచేస్తున్నారని వార్తలు వింటూ వచ్చాం. ఇప్పుడు సైబర్ చౌర్యానికి గురికావడం చైనా వంతయింది. చైనా ప్రభుత్వం, కంపెనీలు తమ కంప్యూటర్ యంత్రాంగాలను ఆధునికీకరిస్తున్నందున పాత నెట్‌వర్క్ సాధనాలను, సర్వర్లు, సీసీటీవీ కెమేరాలను మూలన పడేస్తున్నాయి. విదేశీ గూఢచారి సంస్థలు సరిగ్గా ఈ పాత సాధనాలు, సర్వర్ల ద్వారా చైనా జాతీయ, వాణిజ్య రహస్యాలను చోరీచేస్తున్నాయని ఆ దేశ జాతీయ భద్రతా శాఖ (ఎంఎస్ఎస్) హెచ్చరించింది. ఒక చైనా కంపెనీ పక్కనపడేసిన సర్వర్‌ను ఇటీవల ఒక విదేశీ గూఢచారి సంస్థ తన అదుపులోకి తీసుకుని సైబర్ దాడి చేసిందని చైనీస్ మెసేజింగ్ యాప్ వియ్ చాట్ వేదికగా శుక్రవారం ఎంఎస్ఎస్ వెల్లడించింది. మరోసారి ఒక కెమేరా మానిటరింగ్ సంస్థ సర్వర్‌ను అదుపులోకి తీసుకుని యూజర్ పేర్లు, పాస్‌వర్డ్‌లను కాజేసి ముఖ్యమైన సమాచారాన్ని, చిత్రాలను దొంగిలించారని వెల్లడించింది. "విదేశీ గూఢచారులు డేటింగ్ పేరిట చైనీయులకు వల వేస్తున్నారు. విద్యాపరమైన కన్సల్టెంట్లుగా నటిస్తున్నారు, అధిక వేతనాలపై పార్ట్ టైమ్ ఉద్యోగాలు ఇస్తున్నట్లు చైనా విద్యార్థులను బురిడీ కొట్టిస్తున్నారు. ఫొటోగ్రఫీ ప్రాజెక్టుల పేరుతో కీలక సమాచారాన్ని దొంగిలిస్తున్నారు. ఈ-మెయిల్స్ పంపి వ్యక్తిగత మెయిల్ బాక్స్‌లలో సమాచారాన్నీ సంగ్రహిస్తున్నారు" అని చైనా జాతీయ భద్రతా శాఖ తెలిపింది.

జమ్మూకశ్మీర్‌లో 16న కొత్త ప్రభుత్వం!

- సీఎంగా ఒమర్ అబ్దుల్లా ప్రమాణానికి రంగం సిద్ధం

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో ప్రభుత్వ ఏర్పాటుకు నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్సీ) నేతృత్వంలోని కూటమి ముందుకు వచ్చింది. ఇదే విషయాన్ని లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హాను కలిసి చెబుతూ ఎమ్మెల్యేల మద్దతు లేఖలను సమర్పించింది. అంతకుముందు కాంగ్రెస్ పార్టీ కూడా ఎన్సీకి మద్దతును ప్రకటించింది. ఈ నెల 16న ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు లెఫ్టినెంట్ గవర్నర్‌కు తెలియజేసినట్లు ఒమర్ అబ్దుల్లా శుక్రవారం వెల్లడించారు.

చొరబాటుకు సిద్ధంగా 150 మంది ఉగ్రవాదులు

- బీఎస్ఎఫ్ అధికారి వెల్లడి

శ్రీనగర్: చలికాలం సమీపిస్తున్న నేపథ్యంలో కశ్మీర్ లోయలోకి చొరబడేందుకు నియంత్రణ రేఖ వెంట ఉన్న లాంచ్‌ప్యాడ్ల వద్ద 150 మంది ఉగ్రవాదులు సిద్ధంగా ఉన్నారని బీఎస్ఎఫ్ అధికారి ఒకరు తెలిపారు. అయితే ఉగ్రవాదుల చొరబాటు యత్నాలను సమర్థంగా తిప్పికొట్టేందుకు భద్రతా బలగాలు అప్రమత్తంగా ఉన్నాయన్నారు. "చొరబాటు యత్నాలు కొనసాగనున్నాయి. వివిధ సంస్థల నుంచి అందిన నిఘా సమాచారం ఆధారంగా మేం సరిహద్దు వెంట ముమ్మరంగా గస్తీ ప్రణాళిక అమలు చేయడానికి సైన్యంతో సమన్వయం చేసుకుంటున్నాం" అని బీఎస్ఎఫ్ ఐజీ (కశ్మీర్ ఫ్రాంటియర్) అశోక్ యాదవ్ శుక్రవారమిక్కడ విలేకరులకు తెలిపారు.

కోల్‌కతాలో 6వ రోజుకు చేరిన జూడాల నిరాహార దీక్ష

- ఒకరి పరిస్థితి విషమం
- తక్షణం స్పందించాలని మమతకు ఐఎంఏ లేఖ

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లోని ఆర్‌జీ కర్ ప్రభుత్వ ఆసుపత్రిలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటన వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ జూడాలు చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష శుక్రవారంతో ఆరోరోజుకు చేరింది. ఈ దీక్షల్లో పాల్గొంటున్న వైద్యుల్లో అనికేత్ మహతో పరిస్థితి విషమంగా ఉన్నటు వైద్యాధికారులు తెలిపారు. స్పృహ తప్పిన స్థితిలో ఆయనను ఆసుపత్రికి తరలించి గురువారం రాత్రి నుంచీ చికిత్స అందిస్తున్నారు. మహతో ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించడానికి అయిదుగురు సభ్యులతో మెడికల్ బోర్డును ఏర్పాటుచేశారు. దీక్షల్లో పాల్గొంటున్న మరో ఆరుగురు వైద్యుల ఆరోగ్యం కూడా క్షీణిస్తున్నట్లు ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. వీరికి సకాలంలో వైద్యం అందించడానికి దీక్ష ప్రాంతంలో ఐసీయూ అంబులెన్సు, ఇతర వైద్య పరికరాలను సిద్ధం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తమ డిమాండ్లను పూర్తిగా పరిష్కరించేవరకు నిరాహార దీక్షలు కొనసాగుతాయని జూడాలు పునరుద్ఘాటించారు. తమలో ఎవరికి ఏం జరిగినా దానికి రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. అలాగే నార్త్ బెంగాల్ వైద్య కళాశాలలోనూ నిరవధిక నిరాహార దీక్షలు చేస్తున్న మరో ఇద్దరు జూనియర్ వైద్యులు సైతం ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు అక్కడి వైద్యాధికారులు తెలిపారు. "ఈ యువ వైద్యులే మన భవిష్యత్తు. పరిస్థితి చేయి దాటకముందే ప్రభుత్వం వేగంగా స్పందించాలి" అని ఓ సీనియర్ డాక్టర్ డిమాండ్ చేశారు. దీక్షలు చేపట్టిన జూడాలకు ఏదైనా హాని జరిగితే వైద్యసేవలను పూర్తిగా నిలిపివేస్తామని 'ఫెడరేషన్ ఆఫ్ ఆలిండియా మెడికల్ అసోసియేషన్ (ఎఫ్ఏఐఎంఏ) ఓ ప్రకటనలో హెచ్చరించింది. దాదాపు వారం రోజులుగా నిరాహార దీక్షలు చేస్తున్న జూడాల ఆరోగ్య పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేసిన ఐఎంఏ అధ్యక్షుడు ఆర్.వి.అశోకన్.. తక్షణం జోక్యం చేసుకోవాలంటూ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి లేఖ రాశారు.

కోల్‌కతాలో జూనియర్ వైద్యులు చేపట్టిన నిరాహార దీక్ష శిబిరానికి భారీ సంఖ్యలో చేరుకున్న ప్రజలు

దిల్లీలో వారం రోజుల్లో రూ.7,700 కోట్ల విలువైన డ్రగ్స్ స్వాధీనం

దిల్లీ: దేశ రాజధాని నగరంలో వారం రోజుల వ్యవధిలో జరిపిన రెండు దాడుల్లో పోలీసులు రూ.7,700 కోట్ల విలువైన డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. అక్రమ ధన చలామణి కేసు నమోదు చేసి దిల్లీ, ముంబయి, గురుగ్రామ్‌లలో సోదాలు జరిపినట్లు ఈడీ అధికారులు శుక్రవారం వెల్లడించారు. ఈ కేసుల్లో పోలీసులు ఇంతవరకు ఏడుగురిని అరెస్టు చేశారు. ఈ నెల 2వ తేదీన దిల్లీ ప్రత్యేక పోలీసు సిబ్బంది నగరంలోని మహిపాల్‌పుర్‌లో రూ.5,620 కోట్ల విలువైన 560 కిలోల కొకైన్‌ను, 40 కిలోల గంజాయిని పట్టుకున్న విషయం తెలిసిందే. 10వ తేదీన నగరంలోని రమేశ్‌నగర్‌లో అద్దె దుకాణం నుంచి రూ.2,080 కోట్ల విలువైన 208 కిలోల కొకైన్‌ను స్వాధీనం చేసుకొన్నారు. అధికారుల కథనం మేరకు.. ఈ రెండు కేసులకూ సంబంధం ఉంది. ప్రధాన నిందితుడైన తుషార్ గోయెల్ కుటుంబానికి ప్రచురణ సంస్థలు ఉన్నాయి. తుషార్ ఈ ఏడాది జూన్‌లో దుబాయ్, థాయిలాండ్‌లకు వెళ్లి మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు పథకం వేశాడు. భారత్‌లోకి తెచ్చిన కొకైన్‌ను మహిపాల్‌పుర్‌లోని తన ప్రచురణ సంస్థ గోదాములో నిల్వ చేశాడు. పోలీసులు ఈ ప్రచురణ సంస్థ కార్యాలయాలపైనా దాడులు చేశారు. ఇతర నిందితుల ఇళ్లు, కార్యాలయాలనూ సోదా చేశారు.

అలాంటి కష్టకాలాన్ని చూశా.. భాజపా హయాంలోనే మార్పు: జేపీ నడ్డా

బిలాస్‌పుర్: కాంగ్రెస్ అంటే విభజించు పాలించు, ఓటు బ్యాంకు రాజకీయాలకు పర్యాయ పదమని భాజపా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా దుయ్యబట్టారు. భాజపా వల్లే అభివృద్ధి జరుగుతుందన్నారు. హరియాణా ఎన్నికల విజయోత్సాహంలో ఉన్న ఆయన శుక్రవారం హిమాచల్‌ప్రదేశ్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడి నైనా దేవి ఆలయాన్ని దర్శించుకొని పూజలు నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. హరియాణా, జమ్మూకశ్మీర్‌లో భాజపా చాలా సాధించిందన్న ఆయన.. ఈ ఘనత అంతా ప్రజలు, ఆ భగవంతుడికే దక్కుతుందన్నారు. త్వరలో ఎన్నికలు జరగనున్న మహారాష్ట్ర, ఝార్ఖండ్‌లలో కూడా క్లీన్‌స్వీప్ చేస్తామని విశ్వాసం వ్యక్తంచేశారు. అనంతరం భాజపా కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో నడ్డా మాట్లాడారు. హిమాచల్‌లో తాము చేపట్టిన అభివృద్ధి పనులను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. "మీరు ఇక్కడ చూస్తున్న ప్రతి ఇటుకా భాజపా హయాంలో వేసినదే. ప్రజలు నీటి కోసం ఉదయం 4 గంటలకే నిద్రలేచి గంటల తరబడి బకెట్లు పట్టుకొని వేచి ఉండే రోజులను నేను చూశాను. కానీ ఇప్పుడు ప్రతి ఇంట్లో కుళాయి ఉంది. గ్రామాలకు రోడ్లు వేసి అనుసంధానం చేశాం" అని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వ పనితీరుతో ప్రజలంతా ఆనందంగా ఉన్నారన్నారు. హరియాణా యువత, రైతులు, మహిళలు.. అన్ని వర్గాల వారు ప్రతిపక్ష పార్టీలకు తగిన పాఠం నేర్పారని తెలిపారు. మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వ విధానాలను ప్రజలు విశ్వసిస్తున్నారని ఈ ఫలితాలే స్పష్టం చేస్తున్నాయని నడ్డా చెప్పారు. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదం నియంత్రణలోనే ఉందని తెలిపారు. భాజపా పాలన అంటే కేవలం అధికారంలో కూర్చోవడానికి కాదు.. దేశాన్ని సురక్షితంగా ఉంచేందుకని చెప్పారు.

అమెరికాలో మిల్టన్ తుపాను బీభత్సం

- ఫ్లోరిడా రాష్ట్రంలో ఎనిమిది మంది మృతి

సెయింట్ పీటర్స్‌బర్గ్ (ఫ్లోరిడా): మిల్టన్ తుపాను ఉద్ధృతికి అమెరికాలోని ఫ్లోరిడా రాష్ట్రం అతలాకుతలమైంది. గురువారం సంభవించిన బలమైన సుడిగాలుల (టోర్నడో) ధాటికి అక్కడి తీర ప్రాంతాల్లో తీవ్ర నష్టం సంభవించింది. అనేక ఇళ్లు నేలమట్టమవ్వగా, వీధులన్నీ బురదతో నిండిపోయాయి. రెస్క్యూ బృందాలు ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించినప్పటికీ.. కనీసం ఎనిమిది మంది మృతి చెందినట్లు అక్కడి అధికారులు తెలిపారు. రెండు వారాల క్రితం హెలీన్ హరికేన్ సృష్టించిన నష్టాన్ని మరవకముందే ఇప్పుడు మిల్టన్ విరుచుకుపడింది. దీని ధాటికి 30 లక్షల మంది విద్యుత్తు సౌకర్యం లేక అంధకారంలో అలమటిస్తున్నారు. తీరానికి సమీపంలో ఉన్న దీవులను వరదలు ముంచెత్తాయి. గాలుల తీవ్రతకు ఓ బేస్‌బాల్ స్టేడియం పైకప్పు ముక్కలుగా విరిగిపోగా, నిర్మాణ పనుల్లో ఉన్న క్రేన్ సైతం కూలిపోయింది. సరసోటా కౌంటీలో తుపాను తీవ్రత ఎక్కువగా ఉంది. ఇక్కడ 45 సెంటీమీటర్ల మేర వర్షం కురిసింది.

ఫ్లోరిడాలోని ఫోర్ట్ పియర్స్‌లో హరికేన్ కారణంగా ధ్వంసమైన నివాస భవనాలు

భారత్, భూటాన్ సుప్రీంకోర్టుల మధ్య 4 ఎంవోయూలు

దిల్లీ: భారత్, భూటాన్‌ల మధ్య న్యాయ సంబంధ అంశాల్లో సహకారాన్ని పెంపొందించుకునేందుకు నాలుగు అవగాహన ఒప్పందాలు (ఎంవోయూలు) కుదిరాయి. వీటిపై భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీ.వై.చంద్రచూడ్, భూటాన్ ప్రధాన న్యాయమూర్తి లియాన్‌పో చోగ్యాల్ డాగో రిగ్జిన్ సంతకాలు చేశారు. ఈ మేరకు సుప్రీంకోర్టు ఓ ప్రకటన విడుదల చేసింది. "సీజేఐ జస్టిస్ డీ.వై.చంద్రచూడ్ ఈ నెల 7 నుంచి 10 మధ్య భూటాన్ అధికారిక పర్యటనలో భాగంగా ఆ దేశ రాణి సోనం డెచన్ వాంగ్‌చుక్, ప్రధాన మంత్రి డాషో త్సేరింగ్ టోబ్గాయ్‌తో భేటీ అయ్యారు. వివిధ అంశాలపై చర్చించారు. అక్టోబరు 9న ద్వైపాక్షిక న్యాయ సంబంధ అంశాల సహకారంపై భూటాన్ ప్రధాన న్యాయమూర్తి లియాన్‌పో చోగ్యాల్ డాగో రిగ్జిన్‌తో చర్చించారు. అనంతరం ఆ దేశ సుప్రీంకోర్టులో నాలుగు ఎంవోయూలపై రెండు దేశాల ప్రధాన న్యాయమూర్తులు సంతకాలు చేశారు. ఇందులో వివిధ న్యాయ విద్యా సంస్థల మధ్య సహకారం, బలోపేతం చేసుకోవడం వంటివి ఉన్నాయి" అని అందులో పేర్కొంది.

నీతీశ్‌జీ.. ఎన్డీయేను వీడండి

- ఎస్పీ అధ్యక్షుడు అఖిలేశ్ డిమాండ్

లఖ్‌నవూ: సోషలిస్టు జయప్రకాశ్ నారాయణ్(జేపీ) జయంతి సందర్భంగా తలెత్తిన ఓ వివాదం సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ), జనతా దళ్ (యు) మధ్య వివాదానికి ఆజ్యం పోసింది. లఖ్‌నవూలోని జేపీ అంతర్జాతీయ కేంద్రంలో ఉన్న జయప్రకాశ్ నారాయణ్ విగ్రహం వద్ద నివాళులర్పించేందుకు ఎస్పీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్‌ను శుక్రవారం యూపీ సీఎం ఆదిత్యనాథ్ ప్రభుత్వం అనుమతించకపోవడం వివాదాస్పదమైంది. జేపీ విగ్రహం వద్దకు వెళ్లకుండా నిరోధించేందుకు అఖిలేశ్ నివాసం సమీపంలో బ్యారికేడ్లు నిర్మించడంతో వందల మంది ఎస్పీ కార్యకర్తలు గుమిగూడి నిరసనకు దిగారు. ఉదయం 10.30 గంటల తర్వాత సమీప వీధిలోని జేపీ విగ్రహానికి అఖిలేశ్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రసంగిస్తూ...జేపీ ప్రారంభించిన ప్రజాస్వామ్య ఉద్యమమే బిహార్ సీఎం నీతీశ్ కుమార్ రాజకీయ జీవితానికి పునాదులు వేసిందని ఎస్పీ అధ్యక్షుడు అఖిలేశ్ గుర్తు చేశారు. జేపీ అనుయాయులను అడ్డుకుంటున్న యూపీలోని భాజపా ప్రభుత్వ చర్యకు నిరసనగా నీతీశ్‌కుమార్ నేతృత్వంలోని జేడీ(యు)... కేంద్రంలోని ఎన్డీయే సర్కారుకు మద్దతు ఉపసంహరించుకుని వెలుపలకు రావాలని అఖిలేశ్ డిమాండ్ చేశారు. అటువంటి నిర్ణయం తీసుకోవడానికి ఇదే సరైన సమయమని తెలిపారు. అయితే, ఎస్పీ అధ్యక్షుడి డిమాండ్‌ను జేడీ(యు) నేతలు కొట్టిపారేశారు. జేపీ సిద్ధాంతాలను పట్టించుకోని అఖిలేశ్ ఆయనను రాజకీయ ప్రయోజనాలకు వాడుకునేందుకు యత్నిస్తున్నారని దుయ్యబట్టారు. తాజా వివాదంపై లఖ్‌నవూ అభివృద్ధి సంస్థ (ఎల్‌డీఏ) వివరణ ఇస్తూ...జేపీ అంతర్జాతీయ కేంద్రం వద్ద నిర్మాణ పనులు జరుగుతున్నందునే ఆ ప్రాంతానికి ఎవరినీ అనుమతించలేదని తెలిపింది. వర్షం కురవడం, నిర్మాణ సామగ్రి చెల్లాచెదురుగా ఉండడంతో అక్కడకు వెళ్లడం సురక్షితం కాదని పేర్కొంది.


జయప్రకాశ్ నారాయణ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న అఖిలేశ్

ఇజ్రాయెల్ దాడుల కారణంగా లెబనాన్ రాజధాని బీరుట్‌లో ధ్వంసమైన భవనాలు

ఖుద్స్ ఫోర్స్ అధినేతే ఇరాన్ ఇంటిదొంగ!

ఇస్మాయిల్ ఖానీ

ఇంటర్నెట్ డెస్క్: ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్‌జీసీ)కు చెందిన ఖుద్స్ ఫోర్స్ అధినేత ఇస్మాయిల్ ఖానీ ఇజ్రాయెల్ ఏజెంట్‌గా పనిచేస్తున్నట్లు వస్తున్న వార్తలు తాజాగా కలకలం సృష్టిస్తున్నాయి. పశ్చిమ దేశాల మీడియా కథనాల ప్రకారం- విషయం బయటపడటంతో ఖానీని ఇరాన్ దళాలు బంధించాయి. ఇంటరాగేషన్ చేస్తుండగా ఆయనకు గుండెపోటు వచ్చింది. చికిత్స కోసం వెంటనే ఆసుపత్రికి తరలించారు. ఖానీ సన్నిహిత బృందాన్ని కూడా ఇరాన్ దళాలు అదుపులోకి తీసుకున్నాయి. ఆయనతో భేటీ అయిన తర్వాతే నస్రల్లా సహా పలువురు కీలక హెజ్‌బొల్లా నేతలపై ఇజ్రాయెల్ దాడి చేసినట్లు సౌదీ అరేబియాకు చెందిన అల్ హదిత్ ఛానల్ పేర్కొంది. మరోవైపు- ఇజ్రాయెల్‌పై నిఘా వేసేందుకు నియమించిన సీక్రెట్ విభాగం చీఫ్ తమ సమాచారాన్ని ఆ దేశానికి అందించాడని ఇరాన్ మాజీ అధ్యక్షుడు మహమూద్ అహ్మదినెజాద్ ఇటీవల వాపోయిన సంగతి గమనార్హం.

ఉక్రెయిన్‌లోని ఒడెస్సాపై రష్యా దాడులు

- 16 ఏళ్ల బాలిక సహా నలుగురు పౌరుల మృతి

కీవ్: ఉక్రెయిన్ దక్షిణ ప్రాంతంలోని ఒడెస్సా నగరంపై రష్యా క్షిపణి దాడులకు పాల్పడింది. దీంతో 16 ఏళ్ల బాలిక సహా నలుగురు పౌరులు మృతి చెందారని స్థానిక అధికారులు శుక్రవారం వెల్లడించారు. గడచిన వారం రోజులుగా ఈ ప్రాంతంపై రష్యా దాడులు కొనసాగిస్తోంది. తద్వారా ఉక్రెయిన్ ఆహార ధాన్య ఎగుమతులను దెబ్బతీయాలని భావిస్తోంది. ఈ వారంలో ఒడెస్సా ప్రాంతంపై నాలుగుసార్లు క్షిపణి, డ్రోన్ దాడులు జరిగాయి. ఈ ఘటనల్లో మొత్తం 14 మంది మరణించారు. 20 మంది గాయపడ్డారు. రష్యా దాడులతో పలు వాణిజ్యనౌకలు, నౌకాశ్రయ మౌలికసదుపాయాలు దెబ్బతిన్నాయి.

భారతీయ టీకాల ప్రమాణాలు భేష్

దిల్లీ: ప్రపంచ ఆరోగ్యసంస్థ (డబ్ల్యూహెచ్‌వో) నెలకొల్పిన క్రియాశీల వ్యాక్సిన్ నియంత్రణ ప్రమాణాలను భారత జాతీయ ఏజెన్సీ 'కేంద్రీయ ఔషధ ప్రమాణాల నియంత్రణ సంస్థ' (సీడీఎస్‌సీవో) అందుకొంది. పేద దేశాలకు సరసమైన ధరలకు టీకాలు, జెనరిక్ మందులను అందిస్తున్న భారత కీర్తికిరీటంలో ఇది కలికితురాయి అని కేంద్ర ఆరోగ్యశాఖ కార్యదర్శి పుణ్య సలిల శ్రీవాస్తవ ప్రశంసించారు. జెనీవాలోని ప్రపంచ ఆరోగ్యసంస్థ ప్రధాన కార్యాలయం నుంచి వచ్చిన అంతర్జాతీయ నిపుణుల బృందం సెప్టెంబరు 16 నుంచి 20 వరకు భారతదేశ వ్యాక్సిన్ నియంత్రణ వ్యవస్థను తనిఖీ చేసింది. ప్రపంచవ్యాప్తంగా సరఫరా చేసే టీకాలకు డబ్ల్యూహెచ్‌వో నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా భారత్‌లో టీకాలు తయారవుతున్నాయని ఈ బృందం ధ్రువీకరించింది.

ఫ్రాన్స్‌లో వరదల కారణంగా క్రెసీ-లా-చాపెల్లెలో నీట మునిగిన ప్రాంతం

(c) eenadu

ఈనాడు సినిమా



'విశ్వంభర' రాక... ఓ వేడుక

అభిమానులు, సినీ ప్రియుల దసరా వేడుకల్లో 'విశ్వంభర' ఓ భాగం కానుంది. చిరంజీవి కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'విశ్వంభర' టీజర్ శనివారం విడుదలవుతోంది. 'అందరూ ఎదురు చూస్తున్న అతని రాక ఓ వేడుక' అంటూ ఈ విషయాన్ని చిత్రబృందం శుక్రవారం అధికారికంగా ప్రకటించింది. వశిష్ఠ దర్శకత్వంలో, యు.వి.క్రియేషన్స్ పతాకంపై రూపొందుతున్న చిత్రమిది. చిరంజీవి సరసన త్రిష నటిస్తున్నారు. విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మాతలు. నేడు విడుదలవుతున్న టీజర్‌తో పాటు, విడుదల తేదీపై కూడా చిత్రబృందం స్పష్టతనిచ్చే అవకాశాలున్నాయి. ఈ చిత్రానికి సంగీతం: ఎం.ఎం.కీరవాణి.

సల్మాన్ తిరస్కరిస్తే.. షారుక్‌కు స్టార్‌డమ్

ఫ్లాష్‌బాక్


షారుక్ ఖాన్

కొందరి నటీనటుల కెరీర్‌లో అనుకోకుండా వచ్చిన అవకాశాలే కొన్నిసార్లు మంచి ప్రశంసల్ని తెచ్చిపెడుతుంటాయి. అలా షారుక్‌కు గుర్తింపుతో పాటు ప్రేక్షకులకు మరింత దగ్గర చేసిన చిత్రం 'బాజీగర్'. ఆయన ప్రధాన పాత్రలో అబ్బాస్-మస్తాన్ తెరకెక్కించిన ఈ సినిమా అప్పట్లో ఘనవిజయాన్ని అందుకుంది. ఇందులో విక్కీ మల్హోత్రా అనే నెగటివ్ పాత్రలో కనిపించిన షారుక్ నటనకు సినీప్రియులు ఫిదా అయ్యారు. కానీ..ఈ విక్కీ పాత్ర కోసం ముందుగా అనుకున్నది సల్మాన్ ఖాన్‌నే. ఆయన తిరస్కరిస్తేనే అది షారుక్ ఖాతాలో చేరింది. ఈ విషయాన్ని ఓ ఇంటర్వ్యూలో సల్మాన్ స్వయంగా పంచుకున్నారు. "నాకు బాజీగర్ కథ చాలా నచ్చింది. కానీ కెరీర్ ప్రారంభంలోనే ఇలాంటి ప్రతినాయక ఛాయలున్న పాత్రలో నటించాలనిపించలేదు. అందుకే ఎమోషనల్‌గా ఉంటుందని తల్లి పాత్రను జోడించమని అబ్బాస్-మస్తాన్‌కు చెప్పాను. వాళ్లు స్పందించలేదు. చాలా చర్చల తర్వాత నేను ఈ చిత్రం నుంచి తప్పుకోవాలని నిర్ణయించుకున్నాను. కానీ సినిమా పూర్తయిన తర్వాత.. ఓ రోజు దర్శకుడు నాకు ఫోన్ చేసి 'మీరు చెప్పిన ఆ తల్లి పాత్ర ఆలోచన నచ్చి ఇందులో జోడించాము. మాకు ఇలాంటి ఐడియా ఇచ్చినందుకు ధన్యవాదాల'ని చెప్పారు. ఇందులో విక్కీ మల్హోత్రా పాత్రలో షారుక్‌ను తీసుకున్నందుకు ఎలాంటి బాధ లేదు. ఆ రోజు నేను తిరస్కరించిన ఆ చిత్రమే.. షారుక్‌కు మంచి స్టార్‌డమ్ తెచ్చిపెట్టిందనే విషయంలో నాకు సంతోషంగా ఉంద"ని ఆనాటి రోజుల్ని గుర్తుచేసుకున్నారు.

పరాజయం చెప్పే పాఠం విలువైనదైనా.. ప్రతిభను చాటి చెప్పి ప్రపంచం ముందు హీరోగా నిలబెట్టేది విజయమే. అందుకే జీవితంలో జయాపజయాలు సాధారణమే అయినా ప్రతి ఒక్కరూ విజయం వెంటే పరుగులు తీస్తుంటారు. అయితే ఇతర రంగాలతో పోల్చితే చిత్ర పరిశ్రమలో ఈ విజయాలే సినీ కెరీర్‌కు కీలకంగా నిలుస్తుంటాయి. ఒక్క హిట్టు చాలు.. రాత్రికి రాత్రే తారల జాతకాలు మారిపోవడానికి. అగ్రతారలుగా ఆధిపత్యం ప్రదర్శించాలన్నా.. సినిమా సినిమాకీ మార్కెట్ లెక్కలు పెంచుకుంటూ పోవాలన్నా నిలకడగా విజయాల బాటలో పయనం సాగించాల్సిందే. అదే ఇటు తారలకు.. అటు చిత్రసీమకూ శ్రీరామరక్ష. అందుకే అభిమానులు కూడా తమ కథానాయకులు వరుస విజయాలతో దూసుకెళ్లాలని కాంక్షిస్తూ ఉంటారు. ఇప్పుడిలా ప్రేక్షకుల ఆకాంక్షలకు తగ్గట్లుగా విజయాలతో సవారీ చేస్తూ.. తదుపరి చిత్రాల విషయంలో అంచనాల్ని అంతకంతకూ పెంచేస్తున్న హీరోలు తెలుగులో చాలా మందే కనిపిస్తున్నారు. విజయానికి ప్రతీకగా నిలిచే విజయ దశమి సందర్భంగా ఆ తారల చిత్ర విశేషాలివీ..!

అంచనాలు పెంచిన విజయ మంత్రం

వరుస హిట్లతో జోరు చూపిస్తున్న తారలు

కథానాయకులు వరుస విజయాలతో జోరు చూపిస్తుంటే సినీప్రియుల్లోనూ.. మార్కెట్ వర్గాల్లోనూ ఓ నూతనోత్సాహం కనిపిస్తుంటుంది. అది చిత్రసీమకు ఓ సరికొత్త ఉత్తేజాన్ని అందిస్తుంటుంది. కాకపోతే ఈ పరిశ్రమలో నిలకడగా జైత్ర యాత్ర సాగించడం కత్తిమీద సాము లాంటి వ్యవహారమే. అలాంటిది ఈ మధ్య కాలంలో అగ్ర కథానాయకుల నుంచి కుర్ర హీరోల వరకు పలువురు వరుస విజయాలతో బాక్సాఫీస్ ముందు జోరు చూపిస్తున్నారు. దీని కోసం వాళ్లు తెర వెనుక తమదైన రీతిలో శ్రమిస్తున్నారు. ఆలస్యమైనా సరే కథల ఎంపికలో ఆచితూచి అడుగులేయడం.. ప్రేక్షకుల అభిరుచులకు తగ్గట్లుగా కొత్తదానికి ప్రాధాన్యత ఇవ్వడం.. అన్నీ చక్కగా కుదిరాకే ఆయా ప్రాజెక్ట్ కోసం రంగంలోకి దిగడం.. వాళ్లు చేస్తున్న పని. కథానాయకుడు నందమూరి బాలకృష్ణ గత నాలుగేళ్లుగా నిర్విరామంగా జైత్ర యాత్ర కొనసాగిస్తున్నారు. 'అఖండ', 'వీరసింహారెడ్డి', 'భగవంత్ కేసరి' సినిమాలతో హ్యాట్రిక్ విజయాలందుకున్న ఆయన.. భారీ వసూళ్లతో బాక్సాఫీస్‌కు ఫుల్ జోష్‌ను అందించారు. దీంతో ప్రస్తుతం ఆయన నుంచి రానున్న 'ఎన్‌బీకె 109' (వర్కింగ్ టైటిల్)పైనా అంచనాలు భారీగా పెరిగిపోయాయి. బాబీ దర్శకత్వంలో ముస్తాబవుతున్న ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం హైదరాబాద్‌లో శరవేగంగా జరుగుతోంది. ఈ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో బాలయ్య రెండు కోణాల్లో సాగే పాత్రలో కనువిందు చేయనున్నారు. ఇది వచ్చే ఏడాది తెరపైకి వచ్చే అవకాశమున్నట్లు తెలుస్తోంది. 'బాహుబలి' విజయాల తర్వాత వరుస పరాజయాలతో సతమతమైన ప్రభాస్ గతేడాది 'సలార్: పార్ట్ 1 - సీజ్‌ఫైర్'తో తిరిగి హిట్ ట్రాక్ ఎక్కిన సంగతి తెలిసిందే. ఇది బాక్సాఫీస్ ముందు దాదాపు రూ.700కోట్ల వసూళ్లు సాధించి సత్తా చాటగా.. ఈ ఏడాది 'కల్కి 2898ఎ.డి'తో దాదాపు రూ.1150కోట్ల పైచిలుకు వసూళ్లు కొల్లగొట్టి గత రికార్డును తిరగరాశారు ప్రభాస్. దీంతో ఇప్పుడాయన నుంచి రానున్న 'రాజా సాబ్'పై అంచనాలు మరింత రెట్టింపయ్యాయి. మారుతి తెరకెక్కిస్తున్న ఈ రొమాంటిక్ కామెడీ హారర్ థ్రిల్లర్ ప్రస్తుతం ముగింపు దశలో ఉంది. మరి ఈ సినిమాతో ప్రభాస్ హ్యాట్రిక్ కొడతారా లేదా? తెలియాలంటే వచ్చే ఏడాది ఏప్రిల్ 10వరకు వేచి చూడక తప్పదు. ఈసారి దీన్ని పాన్ వరల్డ్ సినిమాగా విదేశీ భాషల్లోనూ విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. దీంతో ఇది వసూళ్ల పరంగా ఎలాంటి రికార్డులు అందుకుంటుందన్నది సినీప్రియుల్లో ఆసక్తి రేకెత్తిస్తోంది.

◆ చిత్రసీమలో దశాబ్ద కాలం పాటు నిలకడగా జైత్ర యాత్ర సాగించడమన్నది అరుదుగా కనిపిస్తుంటుంది. ఇప్పుడలాంటి ఘనతకు అడుగు దూరంలో ఉన్నారు కథానాయకుడు ఎన్టీఆర్. 2015లో 'టెంపర్'తో మొదలైన తారక్ జైత్ర యాత్ర 'నాన్నకు ప్రేమతో', 'జై లవ కుశ', 'అరవింద సమేత..', 'ఆర్ఆర్ఆర్' విజయాలతో డబుల్ హ్యాట్రిక్ అందుకున్న సంగతి తెలిసిందే. ఇప్పుడాయన 'దేవర: పార్ట్ 1'తో మరోసారి బాక్సాఫీస్ ముందు జోరు చూపిస్తున్నారు. కొరటాల శివ తెరకెక్కించిన ఈ పాన్ ఇండియా చిత్రం ప్రస్తుతం వసూళ్ల పరంగా రూ.500కోట్ల మైలురాయికి చేరువైంది. మరి ఇది దసరా సీజన్ ముగిసే నాటికి ఇంకెన్ని రికార్డులు అందుకుంటుందో అని అందరిలోనూ ఆసక్తి రేకెత్తిస్తోంది. ఇక వచ్చే ఏడాది ఎన్టీఆర్ నుంచి 'వార్ 2' వచ్చే అవకాశముంది. హృతిక్‌తో కలిసి చేస్తున్న ఈ మల్టీస్టారర్‌పై ఇప్పటికే ఇటు దక్షిణాదిలోనూ.. అటు ఉత్తరాదిలోనూ భారీ అంచనాలేర్పడ్డాయి. ఇది కూడా విజయవంతమైతే దశాబ్ద కాలం పాటు నిర్విరామంగా జైత్ర యాత్ర సాగించిన హీరోగా నిలుస్తారు తారక్. రాశి కంటే వాశి ముఖ్యమని నమ్ముతూ.. ఆలస్యమైనా సరే సినిమాల విషయంలో జాగ్రత్తగా అడుగులేస్తూ వరుస విజయాలతో దూసుకెళ్తున్నారు కథానాయకుడు అల్లు అర్జున్. 'అల.. వైకుంఠపురములో'తో ఫ్లాప్‌లకు చెక్ చెప్పిన ఆయన ఆ తర్వాత 'పుష్ప: ది రైజ్'తో ఏకంగా జాతీయ స్థాయిలో సత్తా చాటారు. దీంతో ఇప్పుడాయన నుంచి రానున్న 'పుష్ప 2: ది రూల్'పై ఇటు దక్షిణాదిలోనూ.. అటు ఉత్తరాదిలోనూ భారీ అంచనాలేర్పడ్డాయి. సుకుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం ముగింపు దశలో ఉంది. ఇది డిసెంబరు 6న థియేటర్లలోకి రానుంది. మరి బన్నీ ఈసారి 'పుష్ప 2'తో ఎలాంటి ఘనతలు అందుకుంటారో చూడాలి. ఓవైపు సినిమాల విషయంలో వేగం చూపిస్తూనే.. మరోవైపు విజయాల పరంగానూ దూకుడు చూపిస్తున్నారు కథానాయకుడు నాని. గతేడాది 'దసరా', 'హాయ్ నాన్న' చిత్రాలతో వరుస విజయాలందుకున్న ఆయన.. ఈ ఏడాది 'సరిపోదా శనివారం'తో హ్యాట్రిక్ పూర్తి చేశారు. దీంతో ఇప్పుడాయన నుంచి రానున్న తదుపరి చిత్రాలపైనా అంచనాలు రెట్టింపయ్యాయి. ప్రస్తుతం ఆయన ఓవైపు 'హిట్ 3'ని పూర్తి చేస్తూనే.. మరోవైపు దర్శకుడు శ్రీకాంత్ ఓదెలతోనూ ఓ కొత్త ప్రాజెక్ట్ పట్టాలెక్కించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ రెండూ వచ్చే ఏడాదే తెరపైకి రానున్నాయి.

కుర్రాళ్లు కుమ్మేస్తున్నారు..

వేగానికి చిరునామాగా నిలిచే కుర్రహీరోల్లో నిలకడగా వరుస విజయాలతో జోరు చూపిస్తున్న వాళ్లు కొందరున్నారు. థ్రిల్లర్ చిత్రాలతో మురిపిస్తూ సినీప్రియుల్లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు అడివి శేష్. 'క్షణం' నుంచి మొదలైన ఆయన జైత్ర యాత్ర 'హిట్: ది సెకండ్ కేస్'తో డబుల్ హ్యాట్రిక్ పూర్తి చేసుకుంది. ఇప్పుడాయన నుంచి 'జీ2', 'డెకాయిట్' చిత్రాలు రావాల్సి ఉంది. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న ఈ రెండు సినిమాలపైనా సినీప్రియుల్లో భారీ అంచనాలే నెలకొని ఉన్నాయి. 'ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ'తో హీరోగా తొలి ప్రయత్నంలోనే సత్తా చాటారు నవీన్ పొలిశెట్టి. 'జాతిరత్నాలు', 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' విజయాలతో హ్యాట్రిక్‌ను పూర్తి చేశారు. దీంతో ఈసారి ఆయన ఎలాంటి సినిమాతో తెరపైకి వస్తారన్న ఆసక్తి ప్రేక్షకుల్లో మొదలైంది. నవీన్ ప్రస్తుతం గీతా ఆర్ట్స్2లో ఓ ప్రాజెక్ట్ చేయనున్నట్లు ప్రచారం మొదలైంది. 'డీజే టిల్లు', 'టిల్లు స్క్వేర్' చిత్రాలతో ప్రేక్షకుల్ని కడుపుబ్బా నవ్వించారు యువ హీరో సిద్ధు జొన్నలగడ్డ. ఇప్పుడాయన 'జాక్', 'తెలుసు కదా' సినిమాలతో అలరించేందుకు సమాయత్తమవుతున్నారు.

శ్రుతి.. ది డెవిల్ ఈజ్ వెయిటింగ్!

నవీన్ చంద్ర హీరోగా లోకేశ్ అజ్ల్స్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'లెవెన్'. అజ్మల్ ఖాన్, రేయా హరి నిర్మిస్తున్నారు. రేయా, శశాంక్, అభిరామి తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. నిర్మాణానంతర పనుల్లో ఉన్న ఈ సినిమా త్వరలో తెలుగు, తమిళ భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే ఇందులో నటి శ్రుతి హాసన్ పాడిన "ది డెవిల్ ఈజ్ వెయిటింగ్" అనే గీతాన్ని హీరో కమల్‌హాసన్ విడుదల చేశారు. ఈ పాటకు డి.ఇమ్మాన్ స్వరాలు సమకూర్చగా.. దర్శకుడు లోకేశ్ సాహిత్యమందించారు. "ఆసక్తికర కథాంశంతో తెరకెక్కిన ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ ఇది. స్క్రీన్‌ప్లే చాలా రేసీగా ఉంటుంది. త్వరలో విడుదల తేదీ ప్రకటిస్తాం" అని చిత్ర వర్గాలు తెలిపాయి.

శ్రుతి హాసన్

వేణు, శ్రీను వైట్ల, గోపీచంద్, కావ్య

ఒక్క సెకను కూడా బోర్ కొట్టలేదంటున్నారు

'విశ్వం'తో థియేటర్లలో సందడి చేస్తున్నారు గోపీచంద్. ఆయన హీరోగా నటించిన ఈ చిత్రాన్ని శ్రీను వైట్ల తెరకెక్కించిన సంగతి తెలిసిందే. వేణు దోనేపూడి, టీజీ విశ్వప్రసాద్ నిర్మించారు. ఈ సినిమా శుక్రవారం విడుదలైన నేపథ్యంలో హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హీరో గోపీచంద్ మాట్లాడుతూ.. 'మేము ఏదైతే నమ్మి ఈ చిత్రం చేశామో దానికి ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. ఇది కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రం" అన్నారు. "సినిమాలో ఒక్క సెకన్ కూడా బోర్ కొట్టలేదని చెప్పడం ఆనందాన్నిస్తోంది" అన్నారు దర్శకుడు శ్రీను వైట్ల. ఈ కార్యక్రమంలో కావ్య, వేణు దోనేపూడి తదితరులు పాల్గొన్నారు.

షబానాకు 'మామి' పురస్కారం

షబానా అజ్మీ

బాలీవుడ్ సీనియర్ నటి షబానా అజ్మీకి అరుదైన గౌరవం దక్కింది. తాజాగా ఆమెకు 'మామి' (ముంబయి అకాడమీ ఆఫ్ మూవింగ్ ఇమేజ్) చిత్రోత్సవాల వేళ 'ఎక్సలెన్స్ ఇన్ సినిమా' అవార్డును ప్రకటించారు. ఈ నెల 18న ఆమెకు ఈ పురస్కారాన్ని ఇవ్వనున్నట్లు 'మామి' నిర్వాహకులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 'అంకుర్' చిత్రంతో సినీ జీవితాన్ని మొదలు పెట్టిన షబానా... 'అర్థ్', 'స్వామి', 'స్పర్ష్', 'మండీ', 'మాసుమ్', 'ఏక్ దిన్ అచానక్', 'గాడ్ మదర్', 'ఫైర్' లాంటి చిత్రాల్లో నటించి ఐదు దశాబ్దాలుగా విమర్శకుల ప్రశంసలు అందుకుంటున్నారు. 'మామి' డైరెక్టర్ శివేంద్ర సింగ్ దుంగాపూర్ మాట్లాడుతూ..'గత యాభై సంవత్సరాలుగా తన విలక్షణ నటనతో ప్రేక్షకులను అలరిస్తూ.. సినీ పరిశ్రమలో స్వర్ణోత్సవ వేడుకలను జరుపుకోవడం ఆనందంగా ఉంది' అని అన్నారు.

బ్యాంకింగ్ సెక్టార్‌పై పూర్తి స్థాయి చిత్రం

వెంకీ అట్లూరి, నాగవంశీ

'లక్కీ భాస్కర్'గా దీపావళి బరిలో సందడి చేయనున్నారు దుల్కర్ సల్మాన్. ఆయన హీరోగా నటించిన ఈ బహుభాషా చిత్రాన్ని వెంకీ అట్లూరి తెరకెక్కించారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. మీనాక్షి చౌదరి కథానాయిక. ఈ సినిమా ఈ నెల 31న విడుదల కానున్న నేపథ్యంలో శుక్రవారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు వెంకీ అట్లూరి మాట్లాడుతూ.. "నాకు తెలిసి ఇంత వరకు బ్యాంకింగ్ సెక్టార్‌పై పూర్తి స్థాయి చిత్రమేదీ రాలేదు. అందులో చాలా రకాల కుంభకోణాలు జరుగుతుంటాయి. ఈ సినిమా అదే నేపథ్యంతో ఉంటుంది. 1980ల నాటి బ్యాక్‌డ్రాప్‌లో సాగుతుంటుంది. ఇప్పటి వరకు నేను తీసిన చిత్రాలన్నింటిలో ఈ సినిమా ప్రత్యేకంగా ఉంటుందని నమ్ముతున్నా. నిర్మాణానంతర పనులు ముగింపుకొచ్చాయి. ఈ నెల 21న ట్రైలర్‌ను విడుదల చేయనున్నాం. డబ్బు సంపాదనపై ఇష్టమున్న ప్రతి ఒక్కరికీ ఈ చిత్రం తప్పక నచ్చుతుంది" అన్నారు. "ఈ మధ్య కాలంలో ఇలాంటి చిత్రం రాలేదు. కథ, కథనాలు కొత్తగా ఉంటాయి. ఈ నెల 26, 27 తేదీల్లో ఆంధ్ర, తెలంగాణల్లో విడుదల ముందస్తు వేడుకలు నిర్వహించనున్నాం. విడుదలకు ఒక రోజు ముందే 30న సాయంత్రం నుంచి ప్రీమియర్లు వేయనున్నాం" అన్నారు నిర్మాత సూర్యదేవర నాగవంశీ. ఈ చిత్రానికి సంగీతం: జి.వి.ప్రకాశ్ కుమార్, ఛాయాగ్రహణం: నిమిష్ రవి.

పేరు.. టీజర్ దీపావళికే..

బాలకృష్ణ కథానాయకుడిగా బాబీ దర్శకత్వంలో ఓ సినిమా రూపొందుతోన్న సంగతి తెలిసిందే. ఈ చిత్ర విడుదల తేదీని దసరా సందర్భంగా నేడు ప్రకటించనున్నారు. ఇక ఈ చిత్ర టైటిల్, టీజర్‌ను దీపావళి సందర్భంగా విడుదల చేయనున్నట్లు నిర్మాత నాగవంశీ స్పష్టత ఇచ్చారు. చిత్రీకరణ దశలో ఉన్న ఈ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకొచ్చే అవకాశముంది.

రిషి.. మంచి రేసర్

నిఖిల్ సిద్ధార్థ్ కథానాయకుడిగా సుధీర్ వర్మ తెరకెక్కించిన చిత్రం 'అప్పుడో ఇప్పుడో ఎప్పుడో'. బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మించారు. రుక్మిణి వసంత్ కథానాయిక. దివ్యాంశ కౌశిక్, హర్ష తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. ఈ సినిమా నవంబరు 8న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే శుక్రవారం ఈ చిత్ర టీజర్ విడుదల చేశారు. "వీడి పేరు రిషి. మనోడు లోకల్‌లో మంచి రేసర్. లండన్ వెళ్లి తెల్ల పిల్లను పడేసి ప్రపంచం మొత్తం చుట్టేద్దామనుకున్నాడు" అంటూ టీజర్‌లో నిఖిల్ పాత్రను ఆసక్తికరంగా పరిచయం చేశారు. ఈ ప్రచార చిత్రాన్ని తీర్చిదిద్దిన తీరును బట్టి.. ఇదొక సస్పెన్స్ యాక్షన్ థ్రిల్లర్‌గా ముస్తాబైనట్లు అర్థమవుతోంది.

నిఖిల్

జీవితం ఓ నటన

జీవితం అంటే ఏమిటో తెలియనివాడు, జీవితంలో నటుడు అవ్వడమే కష్టం అన్నారందరూ. అందుకే జీవితాన్ని తెలుసుకునేందుకు ప్రయాణం మొదలు పెట్టాడు ఆ యువకుడు. కేరళలోని ఓ పల్లెటూరి వరకూ సాగిన ఆ ప్రయాణం అతనికి జీవితాన్ని నేర్పించిందా? నటుడు అయ్యాడా? తదితర విషయాలు తెలియాలంటే ఈ నెల 25న విడుదలవుతున్న 'నరుడి బ్రతుకు నటన' చూడాల్సిందే. శివ కుమార్ రామచంద్రవరపు, నితిన్ ప్రసన్న ప్రధాన పాత్రధారులుగా రూపొందిన చిత్రమిది. శ్రుతిజయన్, ఐశ్వర్య అనిల్ కుమార్, వైవా రాఘవ్ ఇతర పాత్రలు పోషించారు. రిషికేశ్వర్ యోగి దర్శకుడు. టి.జి.విశ్వప్రసాద్, సుకుమార్ బోరెడ్డి, డా.సింధురెడ్డి నిర్మాతలు. వివేక్ కూచిభొట్ల సహనిర్మాత. ఈ సినిమా ట్రైలర్‌ని శుక్రవారం నటి నిహారిక కొణిదెల విడుదల చేశారు. "నటుడు కావాలనుకున్న ఓ యువకుడి చుట్టూ సాగే కథ ఇది. కేరళ నేపథ్యం, భావోద్వేగాలు చిత్రానికి ప్రధానబలం. ట్రైలర్‌కి మంచి స్పందన లభిస్తోంద"ని సినీ వర్గాలు చెప్పాయి. ఈ చిత్రానికి సంగీతం: ఎన్.వై.ఎక్స్.లోపెజ్, ఛాయాగ్రహణం: ఫహాద్ అబ్దుల్ మజీద్.

నితిన్ ప్రసన్న, శివ కుమార్

(c) eenadu

బిజినెస్

టాటా ట్రస్ట్స్ ఛైర్మన్ నోయల్ టాటా

ట్రస్టీల సమావేశంలో ఎంపిక

ముంబయి

దిగ్గజ పారిశ్రామికవేత్త రతన్ టాటా వారసత్వ బాధ్యతలను, ఆయన సవతి సోదరుడు నోయల్ టాటా (67) చేపట్టనున్నారు. టాటా గ్రూప్ హోల్డింగ్ కంపెనీ టాటా సన్స్‌లో 66% వాటా కలిగి, అత్యంత కీలకమైన బాధ్యతలు నిర్వర్తించే టాటా ట్రస్ట్స్ ఛైర్మన్‌గా నోయల్ టాటా వ్యవహరిస్తారు. టాటా ట్రస్ట్స్‌లోని అన్ని ట్రస్టులకు నోయల్ నాయకత్వం వహించనున్నారు. శుక్రవారం ముంబయిలో పలు టాటా ట్రస్టులకు చెందిన ట్రస్టీల సంయుక్త సమావేశం జరిగింది. ముందుగా రతన్ టాటా మృతికి నివాళులు అర్పించిన ట్రస్టీలు, ఆయన అపూర్వ సేవలను గుర్తు చేసుకున్నారు. అనంతరం టాటా ట్రస్ట్స్ ఛైర్మన్‌గా నోయల్ నావల్ టాటాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. నోయల్ నియామకం తక్షణమే అమల్లోకి వస్తుందని తెలిపారు.

2023-24లో రూ.14 లక్షల కోట్ల ఆదాయం

టాటా గ్రూప్‌లోని అన్ని వాణిజ్య సంస్థలను టాటా సన్స్ నిర్వహిస్తోంది. 100 దేశాల్లో వినియోగ వస్తువులు, హోటళ్లు, వాహనాలు, విమాన రంగాల్లో 30కి పైగా సంస్థలు టాటా సన్స్ ఆధ్వర్యంలోనే ఉన్నాయి. గత ఆర్థిక సంవత్సరంలో ఈ సంస్థల మొత్తం టర్నోవర్ 165 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.14 లక్షల కోట్లు). టాటా గ్రూప్ ఛైర్మన్ తర్వాత టాటా ట్రస్ట్స్ పదవిని కీలకంగా భావిస్తారు. సర్ రతన్ టాటా ట్రస్ట్ అండ్ అలైడ్ ట్రస్ట్స్, సర్ దొరాబ్జీ టాటా ట్రస్ట్ అండ్ అలైడ్ ట్రస్ట్స్‌తో కూడిన టాటా ట్రస్ట్స్‌ను నోయల్ నడిపించనున్నారు. ఈ రెండు ట్రస్టుల బోర్డులో 2019 నుంచి నోయల్ ట్రస్టీగా ఉన్నారు.

ప్రతిష్ఠాత్మక వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్తా: నోయల్

టాటా ట్రస్ట్స్ ఛైర్మన్‌గా ఎంపిక కావడంపై నోయల్ టాటా స్పందిస్తూ 'రతన్ టాటా, టాటా గ్రూప్ వ్యవస్థాపకుల ప్రతిష్ఠాత్మక వారసత్వాన్ని ముందుకు తీసుకు వెళ్లడానికి కృషిచేస్తా. వంద సంవత్సరాలకు పైగా చరిత్ర కలిగిన టాటా ట్రస్ట్స్‌ను నడిపించడం ఎంతో గౌరవనీయ విషయం. అభివృద్ధి, దాతృత్వ కార్యకలాపాలను కొనసాగించడంతో పాటు దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తామ'ని తెలిపారు.

నోయల్ టాటా గురించి..

టాటా సన్స్‌లో వాటాలు ఇలా	
టాటా ట్రస్ట్స్	65.9%
6 గ్రూప్ కంపెనీలు	12.9%
మిస్త్రీ కుటుంబం	18.4%
ఇతరులు	2.8%

నావల్ హెచ్ టాటా, సోనూ దంపతులకు రతన్, జిమ్మీ జన్మించాక వారు విడిపోయారు. తదుపరి నావల్ హెచ్ టాటా స్విట్జర్లాండుకు చెందిన వ్యాపారవేత్త సిమోన్‌ను వివాహం చేసుకున్నారు. వీరికి నోయల్ టాటా 1957లో జన్మించారు. దీంతో రతన్‌కు నోయల్ సవతి సోదరుడు అవుతారు. రతన్, జిమ్మీ వివాహం చేసుకోలేదు. పల్లోంజి మిస్త్రీ కుమార్తె ఆలూ మిస్త్రీని నోయల్ టాటా వివాహం చేసుకున్నారు. ఈమె సోదరుడే టాటా సన్స్ మాజీ ఛైర్మన్ సైరస్ మిస్త్రీ. టాటా గ్రూప్‌లో పల్లోంజి మిస్త్రీ గ్రూప్‌నకు 18.4% వాటా ఉంది. నోయల్, ఆలూకు ముగ్గురు పిల్లలు- లేహ్, నెవిల్లె, మాయా ఉన్నారు. వీరు ప్రస్తుతం టాటా గ్రూప్‌లో పలు పదవుల్లో బాధ్యతలు నిర్వహిస్తున్నారు. టాటా ట్రస్ట్స్‌లో ట్రస్టీలుగా ఈ ఏడాదే నియమితులయ్యారు.

- టాటా గ్రూప్‌తో నోయల్‌కు 40 సంవత్సరాలకు పైగా అనుబంధం ఉంది. యునైటెడ్ కింగ్‌డమ్‌లోని ససెక్స్ యూనివర్సిటీలో నోయల్ గ్రాడ్యుయేషన్ చేశారు. తదుపరి ఫ్రాన్స్‌లోని ఇన్‌సీడ్‌లో ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రాం చేశారు.
- టాటా గ్రూప్‌లోని పలు కంపెనీల బోర్డుల్లో నోయల్ టాటా ఉన్నారు. ట్రెంట్, టాటా ఇంటర్నేషనల్ లిమిటెడ్, వోల్టాస్, టాటా ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్‌లకు ఛైర్మన్‌గా, టాటా స్టీల్, టైటన్ కంపెనీ వైస్ ఛైర్మన్‌గా నోయల్ టాటా వ్యవహరిస్తున్నారు.
- 1999లో టాటా ఇంటర్నేషనల్‌లో నోయల్ వృత్తిజీవితం ప్రారంభమైంది. ఈ సంస్థ టాటా గ్రూప్‌నకు ట్రేడింగ్-డిస్ట్రిబ్యూషన్ బాధ్యతలు నిర్వరిస్తుంది. నోయల్ మాతృమూర్తి సిమోన్ స్థాపించిన టాటా గ్రూప్ రిటైల్ సంస్థ ట్రెంట్‌కు ఆ ఏడాది జూన్‌లో నోయల్ మేనేజింగ్ డైరెక్టర్ అయ్యారు. ట్రెంట్ ఆధ్వర్యంలోని వెస్ట్‌సైడ్, జుడియో, ల్యాండ్‌మార్క్ స్టోర్‌లు లాభదాయక సంస్థలుగా మారడంలో నోయల్ కీలక పాత్ర పోషించారు. 1998లో ఒక స్టోర్ ఉండగా, వీటిని వివిధ విభాగాల్లో 700 విక్రయశాలలకు విస్తరించారు.
- 2003లో టైటన్, వోల్టాస్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. తనిష్క్, టైటన్, టైటన్ ఐ, ఫాస్ట్‌ట్రాక్ బ్రాండ్‌ల అభివృద్ధికి కృషి చేశారు.
- 2019లో సర్ రతన్ టాటా ట్రస్ట్ బోర్డులో చేరారు. 2018 నుంచి 2022 మధ్య టైటన్ వైస్ ఛైర్మన్‌గా ఉన్నారు.
- 2010-2021 మధ్య టాటా ఇంటర్నేషనల్ బాధ్యతలను మేనేజింగ్ డైరెక్టర్ హోదాలో చూసుకున్నారు. ఈ సమయంలో కంపెనీ ఆదాయం 500 మి.డాలర్ల నుంచి 3 బిలియన్ డాలర్లకు వృద్ధి చెందింది.

దివ్యాంగులూ వినియోగించేలా డిజిటల్ చెల్లింపుల సేవలు

బ్యాంకులకు ఆర్‌బీఐ సూచన

ముంబయి: దివ్యాంగులూ సులభంగా డిజిటల్ చెల్లింపుల సదుపాయాన్ని వినియోగించుకునేలా, చెల్లింపుల వ్యవస్థల్లో మార్పులు తీసుకురావాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) బ్యాంకులను కోరింది. డిజిటల్ చెల్లింపుల సేవలను అన్ని వర్గాలతో పాటు దివ్యాంగులూ వినియోగిస్తున్నారని శుక్రవారం జారీ చేసిన సర్క్యులర్‌లో ఆర్‌బీఐ గుర్తు చేసింది. మిగిలిన వారితో సమానంగా దివ్యాంగులు కూడా ఈ సదుపాయాన్ని వినియోగించుకునేందుకు బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ, పరికరాలను సమీక్షించాలని ఆర్‌బీఐ సూచించింది. తదుపరి అవసరమైన మార్పులు చేయొచ్చని పేర్కొంది. అదే సమయంలో భద్రత విషయంలో ఎలాంటి రాజీ పడొద్దని స్పష్టం చేసింది. చేయాల్సిన మార్పులు, దాన్ని అమల్లో పెట్టేందుకు కార్యాచరణ ప్రణాళికను నెల రోజుల్లోగా సమర్పించాలని బ్యాంకులను కోరింది.

జీవిత బీమా నూతన ప్రీమియం వసూళ్లలో 14% వృద్ధి

దిల్లీ: జీవిత బీమా సంస్థలు కొత్త పాలసీల ప్రీమియం వసూళ్లలో చరిత్ర సృష్టించాయి. గత నెలలో అన్ని బీమా సంస్థలూ కలిసి రూ.35,020 కోట్ల మేరకు తొలి ప్రీమియాన్ని వసూలు చేశాయి. ఏడాది క్రితం ఇదే నెల వసూళ్ల రూ.30,716 కోట్లతో పోలిస్తే ఇవి 14% అధికం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఆరు నెలల్లో కొత్త ప్రీమియం వసూళ్లు 19% వృద్ధితో రూ.1,89,214 కోట్లుగా నమోదయ్యాయి. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఈ మొత్తం రూ.1,58,377 కోట్లుగా ఉందని జీవిత బీమా కౌన్సిల్ తెలిపింది. వ్యక్తిగత బీమా ప్రీమియం వసూళ్లు 45.49% పెరిగాయి. కొత్తగా 32,17,880 పాలసీలను బీమా సంస్థలు అందించాయి. లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ) తొలి ప్రీమియం రూపంలో రూ.20,369 కోట్లను వసూలు చేసింది. గత ఏడాది ఇదే కాలంలో వసూలైన రూ.18,126 కోట్లతో పోలిస్తే ఇది 25% అధికం.

ప్రత్యక్ష పన్నుల వసూళ్లు రూ.11.25 లక్షల కోట్లు

దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అక్టోబరు 10 వరకు నికర ప్రత్యక్ష పన్నుల వసూళ్లు రూ.11.25 లక్షల కోట్లకు చేరినట్లు ప్రభుత్వ గణాంకాలు వెల్లడించాయి. గత ఆర్థిక సంవత్సరం ఇదే సమయ వసూళ్లు రూ.9.51 లక్షల కోట్లతో పోలిస్తే, ఈ మొత్తం 18.3% ఎక్కువ. తాజా వసూళ్లలో వ్యక్తిగత ఆదాయపు పన్ను వసూళ్లు రూ.5.98 లక్షల కోట్లు కాగా, కార్పొరేట్ పన్నులు రూ.4.94 లక్షల కోట్లుగా ఉన్నాయి. సెక్యూరిటీస్ లావాదేవీల పన్ను (ఎస్‌టీటీ) రూ.30,630 కోట్లుగా నమోదైంది. ఇతర పన్నులు రూ.2150 కోట్లుగా ఉన్నాయి. రిఫండ్‌లు కూడా 46% అధికమై రూ.2.31 లక్షల కోట్లకు చేరాయి.

- ఏప్రిల్ 1 నుంచి స్థూల ప్రత్యక్ష పన్నులు 22.3% అధికమై రూ.13.57 లక్షల కోట్లకు చేరాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ప్రత్యక్ష పన్నుల వసూళ్లు రూ.22.07 లక్షల కోట్లకు చేరొచ్చని బడ్జెట్‌లో ప్రభుత్వం అంచనా వేసింది.

కోడి గుడ్డు

12న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	510
వరంగల్	512
విజయవాడ	525
గోదావరి	525
విశాఖపట్నం	525
చిత్తూరు	538

టెస్లా రోబోట్యాక్సీ సైబర్ క్యాబ్

ధర 30,000 డాలర్లు

లాస్‌ఏంజెలెస్: రోబోట్యాక్సీ 'సైబర్‌కాప్'ను, విద్యుత్తు వాహన సంస్థ టెస్లా ఆవిష్కరించింది. వార్నర్ బ్రదర్స్ స్టూడియోలో నిర్వహించిన కార్యక్రమంలో టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్ ఈ వాహన ప్రత్యేకతలను వివరించారు. ఏఐ (కృత్రిమమేధ) సామర్థ్యంతో పనిచేసే ఈ వాహనాలకు స్టీరింగ్, పెడల్స్ వంటివి ఉండవు. మానవుల ప్రమేయం లేకుండా, అటానమస్ డ్రైవింగ్ టెక్నాలజీ సాయంతో ఈ వాహనాలను నడిపే వీలు కలుగుతుందనే విశ్వాసాన్ని మస్క్ వ్యక్తం చేశారు. సైబర్‌కాప్ వాహనాల ధరలు 30,000 డాలర్ల (సుమారు రూ.25 లక్షల) లోపు ఉంటాయని మస్క్ తెలిపారు. చిన్నపాటి బస్సు మాదిరి ఉన్న ఈ సెల్ఫ్ డ్రైవింగ్ వాహనంలో 20 మంది వరకు ప్రయాణించొచ్చు. 2026లో ఇవి అందుబాటులోకి వస్తాయని వెల్లడించారు.

రూ.1.6 లక్షల కోట్ల దివీస్

- ఔషధ కంపెనీల మార్కెట్ విలువలో రెండోస్థానం
- భవిష్యత్తు వృద్ధిపై మదుపరులు ఆశావహం
- జీవనకాల గరిష్ఠానికి చేరిన షేరు ధర

ఈనాడు, హైదరాబాద్: స్టాక్ మార్కెట్లో దివీస్ లేబొరేటరీస్ షేరు ధర దూసుకుపోతోంది. ఈ కంపెనీ భవిష్యత్తు వృద్ధి అవకాశాలపై మదుపరుల్లో విశ్వాసం పెరగడమే ఇందుకు కారణం. శుక్రవారం బీఎస్ఈలో జీవనకాల గరిష్ఠమైన రూ.6,159కు చేరిన ఈ షేరు, చివరకు రూ.6,141.15 వద్ద స్థిరపడింది. ఇది కూడా రికార్డు ముగింపే. దీనివల్ల కంపెనీ మార్కెట్ విలువ రూ.1.63 లక్షల కోట్లను మించింది. తెలుగు రాష్ట్రాల్లో ఇంతటి విలువ సాధించిన తొలి కంపెనీగా దివీస్ గుర్తింపు సాధించింది. కొంతకాలం క్రితం రూ.1 లక్ష కోట్ల మార్కెట్ విలువను చేరుకున్నప్పుడు, దివీస్ అందరి దృష్టిని ఆకర్షించింది. ఇప్పుడు సరికొత్త రికార్డు సృష్టించింది.

రూ.లక్ష కోట్ల పైన దేశంలో 8 ఫార్మా కంపెనీలే

945 945 8111
GREATER INFRA PROJECTS PVT LTD
Plot No. 217/A, 2nd Floor, Near Metro Station,
Matrusri Nagar, Miyapur, Hyderabad - 500049

(c) eenadu

భక్తుల ఇలవేల్పులు మైసమ్మ.. ఎల్లమ్మ

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ పరిధి బొంబాయి జాతీయ రహదారిలో మహిమ గల గ్రామదేవతలు ఏళ్ల క్రితం వెలిశారు. బొంబాయికి చిన్న రోడ్డు ఉండేది. చుట్టూ దట్టమైన అడవి ఉండేది. చెట్ల కింద పుట్టలో కనిపించిన అమ్మవార్లకు విశేష పూజలు చేసి పూర్తిస్థాయి ఆలయాలుగా తీర్చిదిద్దారు. భక్తులు భారీగా మొక్కులు చెల్లించుకుంటున్నారు. జేఎన్‌టీయూ మెట్రోస్టేషన్ దాటాక హైదర్‌నగర్ వద్ద శ్రీజయదుర్గ మైసమ్మ దేవస్థానం, కేపీహెచ్‌బీ మెట్రోస్టేషన్ కింద రేణుక ఎల్లమ్మ ఆలయాలు కొలువుదీరాయి. వాటి చరిత్ర తెలుసుకుందాం.

దొంగల మైసమ్మ నుంచి జయ దుర్గ మైసమ్మగా

జేఎన్‌టీయూ మెట్రోస్టేషన్ దాటాక హైదర్‌నగర్ వద్ద జాతీయ రహదారిలో ఉన్న శ్రీజయ దుర్గ మైసమ్మ మహిమ గల అమ్మవారుగా భక్తుల నమ్మకం. అమీర్‌పేట వాస్తవ్యులు నేతి శ్రీశైలం రోజూ వ్యవసాయ పనులు చూసుకునేందుకు వెళ్తొస్తున్న క్రమంలో హైదర్‌నగర్ వద్ద చెట్టు కింద పుట్టలో అమ్మవారు కనిపించారు. ౧౯౯౮-౯౯ మధ్య కాలంలో శ్రీశైలం చెట్టు, పుట్ట అలానే ఉంచి చిన్న గుడి కట్టించారు. దసరా, ఆషాఢ బోనాలు, శ్రావణమాస పూజలతోపాటు ఆయుధ పూజలకు ఈ ఆలయం ప్రసిద్ధి గాంచింది. మైసమ్మ అమ్మవారి ప్రాంగణంలోనే కుజ దోష నివారణకు నాగదేవత, దుర్గామాత, గణపతి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి విగ్రహాలు

హైదర్‌నగర్‌లో జయదుర్గ మైసమ్మ ఆలయం

ప్రతిష్ఠించి ధూప, దీప, నైవేద్యాలు సమర్పిస్తున్నారు. ౨౦౦౦లో పూర్తిస్థాయి నిర్మాణం జరిగింది. పురాతన కాలంలో చెట్టు, అమ్మవారు ఉన్న ప్రదేశంలో దొంగలు దాక్కునే వారు అని హైదర్‌నగర్ గ్రామస్తులు పేర్కొన్నారు. అలా దొంగల మైసమ్మ ఆలయంగా కూడా పిలిచేవారట. క్రమేణ అభివృద్ధి చేసి శ్రీజయ దుర్గ మైసమ్మ దేవస్థానంగా మార్చారు. పూర్వీకులు

కేపీహెచ్‌బీ మెట్రోస్టేషన్ కింద రేణుక ఎల్లమ్మ ఆలయంలో భక్తుల సందడి

చెప్పిన ప్రకారం అమ్మవారు ౨౦౦ఏళ్ల క్రితమే వెలిసిందని నేతి శ్రీశైలం కుటుంబసభ్యులు, స్థానికులు చెబుతున్నారు. ౨౦౧౫లో ఆలయ నిర్వహణను దేవాదాయశాఖకు అప్పగించారు.

పుట్టలో వెలసిన రేణుక ఎల్లమ్మ

కేపీహెచ్‌బీ మెట్రోస్టేషన్ కింద ప్రస్తుతం ఉన్న రేణుక ఎల్లమ్మ ఆలయం సుమారు ౫౦ ఏళ్ల క్రితం పాము పుట్టలో వెలిసినట్టు కూకట్‌పల్లి గ్రామస్తులు గుర్తించారు. కూకట్‌పల్లి గ్రామస్తులు పెద్ద కంచెగా పిలిచే కేపీహెచ్‌బీకి వచ్చి వ్యవసాయం చేసేవారు.. పశువులు మేపేవారు. అమ్మవారిని గుర్తించిన వీరు అప్పటి నుంచి విశేష పూజలు చేయసాగారు. ౧౯౮౫లో చిన్న గుడి నిర్మించారు. అప్పుడు జాతీయ రహదారి చిన్న రోడ్డుగా ఉండేది. బొంబాయి బస్సులు ఈ రోడ్డులోనే వెళ్లేవి. అదే సమయంలో కేపీహెచ్‌బీ ఫేజ్ ౧, ౨ రూపుదిద్దుకుంటున్నాయి. గుడి సమీపంలోనే కల్లు కాంపౌండ్ ఉండేది. క్రమేణా జాతీయ రహదారి అభివృద్ధి చెందడంతో ఈ ప్రాంతం రూపురేఖలు, మెట్రోరైలు ప్రాజెక్ట్ రావడంతో ఆలయ రూపురేఖలు మారిపోయాయి. ప్రహరీ, ధ్వజస్తంభం ఒక్కొక్కటిగా ఏర్పాటుచేశారు. బోనాల వేడుకలకు ఆలయం చుట్టుపక్కల భక్తులతో కిక్కిరిసిపోతుంది. ఆలయ ప్రాంగణంలో కాలభైరవ, వినాయకుడు, నవగ్రహాలు, పోచమ్మ దుర్గమ్మ విగ్రహాలు ప్రతిష్టించారు.

ఆదిపరాశక్తికి అపురూప నివేదనలు

సర్వజగత్తుకూ మూలాధారమైన అమ్మవారిని భక్తిప్రపత్తులతో పూజించే పర్వదినాలు శరన్నవరాత్రులు. ఈ సందర్భంగా కనకదుర్గ అమ్మవారిని పలు విధాలుగా అలంకరించి, వివిధ పదార్థాలను నైవేద్యంగా సమర్పించడం ఆచారం. అలా నివేదించిన పదార్థాలను ప్రసాదంగా స్వీకరించినప్పుడు.. ఆధ్యాత్మిక చింతన పెంపొందుతుంది.

ఆదిపరాశక్తిని ఒక్కో రోజు ఒక్కో అవతారంగా అలంకరించి నివేదనలు సమర్పిస్తారు. తొలి రోజున అమ్మవారిని నారింజరంగు చీరలో బాలా త్రిపుర సుందరిగా అలంకరించి పులుపు, ఉప్పు తీపి, కారం, వగరు, చేదు.. ఇలా షడ్రుచులూ కలగలసిన పులిహోర నివేదిస్తారు. ఉప్పు, చింతపండు, బెల్లం, ఆవపిండి, మెంతిపిండి, మిరియాలపొడి తగుపాళ్లలో కలపాల్సి ఉంటుంది. ఇళ్లల్లో చేసుకునేట్లు కాకుండా ఆలయాల్లో ఆవపిండి కాస్త ఎక్కువ మోతాదులో వేస్తారు. ఆ ఘాటు రుచిని పెంచడమే కాదు, ఆరోగ్యదాయకం.

నవరాత్రుల్లో రెండో రోజున జగన్మాతను గాయత్రీదేవిగా అర్చించి, కొబ్బరన్నం నైవేద్యంగా పెడతారు. మన పూజలూ వ్రతాల్లో కొబ్బరి కాయకు ఉన్న ప్రాముఖ్యం అంతా ఇంతా కాదు. కలశంలో టెంకాయ పెడతాం. కొబ్బరి ఆరోగ్యప్రదమైంది. దేవుడి ముందు టెంకాయ కొట్టి, కొబ్బరిని ప్రసాదంగా పంచుతాం. దాంతో పరమాన్నం చేసి దేవుడికి నివేదిస్తాం. ఉడుకుతున్న బియ్యంలో కొబ్బరిపాలు జతచేసి వండేదే కొబ్బరన్నం.

మూడో రోజున అమ్మవారిని పసుపు రంగు చీరలో అన్నపూర్ణాదేవిగా అలంకరించి మినపప్పు లేదా పెసరపప్పుతో చేసిన గారెలు నివేదిస్తారు. గారెలు అత్యంత ప్రాచీన వంటకం. అందునా పెసరగారెలు ఇంకా ప్రాచీనమైనవి.

నాలుగో రోజున అమ్మవారికి పెరుగన్నం సమర్పిస్తారు. దీన్నే కొందరు 'చద్ది నివేదన' అంటారు. చద్దన్నం అంటే నిన్నటి అన్నం అనే కాదు, చల్ల లేదా పెరుగు కలిసిన అన్నం అని కూడా అర్థం. ఈ నివేదన అల్లం, మిరియాలు, ఉప్పు, పచ్చిమిరపకాయలు చేర్చి చేసే దధ్యోదనం కాదు. కేవలం పెరుగు కలిపిన అన్నం మాత్రమే.

ఐదో రోజున ఆదిపరాశక్తికి లడ్డూప్రసాదం నివేదిస్తారు. ఆరో రోజున మాతకు కేసరిని నైవేద్యంగా సమర్పిస్తారు. రాగులు, జొన్నలు, సజ్జలు, బియ్యం, గోధుమలు తదితర ధాన్యాల రవ్వతో కేసరి చేసి నివేదించడం ఆనవాయితీ.

శరన్నవరాత్రుల్లో ఏడో రోజున గులాబి రంగు చీరలో శ్రీమహాలక్ష్మీదేవిగా దర్శనమిచ్చే అమ్మవారికి అల్లం గారెలు నైవేద్యంగా సమర్పిస్తారు.

ఎనిమిదో రోజున ఆదిపరాశక్తికి శాకాన్నం నివేదిస్తారు. కొందరు దోస, చిక్కుడు, చిలగడదుంప.. ఇలా అనేక కూరగాయలు కలగలిపి పులుసన్నం చేసి నైవేద్యంగా పెడతారు. ఈ రెండింటిలో ఏది నివేదించినా కూరగాయ ముక్కలు ఎక్కువగా, అన్నం కొద్ది మోతాదులో ఉండాలి.

తొమ్మిదో రోజున అమ్మవారికి చక్రపొంగలి నివేదిస్తారు. బియ్యంలో పాలు, పంచదార, పెసరపప్పులు వేసి చేసేదే చక్రపొంగలి. పదో రోజున అమ్మవారిని పచ్చరంగు వస్త్రంతో రాజరాజేశ్వరీదేవిగా అలంకరించి పరమాన్నం నివేదిస్తారు. బియ్యం ఉడికేటప్పుడు పాలు, బెల్లం, యాలకుల పొడి, పచ్చకర్పూరం, ఎండుద్రాక్ష, జీడిపప్పులు వేసి చేసేదే పరమాన్నం.

(c) eenadu

ఆధ్యాత్మిక కేంద్రం.. శివగంగ రాజరాజేశ్వరుడి క్షేత్రం

మహేశ్వరం, కూకట్‌పల్లి: వందల ఏళ్ల చరిత్ర కలిగిన ప్రతిష్ఠాత్మక ఆలయం.. నాటి శిల్పులు అత్యంత సుందరంగా తీర్చిదిద్దిన ఆధ్యాత్మిక కేంద్రం. చూడముచ్చటైన ఈ కోవెల నీటి కొలను మధ్యలో నిర్మించారు. చూపరులను అబ్బురపరిచే అందమైన కోనేరు.. చుట్టూ అష్టాదశ లింగాలతో కూడిన ఆలయాలు.. మధ్యలో సమ్మోహన రూపంతో రాజరాజేశ్వరస్వామి.. ఆయన నీడలో ఆలయం దిగువభాగంలో కొలువైన రాజరాజేశ్వరీదేవి అమ్మవారు.. ఈ దేవతామూర్తులను దర్శించుకునేందుకు కోనేటి మధ్యన వంతెన.. ఇదీ మహేశ్వరంలో భక్తులకు కనిపించే సుందర దృశ్యం. శివగంగ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు ఏటా వైభవంగా నిర్వహిస్తారు. ఇక్కడ శైవ సంప్రదాయంలో శరన్నవరాత్రి మహోత్సవాలు జరుగుతాయి. పాండవులు జమ్మిచెట్టు మీద దాచిన ఆయుధాలను తీసుకుని యుద్ధంలో శత్రువులను ఓడించిన వృత్తాంతాన్ని గుర్తు చేసుకుంటూ దసరా రోజు సాయంత్రం ప్రజలు ఆలయ ప్రాంగణంలో జమ్మి చెట్టుకు పూజలు చేస్తారు. అనంతరం శమీపత్రాలను తల్లిదండ్రులు, పెద్దలకు సమర్పించి వారి ఆశీర్వాదం తీసుకుంటారు. ఆలయం ముందు రావణ దహనం చేపడతారు. ప్రతిరోజు భక్తులకు అన్నదానం చేస్తారు. కొత్తగా పెళ్లైన ఆడబిడ్డలు పుట్టింటికి వస్తారు.. ఆనందోత్సాహాల మధ్య బతుకమ్మ పండగ నిర్వహిస్తారు.. రకరకాల పిండివంటలు చేసుకుంటారు. పరిసరాల్లోని ప్రతి గ్రామంలో నెలకొల్పే దుర్గామాత మండపాల వద్ద కోలాటాలు, బతుకమ్మ ఆటలతో సాంస్కృతిక శోభ ఉట్టిపడుతుంది.

శివగంగ రాజరాజేశ్వరస్వామి ఆలయానికి విద్యుత్తు దీపాలంకరణ

రాజరాజేశ్వరుడు, రాజరాజేశ్వరీ అమ్మవారు

దేవీశరణం గచ్ఛామి.. : ఆధ్యాత్మిక శక్తి ప్రపంచాన్ని ముందడుగు వేసేలా చేస్తోంది. శక్తికి మరోపేరు అమ్మవారు. అమ్మవారిని ఏకాగ్ర చిత్తంతో ఆరాధిస్తే ధైర్యం ఆవహిస్తుంది. మంచి పనులకు మనసును పురిగొల్పుతుంది. శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా రాజరాజేశ్వరీ క్షేత్రంలో దశమి వరకు రోజుకో రకంగా దివ్యమైన పూజలు జరుగుతాయి.

రోజుకో అవతారంలో దర్శనం..

శరన్నవరాత్రి ఉత్సవాల్లో తొమ్మిది రోజులు అమ్మవారు రోజుకో అవతారంలో భక్తులకు దర్శనమిస్తారు. నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో విశేష పూజలు చేస్తారు. నవరాత్రుల్లో కాత్యాయనీదేవి, బాలాత్రిపుర సుందరీదేవి, గాయత్రీదేవి, అన్నపూర్ణదేవి, లలితాత్రిపుర సుందరీదేవి, మహాలక్ష్మీదేవి, సరస్వతీదేవి, దుర్గాదేవి, మహిషాసురమర్దిని, రాజరాజేశ్వరీ అవతారంలో అమ్మ భక్తులకు సాక్షాత్కారమిచ్చి అనుగ్రహిస్తుంది.

కొంగు బంగారం.. అమీర్‌పేట కనకదుర్గ

అమీర్‌పేట: అమ్మవారిపై భక్తులకున్న అచంచల విశ్వాసం.. నిత్యం కిక్కిరిసిన భక్తజన సందోహం.. కొలిచే వారికి కొంగు బంగారం.. అమీర్‌పేట కనకదుర్గ ఆలయ విశిష్టత ఇది. ఆలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. అమీర్‌పేట నుంచి గ్రీన్‌ల్యాండ్స్ వైపు వెళ్లే ప్రధాన రహదారిపై సుమారు వందేళ్లుగా ఉన్న పోచమ్మ దేవాలయం 1984 నుంచి అభివృద్ధి చెందుతూ వచ్చింది. స్థానికులు కేంశెట్టి రాజేశ్వరప్ప కుటుంబ సభ్యుల కోరిక మేరకు 1988 మార్చి 31 న పుష్పగిరి పీఠాధిపతి విద్యా నృసింహ భారతి చేతుల మీదుగా కనకదుర్గ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. 1990లో దేవస్థానంలో శ్రీ సంతోషి అమ్మవారి ఆలయాన్ని కూడా ఏర్పాటు చేశారు. కనకదుర్గ అమ్మవారితోపాటు శీతల మాతగా పిలిచే పోచమ్మ వారిని ఒక్కసారి దర్శించుకుంటే అనారోగ్యాలు మాయమవుతాయని భక్తుల విశ్వాసం.

స్వర్ణకిరీట అలంకృత కనకదుర్గ అమ్మవారు

నిత్య కైంకర్యాలు: కనకదుర్గ అమ్మవారి ఆలయంలో ప్రతిరోజు ప్రత్యేక పూజా కార్యక్రమాలతోపాటు ఏడాది పొడవునా విశిష్ట ఉత్సవాలు కొనసాగుతుంటాయి. పౌర్ణమి చతుర్దశి రోజుల్లో నిర్వహించే చండీ హోమాలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరవుతుంటారు. దసరా ఉత్సవాల్లో ప్రతిరోజు ఇక్కడ శ్రీ చక్ర కుంకుమార్చనలు జరుగుతుంటాయి. ప్రతి మంగళవారం రాహుకాల పూజలకు ముందుగానే స్లాట్ బుక్ చేసుకోవాలి. శుక్రవారం నాడు సంతోషిమాత ఉద్యాపనలు, ఆదివారం కాల సర్ప దోష నివారణ పూజలు, రాహు కేతు పూజలు, హోమాలు నిర్వహిస్తుంటారు.

అమ్మవారికి స్వర్ణ కిరీటం: కనకదుర్గ అమ్మవారికి భక్తుల సహకారంతో తయారు చేయించిన ఐదు కిలోల బంగారు వజ్రాభరణాల కిరీటం ఉంది. ఇటీవల అమ్మవారి ఆలయానికి స్వర్ణతాపడం చేయించారు.

భారీ ఏర్పాట్లు: శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఈనెల 10వ తేదీ వరకు భారీ ఏర్పాట్లు చేసినట్లు దేవస్థానం ఈవో వంగ అంబుజ, ఛైర్మన్ మల్లికార్జునప్ప తెలిపారు.



(c) eenadu

శివాలయాలు.. ఏళ్ల చరిత్రకు సాక్ష్యాలు

కూకట్‌పల్లి: ఆలయాల్లో.. శివాలయాలకు ప్రత్యేకత ఉంటుంది. వాస్తవంగా ఏ గ్రామంలో చూసినా శివారు లేదా.. గ్రామం మధ్యలో శివుడి ఆలయం ఉండడం కనిపిస్తుంది. శివుడిని పూజించడం భక్తులకు ఎంతో ఇష్టం. ఆయన అభిషేక ప్రియుడు కావడంతో.. అభిషేకం చేసేందుకు భక్తులు ఎక్కువగా ఇష్టపడుతుంటారు. కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని కొన్ని శివాలయాలకు వందల ఏళ్ల చరిత్ర ఉంది. గ్రామంలో వెలిసిన పాత శివాలయం.. వందల ఏళ్ల నాటిది కాగా.. వివిధ ప్రాంతాల్లో కొలువై ఉన్న ద్వాదశ జ్యోతిర్లింగాలు ఒక్కటే పీఠంపై దర్శనమిచ్చే దేవాలయం కొన్ని దశాబ్దాల క్రితం వెలిసింది. వీటితోపాటు బాలానగర్ సాయినగర్‌లోని భ్రమరాంబ మల్లికార్జున దేవాలయం, ఫతేనగర్ పాత శివాలయం ఇలా ఒక్కో ఆలయానికి ఒక్కో విశిష్టత సొంతం చేసుకున్నాయి. ఈ పురాతన ఆలయాల గురించి మీ కోసం..

పాత శివాలయం

కూకట్‌పల్లిలోని పాత శివాలయంలోని శివలింగం

కూకట్‌పల్లిలోని ద్వాదశ జ్యోతిర్లింగాలు

450ఏళ్ల నాటిది.. పాత శివాలయం

కూకట్‌పల్లి గ్రామంలోని పాత శివాలయానికి 450ఏళ్ల చరిత్ర ఉంది. రాణీరుద్రమదేవి వంశస్థులు అప్పట్లో ఏకకాలంలో 11శివాలయాలు ఏర్పాటులో భాగంగా.. ఇక్కడ ఈ ఆలయాన్ని నెలకొల్పినట్లు పెద్దలు చెబుతుంటారు. అప్పట్లో పటాన్‌చెరు నుంచి కీసర వరకు 11శివాలయాలను నెలకొల్పగా. అందులో కూకట్‌పల్లి జాతీయ రహదారి ఆనుకొని ఉండే ఈ పాత శివాలయం ఒకటి కావడం విశేషం. ఏక రాత్ర శివాలయంగా ఇది పేరుగాంచింది. అంటే ఒక్క రాత్రిలోనే ఆలయాన్ని నిర్మించారు. ఒకప్పుడు చిన్నగా ఉన్న ఆలయాన్ని.. దేవాదాయశాఖ అధికారులు, పెద్దలు 2007లో ఆలయాన్ని పునరుద్ధరించి విగ్రహాలు పునఃప్రతిష్ఠించారు. శివలింగంపై బ్రహ్మసూత్రం ఉండడం విశేషంగా చెబుతుంటారు. బ్రహ్మసూత్రం అంటే స్వస్తిక్, లింగాకారం తదితర గుర్తులు శివలింగంపై ఉండడమని వేద పండితులు చెబుతున్నారు. ఈ బ్రహ్మసూత్రం ఉన్న శివలింగాలు బహు అరుదుగా ఉంటాయన్నది ప్రాచుర్యంలో ఉంది. ఈ శివలింగంపై లింగాకారం(బ్రహ్మసూత్రం) ఉండడం ప్రత్యేకతగా చెప్పొచ్చు. ఈ ఆలయంలో భక్తులు నమ్మకంతో స్వామివారిని పూజిస్తే.. కోరుకున్న కోర్కెలు నెరవేరుతాయన్నది ప్రచారంలో ఉంది. సంతానం లేని వారికి సంతానం కలిగిన, విదేశాలకు వెళ్లాలనుకునే వారికి ఎటువంటి ఆటంకాలు లేకుండా వెళ్లిన ఉదంతాలు ఉన్నట్లు ఆలయ అర్చకుడు శివవిష్ణు పేర్కొన్నారు. ప్రతి సోమవారం విశేష అభిషేకం, కార్తిక మాసంలో విశేష పూజలు, నిత్యాన్నదానం జరుగుతుంది.

ద్వాదశ జ్యోతిర్లింగ, భువనేశ్వరి ఆలయం

ఒకే పీఠంపై ద్వాదశ జ్యోతిర్లింగాలు

కూకట్‌పల్లి : వివేక్‌నగర్‌లోని ద్వాదశ జ్యోతిర్లింగ భువనేశ్వరి అమ్మవారి ఆలయం 1974లో నిర్మించారు. పుల్లూరి నారాయణ దాసు ఇక్కడ ముందుగా పశుపతినాథస్వామిని ప్రతిష్ఠించారు. అనంతరం దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో కొలువై ఉన్న ద్వాదశ జ్యోతిర్లింగాలను ఒక్కటే చోట భక్తుల కోసం ప్రతిష్ఠించాలన్న ఆలోచనతో అప్పట్లోనే ఆయన శివలింగాలను ఏర్పాటు చేశారు. సహజంగా బహు అరుదుగా కనిపించే బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల దేవాలయం కూడా ఇదే ప్రాంగణంలో కొలువై ఉండడం విశేషం. 2021లో కాలభైరవ స్వామి సన్నిధిని కూడా ఇక్కడ ప్రత్యేకంగా అందుబాటులోకి తీసుకొచ్చారు. 50ఏళ్ల చరిత్ర కలిగిన ఈ ఆలయం.. భక్తుల కొంగు బంగారంగా ప్రాచుర్యంలో ఉంది. ఈ ఆలయం ఆనుకొని ప్రత్యేకంగా కల్యాణ మండపాన్ని కూడా నిర్మించడంతో ప్రత్యేక సందర్భాల్లో విశేష పూజల సమయంలో

బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల విగ్రహాలు

దీన్ని వినియోగిస్తున్నారు. అన్ని ప్రాంతాలను తిరిగి ద్వాదశ జ్యోతిర్లింగాలు దర్శించుకోలేని వారంతా.. ఈ ఆలయంలో దర్శించుకొని తరిస్తూ ఉంటారు. అలాగే ఫతేనగర్ పాత శివాలయం, బాలానగర్ సాయినగర్‌లోని భ్రమరాంబ మల్లికార్జునస్వామి దేవాలయాలు కూడా వందల ఏళ్ల చరిత్ర కలిగిన పురాతనమైనవి. సాయినగర్‌లోని ఆలయాన్ని కొన్నేళ్ల క్రితం పునరుద్ధరించగా.. ఫతేనగర్ ఆలయాభివృద్ధికి ఎమ్మెల్యే తన సొంత నిధులు ఇచ్చారు.

(c) eenadu

ఉట్టిపడే ఆధ్యాత్మికం.. కూకట్‌పల్లి ప్రత్యేకం

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజవర్గం పరిధిలో ఆధ్యాత్మిక శోభ అడుగడుగునా ఉట్టి పడుతుంది. ఇక్కడ వందల సంఖ్యలో ఆలయాలు ఉండగా.. వేటికవే ప్రత్యేకతలతో భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. దశాబ్దాల క్రితం వెలిసిన పురాతన ఆలయాలు.. కొన్నేళ్ల క్రితం నిర్మించిన దేవాలయాలతో ఈ ప్రాంతం విరాజిల్లుతుంది. భక్తులను అలరించే ఆలయాలే ఈ ప్రాంతంలో ఎక్కువగా ఉన్నాయి. ప్రత్యేక పూజలు.. విశిష్టతలకు ఇక్కడి ఆలయాలు పెట్టింది పేరు. ఇక్కడ ప్రజలనే కాకుండా.. నగరవ్యాప్తంగా ఈ ప్రాంతంలోని ఆలయాలకు భక్తులు ఉండడం విశేషం. దేవాలయాలు.. దేవుళ్లపై భక్తులకున్న నమ్మకం.. ఆలయాలు సైతం దిన.. దిన ప్రవర్ధమానవుతూ వస్తున్నాయి. ఆలయాల విశిష్టత.. ఇక్కడున్న ఆలయాల సంఖ్య తదితరాల గురించి తెలుసుకుందాం..

కూకట్‌పల్లి దేవీస్థాన్ హోమ్స్‌లో బతుకమ్మ వేడుకలు

400కు పైగా ఆలయాలు

కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలో మొత్తం 8 డివిజన్లు ఉన్నాయి. కూకట్‌పల్లి, బాలానగర్, ఓల్డ్‌బోయిన్‌పల్లి, ఫతేనగర్, అల్లాపూర్, మూసాపేట, బాలాజీనగర్, కేపీహెచ్‌బీకాలనీ తదితర డివిజన్లలో ఆలయాల సంఖ్య లెక్కకు మించి ఉంటాయి. కేవలం అమ్మవారి ఆలయాలు.. చిన్నవి.. పెద్దవి కలిపి 200కు పైగా ఉండగా.. మిగతా అన్ని దేవుళ్ల ఆలయాలు మరో 200వరకు ఉన్నాయి. అన్ని డివిజన్లలో వీటి సంఖ్య ఎక్కువగానే ఉంటుంది. కొన్ని పురాతన ఆలయాలను అభివృద్ధి చేయడంలోనూ ఇక్కడి ప్రజలు ఎక్కువ ఉత్సాహం చూపుతారంటే.. దేవాలయాలు.. దేవుళ్లపై వారిలో ఉన్న నమ్మకానికి ప్రతీకగా నిలుస్తుంది. రామాలయాలు, వేంకటేశ్వరస్వామి దేవాలయాలు, లక్ష్మీనరసింహస్వామి, రంగనాయకస్వామి.. ఇలా అందరి దేవుళ్లతో కూడిన అతిపెద్ద ఆలయాలు కూడా ఇక్కడ దర్శనమిస్తాయి. కూకట్‌పల్లిలోని అయ్యప్పస్వామి దేవాలయానికి నగర వ్యాప్తంగా భక్తులు వస్తారంటే.. ఈ దేవాలయానికి ఉన్న ప్రత్యేకత అర్థమవుతుంది. సాయిబాబా దేవాలయం, శివాలయాలకు కూడా ప్రత్యేకత ఉంది.

పండుగొచ్చిందంటే.. కిక్కిరిసిపోవాల్సిందే

పండుగొచ్చిందంటే.. ఈ ప్రాంతంలో ఆలయాలు భక్తులతో కిక్కిరిసి కనిపిస్తాయి. ఇసుకేసినా రాలనంత జనం కూకట్‌పల్లికి ప్రత్యేకమని చెప్పాలి. ముఖ్యంగా ప్రతి గురువారం పూజలు, అన్నసమారాధన జరిగే సాయిబాబా దేవాలయంలో పండుగ వాతావరణం కనిపిస్తుంది. క్యూ కట్టి మరి సాయిబాబాను దర్శనం చేసుకుంటారు. ఇక అయ్యప్పస్వామి దేవాలయంలో స్వామిమాల ధారణ సీజన్‌లో భక్తుల కొంగు బంగారంగా చెప్పాలి. అయ్యప్ప పడిపూజలతో పాటు మధ్యాహ్నం అన్నసమారాధన, రాత్రి అల్పాహారం ఈ ఆలయం ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు. కేవలం సీజన్‌లోనే కాకుండా ఏడాదిలో 365రోజులు ఇక్కడ అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు కొనసాగుతూ ఉంటాయి. కూకట్‌పల్లితో పాటు మిగతా అన్ని ప్రాంతాల్లో అయ్యప్పస్వామి మాలధారణ సీజన్‌లో నిత్యాన్నదానాలు ఇక్కడ ప్రత్యేకం.

మహా వైభవం.. మైసూర్ చాముండేశ్వరీ దేవి ఉత్సవాలు

క్రౌంచపుర స్థితా మాతా చాముండీ దుష్టనాశనీసర్వసిద్ధిప్రదా దేవి భక్తపాలన దీక్షితా.. అని అశేష భక్తజనం చాముండేశ్వరీ దేవిని స్తుతిస్తూ అమ్మవారిపై భక్తిప్రపత్తులను చాటుకుంటారు. ప్రచారంలో ఉన్న పురాణ కథను అనుసరించి రాక్షసుడైన మహిషాసురుడు తన సమూహంతో దేవతలపై దండెత్తాడు. వారిని నిలువరించలేక సురలు శివుని భార్య పార్వతీదేవిని శరణుజొచ్చారు. అప్పుడు ఆ దేవి ఉగ్ర రూపం దాల్చి రాక్షస మూకను సంహరించింది. ఆ మాతే చాముండీ దేవిగా పూజలందుకుంటోంది.

మైసూర్ చాముండేశ్వరీ ఆలయం

ఆ వరదాయిని కొలువైన మైసూరు ప్రాంతానికి క్రౌంచపురి అని కూడా పేరు. యావత్‌ప్రపంచ జనవాహినిని అలరించే రీతిలో ఈ దేవి సన్నిధిలో దసరా ఉత్సవాలు నిర్వహిస్తారు. వింధ్యవాసిని అయిన ఆదిపరాశక్తి చండుడు, ముండుడు అనే రాక్షసులను సంహరించిన కారణంగా కూడా చాముండి అనే పేరు సార్థకమైందని చెబుతారు. మూడు కళల ఈశ్వరశక్తికి చాముండేశ్వరీ దేవి ప్రతీక. ఆమె రురు అనే రాక్షసుడి చర్మాన్ని, మొండేన్ని రెండుగా చేసింది కాబట్టి ఈ దేవికి చాముండి అనే పేరు వచ్చిందనేది మరో కథనం.

అష్టాదశ శక్తిపీఠాల్లో ఒకటైన చాముండేశ్వరి ఆలయ ప్రాంతంలో మునులు, ఆధ్యాత్మిక సాధకులు తపస్సు చేశారట. అందుకే అమ్మవారి ఈ శక్తిపీఠానికి క్రౌంచపీఠం అనే పేరు వచ్చింది. మైసూర్ మహారాజుల ఇలవేల్పు చాముండేశ్వరీ దేవికి ఆ పాలకులు అనేక ఆభరణాల్ని సమర్పించుకున్నారు. 'దేవీ మాహాత్మ్యం'లో చాముండేశ్వరీ దేవి ప్రాశస్త్యం కనిపిస్తుంది. మైసూర్‌లోని ఈ చాముండేశ్వరి ఆలయం ద్రావిడ నిర్మాణశైలిలో రూపుదిద్దుకుంది. ఈ ఆలయంలో గర్భాలయం, నవరంగ ప్రాంగణం, అంతరాల మంటపం ఉంటాయి. గర్భాలయంపైన విమానం అని పిలిచే చిన్న గోపురం, ప్రధాన ద్వారం వద్ద వినాయకుడి ప్రతిమ కనిపిస్తాయి. మహిషాసురుని రాజధాని మహిషపురం. అదే నేటి కర్నాటక రాష్ట్రంలోని మైసూరు అని భక్తుల విశ్వాసం. మహిషాసురుని సంహరించిన దేవీశక్తి చాముండి. సర్వ దేవతల తేజస్సులతో ఆవిర్భవించిన శక్తి స్వరూపం.

సముద్ర మట్టానికి 3,500 కి.మీ. ఎత్తున ఉన్న చాముండి కొండలపై ఈ శక్తిపీఠం నెలకొంది. దసరా ఉత్సవాలు ఇక్కడ వైభవంగా జరుగుతాయి. ఈ శక్తిపీఠం పరిసరాల్లో 12 ఏకశిల నంది విగ్రహాలు చూడముచ్చట గొలుపుతాయి.

సర్వాలంకార భూషిత చాముండేశ్వరీ దేవి..

నవరాత్రి ఉత్సవాల్లో సర్వాలంకార భూషిత అయిన చాముండేశ్వరీ దేవిని దర్శించుకోవటం భక్తులు పరమపావనంగా భావిస్తారు. శిరసున చామరాజు ముడి (కిరీటం), కంఠాభరణాలు, కర్ణ పత్రాలు, మణులు పొదిగిన కంఠి, జడ పిన్నులు, జడబిళ్ళ, వజ్ర ఖచిత త్రిశూలం, పాశుపతాస్త్రం, నాగాస్త్రం, కవచం, ఘంటా హస్త కవచం, కలశం తదితర ఆభరణాలతో అమ్మవారు అలరారుతోంది.

మైసూర్ ప్యాలెస్ ముస్తాబు..

దేశంలో ప్రసిద్ధ కనకదుర్గ ఆలయాల వలె కర్నాటక సాంస్కృతిక రాజధాని అయిన మైసూర్ చాముండేశ్వరీ ఆలయం కూడా దసరా ఉత్సవాలకు సంసిద్ధమైంది. మైసూర్ ప్యాలెస్‌ను శోభాయమానంగా అలంకరించారు. రాజుగారి ఆయుధపూజ, ఏనుగుల అలంకరణ, సాంస్కృతి కార్యక్రమాలు వేటికవే ప్రత్యేకం. నవరాత్రుల్లో తొమ్మిదో రోజున మైసూర్ రాజవంశానికి చెందిన రాజఖడ్గాన్ని ఏనుగులు, గుర్రాలు, ఒంటెలతో కలిపి ఊరేగించి పూజలు చేయటం ఆకర్షణీయం. రాజసౌధంలోని అత్యంత విలువైన స్వర్ణసింహాసనాన్ని దసరా వేడుకలు జరిగే పదిరోజుల పాటు సందర్శకులు తిలకించేందుకు అవకాశాన్ని కల్పిస్తారు.

- బి.సైదులు

(c) eenadu

MAKUTA
CROWN OF EXCELLENCE

HAPPY DUSSEHRA

NOW ACCESS **LUXURY** AT A PRICE YOU CAN **AFFORD!**

ADR Estates

5.6 Acers | 6 Blocks | Ground +14 Floors | 817 Units | 45,000 sft - Club House| 65% Open Space | 1070 to 2485 sft

ADR & Makuta's MY SPACE 2

Who said luxury is not affordable?

2 & 3 BHk

Starting From @ ~~₹6500/sft~~
Limited TIME Offer ₹ 6200/sft

CONTACT TO AVAIL DUSSHERA & DIWALI OFFER

PROJECT HIGHLIGHTS

* Grand entrance lobby at Club House * 2&3 BHK apartments
* Well equipped children play area * Jogging track * Visitors car parking
* Servant restrooms * Rainwater harvesting pits * STP * WTP
* Cricket practice nets * Volley ball court * Basketball court * Tennis court

For Site-Visit :

91 00 33 00 33
91 00 44 00 44

Scan For Location

RERA NO : P02200005071

www.makutadevelopers.com

makutadevelopers_official

(c) eenadu

భక్తుల ఇలవేల్పు.. చార్మినార్ భాగ్యలక్ష్మి

చాంద్రాయణగుట్ట, చార్మినార్ : హైదరాబాద్ అనగానే గుర్తుకు వచ్చేది చారిత్రక చార్మినార్ కట్టడం.. ఆ కట్టడాన్ని ఆనుకుని ఉన్న ప్రసిద్ధ భాగ్యలక్ష్మి మందిరం. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా భక్తుల పూజలు అందుకుంటోంది అమ్మవారు. 'గోల్కొండ రాజ్యాన్ని రాజులు పరిపాలిస్తున్న రోజుల్లో సాక్షాత్తు లక్ష్మీదేవి నడుచుకుంటూ వెళుతుండగా, ప్రస్తుతం చార్మినార్ ఉన్న ప్రాంతం వద్ద కాపలాదారులు అడ్డగించారు.. ఆమెను నగరం లోపలికి అనుమతించడానికి ప్రభువు అనుమతి తీసుకువస్తామని చెప్పారు. మీరు వచ్చే వరకు ఇక్కడే ఉంటానని మాట ఇచ్చింది. రాజు వద్దకు వెళ్లి భటులు విషయం చెప్పడంతో వచ్చింది లక్ష్మీదేవి అని గ్రహించిన రాజు కాపలాదారులు తిరిగి వెళితే లక్ష్మీదేవి రాజ్యం నుంచి వెళ్లిపోతుందని, సిరి సంపదలు మాయం అవుతాయని భావించాడు. కాపలాదారులను వెనక్కి పంపకుండా ఆపేశాడు. ఇచ్చిన మాట ప్రకారం లక్ష్మీదేవి శిలగా మారి అక్కడే నిలిచిపోయింది' అనే కథ ప్రచారంలో ఉంది. చార్మినార్ నిర్మాణం తరువాత కూడా శిల అక్కడే ఉండేదని, భక్తులు పూజలు చేసేవారని స్థానిక పెద్దలు చెబుతుంటారు. ౧౯౬౭లో బస్సు ఆ శిలను ఢీకొట్టడంతో పగిలి పోయిందని, తర్వాత కాలంలో అమ్మవారికి ఆలయం నిర్మించి, విగ్రహం ప్రతిష్ఠించారని చరిత్ర. ఇప్పటికీ అమ్మవారి విగ్రహం పాదాల దగ్గర రెండు వెండి తొడుగులు ఉంటాయి. ఆ తొడుగుల కింద పగిలిన శిల ఉందని ఆలయ నిర్వాహకులు చెబుతారు. ౧౯౦౮లో మూసీనదికి వరదలు వచ్చి నగరాన్ని ముంచెత్తినప్పుడు, అప్పటి నిజాం నవాబు మీర్ మహబూబ్ అలీ ఖాన్ భాగ్యలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, బంగారు చాటలో పసుపు, కుంకుమ, గాజులు సమర్పించి.. వాటిని మూసీలో వదలడంతో వరద తగ్గిందని పెద్దలు అంటుంటారు. ఆలయంలో ఏటా శరన్నవరాత్రి ఉత్సవాలతో పాటు బోనాలు, దీపావళి ఉత్సవాలు ఘనంగా జరుగుతాయి. దీపావళి సందర్భంగా ఇక్కడ అమ్మవారి నాణెం తీసుకోవడానికి భక్తులు భారీగా వస్తుంటారు.

ఆలయం వద్ద భక్తుల రద్దీ

సందర్శించిన ప్రముఖులు

భాగ్యలక్ష్మి మందిరాన్ని ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, మాజీ ప్రధానులు ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ, వాజ్‌పేయి, మాజీ హోంమంత్రి అద్వానీ, మాజీ ముఖ్యమంత్రులు ఎన్టీ రామారావు, మర్రి చెన్నారెడ్డి, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీతో పాటు పలువురు కేంద్ర మంత్రులు, సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. అమ్మవారిని దర్శించుకోవడానికి వచ్చే ప్రముఖులు, భక్త జనంతో సందడిగా కనిపిస్తుంది. అమ్మవారు రోజుకో ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తారు. ఆలయం వెలసిన నాటి నుంచే ఇక్కడ ఉత్సవాలు జరుగుతున్నప్పటికీ గత రెండున్నర దశాబ్దాలుగా భక్తుల సంఖ్య విపరీతంగా పెరిగింది. మహిళలు అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించి, ఒడిబియ్యం సమర్పిస్తుంటారు. ఉత్సవాల సందర్భంగా నిత్యం ౨౦ వేల నుంచి ౨౫వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారు. జంటనగరాల్లోని నలు మూలల నుంచే గాకుండా శివారు గ్రామాలు, జిల్లాల నుంచి, రాజస్థాన్, కర్ణాటక, గుజరాత్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల నుంచి కూడా వస్తుంటారు. ఉత్సవాల్లో భాగంగా బతుకమ్మ వేడుకలూ నిర్వహిస్తారు.

150ఏళ్లకు పైగా పెద్దమ్మ తల్లి, ఎల్లమ్మ తల్లికి పూజలు

కేపీహెచ్‌బీ ఏడోఫేజ్ సమీపంలో పెద్దమ్మ తల్లి, ఎల్లమ్మ తల్లి ఆలయాలు

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ నాలుగు, ఏడోఫేజ్ సమీపంలో కొలువైన పెద్దమ్మ తల్లి, ఎల్లమ్మ తల్లి విగ్రహాలు వెలసి ౧౫౦ఏళ్లు దాటిందని స్థానికులు చెబుతుంటారు. ప్రస్తుతం కేపీహెచ్‌బీ-హైటెక్ సిటీ మధ్య రైల్వేట్రాక్ పక్కన ఆలయాలు ఉన్న ప్రదేశం నాడు అడవి ప్రాంతం. కేవలం రైల్వేట్రాక్ ఉండేది. చుట్టూరా దట్టమైన అడవి. పంట కాలువలు, వరద కాలువలు రైల్వే ట్రాక్ కింద ఆలయం పక్కనుంచి పారుతూ ముళ్లకత్వ చెరువులో కలిసేవి. అమ్మవార్లను భక్తులు కొంగుబంగారంగా పూజిస్తారు. సుమారు ౪౦ఏళ్లకి ముందు కైత్లాపూర్ గ్రామస్థులే అమ్మవార్లకు పూజలు చేసేవారు. కేపీహెచ్‌బీ, హైటెక్ సిటీ ప్రాంతాలు రూపుదిద్దుకోవడంతో రెండు ప్రాంతాల భక్తులూ అమ్మవార్లను కొలుస్తున్నారు. బోనాల వేడుకలకు భక్తులు పోటెత్తుతారు. ఆలయ ప్రాంగణాల్లో సందడి వాతావరణం నెలకొంటుంది. బోనాల వేడుకలతోపాటు విడి రోజుల్లో సైతం భక్తులు భారీగా మొక్కులు చెల్లించుకుంటారు. గతంలో చిన్న దేవాలయాలుగా ఉన్న ప్రాంగణాలను క్రమేణ అభివృద్ధి చేయడంతో ఈ ప్రాంత రూపురేఖలు మారిపోయాయి. నేడు గూగుల్ లోకేషన్‌లోనే ఇది అత్యంత ముఖ్యమైన ప్రాంతం.

(c) eenadu

నిత్య హోమం.. కుర్తాళం పీఠం ప్రత్యేకం



ఆర్కేపురం: ఆర్కేపురంలోని కుర్తాళం పీఠంలో ఆదిపరాశక్తి ప్రత్యంగిరా పరమేశ్వరీమాత శరన్నవరాత్రోత్సవాలు ఎంతో వైభవంగా నిర్వహిస్తారు. పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి 18 ఏళ్ల క్రితం ఇక్కడ అమ్మవారిని ప్రతిష్ఠించారు. నాటి నుంచి ప్రత్యంగిరా అమ్మవారు పూజలందుకుంటున్నారు. ఇక్కడ భక్తులే నేరుగా హోమాలు చేసుకోవచ్చు

ఆర్కేపురంలోని కుర్తాళం పీఠంలో హోమం నిర్వహిస్తున్న అర్చకులు

వారాహి ప్రత్యంగిరా దేవి దయతో..

ప్రత్యంగిరా అమ్మవారిపై భక్తులకు అపార నమ్మకం. ఇక్కడి అమ్మవారిని కొలిస్తే సర్వరోగాలు, సమస్త పీడలు తల్లి ఆశీర్వాదంతో తొలగిపోతాయని విశ్వాసం. కొంగు బంగారంగా విలసిల్లే అమ్మవారి దయతో భక్తులకు ఐశ్వర్యం కలుగుతుందని ప్రగాఢంగా నమ్ముతారు. శత్రుసంహారిణిగా అమ్మవారిని భక్తిశ్రద్ధలతో కొలిచిన భక్తులకు ఆ తల్లి ఆశీస్సులు అందిస్తుందని పేర్కొంటారు.

ప్రత్యంగిరా అమ్మవారు

ప్రత్యేకతలెన్నో..: ప్రత్యంగిరా ఆలయంలో జరిగే అమ్మవారి శరన్నవరాత్రులు, బ్రహ్మోత్సవాలకు పలు రాష్ట్రాల నుంచి భక్తులు విచ్చేస్తారు. ఉత్సవాల్లో పాల్గొని మొక్కులు తీర్చుకొని అమ్మవారి ఆశీస్సులు పొందుతారు. అమ్మవారి దర్శన భాగ్యం శుభకరమని భావించి ఏటికేడాది వచ్చే భక్తుల సంఖ్య పెరుగుతోంది. ఆలయం ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లుతోంది.

రోజూ విశేష హోమాలు..

ఈ ఆలయంలో జరిగే హోమాలు ఎంతో ప్రతీతి. ఎండు మిరపకాయలు, మిరియాలు, తిప్పతీగ, ఉప్పు, ఆవాలు, నువ్వులు, నెయ్యి తదితర విశేష పదార్థాలతో లక్ష్మీగణపతి, కాలభైరవ, భగళాముఖి, వారాహి ప్రత్యంగిరా హోమాలు ప్రతినిత్యం జరుగుతాయి. అమావాస్య, పౌర్ణమి రోజుల్లో హోమాలకు ఎంతో విశిష్టత ఉండటంతో విదేశీయులు, సినిమా, రాజకీయ, వ్యాపార తదితర రంగాల ప్రముఖులు హాజరవుతుంటారు.

కొలువైన దేవతామూర్తులు

ఇక్కడి మందిరంలో వారాహిదేవి, రాధాకృష్ణులు, నాగేంద్రుడు, దశమహా విద్యా దేవతలు, గణపతి, సుబ్రహ్మణ్యస్వామి, ఆంజనేయుడు, దత్తాత్రేయుడు, సాయిబాబా, అయ్యప్పస్వామి, కాలభైరవుడు, సరస్వతీదేవి తదితర దేవతామూర్తులను దర్శించుకోవచ్చు

ఆలయం ఎక్కడ..

విక్టోరియా మెమోరియల్ మెట్రో స్టేషన్‌కి దగ్గరలోని టెలిఫోన్ కాలనీ కమాన్ లోపలికి ప్రవేశించి రెండు కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తే ఆలయానికి చేరుకోవచ్చు

(c) eenadu

ఆలయ నూతన ప్రధాన ముఖ ద్వారం

అష్టైశ్వర్యాలనొసగే.. అష్టలక్ష్మి అమ్మవారు

వైభవోపేతంగా దసరా నవరాత్రోత్సవాలు

ఆర్కేపురం, మూసాపేట: హైదరాబాద్ నగరంలోని ఆర్కేపురం డివిజన్ వాసవీ కాలనీలో ఉన్న అష్టలక్ష్మి ఆలయంలో దేవి శరన్నవరాత్రోత్సవాలకు ఎంతో విశిష్టత ఉంది. కంచి కామకోటి పీఠం ఆధ్వర్యంలో వీటి నిర్వహణ జరుగుతుంది.

అష్టలక్ష్ములు ప్రత్యేకం: శ్రీమన్నారాయణుడి చుట్టూ సంతానలక్ష్మి, గజలక్ష్మి, ధనలక్ష్మి, ధాన్యలక్ష్మి, విజయలక్ష్మి, ఐశ్వర్యలక్ష్మి, వీరలక్ష్మి, మహాలక్ష్మి కొలువు దీరి భక్తులకు కొంగు బంగారంగా మారారు.

స్థల పురాణం: కొన్ని సంవత్సరాల క్రితం ఈ ప్రాంతంలో ౩౦ ఎకరాల భూమిని వాసవీ కో-ఆపరేటివ్ సొసైటీ విక్రయించడంతో క్రమేణ వాసవీ కాలనీగా మారింది. ఇక్కడ సుమారు ౩౦౦ కుటుంబాలు స్థిరపడ్డాయి. ఖాళీగా ఉన్న స్థలంలో ఏదో ఒక ఆలయాన్ని నిర్మించాలని స్థానికులు నిర్ణయించారు. ప్రముఖ శిల్పి గణపతి స్థపతి సలహాతో అష్టలక్ష్మి ఆలయాన్ని నిర్మించాలనుకున్నారు. కంచి కామకోటి పీఠాధిపతులైన జయేంద్ర సరస్వతీ, విజయేంద్ర సరస్వతీ శంకుస్థాపన చేయడమే కాకుండా వాళ్ల సూచనలతో నిర్మాణం మొదలై ౨౮ ఏళ్ల క్రితం విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. ఇటీవల చిన్న జీయర్ స్వామి చేతుల మీదుగా నూతన ముఖ ద్వార ప్రతిష్ఠ, యంత్ర స్థాపన చేసి స్వర్ణ రథాన్ని ఆవిష్కరించారు.

ఒక్కోరోజు ఒక్కోరూపంలో...

దసరా ఉత్సవాల్లో తొలిరోజు ఆదిలక్ష్మిగా, రెండోరోజు ధనలక్ష్మిగా, మూడోరోజు సంతానలక్ష్మిగా, నాల్గోరోజు గజలక్ష్మిగా, ఐదోరోజు ధాన్యలక్ష్మిగా, ఆరోరోజు మోహినిగా, ఏడోరోజు సరస్వతిగా, ఎనిమిదోరోజు గోదాదేవిగా, తొమ్మిదోరోజు వీరలక్ష్మిగా, పదోరోజు విజయలక్ష్మిగా భక్తులకు దర్శనమివ్వడం ఇక్కడి ప్రత్యేకత.

సూర్యప్రభ వాహనంపై అమ్మవారు

ఉత్సవాలకు హాజరైన భక్తులు

నిత్యం వాహన సేవలు

పల్లకిసేవ, శేష వాహన, హంస, సూర్యప్రభ, చంద్రప్రభ, గజ, హనుమత్, గరుడ, అశ్వ, సింహ వాహన సేవలతో పాటు చిన్న పెద్ద రథోత్సవం, కళాకారుల ఆటపాటలతో కనుల పండువగా జరుగుతుంది.

రావణాసుర దహనం: అష్టలక్ష్మి ఆలయ ప్రాంగణంలో విజయ దశమిరోజు రావణాసుర దహనం కార్యక్రమం చూడటానికి వేల సంఖ్యల్లో భక్తులు వస్తారు.

చేరుకోవడం ఇలా: విక్టోరియా మెమోరియల్ మెట్రో స్టేషన్ సమీపంలో అష్టలక్ష్మి కమాన్ ఉంటుంది. కమాన్ నుంచి లోపలికి అర కిలో మీటర్ వెళ్తే ఎడమవైపు ఆలయం ఉంటుంది.

తీరొక్క పండగ.. నగరం నిండుగా!

జూబ్లీహిల్స్: ఒకవైపు పూలకు మొక్కుతున్నారు.. మరోవైపు అమ్మను కొలుస్తున్నారు.. పూల పండగతో ఆటపాటలు.. జగదాంబకు చేతులెత్తి మొక్కుతున్న భక్తులు.. నగరంలో శోభాయమానంగా సాగుతున్న రెండు వేడుకలు... బతుకమ్మ, శరన్నవరాత్రులు.. నగరంలోని ఏ ప్రాంతాన్ని చూసినా, బస్తీకి వెళ్లినా పండగ శోభ కనిపిస్తోంది. మహిళలకు, యువతులకు ఎంతో ఇష్టమైన పూల పండగ వేళ ఆటపాటల్లో సందేశాలను సైతం పాటలుగా మలిచి పాడుతున్నారు.

రాష్ట్రంలో మొదటి పది స్థానాల్లో..

దసరా ఉత్సవాల వేళ రాష్ట్రంలోనే పేరుగాంచిన మొదటి పది స్థానాల్లో ఉన్న ఆలయాల్లో జూబ్లీహిల్స్‌లోని పెద్దమ్మతల్లి దేవాలయానికి ఒక విశిష్టత ఉంది. చారిత్రక ఆలయాల్లో ఒకటైన ఇక్కడ అయిదు అంతస్తుల గర్భగుడి, ఏడు అంతస్తుల రాజగోపురం, కల్యాణమండపం, వసతి గృహాలు ఉన్నాయి. అమ్మవారిని రోజుకొక రూపంలో అలంకరిస్తారు.

పెద్దమ్మతల్లి ఆలయ ఆవరణలో భక్తులు

జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లి

ఆలయానికి దాదాపు రూ. ౨౫కోట్ల ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఉండగా, ప్రతి ఏడాది రూ. ౧౩ కోట్ల ఆదాయం వస్తుంది. సాధారణ రోజుల్లో ౮వేల నుంచి ౧౦వేల మంది దర్శించుకొంటే ఆదివారం ఈ సంఖ్య దాదాపు 40 వేల వరకు ఉంటుంది. పండగల నేపథ్యంలో నిత్యం ౫౦ వేల వరకు ఉందని అంచనా.

- ఇక నగరంలో జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లి తరువాత బల్కంపేట ఎల్లమ్మ దేవాలయం ఆదాయంలో, వచ్చే భక్తుల సంఖ్యలో రెండో స్థానంలో ఉంది. దాదాపు రూ. ౨ కోట్లకుపైగా ఆదాయం వస్తుంది. పండగ వేళ నిత్యం ౨౦ వేల నుంచి ౩౦ వేల మంది వరకు వస్తారు. లోయర్ ట్యాంక్ బండ్, బేగంపేటలోని కట్టమైసమ్మ ఆలయాలకు, ఖైరతాబాద్‌లోని దేవాలయాలకూ భక్తుల రద్దీ ఎక్కువగానే ఉంటుంది. ఎంతో ప్రముఖ దేవాలయాలుగా ఇవి గుర్తింపు పొందాయి.

దేదీప్యమానంగా.. : ఉత్సవాల నేపథ్యంలో ఆలయాలు వందల క్వింటాళ్ల పూలతో అలంకరించుకోవడమే కాకుండా వేలవాట్ల కాంతుల విద్యుత్ దీపాల వెలుగుల్లో కళకళలాడుతున్నాయి. ప్రతి రోజు గుడిమల్కాపూర్ మార్కెట్ నుంచి పూలు నగరంలోని అన్ని ప్రాంతాలకు వెళ్తున్నాయి.

ఇంటింటా వేడుకలు..: గతంతో పోలిస్తే ఈసారి నగరంలో చాలా మంది తమ ఇళ్లలో శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. చుట్టుపక్కల వారిని, బంధువులను, స్నేహితులను ఆహ్వానిస్తున్నారు. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, మాజీ ఎమ్మెల్యే పి. విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు ఇళ్లలో రోజుకొక అలంకారంతో అమ్మవారిని కొలుస్తున్నారు.

తొమ్మిది రోజుల పూల పండగ..

మహిళలకు ఎంతో ఇష్టమైన బతుకమ్మ వేడుకతో నగరం నలుదిక్కులా అనుబంధాలు వెల్లివిరుస్తున్నాయి. తొలి రోజు ఎంగిలి పూల బతుకమ్మ, రెండో రోజు అటుకుల బతుకమ్మ, మూడో రోజు ముద్దపప్పు బతుకమ్మ ఇలా ఆయా రోజుకు అనుగుణంగా ఏర్పాటు చేస్తూ ఆటపాటలతో హోరెత్తిస్తున్నారు. చివరి రోజు సద్దుల బతుకమ్మతో పండగను ముగించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. గౌరమ్మలను రంగురంగుల పూలతో కనువిందు చేసేలా పేర్చడమే కాకుండా కొలుస్తూ కొత్త అందాన్ని తీసుకొస్తున్నారు.

(c) eenadu

దసరా శుభాకాంక్షలు

"May the triumph of good over evil in the epic of Dussehra inspire you to conquer your own battles with courage and determination.
HAPPY DUSSEHRA!"

HITECH HYDRAULICS is incredibly delighted to be celebrating its 27th Anniversary, an important milestone that only a select few business reach.

I would like to express my gratitude to all my colleagues, clients, partners, and friends for your continuous support of Hitech Hydraulics.

INTEGRITY * QUALITY * TEAMWORK
27th ANNIVERSARY

hitech HYDRAULICS

AS9100D & ISO 9001:2015
Certified Unit

#5-5-35/226/1, Plot No.17 Shakthipeetam, I.E., Kukatpally, Hyderabad - 500072.
Ph: 040-23720399, Fax: 04023720384, mail: info@hitechhydraulics.in.

(c) eenadu

అమ్మ ఆయుధాలు.. ఆత్మవికాస దీపికలు

కుటుంబంలో అమ్మకున్న ప్రాధాన్యం... దేవతల్లో మూల స్వరూపిణికున్న ప్రాముఖ్యం ఒక్కటే! మనల్ని మనం సమున్నతంగా మలచుకునే క్రమంలో అమ్మలగన్నయమ్మ అవతారాల్లోని ఆయుధాల నుంచీ స్ఫూర్తి పొందుదాం. అవి మనకిచ్చే సంకేతాలను గుర్తించి అయిన వారందరికీ ఆ విశేషాలను పంచుదాం..

కూకట్‌పల్లి : శరన్నవరాత్రుల్లో విశిష్టమైన మహర్నవమి రోజున మహిషాసుర మర్దినిగా, కాళికగా అమ్మవారిని అర్చిస్తాం. ఆయుధపూజ చేస్తాం. జగన్మాత ఒక్కొక్క అలంకారంలో ఒక్కో విధమైన ఆయుధ సామగ్రి కన్పిస్తుంది. రూపాన్ని బట్టి అమ్మకు రెండు, నాలుగు, ఎనిమిది, పది, పద్దెనిమిది... ఇలా చేతులు ఉంటాయి. చేతుల్లో రకరకాల ఆయుధాలను అమ్మవారు ధరించి ఉంటుంది. అమ్మ చేతి ఆయుధాల్లో ధనుస్సు, బాణం, పాశం, అంకుశం, శక్తి, త్రిశూలం, చక్రం, గద, వజ్ర, ఖడ్గం, ఖట్వాంగ ముఖ్యమైనవి.

'పాశం' అంటే బలమైన తాడు. అనురాగమే అమ్మ చేతిలోని పాశం. అనురాగపాశం మనసును కట్టివేస్తుంది. దాంతో అందరి మనసులను గెలుచుకోవాలని అమ్మ సూచిస్తుంది. దీనికి మరో ప్రయోజనమూ ఉంది. పాశం ఇంద్రియ నిగ్రహాన్ని కలిగించి, అహంకారం పెరగకుండా రక్షిస్తుంది.

'అంకుశం' మావటివాడి చేతిలో ఉండి, మదపుటేనుగును అదుపు చేయడానికి సహకరిస్తుంది. మనలో దుందుడుకుతనాన్ని అణచి వేయడానికి అది నిదర్శనం. కోపం నటించి తల్లి తన బిడ్డలు దారి తప్పకుండా అదుపు చేస్తుంది. కోపమే అమ్మ చేతిలోని అంకుశం. ఆత్మసాధనకు అణకువను మించిన మార్గం లేదన్నది దాని సారం.

అమ్మవారి చేతిలో 'ధనుస్సు, విల్లు' ఉంటాయి. ధనుస్సు మన మనసుకు ప్రతీకని పెద్దలు చెబుతుంటారు. ధనుస్సు కదిలిపోతూ ఉంటే విలుకాడు గురిచూసి కొట్టలేడు. చంచలమైన మనసును 'స్థిర సంకల్పం'గా మలచుకోమని ఆ ధనుస్సు మనకు తెలియజేస్తుంది. బాణం లక్ష్యాన్ని ఛేదించాలంటే విలుకాడు ఎంతో ఏకాగ్రతను కలిగి ఉండాలి. విషయ వాంఛలను తృణీకరించగల ఏకాగ్రతకు ప్రతీక 'బాణం'. ఓంకారమే ధనుస్సు అని, ప్రాణశక్తి బాణమని, ఆత్మతత్త్వమే లక్ష్యమని, సాధకులు ఏకాగ్రతతో లక్ష్యాలను సాధించాలని (ప్రణవో ధనుః శరోహ్యాత్మా బ్రహ్మ తల్లక్ష్య ముచ్యతే, అప్రమత్తేన వేద్ధవ్యం శరవత్ తన్మయో భవేత్) ముండకోపనిషత్తు చెబుతుంది.

'శక్తి' ఆయుధాన్ని మహిషాసురుడితో భీకర యుద్ధ సమయంలో అమ్మ ప్రయోగించింది. శక్తి అంటే మనలో అహంకారం కూడా. శక్తి మన సొంతం కాదని, అమ్మ ప్రసాదితంగా అది వచ్చిందని, దాన్ని మంచి పనులకు వినియోగించాలని గుర్తిస్తే అహంకారం తొలగిపోయి మనసు నిర్మలమవుతుంది.

త్రిశూలం దుర్గాదేవి అతి ముఖ్యమైన ఆయుధం. సత్వ, రజో, తమో గుణాలకు అది ప్రతీక. శారీరక, మానసిక, ఆధ్యాత్మిక అవరోధాలను దుర్గామాత దీనిద్వారా తొలగిస్తుందని పెద్దలు చెబుతారు. శూలం విసిరితే ఎదుటివారికి బలంగా గుచ్చుకుంటుంది. ఏమరపాటుగా ఉంటే, మన హృదయంలో 'అసూయ' అనే శూలం గుచ్చుకొనే ప్రమాదం ఉంది. అమ్మ చేతి ఆయుధమైన శూలాన్ని పూజిస్తే అసూయ మటుమాయమై ఉత్సాహం కలుగుతుంది. అసూయ దరి చేరకుండా చూసుకోమని శూలం తెలియజేస్తుంది.

దుర్గా మాత ధరించే 'ఖడ్గం' అన్నింటికన్నా పదునైన జ్ఞానాన్ని సూచిస్తుంది. సకల సందేహాల నుంచి విముక్తమైన జ్ఞానం కత్తి అంచులాగా మెరుస్తుంది. మనిషి అపార విజ్ఞానాన్ని సంపాదించి, దాన్ని లోకకల్యాణం కోసం వినియోగించాలని ఖడ్గం సూచిస్తుంది.

'శంఖం'- ప్రణవం లేదా ఓంకారానికి ప్రతీక. అమ్మ ఈ శబ్ద రూపంలోనే కొలువై ఉందని అర్థం. దుర్గాదేవి శంఖ ధ్వనితో మూడు లోకాలనూ కంపింపజేసింది. ఈ శంఖనాదానికే రాక్షస సైన్యం కకావికలం అయ్యింది. ఈ శంఖనాదం నుంచి ప్రేరణ పొంది కార్యోన్ముఖులం కావాలి.

'చక్రం' వృత్తాకారంలో ఉంటుంది. దానికి ప్రారంభ బిందువు ఏదో ఎవ్వరూ కనిపెట్టలేరు. అలాంటిదే మన మనసులో కలిగే మోహం కూడా. అదెప్పుడు ఎక్కడ ఎలా మొదలవుతుందో తెలియదు. అలా మొదలై క్రమంగా మనసునంతటినీ ఆక్రమించి అతలాకుతలం చేస్తుంది. మోహాన్ని పటాపంచలు చేయాలని చక్రం తెలియజేస్తుంది. చెడును సంహరించి మంచిని వృద్ధి చెయ్యడానికి చక్రాన్ని అమ్మవారు వాడుతుంది.

'గద' చిత్రమైన ఆయుధం. బరువైన భాగాన్ని ముందుకు వదిలి, సన్నగా ఉన్న దండాన్ని పట్టుకుని గదను పైకెత్తాలి. సూక్ష్మబుద్ధితో కార్యభారాన్ని అవలీలగా నిర్వహించగల సులువును సంకేత రూపంలో తెలియజేస్తుంది గద.

వజ్రానికి నూరు అంచులు. సత్కార్య సాధనకు ఉన్న ఎన్నో మార్గాలను వెదికిపట్టుకోమని, కార్యసిద్ధి పొందమని అమ్మవారు ధరించిన 'వజ్రాయుధం' సూచిస్తుంది.

అమ్మ చేతిలోని మరో ఆయుధం దండం, చేతికర్ర. ఊతకర్రగా రక్షణకు ఉపయోగించే ఈ దండమే, అవసరమైనవేళ శత్రువులను ఎదుర్కొనే ఆయుధంగా సహకరిస్తుంది. రక్షణ, శిక్షణలు ఒకే చోట అమరి ఉన్నాయని గుర్తించమంటుంది దండం.

ఖట్వాంగం కూడా గదలాగే ఉంటుంది. కానీ, ముందు భాగంలో కపాలం కనిపిస్తుంది. అంటే మెదడు. ఇది ఆలోచనలకు కూడలి. ఎంత తెలివి ఉన్నా, ఎంత గొప్ప మెదడు అయినా, చివరికి కపాలమే అవుతుంది. ఆ విషయాన్ని గుర్తించి వైరాగ్యాన్ని అలవరచుకోమంటుంది ఖట్వాంగం.

ఆయుధాలను పూజించడమంటే గౌరవించడం కదా. అలాంటి గౌరవంతో ఆ ఆయుధాలు మనకిచ్చే సంకేతాలను గుర్తించి, ఆ సందేశాలను మనసుతో స్వీకరించి, ఆచరించడమే ఆయుధ పూజలోని ఆంతర్యం. అలా చూసినప్పుడు ఆయుధాలన్నీ ఆత్మోన్నతికి సాధనాలే.

(c) eenadu

అమ్మలగన్న అమ్మ..

చిత్తారమ్మ

జాతర ప్రత్యేకం, బోనాలతో భక్తజనం పారవశ్యం

కూకట్‌పల్లిలోని చిత్తారమ్మ దేవాలయం

చిత్తారమ్మ తల్లి

కూకట్‌పల్లి: ఆషాఢ మాసం.. అమ్మవారిని భక్తిశ్రద్ధలతో పూజించే కాలం. మహిళలకు ఇది ప్రత్యేకం. ఈ మాసం వస్తుందంటే చాలు.. అమ్మవారి ఆలయాలు ముస్తాబవుతాయి. ఇందులో అత్యంత విశిష్టతను సంతరించుకున్నది.. చిత్తారమ్మ తల్లి. భయంకరమైన ప్లేగు మహమ్మారి నుంచి గ్రామ ప్రజలను కాపాడడమే కాకుండా.. నమ్మిన భక్తులను కంటికి రెప్పలా కాడు పాడుకుంటూ వస్తుంది. బోనాలు ఊరంతా జరిగే సంబరం. ఏటా అమ్మవారి ఆలయాల్లో ఈ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఉత్సవాలకు పోచమ్మ దేవాలయంలో జరిగే పండగతో శ్రీకారం చుడతారు. ఇలా మొదలయ్యే ఉత్సవాలు చిత్తారమ్మ జాతరతో ముగుస్తాయి. ఈ ఉత్సవాల ప్రారంభం.. ముగింపు.. భక్తుల కొంగుబంగారంగా.. కోరిన కోర్కెలు తీర్చే అమ్మగా విరాజిల్లుతున్న చిత్తారమ్మ తల్లి విశిష్టత గురించి తెలుసుకుందాం.

పోచమ్మ తల్లికి మొదటి బోనం

కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలో ముందుగా గ్రామ పరిధి దేవీ నగర్‌లోని పోచమ్మ తల్లికి బోనాలతో అన్ని ప్రాంతాల్లో వేడుకలు మొదలవుతాయి. గ్రామ ప్రజలు మొదటి బోనం పోచమ్మ తల్లికి సమర్పించడం తరతరాలుగా.. ఆనవాయితీగా ఉంది. ప్రతి ఇంటి నుంచి మహిళలు బోనాలతో వచ్చి అమ్మవారిని మొక్కుతారు. ఒడిబియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు. ఇక్కడ అమ్మవారిని మొక్కి.. కోర్కెలు కోరుకుంటే.. ఇట్టే నెరవేరుతాయన్న నమ్మకం భక్తుల్లో కనిపిస్తుంది. ఏడాది క్రితం ఆలయాన్ని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారంతో ఆలయ కమిటీ నిర్వాహకులు అభివృద్ధి చేసుకున్నారు.

ప్లేగు నుంచి రక్షించిన చిత్తారమ్మ

1894వ సంవత్సరంలో ప్లేగు మహమ్మారి విజృంభిస్తున్న రోజులవి. అన్ని ప్రాంతాలను చుట్టుముడుతూ.. అంటువ్యాధి ప్రబలడంతో జనం భీతిల్లిపోయారు. దీంతో గ్రామ పెద్దలు యాదాద్రి సమీప కరకపట్లలోని చిత్తారమ్మ తల్లి దేవాలయంలో దీపాన్ని కూకట్‌పల్లి ప్రాంతానికి తీసుకొచ్చారు. ఇక్కడ ప్రస్తుతం ఉన్న చిత్తారమ్మ దేవాలయ ఆవరణలోని చెట్టు కింద రాళ్లు పేర్చి దీపాన్ని ఉంచి పూజించారు. చిత్తారమ్మను తలచుకొని పూజించడంతో ఒక వైపు మూసాపేట.. మరోవైపు కుత్బుల్లాపూర్‌లో ప్రవేశించిన ప్లేగు మహమ్మారి కూకట్‌పల్లికి రాకుండానే క్రమంగా మాయమైంది. చిత్తారమ్మ తల్లే గ్రామాన్ని కాపాడిందని.. బలంగా నమ్మిన పెద్దలు, భక్తులు జ్యోతి వెలిగించిన చోటే చిన్న గదిని నిర్మించి ప్రతి ఏడాది జాతర చేయడం ప్రారంభించారు. తర్వాత అమ్మవారి విశిష్టత నలుదిశలా వ్యాపించింది. ఆలయం అభివృద్ధికీ నోచుకుంది. ప్రతి ఏడాది ఆషాఢమాసంలో దేవీనగర్ పోచమ్మ తల్లికి బోనం సమర్పించిన తర్వాత వచ్చే ఆదివారం ఇక్కడ అమ్మవారి జాతర జరుగుతుంది. ఆ రోజు ఇసుకేస్తే రాలనంత భక్తులతో ఆలయం కిక్కిరిపోతుంది. అభిషేకం, వడిబియ్యం సమర్పణ, ఎదుర్కోళ్లు, ఫలహారబండ్ల ఊరేగింపుతో అర్ధరాత్రి వరకు ఉత్సవాలు జరగడం ఆనవాయితీ. వేలాదిమంది భక్తులు సామూహికంగా అమ్మవారికి బోనాలు సమర్పించడం ఉత్సవాల ప్రత్యేకతగా చెప్పొచ్చు

భక్తుల కల్పవల్లి.. ఉజ్జయిని మహాకాళి

ప్రధాన ఆలయంలోని మహాకాళి అమ్మవారు

బన్సీలాల్‌పేట్, రాణీగంజ్: తొలుత కర్ర విగ్రహంగా, చిన్నగుడిగా రూపుదిద్దుకొని.. నేడు నగరంలోనే ప్రముఖ దేవస్థానంగా విరాజిల్లుతోంది.. ఒక్కో మాసంలో ఒక్కో ప్రత్యేకత కలిగిన పూజలతో.. రెండు శతాబ్దాలకుపైగా ఆధ్యాత్మికతను పంచుతోంది సికింద్రాబాద్ శ్రీఉజ్జయిని మహాకాళి అమ్మవారి ఆలయం. తెలంగాణ రాష్ట్ర పండగ ఆషాఢమాస బోనాల జాతరకూ కేంద్రబిందువుగా మారి మరింత వైభవాన్ని సంతరించుకుంది. ఇక్కడ శరన్నవరాత్రి మహోత్సవాలు తొమ్మిది రోజుల పాటు అత్యంత వైభవంగా జరుగుతాయి.

1813లో సైన్యంలో పనిచేసిన సురిటి అప్పయ్య మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినికి బదిలీ అయ్యారు. బదిలీ జరిగిన కొద్దిరోజులకే అక్కడ కలరాసోకి వేలాది మంది మృత్యువాత పడ్డారు. అప్పయ్య తన అనుచరులతో కలిసి మహాకాళి అమ్మవారిని దర్శించి కలరా నుంచి కాపాడాలని వేడుకున్నారు. పరిస్థితులు అనుకూలించాక సికింద్రాబాద్‌లో ఆలయ నిర్మాణం, విగ్రహ ప్రతిష్ఠచేసి పూజలు చేస్తామని మొక్కుకున్నారు. అనుకున విధంగా జరగడంతో 1815లో సికింద్రాబాద్‌కు వచ్చి ప్రస్తుతం ఆలయం ఉన్నచోటనే చిన్న కర్ర విగ్రహం ఏర్పాటు చేసి ఉజ్జయిని మహాకాళిగా నామకరణం చేశారు. అక్కడే బావి తవ్వకాల్లో లభ్యమైన మాణిక్యాలమ్మ విగ్రహాన్నీ పక్కనే ఏర్పాటు చేశారు. 1864లో కట్టె విగ్రహం స్థానంలో ప్రస్తుతం ఉన్న విగ్రహాలను శాస్త్రోక్తంగా ఏర్పాటు చేసి ఆలయాన్ని నిర్మించారు.

ఆలయంలో చండీహోమంలో పాల్గొన్న భక్తులు

ఒక్కోమాసంలో ఒక్కో ప్రత్యేకత....

- ఆషాఢ బోనాల సందర్భంగా అమ్మవారికి బోనం, సాక సమర్పిస్తారు. ఫలహారం బళ్ల ఊరేగింపు అట్టహాసంగా సాగుతుంది.
- శ్రావణమాసంలో అమ్మవారు ప్రతి శుక్రవారం ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తారు. 108 చీరలు, 108 కిలోల పసుపు, కుంకుమ, మిఠాయిలతో అమ్మవారి అలంకరణతోపాటు ఆలయాన్ని పూర్తిగా గాజులతో అలంకరిస్తారు.
- భాద్రపద మాసంలో గణపతి నవరాత్రి ఉత్సవాల్లో ఆలయంలోని మహాకాళేశ్వర సహిత వీరభద్రస్వామి ఆలయంలో గణపతిని ఏర్పాటు చేసి పూజలు నిర్వహిస్తారు.
- కార్తికమాసంలో శివకేశవులను పూజిస్తూ రుద్రాభిషేకం, బిల్వార్చన, ఆకాశదీపం, జ్వాలా తోరణం నిర్వహిస్తారు. చండీహోమం, లక్షదీపోత్సవం జరుగుతుంది.
- మాఘమాసంలో వసంతపంచమికి కోటి కుంకుమార్చన నిర్వహిస్తున్నారు. సుమారు 2వేల మంది భక్తులు పాల్గొంటారు.
- శరన్నవరాత్రి మహోత్సవాల్లో తొమ్మిది రోజులపాటు అమ్మవారు ఒక్కోరోజు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారు. ప్రతిరోజు చండీహోమం జరుగుతుంది.

(c) eenadu

అమ్మ వెలుగుజాడలు... అష్టాదశ శక్తిపీఠాలు

సృష్టి, స్థితి, లయకారులైన బ్రహ్మ విష్ణు మహేశ్వరులే ఈ చరాచర జగతికి మూలం అనుకుంటాం. నిజానికి ఆదిపరాశక్తే అన్నిటికీ మూలం. దక్షుడికి కూతురిగా జన్మించి శ్మశానవాసియైన పరమేశ్వరుణ్ణి వరించింది. తమకు ఆహ్వానం లేకున్నా.. తండ్రి చేస్తున్న యాగానికి వెళ్లింది. అక్కడ దక్షుడు ఈశ్వరుని నిందించగా.. సహించలేక అగ్నిప్రవేశం చేసింది. కోపోద్రిక్తుడైన ఈశ్వరుడు కాలుతున్న సతీదేవి శరీరాన్ని భుజాన వేసుకుని ఉగ్రతాండవం చేశాడు. లోకాలు అల్లకల్లోలం కాకుండా సంరక్షించేందుకు సుదర్శనచక్రంతో ఆ శరీరాన్ని ఛేదించాడు విష్ణువు. ఆ తనువు 18 ఖండాలై 18 ప్రదేశాల్లో పడి.. శక్తి పీఠాలుగా వెలిశాయి. అవే పవిత్ర అష్టాదశ శక్తి పీఠాలు.

శాంకరీ దేవి

అమ్మవారి తొడల మధ్యభాగం శ్రీలంకలోని ట్రింకోమలిలో పడి, శాంకరీ దేవిగా వెలసింది. తన కరుణాకటాక్షాలను సదా మనపై ప్రసరింప చేసే అమ్మవారి తొలి రూపం శాంకరి. ఈ దేవిని పూజిస్తే సకల శుభాలూ చేకూరతాయట.

కామాక్షీదేవి

సతీదేవి నాభిభాగం పడిన ప్రదేశమే కాంచీపుర క్షేత్రమైంది. పాశాంకుశాలు, చెరకు గడ, భుజంపై చిలుకతో పద్మాసన భంగిమలో కొలువైన కంచి కామాక్షీ దేవిని కామాక్షీ అమ్మన్ అంటారు. చెన్నైకి 75 కి.మీ. దూరంలో ఉంది ఈ ఆలయం.

మహాలక్ష్మీదేవి

మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో మహా లక్ష్మిగా కొలువైంది ఆది పరాశక్తి. సతీదేవి నయనాలు పడిన చోటిది. ఇక్కడ అమ్మ వారిని దర్శించుకుంటే కోరికలు నెరవేరతాయని, ముక్తి లభిస్తుందని విశ్వసిస్తారు.

భ్రమరాంబికాదేవి

ఆంధ్రప్రదేశ్ శ్రీశైలంలో అమ్మవారు మల్లికార్జున స్వామి సమేతంగా భ్రమరాంబికగా కొలువు తీరింది. సతీదేవి మెడ భాగం పడిన చోటిది. ఇది శక్తి పీఠమే కాకుండా ద్వాదశ జ్యోతిర్లింగాల్లో రెండోది కూడా.

శృంఖలాదేవి

అమ్మవారి పొత్తికడుపు భాగం పడిన చోటు ప్రద్యుమ్న క్షేత్రం. ప్రసన్న వదనంతో ఆశీర్వదిస్తున్న భంగిమలో నిలిచిన శృంఖలాదేవిని దర్శించుకుంటే ప్రశాంతత చేకూరుతుంది.

చాముండేశ్వరి

సతీదేవి కురులు పడిన ప్రదేశంలో అమ్మవారు చాముండేశ్వరిగా అవతరించింది. కర్ణాటకలోని మైసూరు ఆలయంలో కొలువైన ఈ అమ్మవారు స్వర్ణ విగ్రహంగా దర్శనమిస్తోంది.

జోగులాంబ

సతీదేవి ఖండితాంగాలలో పైవరుస దంతాలు, దవడ భాగం పడిన ప్రదేశం తెలంగాణ రాష్ట్రంలోని ఆలంపూరు. జోగులాంబ అమ్మవారు ఉగ్రస్వరూపిణి కనుక ఈ ఆలయం చుట్టూ నీటి గుండం ఉంటుంది.

మాణిక్యాంబ

ఆంధ్రప్రదేశ్‌లో కాకినాడకు సమీపంలోని ద్రాక్షా రామంలో వెలసింది మాణిక్యాంబ. సతీదేవి ఎడమ చెంప భాగం పడిన ప్రాంతమిది. దక్షవాటికగా ప్రసిద్ధమైన ఈ పుణ్యక్షేత్రం పరమ పవిత్రం.

గిరిజాదేవి

ఒడిశాలోని జాజ్‌పూర్‌లో వెలసిన ఆదిపరాశక్తి గిరిజాదేవి. అమ్మవారి నాభి భాగం పడిన ప్రాంతమిది. సర్వాలంకారశోభితంగా ప్రసన్న వదనంతో దర్శనమిచ్చే ఈ అమ్మ వారు బిరిజాదేవి, విరజా దేవి పేర్లతోనూ ప్రసిద్ధం.

సర్వమంగళాదేవి

గయలో వెలసిన అమ్మ సర్వ మంగళాదేవి. సతీదేవి శరీర భాగాల్లో స్తనాలు పడిన ప్రాంతమిది. ఇక్కడి అమ్మ వారిని దర్శించుకుంటే సర్వ శుభాలూ చేకూరతాయంటారు.

వైష్ణవీదేవి

హిమాచల్ ప్రదేశ్‌లోని జ్వాలాముఖిలో కొలువైంది వైష్ణవీదేవి. ఆదిపరాశక్తి నాలుక పడిన ప్రాంతమిది. ఇక్కడ అమ్మ వారిని జ్వాలాముఖిగా పూజిస్తారు. భూమిలోంచి వచ్చే సహజవాయువుల జ్వాలనే అమ్మవారి శక్తిగా భావిస్తారు.

కామాఖ్యాదేవి

గువాహటీలో వెలసిన ఆదిపరాశక్తే కామాఖ్యా దేవి. ఇక్కడి నీలాచల పర్వత శిఖరంపై సతీ దేవి యోనిభాగం పడిందని పురాణకథలు చెబుతున్నాయి. అందుకే ఇక్కడి అమ్మవారిని కామాఖ్యా దేవిగా కొలుస్తారు.

మాధవేశ్వరీదేవి

ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగలో వెలసిన ఆదిపరాశక్తి మాధవేశ్వరీ దేవి. అమ్మవారి కుడిచేతి వేళ్లు పడిన ప్రాంతమిది. బిందు మాధవీ దేవిని బృహస్పతి అమృతంతో అభిషేకించినందున ఈ పుణ్య ప్రదేశానికి అమృత తీర్థం అనే పేరు స్థిరపడింది.

విశాలాక్షిదేవి

కాశీలో వెలసిన ఆది పరాశక్తే విశాలాక్షి. సతీదేవి చెవి కమ్మ (మణికర్ణిక) పడిన ప్రదేశంలో అమ్మ వారు విశాలాక్షిగా అవతరించింది. మహా శివుణ్ణి ఆశ్చర్యంగా, కళ్లు పెద్దవి చేసి చూసినందున విశాలాక్షి అయ్యిందంటారు.

సరస్వతీదేవి

జమ్ము కాశ్మీరులో వెలసిన అమ్మవారు సరస్వతీదేవిగా పూజలందుకుంటోంది. సతీదేవి కుడి చేయి పడిన ప్రాంతమిది. ఆదిశంకరాచార్యులు ఈ మాతను దర్శించి అర్చించినట్లుగా శంకర విజయ కావ్యం తెలియజేస్తోంది.

పురుహూతికా దేవి

ఆంధ్రప్రదేశ్ పిఠాపురంలో కుకుటేశ్వర స్వామి సమేతంగా వెలసిన తల్లే పురుహూతికా దేవి. సతీదేవి పీఠభాగం పడిన ప్రదేశం కనుక పిఠాపురం అనే పేరు వచ్చిందంటారు. ఇక్కడ అమ్మవారు హుంకారిణిగానూ పూజలందుకుంటోంది.

మహాకాళీదేవి

మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో వెలసిన ఆదిపరాశక్తే మహాకాళీదేవి. సతీదేవి పైపెదవి పడిన చోటిది. కాళిదాసు నాలుకపై బీజాక్షరాలు రాసినందునే మహాకవిగా ప్రసిద్ధుడు అయ్యాడంటూ ఈ అమ్మవారిని ఆరాధిస్తారు.

ఏకవీరాదేవి / రేణుకామాత

మహారాష్ట్రలోని మాహూర్ క్షేత్రంలో వెలసింది ఏకవీరాదేవి. దక్షయజ్ఞంలో తనువు చాలించిన పార్వతీదేవి కుడిచేయి పడిన ప్రాంతమిది. రేణుకామాతగానూ ప్రసిద్ధమైన ఈ అమ్మవారి ఆలయంలో తమలపాకు, వక్కలను మెత్తగా నూరి ప్రసాదంగా ఇస్తారు.

కేపీహెచ్‌బీ కాలనీ

(c) eenadu

దసరా శుభాకాంక్షలు
శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలకు,
BJP నాయకులకు, కార్యకర్తలకు,
అభిమానులకు, శ్రేయోభిలాషులకు
దసరా శుభాకాంక్షలు
మారబోయిన కుటుంబ సభ్యులు

(c) eenadu

విజేత
Fresh Healthy Living

ఈ విజయదశమిని మరింత
విజయోత్సవంగా
జరుపుకోండి మీ విజేత తో

దసరా
శుభాకాంక్షలు

CELEBRATING 25 YEARS OF VIJETHA

విజేత సూపర్‌మార్కెట్స్ ప్రైవేట్ లిమిటెడ్
తెలంగాణ & ఆంధ్రప్రదేశ్
అడ్రస్: HO. 5-4/6, బాలాజి టవర్స్, చందానగర్, హైదరాబాద్ - 500 050 vijethasupermarkets VijethaSuperMarketsPvtLtd

SINCE 1999

(c) eenadu